భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

మార్చి 1966

★

సంపుటము 43 : : సంచిక 3 ;

విడిప్రతిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

మార్చి 1966

అద్వైత మన్మథము

శ్రీ 'బాలగంగాధరతిలక్'

(సీత రాముని యెడల తనకు కలుగు ప్రేమానురాగములను ఆత్మానుబంధమును చెప్పుచున్నది.)

నా మదిలోని దీపమవు నాదు ముదర్ణవ శేషతల్ప లీ
లా మధుకైటభారివి, విలాసిమదీయవయోమయూర వ
ర్షాముఖ నృత్య ఖేలనకు రాయిడిగొన్న మొయిళ్లపాటవో
స్వామి! సమస్త మద్భువనశాలకు కట్టిన రత్నపుమేలుకట్టువున్

తెలతెలవార నా యెడద తీర్చిన మ్రుగ్గుల త్రొక్కివచ్చు శీ
తల పవనమ్ము వీవు, కను దమ్ముల నవ్వయి సోకి లోతు లో
తుల దిగిపోవు రత్నఖచితోజ్జ్వల హేతివి, మద్గవాక్ష వీ
థుల పొగమబ్బులౌ అగురు ధూపము తావివి నీవు రాఘవా


గగనమువంటి నా బ్రతుకుగాథల రూపకమందు చంద్రమ
స్స్వాగతమ వీవు, సంక్షుభిత సాగర సంధులవంటి కన్నులన్
తిగిచిన పక్ష్మమాలికల తీయగ నొత్తిన స్వప్న వేలవో
దృగభినవాభిరామ! యెల దేనియ కాల్వవు గుండె తోటలో

నే కల గాంచగా మును వినీలమణిచ్ఛవి జిమ్ము నిద్రవై
నా కను వంపు మంపు కలనన్ బడిపోవు ద్విరేఫమాలవై.
నాకయి నేనుగా నిను వినా ఒక యేమియుకాని దాని నీ
స్వీకృతిజేసి సుప్రథిత సీతగ మల్చిన దివ్య శిల్పివై

నా యానందపు మేడలో మొదటి వీణానాదమై మ్రోగి, నా
ప్రాయోద్యానమునందు మందపవన ప్రాలంబమై వ్రేలి, నా
ఝా యేకాంతమునందు సిగ్గవయి నన్నిట్లేచి, నా స్త్రీత్వపున్
సాయాహ్నమ్ముల రాగరంజితదిశాసందోహమై వ్రాలినన్

ఏమయిపోయినానో యిటు తేమరిపోయిన నన్ను నేనుగా
నీ మెయి చీకటింట గురుతింపగ నెట్టుల నేర్తు నీ హిమా
నీ మృదితావనీజముల నీడల నా తొలి యూర్పు సవ్వడుల్
నీ మృదు పాదపద్మ రమణీయత వెంబడినే చరించుటై!

కన్నుల కన్నులు నిల్పి కాంచితివేని ని
　　　　దేమి ద్వాదశసూర్య దీప్తి ముంచు
నను వీడి యడుగిడ నాలోన నిదియేమి
　　　　భవమెల్ల కదలించు బాధ పొంగు
బిగ్గ కౌగిలి చేర్చువేళ బ్రతుకు చివ
　　　　రల నిదియేమి క్రొన్నలుపు మంట
ప్రేమార నను పేర బిల్వగా నిదియేమి
　　　　గగనాన మ్రోగె నక్షత్రఘంట
నేను నీలోన నన్ను సృజించుకొనగ
నీవు నాలో లయింతు వెంతేని వింత,
ఇది యపూర్వక్రమము, సృష్టి మొదలు తుదలు
కలసి కొన్నవి మనలోన కాలమాగి!



అంగారతల్పం

శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య

బస్సు కదిలి ముందుకు వెళ్లిపోయింది.

చేయి వూపి స్నేహితుడికి వీడ్కోలు చెబుతూ అలాగే కొన్ని క్షణాలు నిలబడిపోయాను.

అంతలోనే మనసు బరువెక్కి కళ్లలోకి నీటిపొర ఉబికి వచ్చినట్టయింది. ఏమీతోచని వాడిలా ఒక్క నిముషం అటూ ఇటూ చూచి, తర్వాత జనాన్ని తప్పించుకుంటూ యువతలికివచ్చి నడవటం ప్రారంభించాను. ఉన్నట్టుండి ఒక్కసారిగా భయంకరమైన ఒంటరితనం నన్ను లొంగ దీసుకున్నట్టు అనిపించింది. ఆలోచనలోపడినడుస్తూవుంటే లోతైన సముద్రాలలో అడుగున నివసించే ఎనిమిది చేతుల 'ఆక్టోపస్' గుర్తుకు వచ్చింది. ఇంత సమ్మర్దమైన నగరంలోనూ ఈ ఒంటరితనం నన్ను నిర్దాక్షిణ్యంగా 'ఆక్టోపస్'లా కబళించివేస్తున్నది. దానితో శక్తివంచన లేకుండా పోరాడుతూనే ఉన్నాను. అయినా విజయం సిద్ధించడం లేదు సరికదా, ఆ పోరాటంలో క్షణ క్షణానికి వివశుడనైపోతున్నాను.

జనంతో నిండిన పేవ్‌మెంట్‌మీద ముందుకు సాగిపోతూ వుండగా మళ్లీ అదే దృశ్యం.....అవే ప్రశ్నలు.....అవే సమాధానాలూ.....

—స్వింగ్‌డోరు మూసివున్నది. లోపల డాక్టరు వాష్‌బేసిన్ దగ్గర చేతులు తుడుచుకుంటూ నిలబడివున్నాడు. ప్రక్కనే నా మిత్రుడు—ఆత డిప్పు డీ రాష్ట్రంలోనే లేడు—ఆందోళన స్ఫుటంగా వినిపించే గొంతుకను తగ్గించి అడిగాడు. ''ఎంత కాలం గడుస్తుందంటారు డాక్టర్?''

డాక్టరునుంచి ఏ సమాధానమూ వినిపించలేదు. ఆయన బహుశా భుజాలెగరవేసివుంటాడు.

''ఎన్ని సంవత్సరాలు? చెప్పండి డాక్టర్.....'' మిత్రుడి ప్రశ్న.

డాక్టరు మళ్లీ ఏ సమాధానమూ చెప్పలేదు.

''పోనీ ఎన్ని నెలలు? అదైనా చెప్పండి......'' మళ్లీ మిత్రుడి ప్రశ్న. అతనికంఠంలో ఆత్రుత ధ్వనించింది.

ఈసారి డాక్టరు కంఠస్వరం చాలా నెమ్మదిగా వినిపించింది... ''అవును......సంవత్సరాలుకాదు. నెలలే......అదీ సరిగ్గా చెప్పలేను. బహుశా మూడు నాలుగు నెలలు.......ఎవరన్నా కావలసిన వారుంటే తెలియజెయ్యండి. కాని ఒకటిమాత్రం చెప్పగలను. చివరిరోజువరకు అతడు మంచానపడే ప్రమాదంమాత్రం ఉండదు''.

నా మిత్రుడు గొణుక్కున్నాడు. ''ఎవరున్నారతనికి? ఈ లోకంలో 'నా' అనుకోదగ్గ వారెవరూ లేరు.''

డాక్టరు యువతలికి రాబోతున్నందువల్ల అంతవరకూ ఆ గుమ్మం ప్రక్కనే నిలబడి వారి మాటలు వింటున్న నేను త్వరత్వరగా వెళ్లిదూరంగావున్న బల్లమీద కూర్చున్నాను. ఆ యిద్దరూ యువతలికి వచ్చారు. డాక్టరు ముక్కుమీదికి జారుతున్న కళ్లజోడు సర్దుకుంటూ నా వంక చూసి, ''కంగారు పడనక్కరలేదు. త్వరలో అంతా సర్దుకుంటుంది. రెండు రోజుల కొకసారివచ్చి మందు తీసుకుపోతూ ఉండండి'' అన్నాడు.

నేను నవ్వు ఆపుకున్నాను. ''అవును..... త్వరలో అంతా సర్దుకుంటుంది!'' అనుకున్నాను. అంతలో కొంచెంగా దగ్గు వచ్చింది. రుమాలు నోటికి అడ్డం పెట్టుకుని దగ్గు ఆపుకున్నాను.

—'నెమ్మదిగా, చూసి నడవండి సార్' అన్న మర్యాదతో కూడిన మందలింపుతో ఈ లోకంలోకి వచ్చాను. ఆలోచనలోపడి నడుస్తూ ఆ వ్యక్తిని 'ఢీ' కొన్నందుకు వెనుదిరిగి చూపులతోనే క్షమాపణ చెప్పుకుని మళ్లీ ముందుకు సాగిపోయి 'క్యూ'లో నిలబడ్డాను.

సాయంకాలం నాలుగు గంటలు దాటింది. చాలా సేపటి నుంచి బస్సు రాలేదులా వుంది. 'క్యూ' హనుమంతుడి వాలంవలె మెలికలు తిరిగివుంది.

అదేమి చిత్రమోమరి, నా కెన్నడూ పెద్ద 'క్యూ'లో నిలబడవలసిన అవసరం లేకుండా బస్సు దొరకదు. రూమునుంచి ఉదయం ఆఫీసుకు వెళ్లేటప్పుడూ, తిరిగి సాయంకాలం రూముకు వచ్చేటప్పుడూ నా కెన్నడూ సజావుగా బస్సు అందదు. పెద్ద 'క్యూ'లో చివరగా నిలబడవలసిన అవసరం వచ్చినందుకు నేనంతగా బాధపడను. కాని ఉదయం ఆఫీసుకు వెళ్లేటప్పుడు మనసులో కొంచెం బెరుకుగానే ఉంటుంది. అందుకు కారణం కూడా వుంది. ఒక్క నిముషం ఆలస్యంగానైనాసరే నా సీటువైపు వెడుతున్న నన్నుచూసి మా హెడ్ గుమాస్తా—పంచె లోపలికిచొక్కాదోపి బెల్టు పెట్టుకుని పైన కోటు ధరించే ఒక భారీ వ్యక్తి గంభీరంగా

నా వంకా, గోడ గడియారం వంకా చూస్తూ సాభిప్రాయంగా తల పంకిస్తాడు. ఆలస్యంగా వచ్చినందుకు నన్ను కొంచెం కోప్పడినా నే నొట్టే బాధపడను. ఆ తల పంకించడమూ, గడియారం వంకా, నా వంకా మార్చి మార్చి చూడటమూ నాకు మరింత బాధ కలిగిస్తాయి. రెండేళ్ల క్రిందట ఉద్యోగంలో చేరిన కొత్తలో కాబోలు ఒకసారి నేను అరగంట ఆలస్యంగా ఆఫీసుకు వెళ్లాను. అప్పటికి నాకు నే నెక్కవలసిన బస్సు నెంబర్లు కూడా సరిగా తెలియవు మరి....వారి నడిగీ, వీరి నడిగీ, నే నడిగినది వారి కర్థమై, వారు చెప్పినది నే నర్థం చేసుకుని, ఆ బస్సుకోసం పడిగాపులు పడివుండి ఎక్కివచ్చేసరికి ఆలస్యం అయింది. అప్పుడు నా సీటు దగ్గరికి పోబోతున్న నన్ను చూపుడువేలుకదిపి దగ్గరికి రమ్మని సైగ చేశాడు. వెళ్లాను. గడియారంవంక చూశాడు. నేను తలవంచుకుని, ''అవును.....బస్సు ఆలస్యమయింది. అందువల్ల......'' అంటున్నాను. ఆయన అప్పుడు తన ముందున్న ఫైలు మూసి, ఒక పక్కగా పడేసి, తల వూపి,

''ఆ కారణాలు అందరూ చెప్పగలరు. అంతగా అయితే మరోగంట ముందుగా బయలుదేరాలి. లేకపోతే మరో ట్రాన్స్‌పోర్ట్ ఫెసిలిటీ చూసుకోవాలి. ఆలస్యంగా మాత్రం రాకూడదు. అంతే.....'' అన్నాడు. ''అంతే'' అనడం చాలా గొప్పగా, శాసించే ధోరణిలో అన్నాడు. ఇప్పటికీ ఆ మనిషి ఏమీమారలేదు. అలాగే కుర్చీకి నిండుగా కూర్చుని అందర్నీ చూపులతో వేధిస్తూ వుంటాడు. ప్రక్కవాడితో మాట్లాడేందుకు భయం...... పని ఏమీ లేకపోతే 'ఈజీ'గా కాళ్ళు బల్లక్రిందికి జాపుకుని కుర్చీకి ఆనుకుని కూర్చునేందుకు భయం.....ఆలస్యంగా వెళ్లేందుకు భయం........ఒక్క నిముషం ముందుగా సీటునుంచి కదిలేందుకు భయం........

—'హలో' అన్న పలకరింపుతోబాటు భుజంమీద చెయ్యి పడింది. వెనుదిరిగి చూసేసరికి రామమూర్తి కనిపించాడు. అతన్ని చూసి నవ్వి ''బస్సుకోసం.....'' అన్నాను. అతడు చేతిలో సంచీతో ఏవో వస్తువులకోసం బయలుదేరాడులావుంది.

''మీరు రేపు కూడా సెలవు పెట్టారా?'' అని అడిగాడు.

నేను తల అడ్డంగా వూపి 'లేదన్నాను.'

''వచ్చే ఆదివారం అందరం పిక్నిక్ ఏర్పాటు చేసుకున్నాం. సరదాగా నలుగురం కలిసి ఒక రోజంతా గడిపేవద్దాం. నువ్వు 'ఆబ్సెంట్' అయితే వూరుకునేదిలేదు. నీ పాట ప్రోగ్రాంలో మొదటి అయిటం'' అన్నా డతడు మళ్లీ నవ్వుతూ.

తల వూపానేగాని హృదయంలో శల్యం కదిలినట్టయింది. ఇంకెక్కడి పాట! ఇక పాడగలనా నేను?

''మా ఆవిడ సరుకు లేవో తెమ్మని లిస్టు యిచ్చింది. త్వరగా వెళ్లాలి.....'' అంటూ రామమూర్తి ముందుకు వెళ్లిపోయాడు.

'క్యూ'లో కలవరం బయలుదేరింది. బస్సు ఆకలిగొన్న రాక్షసుడిలా వచ్చి క్యూలో కొంతమందిని దిగమ్రింగి వెళ్లిపోయింది. మిగిలినవారు మళ్లీ యథా ప్రకారం సర్దుకు నిలబడి దిక్కులు చూస్తూ వుండిపోయారు. నాకు ఉదయం ఆఫీసుకు వెళ్లేటప్పుడు కొంత ఆదుర్దాగా ఉంటుందన్నానా? సాయంకాలం పూట మాత్రం అదేమీలేదు. హాయిగా శరీరభారం యావత్తూ ఒక కాలిమీదనే మోపి నిలబడి రెండు చేతులూ గుండెలమీద కట్టుకుని గంటల తరబడి నిలబడగలను. ''బస్సు ఎంత ఆలస్యంగా వస్తేనేం? రూముకు వెళ్లి చేసేదిమాత్రం ఏముంది గనుక?'' అనిపిస్తుంది. అప్పుడప్పుడు నేను తప్పుకుని తొందర పడే నా వెనక వారికి దోవ యిచ్చి కొన్ని 'థ్యాంక్స్' కూడా పొందాను. ఇవాళ నాకంటె ముందు 'క్యూ'లో నిలబడి మాటిమాటికీ తన బుల్లి చేతి వాచీ చూసుకుంటున్న ఆ పదహారేళ్ల చిన్న దానికి అలా నాలుగైదుసార్లు సహాయంచేసి ఆమె కృతజ్ఞత సంపాయించాను. అలా 'క్యూ'లో సోమరిగా నిలబడి చూస్తూవుంటే ఎదురుగా హోటల్లో కౌంటర్‌ముందు కూర్చునివుండే బట్టతల వ్యక్తి కనిపిస్తాడు నాకు. నే నతన్ని ఎంతో కాలంగా పరిశీలించాను. బిల్లులు అందుకోవడం....డబ్బు లోపల వేసుకోవడం.....చిల్లరను ఎదురుగావున్న అద్దం బిగించబడిన కౌంటర్‌మీదికి ఒదలడం అతని పని.....ఆ పని ఎంత సునాయాసంగా వేగంగా చేస్తాడో తలుచుకుంటే ఆశ్చర్యంగా ఉంటుంది నాకు. అప్పుడప్పుడు ప్రక్కన నిలబడిన వారితో మాట్లాడుతూనే మెరుపులాగా పని చేస్తా డతడు.....ఆ ప్రక్కనే ఒక స్టేషనరీ స్టోర్సు వుంది. అందులో ఒక నల్లని, మెల్లకన్ను వ్యక్తి కూర్చుని వుంటాడు. అతని కెప్పుడూ బేరం ఉండదు. సోమరిగా కూర్చుని పేపరు తిరగవేస్తూ రోడ్డుమీదికి చూస్తూ ఆవులిస్తూ వుంటాడు. ఆ కొట్లో ఒక ఫోను ఉంది. ఆతడు ఫోనులో మాట్లాడుతూ వుండగానేనెప్పుడూ చూడలేదు. అది కూడా అతనిలాగే సోమరిగా పడి ఉంటుం దక్కడ.

వరుసగా రెండు బస్సులు వచ్చాయి. ముందు వచ్చిన బస్సు కండక్టరు చేయి వూపుతూ ''జాగానై.. జాగానై..'' అని అరుస్తూ వుండగా ఆబస్సు ఆగకుండానే వెళ్లిపోయింది. రెండో బస్సులో బుల్లి చేతివాచీ చూసుకునే అమ్మాయితో పాటు మరో నలుగురు వ్యక్తులు ఎక్కగానే అదికూడా కదిలిపోయింది. నేను చిల్లరపైసలు చేతిలో వుంచుకుని అలాగే నిలబడిపోయాను. గడిచిన రెండురోజులూ గుర్తు వచ్చాయి. మధుసూదనం ఏదో పని మీద వచ్చాడిక్కడికి. నిజానికి ఆపని వాడు వచ్చిన కొద్ది గంటలలోనే అయిపోయింది. వెంటనే వెళ్లిపోతానన్నాడు. నేను 'అలా కాద'న్నాను. ''కనీసం రెండురోజులు యిక్కడ వుండి నాతో గడిపిపో... మళ్లీ అసలు కలుసుకుంటామో లేదో'' అన్నాను.

వాడు ఆశ్చర్యపోయి ''అదేమిట్రా? అలా అవాచ్యాలు పలుకుతావేమిటి?'' అన్నాడు నొచ్చుకుంటూ.

నేను నేలచూపులు చూస్తూ ''నాకేమిటో దిగులుగా వుందిరా...'' అన్నాను. అవును. ఆమాట అన్నాను. అప్పుడు నాకళ్లు నీళ్లతో నిండినట్టనిపించింది.

వాడు నాభుజం తట్టి "ఛ! అదేమిటిరా అలా డీలాపడి పోతావెందుకు? పోనీ, వుంటాన్లే..." అని కొంచెం సేపాగి"అసలు నీ బాధ నాకు తెలుసులే. ఈ ఒంటరి జీవితానికి స్వస్తి చెబితేగాని నువ్వు బాగుపడవు. నిక్షేపంలా పెళ్లి చేసుకో. నువ్వు 'సరే' నంటే చాలు నా ఎరికలో ఎవరినైనా చూసి ముడిపెట్టేస్తాను" అన్నాడు. నేనప్పుడేమీ బదులు పలకలేదు.

ఆతర్వాత రెండురోజులూ ఎలా గడిచిపోయాయో తలుచుకుంటే చాలు, ఆనందంతో తల మున్కలైపోతున్నాను. భయంకరమైన నా ఒంటరితనమూ, దాన్ని సహస్రాధికం చేసి నన్ను బాధపెట్టే నాగదీ, గదిలో కిటికీ మూలగా గూడుఅల్లుకుని కాపురం వుంటూ లారీ హెడ్‌లైట్ల వంటి కళ్లతో మిర్రిమిర్రి చూస్తూ పొరపాటున దోవ తప్పి వచ్చి గూటిలో యిరుక్కున్న చిన్నచిన్న పురుగులను పట్టితినే బలమైన సాలీడూ, పది గంటలయితే చాలు చుక్కనీళ్లు కూడా రానిపంపూ, నన్నెప్పుడూ అకారణ కోపంతో గుడ్లు పెద్దవి చేసుకుని చూసే క్రింది భాగంలోని హిందూస్తానీ మధ్యవయస్సు వ్యక్తీ (నేను రూములో పడుకుని ఒంటరిగా పాడుకుంటూ వుండటం అతనికి నచ్చదు. వయసులో వున్న ఆడపిల్ల తండ్రికదా మరి.) మా ఆఫీసూ, హెడ్‌గుమాస్తా చూపులూ, బస్సులకోసంపడిగాపులు పడివుండటం, రొటీన్ గానుగెద్దు జీవితం, తలనొప్పి పుట్టించే అర్థంపర్థం లేని ఆఫీసు కరెస్పాండెన్సూ, బారెడు పొడుగున వుండే అంకెలూ, రుచీపచీలేని హోటల్ భోజనం...అన్నీ మరిచిపోయాను. ఒకసారి నిద్రసరిగా పట్టక బాధపడుతున్న రోజులలో ఒక స్నేహితుడి సలహా మీద ఏదో టాబ్లెట్ మింగి పడుకున్నాను. ఆ రోజు మంచి నిద్ర పట్టింది. అందులో ఒక్కటంటే ఒక్కటే అందమైన పంచరంగుల కల వచ్చింది. ఇన్నాళ్ళ తర్వాత ఆ కల గుర్తులేదు గాని, యీ రెండురోజులూ అంత హాయిగా, ఆనందంగా గడిచిపోయాయి.

మధుసూదనం చాలా మారిపోయాడు. చిన్నతనంలో వాడు ఎంత అల్లరి చేసేవాడు! చదువు మీదా, పుస్తకాల మీదా బొత్తిగా శ్రద్ధ వుండేదికాదు వాడికి. చొక్కాచేతులు పైకి మడుచుకుని, తలసరిగా దువ్వుకోకుండా ఎప్పుడూ రౌడీపోజులో వుండేవాడు. చేతిలోఒక 'రఫ్' నోట్‌బుక్ తప్ప మరేమీ వుండేది కాదు. కాలేజీలో చేరిన తర్వాత కూడా అంతే. ఎప్పుడూ ఏదో ఒక మిష మీద లెక్చరర్లతో పోట్లాట పెట్టుకుని హక్కులు, స్వాతంత్ర్యం అంటూ అరుస్తూ వుండేవాడు. ఇప్పుడు ఎంత తెలివిగా, జాగ్రత్తగా మాట్లాడటం నేర్చాడు! అతన్నిప్పుడు చూసిన వారెవరూ గౌరవించకుండా వుండరు. అంత మర్యాదమన్ననా ఆ రౌడీకి ఎలా అలవడ్డాయో మరి!

బస్సు రాగానే మళ్లీ 'క్యూ'లో కలవరం బయలుదేరింది. కండక్టరు ఒకొక్కక్కళ్లనే లెక్కపెడుతూ బస్సులో ఎక్కిస్తున్నాడు. నేను కూడా బస్సులో ఎక్కిన తర్వాత మరొక నలుగు రయిదుగురు మాత్రమే క్యూలో నిలబడిపోయారు. ఒక కుచ్చు టోపి, లాంగ్ కోటు,ధరించిన వ్యక్తి 'త్వరగా వెళ్లాల'ని ప్రాధేయ పడుతూ వుంటే కండక్టరు "మాప్ కీజీయే.." అంటూ బెల్ యిచ్చాడు. నేను చోటు చూసుకుని కూర్చున్నాను. కిటికీలో నుంచి వరసగా వెనక్కు కదిలిపోయే కొట్లనూ, హోటళ్లనూ, షో రూములనూ చూస్తూ కూర్చుంటే నాకెందుకో రైలు ప్రయాణం గుర్తుకు వచ్చింది. రైల్లో ఎప్పుడూ కిటికీ ప్రక్కనే బయటికి చూస్తూ కూర్చోడం అంటే నాకు ఎంతో యిష్టం. మధ్యసీటు ఎందుకూ పనికిరాని ముసలివారికీ పసిపిల్లలకూ మాత్రమేనని నా ఉద్దేశం. ఈ ఉద్యోగంలో చేరేందుకు వచ్చేటప్పుడు నాకు రైలుపొడుగునా ఎన్నిసార్లు తిరిగినప్పటికీ కిటికీ పక్క సీటు దొరకలేదు. "చేస్తున్నది దూరప్రయాణం కదా, ఈలోపల ఎవరన్నా దిగిపోతార్లే..." అనే ఆశాభావంతో చాలాసేపు నిలబడ్డాను.తర్వాత ఎప్పుడో మధ్యసీటులోకొంచెం ఖాళీ దొరికితే అక్కడ కూర్చున్నాను. అప్పటినుంచీ నేను దిగిపోయేవరకూ అదేమి చిత్రమో, కిటికీ పక్కసీటులో ఒక్కడు కూడా కదల లేదు, మెదలలేదు... కిటికీ పక్కనే హాయిగా కూర్చుని చేతిని గడ్డం క్రింద ఆనించుకుని బయట వేగంగా కదిలిపోయే చెట్లూ, చేమలనూ, టెలిగ్రాఫ్ స్తంభాలనూ, పంటపొలాలనూ, పల్లటీలు కొడుతూ ఎగురుతూ వుండే రకరకాల పక్షులనూ, చూస్తూ వుంటే కలిగే సుఖం మరెందులోనూ ఉండదనిపిస్తుంది. నేను చేసిన కొద్ది రైలుప్రయాణాలలో నేను కనిపెట్టిన విశేషం ఒకటి వుంది. రైలు కట్ట పక్కనే వున్న చెట్లూ టెలిగ్రాఫ్ స్తంభాలూ వెనక్కు కదిలిపోతున్నట్టు కనిపిస్తాయి. అయితే బాగా దూరంగా వుండే చెట్ల తోపులూ, రాళ్లగుట్టలూ, మనతోపాటు మన వెంటనే వస్తున్నట్టు అనిపిస్తుంది. నేనీ విషయం కొత్తగా కనిపెట్టినవాడిలా ఒక మిత్రుడికి చెప్పగా ఆతడు చప్పరించి "అది ఎవరికి తెలియదేం? దాన్ని సైన్సులో 'పేరలాక్స్' అంటారు" అన్నాడు.

బస్సులో నాముందు సీటులో కూర్చున్న వృద్ధురాలు "బస్సు ఎంతకీ త్వరగా నడవదేం?" అని విసుక్కుంటున్నది. ఆప్రక్కనే ఎవరో అది సహించలేక "ఎందుకమ్మా, అంత తొందర?బస్సు నడుస్తున్నది కదా! అంత అవసరమైతే టాక్సీలో వెళ్ళలేకపోయావా?" అన్నారు.

ఆమె నెమ్మదిగా బాధగా "అదికాదు బాబూ, మాఅబ్బాయి ఒక ఫౌండ్రీలో పని చేస్తున్నాడు. వాడు వొట్టి జులాయి. డబ్బు కళ్లబడితే పెళ్లాంపిల్లలూ తల్లీ ఏమీ అక్కర్లేదు వాడికి. జూదమాడి, తాగి అంత డబ్బూ తగలేస్తాడు. ఇవాళ జీతాలిస్తారు. నేను ముందుగా వెళ్లి కనబడితే అంతకు తెగించడు. ఆ డబ్బు కాస్తా చేజిక్కించుకోకపోతే ఈ నెలరోజులూ నేనూ కోడలూ పిల్లలూ పస్తులుండక తప్పదు" అన్నది నావైపు చూస్తూ తనలో తాను గొణుక్కుంటున్నట్టు.

నా ఎడమచేతి వైపు కూర్చుని వున్న ఆంగ్లోఇండియన్ అమ్మాయి చాలా అందంగా వుంది. ఆమె ఎక్కడో టైపిస్టుగా పని చేస్తున్నదని నాఉద్దేశం. అలా నాకెందు కనిపించిందో నాకు స్పష్టంగా తెలియదు. కాని ఆమె చేతివ్రేళ్లు చూస్తే నాకు

అలా అనిపించింది. అవ్రేళ్లు పొడుగ్గా, నాజూగ్గా అందంగా వున్నాయి.

బస్సు ఆగగానే నేను దిగి రూము వైపు నడవటం ప్రారంభించాను. ఎప్పుడూ బస్సు దిగగానే రూము వైపు నడుస్తూ అడుగులు లెక్కపెడుతూ వుంటాను నేను. సింహద్వారం దాకా మొత్తం నూట ఎనభై మొదలు రెండువందల అడుగులు పడతాయి. సింహద్వారం నుంచీ మేడ మెట్ల దాకా యిరవై అడుగులు. ఆతర్వాత మొత్తం నేనెక్కవలసిన మెట్లు నలభై. ఆఖరి మెట్టు నుంచి మళ్లీ మూడు అడుగులు వేస్తే రూము గుమ్మం ప్రక్కనే నిలబడి వుంటాను. ఆగది, మేడ మీద ఎడమ వైపు చివరగా వుంటుంది. ఎప్పుడూ గాలి విసురుగా వీస్తూనే వుంటుంది. మా ఆఫీసులో ఒక గుమాస్తా వున్నాడు. ఆయన కనిపించిన ప్రతివారితోనూ మాట్లాడేందుకు మరే విషయమూ లేనట్టు ఎప్పుడూ "మేము అద్దెకుంటున్న పోర్షనులో బొత్తిగా గాలిలేక చచ్చిపోతున్నామండీ. ఎలా గెటౌన్ కావడమో అర్థం కావడంలేదు" అంటూ వుంటాడు.

రోడ్డు మీద మొత్తం వంద అడుగులు నడిచానో లేదో నా ఎదురుగా మోటారు సైకిల్ ఆగింది. తలఎత్తి చూసేసరికి మనోహరం కనిపించాడు. ఒక కాలు రోడ్డు మీద వుంచి "ఈమధ్య కనిపించడం లేదేం?" అని ప్రశ్నించి గాగుల్స్ తీసి సిల్కు జేబురుమాలుతో తుడుచుకుంటూ నావంక చూసి నవ్వాడు. అతను కనిపించినందుకు నేను చాలా సంతోషించాను. "నువ్వే నాకు కనిపించడంలేదు. నాదేముందీ ? తెల్లవారితే ఆఫీసూ, పొద్దుగూకితే నా రూమూ, మరెక్కడికీ పోను నేను...." అన్నాను. అతడు నవ్వుతూ "నాకు తీరిక ఉండదోయ్ ! ఇరవైనాలుగ్గంటలూ బిజీ...." అన్నాడు.

నేను ఒక్క క్షణం ఆగి అనుమానిస్తూనే "మా రూము ఇక్కడికి దగ్గరే .... ఒక్కసారి రాగూడదూ ? కాస్సేపు కూర్చుని సరదాగా గడిపినట్టు ఉంటుంది" అన్నాను.

అతడు వాచీ చూసుకుని "మరోసారి వస్తాన్లే .... ఇప్పుడు చచ్చేంత పని ఉంది. మరో పదిహేను నిముషాల్లో ఒకచోటికి వెళ్లకపోతే కొన్ని వేలు నష్టం...." అంటూ మోటర్‌సైకిల్ స్టార్టు చేశాడు.

నా ముఖం బహుశా కొంచెం నల్లబడి ఉండాలి. ఉక్రోషంతో పక్కకు తొలగి నిలబడ్డాను. అతను తలవూపి 'వొస్తానోయ్' అంటూ ముందుకు సాగిపోయాడు.

అవును. నాకీ అవమానం జరుగవలసిందే.... ఇది నాలుగోసారి అనుకుంటాను, అతన్ని మా రూముకు రమ్మని పిలిచి అవమానం పొందటం. అవును మరి.... అతను శ్రీమంతుల అల్లుడు.... కాలు క్రింద పెట్టకుండా, అత్యవసరమైతే తప్ప ఎండలోకి రానవసరంలేకుండా కాలం గడుపుతా డతడు. కొన్ని చోట్లకు నిముషాలమీద వెళ్లకపోతే అతనికి వేల కొద్దీ రూపాయలు నష్టం. అతడు నాకు చాలా యేళ్ల క్రితం ఇంటర్మీడియేట్ చదివే రోజులలో క్లాస్‌మేట్. ఆ పరిచయం కొద్దీ నేను ఉద్యోగంలో చేరగానే మొదటిసారి కనిపించినప్పుడు పలుకరించి వివరాలన్నీ తెలుసుకున్నాడు. నా ఉద్యోగం గురించీ, జీతం గురించీ అన్ని వివరాలూ చెప్పాను. నా జీతం నూటపాతిక రూపాయలని వినగానే అతడు ఒక్కసారి మొహం చిట్లించి "అదేమిటయ్యా మహానుభావా ? ఆ జీతం డబ్బులతో ఇంత సిటీలో ఎలా బ్రతకటం ? అబ్బో చాలా కష్టం...." అన్నాడు. తర్వాత అప్పుడప్పుడు తప్ప, అతడు తరుచుగా కనిపించేవాడుకాదు. కనిపించినప్పుడల్లా నేను అతన్ని 'మా రూముకు రమ్మ'ని ఆహ్వానించటమూ, అతడు వాచీ చూచుకొంటూ "అర్జంటుగా వెళ్లాలోయ్" అని నిరాకరించడమూ జరుగుతూనే ఉంది. అలా రాకపోకలు ప్రారంభమై స్నేహం పెంచుకుంటే, ఆ స్నేహాన్ని నేను మరొక విధంగా ఉపయోగించుకుంటా ననుకున్నాడో ఏమో మరి ! సింహద్వారం దాటి వెళ్లేటప్పుడు రోజా పంపు వంకకు చూస్తూ ఉంటాను. అక్కడ పెద్ద క్యూ ఉంటుంది. వరసగా బిందెలూ, బొక్కెనలూ, కొన్ని కుండలూ బోర్లించబడి తమ వంతు కోసం ఎదురుచూస్తూ ఉంటాయి.

మేడ క్రిందిభాగంలో మెట్ల ప్రక్కనే చివరి పోర్షనులో బ్యాంకు గుమాస్తా ఒకాయన అద్దె కున్నాడు. ఆయన వరండాలో స్తంభాని కానుకుని నిలబడి బీడీ కాల్చుకుంటూన్నాడు. ఆయన కూతురు పి. యు. సి. చదువుతున్నది. బక్కపలుచగా ఎర్రగా ఉంటుంది. ఎప్పుడూ ముందు హాల్లో కిటికీ ప్రక్కగా పడక కుర్చీలో పడుకుని ఒక లావాటి పుస్తకం చదువుతూ ఉంటుంది. ఉదయంపూట ఆ అమ్మాయి కాలేజీకి వెళ్లేటప్పుడు చూస్తే నాకు ఎందుకో జాలి.... బోలెడు పుస్తకాలు ఒక చేత్తో గుండెల కదుముకుని, మరో చేత్తో టిఫిన్ గిన్నె పుచ్చుకొని గాలిలో తేలిపోతున్నట్టు నడుస్తూ వెళ్లిపోతుంది. శక్తికి మించిన చదువు ఆమెను పెరగనివ్వడం లేదని నా అభిప్రాయం. ఆ పిల్ల అన్న ఒక డున్నాడు. వాడి పేరు రాజేంద్ర. ఇంట్లో 'రాజా' అని పిలుస్తూ ఉంటారు. వాడికి చదువు వంటబట్టలేదు. పైగా చెడుసావాసా లున్నాయి. ఆ ఈడుకే సిగరెట్లు తెగ కాల్చిపారేస్తూ ఉంటాడు. ఇంట్లో ఎవరి మాటా వినడు. పక్క యిళ్లలో కూడా వాడంటే అందరికీ హడల్ .... ఉన్నట్టుండి ఏదో దొరికిన వస్తువు చేత పుచ్చుకుని వెళ్లిపోతూ ఉంటాడు. ఒకసారి ప్రక్కయింటివారి అలారం గడియారం పట్టుకుపోయి ఎక్కడో పది రూపాయలకు అమ్మి జల్సా చేశాడు. వారు ఆ విషయం వాడి తండ్రికి చెప్పి "కొంచెం అదుపులో పెట్టుకోండి" అని సలహాయిస్తే ఆయన ఖండితంగా "మావల్ల కాదు. పోలీసు రిపోర్టు యివ్వండి. జైల్లో పడితే మాకూ పీడ విరగడైపోతుంది" అన్నాడు. ఆ భార్యాభర్త లిద్దరికీ ఆడపిల్లమీద బోలెడన్ని ఆశలు. ఆపిల్ల పరీక్షలు ప్యాసై మంచి ఉద్యోగం సంపాయించి తమకు ముసలితనంలో ఆధార మవుతుందని వారు కొండంత ఆశతో ఉన్నారు.

—అలవాటు ప్రకారం మెట్లెక్కుతూ ఉండగా రెండో అంతస్థులో ఉండే హిందూస్తానీ వ్యక్తి నావంక కొరకొరా చూశాడు. వాళ్లమ్మాయి నా చెప్పుల చప్పుడు విని పాము లాగా తల గుమ్మం బయటికి పెట్టి చూసి మళ్లీ లోపలికి వెళ్లిపోయింది.

—నేను రూము ముందు నిలబడి తాళంచెవి వెదికి తీసుకుని తాళం తీసి లోపల ప్రవేశించాను. పొద్దు గూకుతున్న కారణంగా లోపల వెలుతురు తక్కువగా ఉంది. నేను లోపల అడుగు పెడుతూనే కిటికీ పక్కన సాలీడు వంక చూశాను. అది నిశ్చలంగా ఉంది.

చెప్పులు విడిచి, లైటు వేసి, చాపమీద నడుం వాల్చాను. గొంతెత్తి పాడుకోవా లనిపించింది. అంతలోనే దగ్గు వచ్చింది. ఒక్క నిముషంసేపు అలా దగ్గుతూనే ఉండిపోయాను. నీళ్లు నిండిన కళ్లను తుడుచుకుంటూ ప్రక్కనే ఉన్న అద్దం చేతి లోకి తీసుకొని చూసుకుంటే మొహమంతా ఎర్రగా కంది పోయి భయంకరంగా కనిపించింది.

గది నాలుగుమూలల నుంచీ నామీదికి దండెత్తుతున్న ఒంటరితనం నా శక్తిని హరించివేస్తున్నది. ఒంటరితనం కేన్సర్‌లా నన్ను తినివేస్తున్నది. ఇప్పటికే క్రూరమైన షార్క్ చేపలాగా అది నన్ను చాలా భాగం తినివేసింది. మరి కొద్ది రోజులలో పూర్తిగా తిని త్రేన్చుకుంటూ వెళ్లిపోతుంది.

"పిక్నిక్‌లో నా పాట మొదటి అయిటం...." గొంతెత్త బోయాను.

మళ్లీ అంతలోనే గొంతునొప్పి వస్తుందనే భయంతో వొళ్లు జలదరించింది. అలాగే కళ్లు మూసుకుని నిశ్చలంగా కూర్చుండిపోయాను.

2

—మరునాడు ఉదయం రూముకు తాళంవేసి బయలు దేరుతూ ఉండగా ఆ ప్రక్క గదిలో ఉండే వరప్రసాద్ కిటికీలో నుంచి తన ట్రాన్సిస్టర్ ట్యూన్ చేస్తూ కనిపించాడు. అతనిది అసలు గోదావరి జిల్లాలో ఏదో వూరు. కలవారి చిన్నవాడు. ఎప్పుడూ చాలా హుషారుగా ఉంటాడు. నా యీడువాడే. సెంట్రల్ గవర్నమెంటులో ఏదో ఉద్యోగం. నెలలో కనీసం పది రోజులు క్యాంపులమీద వెడుతూ ఉంటాడు.

—అతడు నవ్వుతూ యివతలికి వచ్చి "రెండు రోజుల నుంచీ కనిపించడమే మానేశారేం గురువుగారూ ?" అని అడి గాడు.

నేను మెట్లు దిగబోతూ ఆగి వెనుదిరిగి "ఒక స్నేహి తుడు వచ్చాడు. అందువల్ల రెండు రోజుల నుంచీ ఒకటే తిరుగుడై పోయింది" అని చెప్పాను.

అతడు హుషారుగా "ఇవాళ సాయంకాలం స్టేడియం గ్రౌండ్స్‌లో ఫుట్‌బాల్ ఫైనల్సు ఉంది. మీరు కూడా రాగూ డదూ ? వెళ్ వద్దాం...." అన్నాడు.

నేను రెండు మెట్లు దిగి "చూద్దాంలెండి .... సాయం కాలం పెందరాళే మీరు మా ఆఫీసుకు రండి" అన్నాను. అతడు "ఓ. కే" అంటూ తన రూములోకి వెళ్లిపోయాడు.

నే నప్పు డలా అన్నానే గాని తీరా మెట్లు దిగుతూ ఉండగా ఎందుకో అనాలోచితంగా మాట్లాడా ననిపించింది. అక్కడ విపరీతమైన జనసందోహం ఉంటుంది. అక్కడ నాకు వూపిరాడదు. ఎందుకో అలసటా ఆయాసమూ వస్తాయి. ఆ జనసమూహం తుఫాను నాటి సముద్రంవలె కోలాహలం చేస్తూ ఉంటుంది. దాని అడుగున ఎక్కడో ఆ ఎనిమిది చేతుల భయంకర జంతువు ఉండే ఉంటుంది.... అది షార్క్‌లా వెంటాడి నన్ను కేన్సర్‌లా కబళించక మానదు.

—నేను నెమ్మదిగా నడవటం ప్రారంభించాను. ఈ నగరం గురించి చిత్రమైన విషయం ఏమిటంటే— ఇక్కడ చాలా ఆలస్యంగా తెల్లవారుతుంది. ఉదయం ఎనిమిది గంటలు దాటినా నగరం నిద్రమత్తులో నుంచి బయట పడదు. ఆవేళప్పుడు రోడ్డుమీద నడుస్తూ ఉంటే అక్క డొకరూ అక్కడొకరూ మత్తు నిండిన కళ్లతో బద్ధకంగా గంజాయి పీల్చిన వారిలా జనం ఎదురవుతూ ఉంటారు. మా ఆఫీసులో ఒకాయన మద్యనిషేధంలేని యీ ప్రాంతాలను గురించి తమాషాగా "మాగాణి భూములండీ యివి. వెట్‌ల్యాండ్స్" అంటూ ఉంటాడు. నా గది ప్రక్కనే ఉన్న వరప్రసాద్ అప్పు డప్పుడు 'బార్' గురించీ, త్రాగుడు గురించీ చెబుతూ ఉంటాడు.

—ఒక నడివయసు వ్యక్తి మఫ్లరు మెడ చుట్టూ బిగించుకుంటూ ఎర్రబడిన కళ్లతో పేవ్‌మెంట్ మీద నడిచి పోతున్నాడు. అతన్ని చూస్తే రాత్రి బాగా తాగి మత్తుగా గడిపి యిప్పుడే యీ ప్రపంచంలో పడుతున్నవాడిలా కనిపించాడు. అసలు తాగుతూ ఉంటే ఎలా ఉంటుందో! గొంతు మంట పుడుతుంది కాబోలు ! గొంతులో మంట పుట్టించే ఆ ద్రవం అసలు ఎందుకు త్రాగాలి ? దానివల్ల ఏమిటి లాభం ?

—హఠాత్తుగా డాక్టరు నన్ను పరీక్ష చేసినప్పటి దృశ్యం గుర్తుకు వచ్చింది. నన్ను నిలువెత్తు పెట్టెలో నిల బెట్టి మాట్లాడుతూ ఉండమని గుండె, వూపిరితిత్తులూ, గొంతూ పరీక్ష చేశాడు. అది ఎక్స్‌రే పరీక్ష కాబోలు ! ఆయనకు అప్పుడు ఏం కనిపించి ఉంటుంది ? నా కంఠ నాళాలూ, లోపలి ఎముకలూ, జబ్బూ కనిపించి ఉండాలి.

—దగ్గు వస్తూవుంటే ప్రయత్నంమీద అణుచుకో బోయాను. అందువల్ల దగ్గకనూ తప్పలేదు. బాధపడకనూ తప్పలేదు. కొన్ని క్షణాల అనంతరం ఆ బాధనుంచీ తేరుకుని రుమాలుతో కళ్లు తుడుచుకుని గొంతు సర్దుకున్నాను. "పిక్నిక్‌లో నా పాట మొదటి అయిటం...." కొంచెంగా కూని రాగం తీయబోయి అంతలో బస్ స్టాప్ దగ్గర పడటంవల్ల ఆ ప్రయత్నం విరమించుకున్నాను. క్యూలో నిలబడితే ఎదు

రుగా హొటల్లో కౌంటర్ ముందు కూర్చుని ఉన్న బట్టతల వ్యక్తి కనిపించాడు. హొటల్లో ఆట్టే రద్దీలేని కారణంగా చేతిమీద గడ్డం ఆనించుకుని విశ్రాంతిగా కూర్చుని ఉన్నాడు. ఆ ప్రక్కన స్టేషనరీ స్టోర్సు యజమాని బహుశా అందరికంటె ముందుగా తన కొట్టు తెరుస్తాడనుకుంటాను. అతడు లోపల కూర్చుని పత్రిక తిరగవేస్తున్నాడు.

—బుల్లి చేతివాచీ ధరించే ఆ పచ్చని పడుచు క్యూలో నా వెనక చేరింది. పలుచగా పౌడరద్దిన మొహాన్ని తన చేతి రుమాలుతో తుడుచుకున్నది. అంతలో మృదువైన, హాయి గొలిపే పరిమళం ఏదో కొద్ది : అడుగుల కైవారంలో వ్యాపించి నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. నాకు గొంతులో మంట పుట్టింది. దగ్గు తెర రాబోతే బలవంతంగా అణుచుకున్నాను. వెనుదిరిగి ఒక్కసారి చూస్తే ఆమె చేతిలోవున్న పుస్తకంమీద గుండ్రని అక్షరాలతో ఆమె పేరు కనిపించింది. ఆపేరు ఏమిటో, ఆమె ఏం చేస్తున్నదో తెలుసుకోవా లనిపించింది గాని, తదేకంగా అలా చూస్తే ఆమె అన్యథా భావించే అవకాశం ఉన్నదని తోచడంవల్ల మళ్లీ చూపులు తిప్పుకున్నాను.

—బస్సు వస్తూవుండటం గమనించి అక్కడ ఉన్న నలుగు రయిదుగురూ సర్దుకుని నిలబడ్డారు. బస్సు పూర్తిగా ఖాళీగా ఉంది. నేను చిల్లర పైసలు చేతిలో ఉంచుకుని లోపలికి ఎక్కి ఒకచోట కూర్చుని వెనుదిరిగి చూశాను. బస్సు కదిలిన కుదుపు మూలంగా ఆమె ముందుకు తూలింది. కూర్చునే లోపుగానే ఆమె చేతిలో పుస్తకం నా కాళ్ల దగ్గర పడింది. నేను వంగి దాన్ని తీసుకుని ఆమెకు అందించాను. ఆమె 'థ్యాంక్స్' అన్నది అస్పష్టంగా. అప్పుడు చక్కగా చూడగలిగాను, ఆర్. రత్నావళి అనే పేరు. తర్వాత చూపులు తిప్పుకుని ముందుకు చూస్తూ కూర్చుండిపోయాను. ఆపేరు మళ్లీమళ్లీ జ్ఞాపకం చేసుకోవా లనిపించింది. నా కది అంత మధురంగా ధ్వనించింది.

ఆనాడు స్ప్రింగ్ డోరు తెరుచుకుని వచ్చిన డాక్టరు అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. "కంగారుపడ నక్కరలేదు. త్వరలో అంతా సర్దుకుంటుంది."

బహుశా అంతా సర్దుకుని ఎప్పుడైనా మధుసూదనం చెప్పినట్టు పెళ్లి చేసుకుంటానేమో ! "నాకు కాబోయే భార్య యిలా ఉండాలి" అని నేను కొంతకాలం క్రిందట కలలు కనేవాణ్ణి. అలా నేనూహించిన విధంగానే, అటువంటి అమ్మాయినే పెళ్లిచేసుకుంటే చాలా సంవత్సరాలకు ఎప్పుడో మాకు ఒక బుల్లి పాపాయి పుట్టినప్పుడు, 'రత్నావళి' అని పేరు ఉంచుదామని నేను నా భార్యతో అంటాను. ఆమె తప్పక ఒప్పుకుంటుంది.

బస్సులో ఒక వ్యక్తి ఏవేవో మూటలతో ఎక్కేందుకు ప్రయత్నిస్తూ ఉంటే కండక్టరు తల అడ్డంగా వూపుతూ 'వీల్లేదు' అంటూ బెల్ మ్రోగించాడు. పేవ్‌మెంట్‌మీద నిస్సహాయంగా మూటలతో నిలబడిపోయిన ఆ వ్యక్తినిచూస్తే గుండెలలో చేయిపెట్టి కలచినట్టయింది.

పలుచని బంగారు రంగు ఎండ అంతటా వ్యాపిస్తున్నది. ఉన్నట్టుండి వీధులలో రద్దీ ప్రారంభం అయింది. కార్లూ, రిక్షాలూ, ఆటోరిక్షాలూ, స్కూటర్లూ, మోటారు సైకిళ్లూ, సైకిళ్లూ రివ్వున సాగిపోతున్నాయి. అంతవరకూ మత్తులో జోగుతూ తూగుతూ ఉన్న నగరం హఠాత్తుగా ఎవరో తట్టి లేపినట్టు హడావిడితో నిండిపోతున్నది.

నేను దిగబోతూ బస్సులో చూస్తే బుల్లి చేతివాచీ అమ్మాయి—రత్నావళి—లేదు. ఎక్కడ దిగిపోయిందో మరి.

నేను రోజూ ఆఫీసు ముందు బస్సు దిగగానే పేవ్‌మెంట్ మీద నాలుగు చక్రాల బండిలో తినుబండారా లమ్ముకొనే గడ్డం సాయిబు నవ్వుతూ పలకరిస్తాడు. అతనికి ఏభై యేళ్లుంటాయి. అయిదుగురు ఆడపిల్లల తండ్రి. మాటి మాటికీ "నారు పోసినవాడు నీరు పొయ్యడా .... అన్నిటికీ అల్లా ఉన్నాడు" అంటూ ఉంటాడు.

ఎప్పుడో యుద్ధంలో పనిచేశాడట. ఎడమకాలిలో యిప్పటికీ తుపాకీగుండు ఉందని చెబుతూ ఉంటాడు. అతడు నన్ను చూసి "క్యా సాబ్ ? రెండు రోజుల్నుంచీ కనిపించింది లేదేం ?" అని అడిగాడు. నేను నవ్వి "సెలవు పెట్టాను" అంటూ ఆఫీసు లోపలికి నడిచాను.

ఆఫీసు క్యాంటీనులో కొద్దిమంది మాత్రం ఉన్నారు. అక్కడ, మా సెక్షను వాళ్లెవరూ కనిపించలేదు నాకు. టోకెన్లు తీసుకుని ఒకచోట కూర్చుని టిఫిన్ తీసుకున్నాను. ఆ తిన్నది కొంచెమూ చాలా నెమ్మదిగా తినవలసి వచ్చింది. గొంతులో నొప్పి క్రమక్రమంగా ఎక్కువవుతున్నది. గొంతులో ఏమున్నదో ఏమో ! ఆ నిలువెత్తు ఎక్స్‌రే పెట్టెలో నన్ను నేను చూసుకోగలిగితే ఎంత బాగుండును !

జితేంద్రియరావు నవ్వుతూ పలకరించి వెళ్లాడు. అతని పేరు నాకు ఎప్పుడూ చిత్రంగా ఉంటుంది. అతడు పని చేసేది మా ఆఫీసులో ఒక చిన్న యూనిట్‌లో. అయిదుగురు గుమాస్తా లున్నారు. వారికి వేరే గది ఉంది. ఆ అయిదుగురిలో ఒకాయన హెడ్. అందర్నీ చిత్రమైన పేర్లు కలవారినే ఏరి అక్కడ పడేసినట్టుంది ప్రభుత్వం. ఆ హెడ్ పేరు వైనతేయరావు. నల్లగా, పలుచగా గద్దలాగే ఉంటాడు. జితేంద్రియరావు పక్క సీటులో పని తక్కువ. ఆ కుర్చీలో కునికిపాట్లు పడుతూఉండే వ్యక్తి వెంగళరావు. ఆ తర్వాతి వ్యక్తి నల్లగా లావుగా ఉంటాడు. అతని పేరు కోలాహలరావు. పెళ్లి కెదిగిన ఆడపిల్ల అనే పండు నిప్పులతో నిండిన కుంపటిని వీరోచితంగా గుండెలమీద ఉంచుకొని భరిస్తున్నాడాయన. మొన్న మొన్నటివరకూ నన్ను గురించి ఆచూకీలు తీసి నావెంటపడి తిరిగాడు. చివరకు శాఖను గురించో, గోత్రం గురించో ఎక్కడో యిబ్బంది వచ్చి ఆ ప్రయత్నం విరమిం

చాడు. దేవుడలా ఆ పిల్లకూ నాకూ ఎంతో మేలు చేశాడని పించింది. మరో గుమాస్తా పేరు వ్యాఘ్రేశ్వరరావు. సన్నగా రివటలా గాలి విసురుకే తూలిపోయేవాడిలా ఉంటాడు. అమిత భయస్థుడు. చాలా త్వరగా ఎవరో తరుముకు వస్తున్నట్టు మాట్లాడుతూ ఉంటాడు.

కాఫీ ముగించుకుని బయటికి వచ్చి మా యూనిట్ లోకి నడిచాను. మళ్ళీ మధ్యాహ్నం భోజనానికి తప్ప—సాయంకాలం అయిదు గంటల వరకూ బయటికి రావడం కుదరదు. ఆ మధ్యాహ్నం జీతం వస్తుందనే సంగతి గుర్తుకు వచ్చినా ఆట్టే ఉత్సాహం కలగలేదు. వెళ్ళి సీటులో కూర్చున్నాను. మా హెడ్ అప్పటికే తన కుర్చీలో కూర్చుని ఫైళ్ళు తిరగ వేస్తున్నాడు. ఆయనను చూస్తే నాకు ఆశ్చర్యంగా ఉంటుంది. ఇల్లూ, పెళ్ళాం, పిల్లలూ లేక యితరఆరాటాలూ యీ మనిషికి అసలు ఉన్నాయా? అని సందేహం కూడా కలుగు తుంది. ఇక్కడ చేసేపని చాలక యింటికి కూడా ఫైళ్ళు మోసుకు పోతాడు. అప్పుడప్పుడు "వర్క్ యీజ్ గాడ్" అంటూ ఉంటాడు. నా మటుకు నాకు ఆ కాయితాలను చూస్తేనే ఎందుకో బాధగా ఉంటుంది. ముక్కుపొడి రంగులో ఉంటాయి అవి. అన్నీ రకరకాల అర్జీలు, ఉత్తరువులూ!

ఇంతకాలం నుంచీ యీ సీటులో పనిచేస్తున్నప్పటికీ నాకు యీ ఆఫీసు చేస్తున్న నిర్వాకం ఏమిటో, ఏయే ప్రయోజనాలు ఈ కరెస్పాండెన్స్ వల్ల సిద్ధిస్తున్నాయో యింతవరకూ తెలియదు. ఒకసారి ఒక ముసలి టీచరుకు డబ్బు ముట్టజెప్పవలసి ఉండగా ఆ అర్జీ అన్ని చేతులూ దాటి వెళ్ళి అన్ని అభ్యంతరాలూ తట్టుకుని ప్యాసయ్యేసరికి ఆ నిర్భాగ్యుడు 'హరీ' అన్నాడు పాపం! అటువంటి సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

ఒక్కొక్కరే వచ్చి తమ తమ సీట్లలో సర్దుకు కూర్చుంటున్నారు. రామమూర్తి నవ్వుతూ నా వంక చూశాడు. కొద్ది నిమిషాల్లో అందరూ ఎవరి పనిలో వారు మునిగిపోయారు. నేను పైన గిర్రున తిరిగే ఫ్యాను వంక చూస్తూ ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాను. ప్యూను రాఘవులు నా ముందు బల్లమీద బారెడు పొడుగాటి కాయితాలు తెచ్చి పడేశాడు. వాటినిండా బోలెడు అంకెలు. అవన్నీ కూడి సరిచూడాలి. వాటిని చేతిలోకి తీసుకుని పని ప్రారంభించాను. కొంతదూరం కూడి మళ్ళీ అనుమానం రావడంవల్ల పైకి వెళ్ళాను. ఆ అంకెలన్నీ మహా సముద్రంలా ఉన్నాయి. ఎక్కడా దారీ, తెన్నూ కనిపించడంలేదు. ఆ సముద్రం అడుగున ఎక్కడో ఆ భయంకరమైన ఎనిమిది చేతుల 'ఆక్టోపస్' విహరిస్తున్నది. అది నా ఒంటరితనంలా, కేన్సర్‌లా కబళించివేస్తుంది తప్పదు.

పని పూర్తి అయిందనిపించి చేతులు తుడుచుకున్నాను. తల ఎత్తి గడియారం వంక చూస్తే మరొక గంట వ్యవధి ఉంది. అలాగే కిటికీలోనుంచి బయటికి చూస్తూ కూర్చున్నాను. అలా చూస్తూ ఉంటే ఎప్పుడూ ఆ ఆవరణలో ఉన్న పెద్ద మర్రిచెట్టు నా దృష్టిని ఆకర్షిస్తుంది. వాబోటివాళ్ళు నలుగు రైదుగురు ఒకరి చేతులు మరొకరు పట్టుకుని గుండ్రంగా నిలబడితే దానిచుట్టూ నిలబడగలుగుతా మను కుంటాను. పెద్ద పెద్ద వూడలు నేలలో దిగి పాతుకుపోయి ఉంటాయి. ఆ చెట్టుకు ఎన్నేళ్ళు ఉంటాయో! అది చిన్న మొక్కగా జీవితం ప్రారంభించినప్పుడు యీ ఆఫీసు ఉన్న స్థలంలో ఏముండేదో!

ఆలోచనలో పడిన నన్ను ప్యూను పిలిచాడు. నాకోసం ఎవరో వచ్చారని చెప్పాడు. నేను లేచి బయటికి వెళ్ళి చూద్దునుకదా! వరప్రసాద్ నిండుగా నవ్వుతూ హుషారుగా "రమ్మన్నారుగా గురూజీ! పోదాం పదండి. లెటజ్ గో....' అన్నాడు.

అతనివంక చూస్తూ ఒక్క నిముషంసేపు సముద్రం అడుగున ఉండే ఆ భయంకర ప్రాణిని గురించీ, నన్ను నిరంతరం నిద్రలో కూడా వెంటాడే ఒంటరితనం గురించీ మరిచిపోయాను. అతనిలా నవ్వుతూ, తుళ్ళుతూ హుషార్‌గా ఉండగలగటం ఎంత అదృష్టమో అనిపించింది. కాస్సేపు అతన్ని అనుకరిద్దా మనుకున్నాను. అందుకని అతనిలాగే నవ్వేందుకు ప్రయత్నించి "సరే. పోదాం. నేను జీతం తీసుకు వచ్చేస్తాను. ఒక్క నిమిషం ఆగండి." అని చెప్పి అతన్ని కూర్చోబెట్టి వెళ్ళి జీతాలు యిచ్చే క్లర్కు దగ్గర నిలబడ్డాను. అక్కడ కళ్ళజోడు సవరించుకుని నా చేతికి పెద్ద పుస్తకం అందించి సంతకం పెట్టించుకుని క్యాష్ చెస్ట్ తెరిచి పది రూపాయల నోట్లు వరసగా తీసి లెక్కపెట్టడం ప్రారంభించాడు. నేను అతడు లెక్కపెడుతూ ఉంటే కన్నార్పకుండా చూస్తూ నిలబడ్డాను. అతడు చాలా జాగ్రత్తగా రెండు మూడుసార్లు లెక్కపెట్టి ఆ తర్వాత డబ్బు నాచేతికి అందించాడు. ఇక నేను లెక్కపెట్ట నవసరంలే దనిపించింది. ఆబొత్తిని అలాగే జేబులో ఉంచుకుని వెనుదిరిగాను. ఆ క్షణంలో బస్సులో తటస్థపడిన వృద్ధురాలూ, ఆమె మాటలూ గుర్తుకు వచ్చాయి. ఆమె కొడుకు ఇంట్లో డబ్బు యిచ్చాడో లేదో! లేకపోతే 'కోడలూ, పిల్లలూ, నేనూ ఈ నెలంతా పస్తుండక తప్పదు' అన్న మాటలు చెవులలో ప్రతిధ్వనించాయి.

మెట్లు దిగుతూ ఉంటే రామమూర్తి ఎదురుపడి "ఏమండోయ్! వెళ్ళిపోతున్నారల్లే ఉంది అప్పుడే. వచ్చేవారం పిక్‌నిక్ సంగతి మరిచిపోకండి. ప్రోగ్రాంలో మొదటి అయిటం..." అంటూఉండగానే నేను తలవూపి త్వరత్వరగా దిగి వచ్చేశాను.

ప్రతినెలా నేను జీతం తీసుకున్న వెంటనే తప్పనిసరిగా చేయవలసిన పని ఒకటి ఉంది. దాని తర్వాతనే మరేదయినా. వరప్రసాద్‌తో కలిసి వెళ్ళే దోవలోనే ఆపని పూర్తిచేసుకు మరీ వెళ్ళవచ్చు.

ఇద్దరం కలిసి బయటికి వచ్చేటప్పుడు అతనితో అన్నాను. "మనకు ఇంకా వ్యవధి ఉంది కదా? వెళ్ళే దోవ

లోనే నాకు ఒక చిన్న పని ఉంది. రెండు మూడు నిముషాల కంటే ఎక్కువ పట్టదు.''

వరప్రసాద్ వాచీ చూసుకుని ''ఫరవాలేదు. మనకు చాలా టైం ఉందిలెండి'' అన్నాడు.

ఇద్దరం నడవటం ప్రారంభించాము. సాయంకాలపు ఎండ ఆహ్లాదకరంగా హాయిగా ఉంది. నిర్మేఘమైన ఆకాశం స్వచ్ఛంగా అద్దంలా ఉంది. రకరకాల పక్షులు రకరకాలుగా ఈలలు వేసుకుంటూ ఎగిరిపోతున్నాయి. వరప్రసాద్ ఈల వేస్తూ నడుస్తున్నవాడల్లా ఆగి ''అన్నట్టు గురూజీ! ఈమధ్య మీ పాటలు వినిపించడం మానేశారేం ? రూములో ఒంటరిగా ఉన్నప్పుడు కూడా నిశ్శబ్దంగా ఉంటున్నారు. అంతకు ముందు కదలకుండా అలా కూర్చుంటే చాలు మీ రూములో నుంచి ఎంత హాయిగా పాటలు వినేవాణ్ణి !'' అన్నాడు.

అదుగో, సముద్రం అడుగున ఉండే ఆ ఎనిమిది చేతుల భయంకర జంతువు మళ్లీ కదులుతున్నది. నే నతని కేమీ సమాధానం చెప్పకుండా ఒకచోట ఆగి ''ఇలా లోపలికి రండి. ఒక్క నిముషంలో వెళ్లిపోదాం'' అన్నాను.

వరప్రసాద్ ఆశ్చర్యంతో కళ్లు పెద్దవిచేసి ''ఇక్కడేం పని మీకు ?'' అని అడుగుతూనే ఉన్నాడు. అంతలోనే నేను లోపలికి వెళ్లిపోయాను. వరప్రసాద్ బహుశా అక్కడే 'అన్నదాన సమాజము' అన్న చిన్న బోర్డు వంకా, ఆ ప్రక్కనే అప్పుడే రాత్రి భోజనానికి క్యూలో నిలబడిఉన్న చింపిరితలల, చింపిరి గుడ్డల మనుష్యులవంకా చూస్తూ నిలబడి ఉంటాడు.

చేతులు కట్టుకుని కిటికీలో నుంచి పెరటిలోకి చూస్తున్న ఆ సన్నని వ్యక్తిని చూడగానే నా మనసు ద్రవించింది. ఆయన ఏదో పెద్ద పోరాటంలో ఓడిపోయి అలసి పోయిన వాడిలా ఉన్నాడు. ''జీవితంలో సగభాగం అనుకున్నది సాధించకుండానే గడిచిపోయింది'' అని దిగులుపడుతూన్నవాడిలా కనిపించాడు.

నా అడుగుల చప్పుడు విని వెనుదిరిగి చూసి నవ్వి ''మీరు వచ్చారా ?'' అన్నా డాయన, పాత కుర్చీలో కూర్చుని లోపలినుండి రశీదు బుక్కు తీస్తూ.

నే నాయన ఎదురుగా కూర్చుని జేబులో నుంచి పది రూపాయల నోటు నొకదాన్ని తీసుకుని చేతిలో ఉంచు కున్నాను. ఆయన రశీదు వ్రాస్తూ ఉండగా లోపలికి చూస్తే ఆయన భార్య పొద్దుగూకేసరికి ఆకలితో నకనకలాడుతూ వచ్చి క్యూలో నిలబడే నిర్భాగ్యులకోసం వండి వారుస్తున్నది. ఆమె జుట్టు నెరిసి, నడుం వంగిపోయి జవసత్వాలుడిగిపోయిన స్థితిలో ఉంది. ఆయన రశీదు యిచ్చి పది రూపాయల నోట్లు పుచ్చుకుని నాకు నమస్కారం చేశాడు. నాకు కళ్లవెంట నీళ్లు ఉబికి వచ్చాయి. నిలువెల్లా సిగ్గుతో కంపించిపోయాను. నే నెన్నోసార్లు ''ఈ రశీదు లెందుకండీ?'' అన్నాను ఆయనతో, కాని ఆయన నవ్వి ''అది ఒక సంప్రదాయం. మనం పాటించాలి. అంతే'' అన్నాడు.

''వస్తానండి'' అని చెప్పి గుమ్మం దాటుతూ ఉండగా ఆయన నమస్కారం చేయడం గుర్తొచ్చి మళ్లీ కళ్లల్లో నీటిపొర నిలిచింది. ఆ నీటిపొరలోనుంచి వరండాలో నిలబడి అక్కడి పోస్టర్లు, బోర్డులు చదువుతున్న వరప్రసాద్ కనిపించాడు. నే నతని భుజం తట్టి ''వెడదాం, రండి ....'' అన్నాను. అతడు తల తిప్పి నావంక చూశాడు. మళ్లీ అంతలోనే అవి చదువుతూ నిలబడిపోయాడే గాని కదలలేదు. నాకు అక్కడ నిలబడటం అంతగా నచ్చలేదు. బయట గుమ్మంముందు చేరిన పది పదిహేను మంది మనుష్యులు మావంక కళ్లు పెద్దవి చేసుకుని చూస్తున్నారు. వారిలో ఆ రాత్రికి ఎందరికి అన్నప్రాప్తి ఉందో తెలియదు. ఆ పూట తన శక్తినిబట్టి ఆ వ్యక్తి కొందరిని ఉంచి మిగిలినవారిని వెళ్లిపొమ్మని చెబుతూ ఉంటాడు. ఒక్కొక్కప్పుడు చేరినవారు తమలో తాము పోట్లాడుకుంటూ ఉంటారు కూడా. 'నేను ముందు నిలబడ్డాన' ంటే, 'నేను నీకన్నా ముందు నిలబడ్డాన' ని ఒకరితో ఒకరు కాట్ల కుక్కలవలె వాదులాడుకుంటూ ఉంటారు. 'కొంతమందిని ఉండమ' నీ, మిగిలినవారిని వెళ్లమనీ చెప్ప వలసి వచ్చినప్పుడు ఆ వ్యక్తి మొహం చూడటం పెద్ద శిక్ష. నిస్సహాయుడై, ఏదో పెద్ద తప్పు చేస్తున్నవాడిలా నిలువునా ఒణికిపోతూ చెబుతాడా మాటలు. ఆయన చెప్పగానే వెనక నిలబడినవారు కొందరు వెళ్లిపోతారు. అప్పుడప్పుడు ఒక్కొక్క తలపొగరు మనిషి నోట పట్టరాని తిట్లు తిడుతూ వెళ్లి పోతాడు.

ఎట్టకేలకు వరప్రసాద్ మెట్లు దిగి యివతలికి వచ్చాడు. ఇద్దరం రోడ్డుమీదికి వచ్చి నిశ్శబ్దంగా కొన్ని అడుగులు వేశాము. నేను వరప్రసాద్ వంక చూశాను. అతడు చేబుల్లో చేతులు పెట్టుకుని నడుస్తూ ఆగి నా భుజం పట్టుకుని ''మీరు ప్రతి నెలా యిలా యిస్తూ ఉంటారా ?'' అని అడిగాడు.

నేను తల వూపాను. మరొక అడుగు ముందుకువేసి ''ఆయనను నేను ఎక్కడో చూశాను. బహుశా ఏదో పోస్టా ఫీసులో అనుకుంటాను'' అన్నాడు.

''అవును. ఆయనకు పోస్టాఫీసులోనే ఉద్యోగం. చాలా ఏళ్లనుంచీ ఈ అన్నదాన సమాజం నడుపుతున్నాడు. నెల జీతంలో చాలాభాగం యిందుకే కేటాయిస్తాడు. పిల్లలూ, యితర బాదర బందీ లేవీ లేవనుకోండి'' అన్నాను నేను.

వరప్రసాద్ ఉన్నట్టుండి ''ఒక్క క్షణం ఆగండి ఇప్పుడే వొచ్చేస్తాను'' అంటూ వెనుదిరిగి మళ్లీ లోపలికి వెళ్లాడు. నేను అలాగే వీధిలో నిలబడిపోయాను. రెండు నిముషాల తర్వాత అతడు ఇవతలికి వచ్చి నన్ను కలుసుకుని ''పదండి పోదాం'' అన్నాడు త్వరత్వరగా నడుస్తూ.

అతని టెరిలిన్ చొక్కా జేబులో ఆ ఎర్రరంగు రశీదు కాయితం స్పష్టంగా కనిపించింది నాకు. వీధి చివర ఆగి

వెనుదిరిగి చూస్తే అన్నదానసమాజం ముందు ఆయన నిలబడి మా వంకనే చూస్తూ ఉండటం కనిపించింది.

3

మే మిద్దరమూ బస్సుకోసం నిలబడిఉండగా వరప్రసాద్‌తో అన్నాను. "ఆయనపేరు సత్యమూర్తి. నాకు మొట్టమొదటి సారిగా ఒక రైలు ప్రయాణంలో పరిచయం అయింది ఆయనతో. మే మిద్దరం అప్పుడు చాలా విషయాల గురించి మాట్లాడుకున్నాం. ఆయన అప్పుడీ విషయాలేవీ చెప్పలేదు. మళ్లీ చాలా రోజుల తర్వాత ఒకసారి సెంటర్లో కనిపించాడు. నేను పలకరించగానే గుర్తుపట్టి ఆప్యాయంగా మాట్లాడాడు. తమ యింటికి ఒకసారి రమ్మన్నాడు. వెళ్లాను."

ఒక బస్సు వచ్చి యిద్దరు ముగ్గురిని మాత్రమే ఎక్కించుకుని వేగంగా వెళ్లిపోయింది. వరప్రసాద్ వాచీ చూసుకుని "యిలా అయితే మనం వేళకు అందుకోలే మను కుంటాను. పోనీ రిక్షామీద వెళ్లిపోదాం" అంటూ ఖాళీగా వెడుతున్న రిక్షాను పిలిచి బేరమాడి 'ఎక్కండిసార్' అన్నాడు. ఇద్దరమూ కూర్చోగానే రిక్షా తూనీగవలె రివ్వున పరుగెత్తడం ప్రారంభించింది.

నేను మళ్లీ చెప్పాను.

"తీరా అక్కడికివెళ్లగానే'అన్నదాన సమాజము'అన్నబోర్డు చూసి నివ్వెరపోయాను. అప్పుడు వాకిట్లో చాలామంది నిలబడి వున్నారు. వారి మొహాలలో, మాటలలో, చూపులలో అంతటా ఆకలి...కాన్సర్‌వంటి ఆకలి..నాకు కడుపులో దేవినట్టయింది. లోపల ఎత్తున వంట పనిచేస్తున్న ఆడమనిషిని చూపించి ఆయన 'నాభార్య' అని చెప్పాడు. ఆయన పల్లెత్తి వేరే ఒకమాట అయినా చెప్పకుండానే నేను అంతా గ్రహించాను. ఇంతకుముందు పొద్దున్నా, సాయంకాలమూ ఆఫీసు వేళలలో తప్ప మిగిలిన సమయాలలో ఎవరెవరి దగ్గరకో కాళ్లకు బలపాలు కట్టుకుని తిరిగే వాడు. ఒక్కొక్కప్పుడు బస్సు చార్జీలు కూడా దండగ అనిపించేవి. ఇప్పుడు అంతగా తిరగలేక తన ఆఫీసులోనే ఎవరో కొద్ది మంది దగ్గర వారు యిచ్చినంత పుచ్చుకుని వూరుకుంటున్నాడు. ఇచ్చినవారు యిస్తారు లేనివారు లేదు. అందువల్ల కొన్నినెలలుగా చూస్తున్నాను, చాలా నీరసపడిపోయాడు."

గ్రౌండ్స్ సమీపంలోకి వెళ్లేదాకా వరప్రసాద్ ఏమీ మాట్లాడలేదు. తీరా రిక్షా దిగి చూస్తే టిక్కెట్లు యిచ్చేచోట పెద్ద క్యూ కనిపించింది. లోపల కూడా బోలెడంత మంది జనం చేరినట్టున్నారప్పుడే. లోపల అంతా కేకలూ, గోలా రణగుణ ధ్వనిగా వుంది. నల్ల కళ్లజోళ్లూ, ట్రాన్సిస్టర్లూ, టెరిలిన్‌లూ, సన్నని ప్యాంట్లూ, తళతళలాడే బూట్లు, చూయింగ్‌గమ్‌లు, జోకులు, నవ్వులు, పందేలు, పై పందేలు, సవాళ్లతో వాతావరణం అంతా కోలాహలంగా వుంది.

వరప్రసాద్, వెనకనే నేనూ, క్యూలో నెమ్మదిగా ముందుకు కదులుతున్నాము. అంతలో వరప్రసాద్ స్నేహితులు కాబోలు కొందరు వచ్చారు. నేను ఏమీ తోచనివాడిలా వారిని లెక్కపెట్టాను. ఎనిమిది మంది. అందరూ ఫ్రెష్‌గా, హుషారుగా వున్నారు. వరప్రసాద్ వారికి నన్ను పరిచయం చేశాడు. "నేనప్పుడప్పుడు చెబుతూ వుంటానే మా ప్రక్క రూములో మిత్రుణ్ణి గురించి, వీరే..అద్భుతంగా పాటలు పాడతారు. మిస్టర్ భానుమూర్తి."

నేను వారందరితో కరచాలనం చేశాను. వాళ్ల చేతులు వేడిగా ఉన్నట్టు అనిపించింది. నా చేతులు ఎప్పుడూ చల్లగా వుంటాయి ఎందుకో మరి.

వాళ్లు అన్నారు: "మిమ్మల్ని గురించి మా ప్రసాద్ చాలా సార్లు చెప్పాడు. మేము మిమ్మల్ని వొదిలిపెట్టంలెండి. ఎప్పుడో ఒకసారి మీ పాటలు వినిపించాలి తప్పదు." నేను నవ్వుతూ తలవూపానేగాని ఏమీ మాట్లాడలేదు. వినిపిస్తాను. తప్పక వినిపిస్తాను. ఇప్పుడిప్పుడే నీటి అడుగున ఆ దారుణ జంతువు తన ఎనిమిది చేతులనూ నెమ్మదిగా కదిలిస్తున్నది. నాగొంతు రోజులు గడిచే కొద్దీ భలేగా పలుకుతుంది. కాన్సర్ వలె భయంకరమైన ఒంటరితనమూ, ఒంటరితనం వలె భయంకరమైన కాన్సరూ నన్ను కొద్దికొద్దిగా తింటున్నాయి. ఇంకా అవి పూర్తిగా విజృంభించలేదు. షార్క్‌కు యింకా తన ఆకలి తెలియలేదు. తెలిస్తే దాని విజృంభణను ఏశక్తి అడ్డగించగలదు!

వాళ్లందరితో పాటు క్యూలో ముందుకు కదులుతున్నాను. దూరంగా ఎవరో ఐస్‌క్రీం తింటున్నారు. నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటూ తింటున్నారు. నాకు అన్నదాన సమాజంముందు రాత్రితిండికోసం యిప్పటినుంచే నిలబడిన మనుషుల ముఖాలు గుర్తుకు వచ్చాయి. వారివి షార్క్ చూపులు. వారి పరిసరాలలో అంతటా కాన్సర్, కాన్సర్... వారి మొహాలలో అంతటా ఆకలి ఆకలి,.. వారి హృదయాలలో అంతటా చీకటి, చీకటి...

'క్యూ' సముద్రాల లోతులలోవుండే ఆభయంకరమైననీటి జంతువు తాలూకు ఎనిమిది చేతులలో ఒక చెయ్యిలా వుంది. నేనందులో చిక్కుకున్నట్టున్నాను. టిక్కెట్లు అందుకుని అందరూ హుషారుగా లోపలికి నడిచారు. లోపల చెవులు బద్దలు చేసే రొద, గందరగోళం. మైక్‌లో ఏదో ఎనౌన్స్‌మెంట్లూ, ఈలలూ, కేకలూ. ఆట ప్రారంభం అయ్యేందుకు మరికొద్ది నిముషాలు మాత్రమే వ్యవధి ఉంది. మైక్‌లో ఆ విషయం పదేపదే చెబుతున్నారు.

ఎవరో ఈలవేస్తూ వుండగా చూశాను. మధుసూదనం గుర్తుకు వచ్చాడు. నేను చిన్నతరగతులు చదివే రోజులలో వారానికి రెండురోజులు వారి యింట్లో భోజనం చేసేవాణ్ణి. మిగిలిన అయిదు రోజులూ వేరే అయిదు యిళ్లలో భోజనం. ఆ రోజులలో మధుసూదనం ఎక్కడి నుంచి ఎలా సంపాయించుకు వచ్చేవాడో మరి.. అప్పుడప్పుడు చిల్లరడబ్బులు పట్టుకు వచ్చేవాడు. మేము ఆ డబ్బులతో మధ్యాహ్నం పూట మ్యాటినీ సినిమాలకు వెళ్లే వాళ్లం. వాటికి టిక్కెట్లు దొరక. అవన్నీ ఏవేవో యింగ్లీషు

సినిమాలు. ఆ సినిమాల నిండా గుర్రపు స్వారీలూ, కత్తియుద్ధం, పిస్తోళ్లతో యుద్ధాలూ వుండేవి. అప్పుడు మధుసూదనం యిలాగే యీలలు వేస్తూ వుండేవాడు. ఆట ప్రారంభం అయింది. తెల్ల బనియనులవారూ, ఎర్రచారలబనియనులవారూ పట్టుదలతో ఎవరికి వారే గెలుపు మీద దృష్టి వుంచుకుని పట్టుదలతో ఆడుతున్నారు. నిమిషాలు గడిచే కొద్దీ జనంలోనూ హుషారు పెరిగింది. అందరూ విపరీతంగా అరుస్తున్నారు. చేతులు ఊపుతూ, రుమాళ్లుగాలిలో ఎగరవేస్తూ కోలాహలం చేస్తున్నారు. మా ముందు కొంచెం దూరంలోనే చెదరిన వెంట్రుకలను ఎడమ చేత్తో సర్దుకుంటూ రాజేంద్ర ఆట చూస్తున్నాడు. వాణ్ణి అప్పటికప్పుడు యివతలికి పిలిచి 'అలారం గడియారం అమ్మిన డబ్బుతో ఏయే జల్సాలు చేశాడో' కనుక్కుందా మనిపించింది.

క్రమంగా నాలో అసహనం బయులుదేరింది. పిచ్చాసుపత్రిలో, అర్థంపర్థం లేకుండా ప్రవర్తిస్తున్న వేలకొద్దీ పిచ్చివాళ్ల మధ్య ఒంటరిగా చిక్కుకున్న వాడిలా, సాలీడు గూటిలో చిక్కుకున్న అమాయకపు చిన్నపురుగులా అనుభూతి పొందాను. ఎందుకో ఆయాసం వచ్చినట్టయింది. గొంతులో ఏదో కదులుతున్నట్టు బాధ. దగ్గు వచ్చేట్టుంది. ఉన్నట్టుండి ఆకాశంలో మబ్బులు క్రమ్మి కుండపోతగా వర్షం కురిస్తే అప్పుడీ ఆటా, యీ ప్రేక్షకులగోలా ఏమైపోతాయి?

ప్రేక్షకుల కోలాహలం ఉన్నట్టుండి మిన్నుముట్టింది. అందరూ తమ కొంపలు కాలిపోతున్నట్టు చెవులు కోసిన మేకల్లా ప్రాణా లుగ్గబట్టుకుని అరుస్తున్నారు. ఏ పక్షం వారికో ఒక 'గోల్' అయింది. గ్రౌండ్‌లోనూ, ప్రేక్షకులలోనూ పెద్ద గందరగోళం. ఆకాశానికి చిల్లి పడుతుందేమో అనిపించింది.

ఆ సందడి తగ్గి మళ్లీ మామూలు ఆట ప్రారంభం అయింది. నేను తలఎత్తి పైకి చూశాను. ఒక్క మబ్బుముక్క మాత్రం కనిపించింది. సూర్యకిరణాలు పడటంవల్ల ఆ మబ్బు చుట్టూ వెండి చక్రం గీసినట్టున్నది.

నా మనసులో మళ్లీ కళ్లజోడు ముక్కు మీదికి జారుతూ వుండగా స్ప్రింగ్‌డోరు తెరుచుకుని వచ్చి ప్రయత్నపూర్వకంగా నవ్వుతూ ''కంగారు పడనక్కరలేదు. త్వరలో అంతా సర్దుకుంటుంది'' అంటున్న డాక్టరు మెదిలాడు. ఆయనను మళ్లీ రెండుమూడు సార్లు చూశాను. రెండురోజుల కొకసారి 'రమ్మ'ని ఆయన అంటే నేను పదిరోజుల కొకసారి వెళ్లాను. ఆయన నుదుట ఎప్పుడూ చమటపడుతూవుంటుందెందుకో!

మళ్లీ కేకలు, రొద, గందరగోళం. 'గోలు' కాకుండా కాస్తంతలో తప్పిపోయింది. ఆ గ్రౌండులో పరుగులెత్తుతూ ఒకరి మీద గెలుపు కోసం మరొకరు ఆరాటపడుతున్న రెండు పక్షాలూ ఈ ప్రేక్షకుల వినోదం కోసం సతమతమవుతున్న ఆటబొమ్మల్లా కనిపించారు నాకు.

ఇక ఆకాశంలో మబ్బులు నమకూడవు. వర్షం అసలే రాదు. ఈ ఆట యిప్పట్లో ముగియదు. ఈలోపల కల్లోల సముద్రం అడుగున వుండే ఆ జంతువు నన్ను పసికడుతుంది. చచ్చిపోయిన పెద్దచేప మాంసం వాసన ఆ షార్క్ నాసికా పుటాలకు అంది తీరుతుంది. అది ఆకలితో కసిగా వేగంగా నావంకకు రాకమానదు.

నేను హఠాత్తుగా లేచి వరప్రసాద్‌తో ''నేను అర్జంటుగా వెళ్లాలి మన్నించండి'' అని త్వరత్వరగా జనాన్ని తప్పించుకుంటూ యివతలికి వచ్చేశాను. ఆ పరిసరాలు దాటి కొద్దిగజాలు నడిచి గట్టిగా ఊపిరి పీల్చి 'అమ్మయ్య' అనుకున్నాను. గొంతులో మంట పుట్టడం ప్రారంభించింది. దగ్గు కూడా వచ్చింది. అలాగే, రుమాలు నోటికి అడ్డం పెట్టుకుని నడుస్తున్నాను. ఆకలిగా వున్నట్టు అనిపించింది. నేరుగా హోటలుకు వెళ్లాలి. ముందు భోజనం చేయాలి. తర్వాత రూముకు వెళ్లి ఆ ఒంటిరి తనాన్నే మంచి చేసుకుని కౌగలించుకుని నిశ్శబ్దంగా పడుకోవాలి.

సూర్యుడు ఎర్రగా కాల్చబడిన లోహపు బంతిలా అస్తమించాడు. పశ్చిమదిశను ఆకాశం అంతా తగలబడిపోతున్న అరణ్యంలా వుంది. మబ్బులు భయంకరంగా ఎర్రగా వున్నాయి. పదునైన వెండి కొడవలి వలె చంద్రుడు ఒకవైపున అప్పుడే ఉదయించాడు. ఇవాళ వెన్నెల ఉంటుందా?

హోటల్లో కౌంటరు దగ్గర టిక్కెట్టు యిచ్చి టోకెన్ తీసుకుని చుట్టూ చూశాను. ఎక్కడా ఖాళీ కనిపించలేదు. నగరం అంతా క్యూలతో, టోకెన్లతో నిండినట్టనిపించింది. కొందరు వెయిటింగ్ లిస్టులో అక్కడ వున్న కుర్చీలలో కూర్చుని పేపర్లు చూస్తున్నారు. నేను కూడా వెళ్లి అక్కడ కూర్చుని అందరి వంకా చూశాను. అందరి ముఖాలూ యించుమించు అన్నదాన సమాజం ముందు నిలబడినవారి ముఖాల వలెనే వున్నాయి. అన్ని ముఖాలలోనూ ఆకలి. నా ముఖం ఎలా వుందో? లేచివెళ్లి చెయ్యి కడుక్కుంటూ ఎదురుగా ఉన్న అద్దంలో మొహం చూసుకున్నాను. అద్దంలో కనిపిస్తున్న ప్రతిబింబం నాదేనా అని అనుమానం వచ్చింది. చెయ్యి పైకి ఎత్తాను. అద్దంలో బొమ్మ కూడా చెయ్యి పైకి ఎత్తింది. నాలో నేను నవ్వుకోబోగా దగ్గు మళ్లీ వచ్చింది.

తర్వాత కొద్దినిముషాలు వేచివుండి ఒకచోట ఖాళీ చూసుకుని కూర్చుని ఆకు కడుగుతూ వుండగా వరప్రసాద్, అతని స్నేహితులు గుర్తుకు వచ్చారు. అలా హఠాత్తుగా వచ్చేసినందుకు ఏమనుకున్నారో ఏమో!

ఆకలితో దహించుకు పోతున్నప్పటికీ చాలా నెమ్మదిగా తినవలసి వచ్చింది. ముద్దముద్దకూ గొంతు 'భగ్గున' మండుతున్నది. ముద్దముద్దకూ కళ్ల వెంట నీళ్లు తిరుగుతున్నాయి.

ఎలాగో తిండి ముగించి యివతలికి వచ్చి నడవటం ప్రారంభించాను. చీకటి పడింది. ఒక సినిమాహాలు దగ్గర ''టిక్కెట్లు లేవు'' అని బోర్డు తగిలించినా జనం యింకా తగ్గలేదు.

పేవ్‌మెంట్ మీద నడుస్తున్న ఒకవ్యక్తి వచ్చి 'ఛీ'కొన్నాడు. పైగా వెనుదిరిగి చూసి 'కళ్లు కనబట్టంలేదూ' అని అడిగాడు.

నేనేదో చెప్పబోయాను. మళ్లీ నా దగ్గరికి వచ్చి మొహంలో మొహం పెట్టి ''ఇంకెన్నడూ తాగి రోడ్డు మీద తిరక్కు. ఎల్లు...'' అన్నాడు. అతని నోటి వెంట ఏదో భరించరాని వాసన గుప్పుమని వచ్చింది. వెనుదిరిగి తూలుతూ పోతున్నాడు. నేను అతన్ని సమీపించి ''మీ యిల్లు ఎక్కడ? నేను వెంట వచ్చి నిన్ను దిగబెడతాను.'' అన్నాను.

అతడు మొహం మీద పడుతున్న జుట్టు పైకి సర్దుకుంటూ ఒక్కక్షణం నావంక చూసి ''ఓయస్..రా..మా యింటికి ఎటెల్లాలో నేను చెప్తాను. నువ్వు ముందుండి దారి చూపించు'' అన్నాడు. నేను తలవూపాను. అతని వెంటనే నడవటం ప్రారంభించాను. ఒకచోట ఆగి 'కుడివైపు' తిరుగు అన్నాడు, కుడివైపు తిరిగాను. అతడు ''అదీ..అలా గుండాలి.. ఇదేదోవ'' అంటూ నా వెనకనే నడుస్తున్నాడు. మళ్లీ కొంచెం దూరం నడిచిన తర్వాత 'ఎడమవైపుకు తిరగమ'న్నాడు. ఆ చెప్పడంలో అతడు చూపించిన దర్జాకు నాకు నవ్వు వచ్చింది. అయినా చెప్పిన మాట వినే బుద్ధిమంతుడైన బాలుడి వలె అతను చెప్పిన వైపు నడిచాను. 'నా కొడుకులు.. దొంగాట ఆడతారు.. ముక్కలు దాచుకొస్తారు. దమ్ములుంటే ధర్మంగా, సజావుగా ఆడమను'' అని గొణుక్కుంటున్నాడు.

చీకటి రాజ్యంలా వున్న చోటికి వచ్చాము. అక్కడ లైట్లు లేవు. వెలుతురులేదు. అంతటా దుర్గంధం.

చిన్నచిన్న చీకటి ముద్దలవలె గుడిసెలు. వాటిలో నుంచి కేకలూ, గోలా, పసిపిల్లల ఏడుపులూ,.. ఒక గుడిసెలో ఎవడో తాగి తెగ పేలుతున్నాడు. ఒకచోట ఎవరో పిల్ల సినిమా పాటలు పాడుతున్నది.

ఒక చీకటి ముద్ద దగ్గర అతడు 'హోల్డాన్' అని అరిచాడు. తర్వాత మిలిటరీవాడిలా శాల్యూట్ కొట్టి బాగా వంగి నడుస్తూ వెళ్లి గుడిసెలో దూరాడు. లోపల కొంచెం సంచలనం. పసిపిల్ల ఏడుపు.

నేను వెనుదిరిగి నడవబోయాను. నా వెనకనే ''ఎవురది?'' అన్న ప్రశ్న వినిపించడంతో కొద్ది అడుగులు వేసి తలత్రిప్పి చూశాను. ముగ్గుబుట్ట వంటి తలతో, కృశించిన శరీరంతో బస్సులో నా ముందు సీటులో కూర్చుని ''కొడుకు జీతం రాగానే జూదమాడి, తాగి అంతడబ్బూ తగలేస్తాడు. ఆ డబ్బు కాస్తా చేజిక్కించుకోకపోతే నెలరోజులూ నేనూ, కోడలూ, పిల్లలూ పస్తులుండక తప్పదు'' అన్న వృద్ధురాలు కనిపించింది.

నేను తలవంచుకుని త్వరత్వరగా నడిచాను. చీకటి, అంతటా కాన్సర్ వంటి చీకటి, లోకాన్ని తినేస్తున్నది. ఈచీకటి మహాసముద్రంలో అట్టడుగున ఎక్కడో వుండి వుంటుంది ఆ భయంకరమైన నీటిజంతువు. ఈ చీకటి ముద్దలవంటి గుడిసెలు భూమి మీద లేచిన భయంకర వ్రణాలవలె వున్నాయి. అవి యీ భూమిని కాన్సర్‌లా తినేస్తాయి. తప్పదు...

త్వరత్వరగా లైట్లతో నిండిన వీధిలోకి వచ్చాను. చల్లని గాలి విసురుగా వీస్తున్నది. ఆ గాలిలో తేమవల్ల నా గొంతులో మరింతగా మంట పుడుతున్నది. ఎక్కడో దూరం నుంచి విషాద గీతం ఏదో వినిపిస్తున్నది. రాత్రివేళల విహరించే ఏదో తెల్లని పక్షి రెక్కలల్లార్చుకుంటూ 'క్రీక్' మని అరుస్తూ ఎగిరి పోతున్నది.

సింహద్వారం దాటి లోపల మెట్లు ఎక్కబోతూ వుండగా బ్యాంకు గుమాస్తాగారి అమ్మాయి మామూలు ప్రకారమే నా చెప్పుల చప్పుడు విని కిటికీలో నుండి చూసింది. ఆమె వొళ్లో లావాటి పుస్తకం వుంది. ఆమె శ్రద్ధగా చదువుతున్నదా లేదా అని నాకు అనుమానం వచ్చింది. శ్రద్ధగా పుస్తకంలో లీనమై చదువుతూ వుండే పక్షంలో నా చెప్పుల చప్పుడు ఆమెకు వినిపించి ఆమె తలఎత్తి చూసే అవకాశం తక్కువ.

ఇంకా నేను మెట్ల మీద కాలు వెయ్యనేలేదు. అంతలో ఆ ప్రక్కగా చిన్న రేకుల షెడ్డులో అద్దెకుండే యాభైయేళ్ల స్త్రీ ''ఇదుగో బాబూ, నిన్నే. ఇలా ఒక్కసారి రా నాయనా.'' అని పిలిచింది. ఆమె చేతిలో హరికేన్ లాంతరు వుంది. ఆ యింటివారు 'స్థలం నిరుపయోగంగా వుండడం ఎందుకూ?' అనే మీమాంసపడి ప్రహరీ గోడ మీదుగా నాలుగురేకులు వేసి మూడు వైపులా సిమెంటు రాళ్లతో గోడలు కట్టి దాన్ని రెండు భాగాలుగా చేసి రెండు కుటుంబాలకు అద్దెకిచ్చారు. ఒక్కొక్క గదికి నెలకు పదిహేను రూపాయలు మాత్రమే అద్దె. కరెంటులేదు. పిలిచిన ఆమె పేరు నాకు తెలియదు. వితంతువు. ఆమెకు, హైస్కూల్లో చదువుతున్న పన్నెండేళ్ల కొడుకు వున్నాడు. ఆమె నన్ను ఎందుకు పిలిచిందో నాకు తెలుసు. మునుపు కూడా ఒకసారి యిలాగే పిలిచింది. అయినా మళ్లీ వెళ్లాను. ఆమె నన్ను కూర్చోమని చెప్పి అలమారు నుంచి ఒక పెట్టె తీసింది. అందులో నుంచి ఒకపాత ప్రామిసరీనోటు యివతలికి తీసింది. అది నాచేతికిచ్చి ''చూడు బాబూ, అతను తొందరలో డబ్బు యిస్తానన్నాడు. వడ్డీ లెక్కగట్టి మొత్తం ఎంత అయిందో లెక్కచూడు కొంచెం. నేను పెద్దదాన్ని. నాకేమీ తెలియదు మరి'' అన్నది.

అవును. నీకేమీ తెలియదు. వాడెవణ్నో నమ్మి అయిదేళ్ల క్రిందట రెండువేల రూపాయలు, నీ భర్త మిగిల్చిపోయిన సర్వస్వం అప్పు యిచ్చి నోటు వ్రాయించుకున్నావు. మళ్లీ ఎన్నడూ చెల్లు కూడా వేయలేదు. వాడెవడో అప్పు తీర్చే బాపతుకాదు. నాకేమో ఏమీ తెలియదు.

నేను కాయితం మీద లెక్కలు వేస్తూ కూర్చున్నాను. ఒక మంచి అమాయకపు చేపను షార్కు తింటున్న దనిపించింది.

చివరకు వడ్డీతో సహా లెక్క తేల్చి కాయితం మీద వ్రాసి యిచ్చి గొంతు సర్దుకుని ''త్వరలో డబ్బు తిరిగి పుచ్చుకోండి. ఎవళ్లనూ నమ్మదగిన రోజులుకావు'' అన్నాను.

ఆమె దిగులుగా మొహం పెట్టి ''నిజమే నాయనా? కాని ఏం చెయ్యను?ఆయన్ను ఎన్నోసార్లు అడిగాను. 'ఇదుగో అదుగో' అంటూ గడపుతున్నాడు. పైగా లేనివాడేమీకాదు కూడాను'' అన్నది లాంతరు చూపుతూ. అప్పుడే ఆమె కొడుకు ప్రయివేటు

నుంచి నాకోసం తిరిగి వచ్చాడు. వాణ్ణి చూస్తే నాకు కొండంత జాలి వేసింది. పాపం! చిన్న పిల్ల!

నాల్గు మెట్లు ఎక్కిన తర్వాత మలుపు తిరుగుతూ వుండగా దగ్గు ముంచుకువచ్చి ఉక్కిరి బిక్కిరి చేసింది. అక్కడ ఒక్క క్షణం ఆగి అలుపుతీర్చుకున్నాను. దగ్గు తెర తగ్గిన తర్వాత చూస్తే నోటికి అడ్డంగా పెట్టుకున్న రుమాలుమీద ఆ మందమైన కొద్దిపాటి వెలుగులో నల్లని చార—బహుశా రక్తమేమో—కనిపించింది. రేపు డాక్టరు దగ్గరికి వెళ్లాలి. ఆయన నన్ను కుర్చీలో కూర్చోబెట్టి సానుభూతి వర్షించే కళ్లతోచూస్తూ ఇంజెక్షన్ యిస్తాడు. ఆ ద్రవ మేదో ఎర్రగా—రక్తంలాగే వుంటుంది. నేను ఆయనకుముందే చెప్పాను. ''నే నెక్కడికీ యితర చోట్లకువెళ్లి ఖరీదైన వైద్యం చేయించుకోలేను. మీరే అందుబాటులోవున్న వైద్యం చేయండి. తగ్గితే సరేసరి, లేదా......''

డాక్టర్ కళ్లజోడు సర్దుకుంటూ ''అవున్లే. నువ్వు చెప్పిందీ నిజమే. ఎక్కడికి వెళ్లినా యిది తగ్గే రోగంకాదు. అనవసరమైన శ్రమా, దండగా ఎందుకు? నువ్వు మహా బ్రతికితే మాత్రం ఎన్నాళ్లు?......'' అన్నట్టు చూస్తాడు. ఆయన చూపులలో యితరు లెవరికీ యీ భావాలు కనిపించవు. నాకు మాత్రం ఆయన ప్రతి కదలికలోనూ, చూపులోనూ యిదే అర్థం కనబడుతుంది. ప్రవాహంలో మునిగిపోతూ కొట్టుకుపోతున్న వాణ్ణి దూరంగా గట్టున నిలబడినజనం ఎలా చూస్తారు? అవే చూపులు డాక్టరువి. కాకపోతే అలా మునిగిపోతూ చేతులు పైకెత్తి దణ్ణాలుపెట్టే స్వభావంకాదు నాది. హాయిగా మునిగిపోదాం! అనిపిస్తుంది. అలా మునిగిపోగలిగే అవకాశంమాత్రం ఎవరికి లభ్యమవుతుంది? అందులోనూ ఏదో చిత్రమైన ఆనందం ఉండి ఉండాలి.

తాళంతీసి లైటువేసి చాపమీద నడుం వాల్చాను. హఠాత్తుగా చాలా ఏళ్ల క్రిందట జరిగిన విషయాలు గుర్తువచ్చాయి.

ఒకసారి నేనూ, మరో స్నేహితుడూ—బహుశా మధుసూదనమే అనుకుంటాను, అవును వాడే—యిద్దరమూ వూరికి దూరంగా రైలు కట్టవెంట నడుచుకుంటూ వెళ్లాము. చాలాదూరం వెళ్లాము. రైలుకట్టక్రింద గడ్డి బాగా ఒత్తుగా, ఎత్తుగా పెరిగివున్నచోట కూర్చుని ఉన్నాము. అప్పుడు మధుసూదనం—వా డా రోజులో పద్యాలు వ్రాసేవాడు—తను వ్రాసిన పద్యాలు హుషారుగా చదివి వినిపిస్తున్నాడు. చల్లని గాలి హాయి హాయిగా తెరలు తెరలుగా వీస్తున్నది. కాస్సేపట్లో పొద్దు గూకబోతున్నది. దూరంగా సూర్యుడు భయంకరంగా అస్తమిస్తున్నాడు. హత్యచేసి పారిపోతున్నవాడి ముఖంలావుంది సూర్యబింబం. అప్పుడొక నడి వయస్సు వ్యక్తి మా దగ్గరికివచ్చి నిలబడ్డాడు. మధుసూదనం పద్యం చదవటం పూర్తిచేసి మరో పద్యం అందుకునే లోపుగా దగ్గి, ''ఏమండీ!ఇప్పుడు బండి వచ్చే వేళఅయిందా?'' అని అడిగాడు. మధుసూదనం చిరాకుగా, ''ఎటునుంచి ఎటు పోతుందో తెలీదుగాని మొత్తానికి ఒక బండి వచ్చే వేళ అయింది'' అని చెప్పాడు. ''ఎటునుంచి ఎటు పోతేనేం? మొత్తానికి రైలంటూ'' ఒకటి వస్తుంది కదా!'' అనుకుంటూ అతడు మా ప్రక్కన నిలబడి మధుసూదనం పద్యం చదువుతూవుంటే వింటూ అసహనంగా ఉన్నట్టు కనిపించాడు. ఇంతలో దూరంనుంచి రైలు కూత అస్పష్టంగా వినిపించింది. ఆ వ్యక్తి ధ్యాస అంతా అటే ఉన్నట్టుంది. అతడు నెమ్మదిగా నడుస్తూ మానుంచి కొంచెం దూరంగా వెళ్లాడు. మేము పద్యపఠనంలోనూ శ్రవణంలోనూ పీకలవరకూ మునిగిఉన్నాం. రైలు గుప్పు గుప్పున పొగ వదులుతూ రావడమూ, మాకు కొంచెం దూరంలో దారుణమైన చప్పుడుచేస్తూ ఆగిపోవడమూ మేము ఆలస్యంగా గమనించాము. అక్కడ అంతా కోలాహలం, గందరగోళం. జనం రైల్లోనుంచి దిగి ఏమిటోచూస్తున్నారు. పెద్దగా అరుస్తూ మాట్లాడుతున్నారు. మేము లేచి వెళ్లి చూద్దుముకదా, అంతకుముందు మా ప్రక్కనే నిలబడివుండిన వ్యక్తి తలా మొండెమూ వేరుగా పడి ఉన్నాడు. నెత్తురుతో తడిసిన పట్టాల మధ్య రాళ్లు అస్తమిస్తున్న సూర్యుడి కాంతులలో మరింత ఎర్రగా భయంకరంగా కనిపించాయి. మాకు కళ్లు చెదిరిపోయాయి. ఇద్దరం దడదడలాడే గుండెలతో ఆ చోటు విడిచివెళ్లాము. నే నంతకుముందుకుగాని, ఆ తర్వాత గాని ఎప్పుడూ మళ్లీ అటువంటి దృశ్యం చూడలేదు. నీళ్లలో మునిగిపోతున్నవాణ్ణి అసలు చూడలేదు. కేవలం వినడమే. నేను చాలాసార్లు వరవడి దినాలలో నదికి వెళ్లేవాణ్ణి. జనం వేల సంఖ్యలో స్నానాలు చేస్తూ ఉంటారుకదా!

''ఏ ఒక్కడైనా పొరపాటున నీటి వేగానికి దూరంగా మునకలువేస్తూ కొట్టుకు పోకుండా ఉంటాడా? అప్పుడు చూడటానికి ఎలా ఉంటుందో'' అని లోలోపల అంతరాంతరాలల్లో పరమనీచమైన ఉత్కంఠ ఒకటి ఉండేది. కాని అలా ఎప్పుడూ జరగలేదు. అదికాదు. చిన్నప్పటినుంచీ అటువంటి వెధవ కోరికలు చాలా ఉండేవి. నా లోపల ఎవడో మరొక సైతాను అంశలో పుట్టిన నికృష్టు డున్నాడనిపించేది. ''ఇళ్లు పెద్దసంఖ్యలో తగలబడుతూవుంటే చూడాలనీ, వరదలలో సమస్తమూ మునిగి కొట్టుకు పోతూవుంటే, భూకంపంవచ్చి అన్నీ కూలి పోతూవుంటే చూడాలనీ, అగ్ని పర్వతంలావాద్రవాన్ని ఫౌంటెన్‌లా చిమ్ముతూవుంటే చూడాలనీ....యిలాంటి కోరిక లుంటాయి వాడికి. నా లోపలివాణ్ణి అందుకే బ్రతక నివ్వకూడదు. వాణ్ణి షార్కులు చిత్రహింసకు గురిచేసి చంపాలి. వాణ్ణి కాన్సర్ తిని వెయ్యాలి. ఆ భయంకర సముద్ర జంతువు తన ఎనిమిది చేతులతో ఒక్కుమ్మడిగా నలిపి వెయ్యాలి. అప్పుడు కాని నాకు సుఖం ఉండదు. కాని చిత్ర మేమిటంటే అవి వాడితోపాటు నన్ను కూడా అంతమొందిస్తున్నాయి.

4

నేను గదిలో కుర్చీలో కదలకుండా కూర్చుని ఉన్నాను. డాక్టరు ఎందుకో లోపలికివెళ్లి యింకా రాలేదు. బహుశా అక్కడ మరొక రోగిని పరీక్ష చేస్తున్నాడేమో!

బల్లమీద అద్దం వుంది. అందులో నా ప్రతిబింబం నాకే చిత్రంగా కనిపించింది. కణతలమీద నరాలు ఉబ్బిఉన్నాయి. ఎర్రగా కందగడ్డలావుంది మొహమంతా.

మా స్నేహితు డొకడు—వాడిమధ్య ఎప్పుడో సముద్ర స్నానం చేస్తూ మునిగిపోయాడనీ, శవం కూడా దొరకలేదనీ అన్నా రెవరో—వాడు అప్పుడు శీర్షాసనం వెయ్యడం ప్రాక్టీసుచేస్తూ వుండేవాడు. చాలాసేపు అలా తల్రకిందులుగా వుండి తిరిగి మామూలుగా లేచి కూర్చునేసరికి యిలాగే వాడి మొహమంతా నెత్తురుతో నిండి ఎర్రగా రామములగవండులా తయారయ్యేది.

డాక్టరు వచ్చి కూర్చుని "ఏం మిస్టర్! హౌ ఆర్ యు?" అని అడిగాడు.

ఏం చెప్పను? ఏదో చెప్పబోయాను. కాని గొంతు మంట పుట్టింది. అంటే గడువు తీరుతున్నదన్నమాట.

ఆయన "డోన్ట్‌వర్రీ" అంటూ లేచివెళ్లి యింజెక్షన్ సిద్ధం చెయ్యడం ప్రారంభించాడు.

'రక్షించాడు' అనుకున్నాను. ఏమీ తినలేకుండా ఉన్నాననీ, గొంతు మంట దగ్గు విపరీతంగా ఉన్నాయనీ, నెత్తురు కూడా పడుతున్నదనీ, ఎలా చెప్పను? చెబితేమటుకు ఆయన ఏం చెయ్య గలడు? మరో సూది పోటు పొడస్తా డంతేగా? ఆ ఎనిమిది చేతుల జంతువును, నా దగ్గరికి రాకుండా చెయ్యడానికీ, ఆ కాన్సర్ నన్ను షార్క్‌లాగా తినివేయకుండా చూడటానికీ చాలినంత శక్తి గల మందు ఎవరు తయారు చెయ్యగలరు? ఆ షార్కులకు వాసన తగిలితే యిక వాటిని ఎవ్వరాపగలరు?

డాక్టరు ఇంజక్షను యిస్తూ ఉండగా మా యింటి క్రింది భాగంలో అద్దెకుండే ఆసామీ గుర్తు వచ్చాడు. ఆయనకు కొంచెం తలనొప్పి వచ్చినా, వొళ్లు కొంచెం వెచ్చబడినా, యిక ఆ యింటిలో వారికే కాదు చుట్టుప్రక్కల వారికి గూడా గండమే. పెద్దగా కేకలు పెట్టి మూలిగి గందరగోళం చేస్తాడు. అమృతాంజనం మొదలుకుని సర్వౌషధాలూ తలా ఒకటి చొప్పున సప్లయి చెయ్యాలి. ఎవరే మందు చెప్పినా సరే తెప్పించుకుని మింగుతాడు. అలా రకరకాల టాబ్లెట్లు మింగుతూనే "ఇకనేను బతకను"అంటూ అప్పగింతలు పెడతాడు. ఆ కాస్త తలనొప్పీ, జ్వరమూ తగ్గగానే మృత్యు ముఖంలో నుంచి తప్పించుకున్నవాడిలా ఇతరుల సానుభూతి పొందేందుకు మరింత నీరసం నటిస్తాడు. చుట్టుప్రక్కలవారందరూ "పాపం, ఎంత జబ్బు పడి లేచాడు. ఇంకా నయం.... ఆ ఇల్లాలి మాంగల్యం గట్టిది కావడాన...." అనుకోవాలని ఆయన తాపత్రయం. అదంతా ఏమోకాని ఆయన చేసే హడావిడికి ఆ యిల్లాలు ఎప్పుడో మంచాన పడటం ఖాయం.

డాక్టరు చేతిలో ఒక పది రూపాయల నోటు ఉంచి యివ తలికి వచ్చాను.ఆ క్షణంలో ఆయన మొహం వంక చూసేందుకు నాకు మనసొప్పలేదు. "పాపం! ఇతను డబ్బు యిస్తు న్నాడే...." అనుకుంటూ ఆ డాక్టరు చూసే చూపులు నేను భరించలేను.

ఆఫీసులో మా హెడ్ ఒక చిత్రమైన భంగిమలో కుర్చీలో కూర్చుని ఉన్నాడు. కొద్ది నిముషాలు ఆలస్యంగా వచ్చిన నావైపు అలాగే నిశ్చలంగా కూర్చుని చూశాడు.

"నాకు తగ్గని రోగం. అందువల్ల నేను ఎంత ఆలస్యంగా వచ్చినా, అసలు రాకపోయినా అలా మాత్రం చూడకండి" అని నేను ఒక్కమాట అంటే చాలు. ఇక అలా చూడడు. కాని నాకు అలా అనడం యిష్టంలేదు, సరికదా ఆయన అలా నావంక చూడటం ఎందుకో యిష్టం. నాలోపలి నీచుడికి మరి అటువంటివే కదా యిష్టం.

నేను సీటులో కూర్చుని మళ్లీ ఆయన వంక చూశాను. ఆయన ఇంకా అలాగే కూర్చుని ఉన్నాడు. ఏం ఆలోచిస్తున్నాడో మరి.

నా రూములో పెట్టె అడుగున గుడ్డల మడతలలో ఎక్కడో ఒక ఫోటో ఉండాలి. అది నా చిన్నతనంలో ఎవరో కావలసినవారు "తాతయ్య ఫోటో..." అని చెప్పి యిచ్చారు. ఆ ఫోటోలో ఉన్నది మా తాతయ్య అవునో కాదో నాకు సరిగా తెలియదు. ఎందుకంటే మా తాతయ్యను నేను చూడ లేదు కాబట్టి. అయినా నేనా ఫోటోలో బొమ్మ మా తాతయ్యదే అనుకుంటూ ఉంటాను ఎప్పుడూ. అది చాలా పాతది కావడంవల్లనూ, ఎవరూ శ్రద్ధ తీసుకుని ఫ్రేము కట్టించక పోవడంవల్లనూ ఏవో పురుగులు కొట్టివేశాయి. అక్కడక్కడ సన్నని రంధ్రాలు పడ్డాయి. ఫోటోలో మా తాతయ్య నోటి మధ్యగా సరిగ్గా ఒక రంధ్రం ఉంది. కంఠంమీద మరొక రంధ్రం ఉంది. అది పెద్దది. ఇక చేతులనిండా కాళ్లనిండా చిన్నచిన్న చిల్లులు చాలా ఉన్నాయి. ఆ ఫోటో మా తాతయ్య చనిపోయిన తర్వాత కుర్చీలో కూర్చోబెట్టి తీయించారట. మృత్యువుతోపాటు మూసుకుపోయిన కళ్లను ప్రయత్నంమీద తెరిచిఉంచి కదలకుండా కుర్చీలో కూర్చోబెట్టి నోరు మూసి తీసి ఉంటారు ఆ ఫోటోను. కాని వెనక ఎవరో ఒకరు కన బడకుండా నిలబడి శవాన్ని పట్టుకున్నారేమోనని నా సందేహం. ఎందుకంటే ఆ కుర్చీ వెనుక క్రింది భాగంలో మనిషి కాలు అని భ్రమ కలిగించేదేదో కనిపిస్తూ ఉంటుంది.

ఇప్పుడది అంతా ఎందుకు గుర్తు వచ్చిందంటే మా హెడ్ సరిగా అదే భంగిమలో కుర్చీలో కూర్చుని ఉన్నాడు.

ఆరోజు సాయంకాలం వరకూ పొడుగాటి అంకెలతో నిండిన కాయితాలతో వ్యవహరించి యివతలికి వచ్చి గుండెల నిండా గాలి పీల్చుకున్నాను. ఆ అంకెలను తలుచుకుంటే నాకు వానపాములూ, కోళ్లు ఏరుకుతినే చిన్నచిన్న పురుగులూ జ్ఞాపకం వస్తాయి. పైగా ఆ అంకె లన్నిటినీ కూడి లెక్కవేస్తూ ఉంటే ఎక్కడి కక్కడ లెక్క తెగిపోయి మళ్లీ పని అంతా మొదలుపెట్టవలసి వచ్చింది చాలాసార్లు.

ఒక హోటల్లోకి వెళ్లి కూర్చుని కాఫీ తెప్పించుకుని నెమ్మదిగా త్రాగుతున్నాను. చాలా నెమ్మదిగా ఒక్కొక్క చుక్క

చొప్పున త్రాగుతూ అద్దాలలోనుంచి వీధిలోకిచూస్తూ కూర్చున్నాను. అంతలోనే రోడ్డుమీద చిన్నప్రమాదం జరిగింది. ఆ రద్దీలో జనాన్ని, బండ్లనూ కార్లనూ తప్పించుకుని వేగంగా బాణంలా దూసుకుపోదామని ప్రయత్నించిన ఒకానొక యువక సైక్లిష్టు ఒక ఆటోరిక్షాను ఢీకొని గింగిరాలు తిరుగుతూ నేలమీద పడిపోయాడు. సైకిలు చక్రాలు వంకర్లు తిరిగి పోయాయి. అతడు పాపం వెంటనే లేచి చొక్కా లాగూల కంటిన దుమ్ము దులుపుకుని చుట్టూ చేరిన జనం వంక సిగ్గు పడుతూ చూస్తూ సైకిలు లేవదీసుకుని రోడ్డు ప్రక్కకు నడిచాడు. ఒకరిద్దరు వ్యక్తులు అతన్ని సాయంపట్టి హోటలు లోపలికి నడిపించుకు వచ్చారు. అతడు వారితో నెమ్మదిగా తనదే తప్పనీ, సైకిలు తొక్కడం కేవలం రెండు మూడు రోజుల క్రితమే నేర్చుకుని అంతలోనే రద్దీతో నిండిన వీధి లోకి రావడం పొరపాటేననీ, ఆ కంగారులో బ్రేకులు వేయడం కూడా మరిచిపోయాననీ అంటున్నాడు.

''అవును మరి'' అనుకున్నాను నేను. కాఫీ కొంచెం ఎక్కువగా గొంతులోకి దిగి ఒక్క క్షణం విపరీతంగా బాధ పడ్డాను. తర్వాత రుమాలుతో కళ్లు తుడుచుకుంటూ ఆ సైకిల్‌వాలా వంక చూశాను. నా కళ్లకు అతడు కొన్ని యేళ్ల క్రితం నేనెలా ఉండేవాణ్ణో అచ్చంగా అలాగే కనిపించాడు. నేనా రోజులలో యిలాగే ప్రవర్తించేవాణ్ణి. ఒక పర్యాయము నేను ఈత కొట్టడంలో చాలా నిపుణుణ్ణనే భావం నా స్నేహితులకు కలిగించాను. ఎప్పుడో మాటల సందర్భంలో 'నేను గజ యీతగాణ్ణి' అనీ, 'రకరకాలుగా నీళ్లలో ఈదగలను' అనీ అబద్ధాలు చెప్పాను. ఎందుకు అలా చెప్పానో తెలియదు. పైగా నాకు నీళ్లంటే అపరిమితమైన భయం. ఎప్పుడైనా నీళ్లలో దిగవలసి వస్తే 'అక్కడ ఎంత లోతు ఉందో ?' అనీ 'లోపల జలగలు మొదలైన క్రూర జల జంతువు లేవైనా ఉన్నాయేమో' అనీ అనిపించి నరాల్లో వొణుకు పుట్టుకు వచ్చేది. అటువంటి నన్ను అందరూ 'ఈతలో ఎక్స్‌పర్టు' అనుకుంటూ ఉండేవారు. కాని ఒకసారి పులితోలు కప్పుకున్న మేక అసలు స్వరూపం బయటపడింది. నలుగు రయిదుగురు స్నేహితులతో కాలవకో, నదికో బయలుదేరి వెళ్లవలసి వచ్చింది. వా రందరూ నీళ్లలో దిగి ఈతలు కొడుతూ ఉంటే నేను వొడ్డునే నిల బడ్డాను. కాని వారు నన్ను కూడా దిగి రమ్మని గోల చేశారు. 'నాకు జలుబు చేసింద' నీ, 'తల నొప్పిగా కూడా ఉంద' నీ, 'ఒడ్డునే ఉండి వారి దుస్తులు చూస్తూ ఉంటాననీ' చెప్పాను. వారు నా మాటలు వినిపించుకోలేదు. ఒకడు ''చేతులూ కాళ్లూ కదల్చకుండా నీళ్లమీద తేలుతూపోవడం నాకు నేర్పు'' అంటున్నాడు. ఇక నాకు దిగక తప్పలేదు. లోపల ఒక భరోసావుంది. కొంతసేపటినుంచీ వారందరూ నీళ్లలో యీదులాడుతూవుంటే చూశానుకదా! 'ఇంతేకదా' అనిపించింది. 'అదేమీ బ్రహ్మ విద్య కాద'ని కూడా అనిపించింది. ఆ కదలికలూ, ఒడుపులూ అన్నీ గుర్తు పెట్టుకున్నాను. 'నీళ్లలో దిగి మనమూ అలాగే చేతులూ కాళ్లూ కదిలిస్తే సరి' అనుకున్నాను.

తీరా నీళ్లలోకి దిగుతూవుండగా భయం కలిగింది. కాళ్లు అందనంత లోతుకువెళ్లి కాళ్లూ చేతులూ తపతప ఎంతగా విదిలించినా లాభం లేకపోయింది. పైగా గొంతులోకి నీళ్లు కూడా పోయి క్రింద కాళ్లు ఆనని కారణంగా గుండెల్లో దడ బయలుదేరింది. మునకలు వేస్తూ పెద్దగా చావు కేకలు పెట్టాను. వాళ్లందరూ గాభరాపడి నన్ను జుట్టు పట్టుకుని ఒడ్డుకు లాక్కువచ్చి పడేసి తర్వాత ఒకటే నవ్వడం. అప్పటి నా వాలకంలాగే ఉంది, యీ సైక్లిస్టు యువకుడి వాలకం కూడా....

బిల్లు చెల్లించి హోటలు బయటికివచ్చి పేవ్‌మెంట్ మీద నడుస్తున్నాను. బస్సు స్టాప్‌కు యింకా కొద్ది గజాల దూరంలో ఉండగానే వెనకనుంచి ఫైర్ ఇంజన్లు మ్రోగిస్తున్న గంటలు చెవులు చిల్లులు పడేట్టు వినిపించాయి. జనం అందరూ రోడ్డుమీద ప్రక్కకు తప్పుకుని దోవయిచ్చి నాలుగు వైపులా చూడటం ప్రారంభించారు.

నేనూ ఉత్కంఠతో తల నాలుగు వైపులా తిప్పిచూశాను. అదుగో! ఆ వైపున పొగ చుట్టలు చుట్టలుగా పైకి లేస్తున్నది. గచ్చకాయ రంగులోవున్న పొగ మధ్యగా ఎర్రని మంటలు వ్యాపిస్తున్నాయి. దాదాపు పరుగెత్తుతున్నంత వేగంగా అడుగులు వేశాను.

ఇళ్లు తగలబడుతున్న దృశ్యం పెద్ద నగరాలలోచూస్తే మనం వున్నచోటికి చాలా దగ్గరగా ఉన్నట్టు అనిపిస్తుంది. ఆ ప్రదేశం మైళ్లకొద్దీ దూరంలోవున్నాసరే మన పరిసరాల్లోనే అనిపిస్తుంది. ఇప్పుడూ అంతే అయింది. 'ఇక్కడే.....ఇక్కడే' అనుకుంటూ దాదాపు అరమైలు దూరం నడవవలసివచ్చింది. నా వెనకనే ఒక సన్నటి వ్యక్తి ఉరుకులు పరుగులుగా ఒగర్చుకుంటూ వస్తున్నాడు. ఏదో వర్క్‌షాపులోనుంచి చేస్తున్న పని అలాగే వదిలేసి పరుగెత్తి వస్తున్నాడు కాబోలు అతని చేతుల నిండా, దుస్తులనిండా నల్లని మసి.

తీరా అక్కడికి చేరుకునేసరికి ఆ వేడిమికి కమిలిపోతానేమోననిపించింది. వరుసగా చాలా గుడిసెలు బుగ్గిపాలయిపోయాయి. బూడిద కుప్పలుగా మిగిలిపోయాయి. ఇంకా కొన్ని తీరికగా నిలబడి కాలుతున్నాయి. ఆ పాకలలో అంతవరకూ తల దాచుకుంటూ వచ్చిన పిల్లామేకా, ఆడా, మగా, అంతా కొందరు భయంగా చూస్తూనూ, మరికొందరు శోకాలు పెడుతూనూ రోడ్డుమీదే పడి ఉన్నారు.

ఫైర్ సర్వీసువారు మంటలతో పోరాడుతూనే ఉన్నారు. అయినా ఆట్టే ప్రయోజనం కనిపించడంలేదు. అగ్నిదేవుడు వాయుదేవుడితో స్నేహం కట్టి తన జ్వాలాజిహ్వలు చాచి అన్ని వస్తువులనూ, యిదీ అదీ అనే వివక్షత లేకుండా బంగారం మొదలుకుని, బ్రతుకు బరువును మోస్తున్న బీదసాదల శరీరాలవంటి శుష్కించిన వెదురు బొంగుల వరకూ సర్వస్వాన్నీ కాల్చి కబళించి వేస్తున్నాడు. లోతైన సముద్రాలలోని ఆ ఎనిమిది చేతుల భయంకర జంతువు విజృంభించి సమస్తాన్నీ మింగుతున్నట్టున్నది.

నేను ఆ జనంలో ముందుకు నడిచి వెళ్ళాను. మసోటు కాళ్ళ మంచాలులాగా, కళ్ళు తెరవని పసిగుడ్డులూ, ఆడవాళ్ళూ, అవ్వలూ, గేదెలూ, నులక మంచాలూ, చాపలూ, పక్కగుడ్డలూ, మట్టికుండలూ, శోకాలు పెట్టేవారూ, 'అయ్యో! ఇక ఎలా బ్రతకడం' అని అంగలార్చేవారూ, "ఇలా ఎందుకు జరిగింది అసలు?" అని ప్రశ్నలు వేసేవారూ, అంతా సంతలాగుంది. కొందరు పత్రికా విలేఖరులు కాబోలు, పెన్సిళ్ళు పట్టుకుని సమాచారంకోసం జనంలో తిరుగుతున్నారు. పోలీసులు బెత్తాలు పుచ్చుకుని కాపలా కాస్తున్నారు.

నా లోపలి సైతాను అంశలో పుట్టిన దుష్టుడికి ఇదీ అని చెప్పరాని ఒక పొంగు వచ్చినట్టుంది. ఆదుర్దాతో అందరి దగ్గరికీ వెళ్ళి వారు మాట్లాడుకుంటున్నది వింటూ, అటూ యిటూ తిరుగుతూ ఉండిపోయాను. ఫైర్ సర్వీసువారు యింకా కాలుతున్న ఒక పెద్ద నాలుగు నిట్రాళ్ల గుడిసె మీదికి నీళ్లు చిమ్ముతున్నారు. ఒకచోట ఒక చిన్న గుడిసెవుంది. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, గాలివాలువల్లనో, ఆ గుడిసె స్వంతదారుల అదృష్టంవల్లనో చుట్టూ వున్న అన్ని గుడిసెలు తగలబడి బూడిదగా మిగిలిపోయినా ఆ గుడిసెకు మాత్రం నిప్పు అంటుకోలేదు.

నేను ఆశ్చర్యం పైకి వెలిబుచ్చుతూ, "ఈ గుడిసెకు నిప్పంటుకోలేదేం?" అని అడిగాను. నా ప్రశ్నలో ఏదురర్థం స్ఫురించిందో మరి అక్కడివారు కొందరు నన్ను వింతగా చూశారు. నేను వెంటనే యివతలికి వచ్చేశాను. ఎట్టకేలకు మంటలు అదుపులోకి వచ్చాయి. జనం కొందరు తమ తమ గుడిసెలుండవలసినచోట ఏమేమి మిగిలాయో చూచుకునేందుకు వెడుతున్నారు.

నేను నడుస్తూ ఉండగా రోడ్డుప్రక్క కూర్చునివున్న ఆ వృద్ధురాలు కనిపించింది. మొహంచూస్తే అంతవరకూ ఏడ్చి శోకాలు పెట్టిందేమోననిపించింది. ఆ ప్రక్కనే పసి పిల్లకో—పిల్లవాడికో పాలిస్తూ కూర్చునివున్న యిరవై అయిదేళ్ల యువతి ఆమె కోడలై ఉండాలి. మరో యిద్దరు పిల్లలు పక్కనే దిస్స మొలలతో నిలబడి ఉన్నారు. వారిలో పెద్దవాడు బెరుకుగా, భయంగా, చూస్తున్నాడు. చిన్నవాడు నోట్లో వేలు వేసుకుని చీకుతూ కళ్ళు పెద్దవి చేసుకుని సంతలో విచిత్రాలు చూస్తున్న వాడిలా నిలబడి ఉన్నాడు. ఆ త్రాగుబోతు నగరంలో ఆ మూల ఎక్కడో ఫౌండ్రీలో పని చేస్తున్నాడు కదా, వాడు ఎప్పుడో రాత్రి పొద్దుపోయిన తర్వాత యిక్కడికి చేరుకుంటాడు. అతనికిలోపల యీ విషయం తెలిసే అవకాశంలేదు. తీరా అప్పుడు వచ్చి ఈ దృశ్యం చూసి కొయ్యబారిపోతాడు కాబోలు!

"ఇక ఎలా బ్రతకడం?" అనుకుంటున్నది ఆ వృద్ధురాలు. అవును......ఎలా బ్రతుకుతావు? నీ కొడుకు తన సంపాదన అంతా త్రాగుడుకూ, జూదానికీ తగలేస్తాడు. నువ్వినాళ్ళూ వాడు దయతలిచియిస్తే తిన్నావు. లేకపోతే పస్తులే ఉన్నావు. తిన్నావో తినలేదో, పచ్చి మంచి నీళ్లే తాగి కోడలూ, పిల్లలతో పస్తులే ఉన్నావో, ముత్తానికి అందర్నీ కడుపులో పెట్టుకుని ఆ గుడిసెలో ముడుచుకుని పడుకున్నావు. ఇప్పుడా గుడిసె నిప్పుల పాలయిపోయింది. ఇక ఏం పెట్టి మళ్ళీ యిల్లు వేసుకుంటావు?

నేను తిరిగి వస్తూవుంటే ఆకలి విపరీతంగా బాధించడం ప్రారంభించింది. త్వరత్వరగా నడిచాను. లైట్ల వెలుగులో నగరం ఉజ్జ్వలంగా తళతళా మెరుస్తున్నది. ఎక్కడ చూసినా నియోన్‌లైట్ల కాంతులూ, ఖరీదైన కార్లూ, స్కూటర్లూ, వాటి వెనక సీట్లలో అందమైన ఆడవాళ్ళూ, షోరూములూ కనిపించి కళ్ళు మిరుమిట్లు కొల్పుతున్నాయి. నేనెప్పుడో—డాక్టరు మాట ఆయనఅనుకున్నట్టు ఫలించి 'త్వరలో అంతా సర్దుకుంటే'—స్కూటర్‌మీద దూసుకుపోతూ వుంటే ఆ వెనకసీటులో రెండు చేతులతో నన్ను గట్టిగా పట్టుకుని కూర్చోబోయే ఆ తలోదరి ఎవరు?

హొటలు మరో వంద గజాల దూరంలో వుంది. అప్పుడు గొంతులో మంట ప్రారంభం అయింది. ఓర్పుగా గొంతు రుద్దుకుంటూ దగ్గు ఆపుకుంటూ నడక సాగించాను నేను.

భోజనం కూడా నాకు చాలా చికాకు కలిగించింది. అంతా కారం మయం. ముద్ద నోట పెడితే కళ్లవెంట నీళ్లు తిరిగాయి. అలాగే ఓపికగా ఒట్టి అన్నం నాలుగు ముద్దలు మింగి చేతులు కడుక్కుని బయట పడ్డాను. ఆ క్షణంలో నాకు ఎవరిమీదో, ఎందుకో తెలియని కసీ ఉక్రోషమూ పొంగివచ్చాయి.

చీకట్లో నడుస్తూ వుంటే కళ్లవెంట యింకా నీళ్లు రావడం మానలేదు. వెనక ఎవరివో అడుగుల చప్పుడు వినిపించి వెనుదిరిగిచూస్తే రత్నావళి చేతిలో పుస్తకాలతో హంసలా నడిచిపోతూ కనిపించింది. నన్ను చూచే ఉంటుందా? ఏమో మరి!

సింహద్వారం దాటి మెట్లు సమీపించి మామూలుగానే బ్యాంకు గుమాస్తాగారి భాగం వైపు చూశాను. ఆయన కూతురు కూడా రోజూవలెనే లావాటి పుస్తకం ఒళ్లో పెట్టుకుని చదువు కుంటున్నదల్లా చెప్పుల చప్పుడు విని కిటికీలోనుంచి తల యివతలకిపెట్టి చూసింది. నాకు మామూలుగానే "ఆమె శ్రద్ధగా చదువుతున్నదా, లేదా?" అని అనుమానం కలిగింది.

ఈ వేళ పద్దెనిమిది మెట్లు ఎక్కగానే దగ్గుముంచుకుని వచ్చి నన్ను మెలికలు తిప్పివేసింది. నోటి కడ్డంగా ఉంచుకున్న రుమాలులో మళ్ళీ నల్లని చార కనిపించింది. నెమ్మదిగా మిగిలిన మెట్లు ఎక్కాను. పైకి చేరుకోగానే చల్లని గాలి విసురుగా ఒంటికి తగిలింది. వరప్రసాద్ క్యాంపుకు వెళ్లాడో ఏమో, అతని రూముకు తాళం వేసివుంది.

నేను తలుపుతీసి లైటు వెలిగించి ఆశ్చర్యపోయాను. నా గదిలో గుమ్మం ప్రక్కనే నేలమీద ఉత్తరం! దాన్ని వెంటనే చేతుల్లోకి తీసుకోకుండా దుస్తులు మార్చుకుంటూ 'చాలా' ఆలోచించాను. నాకు 'నా' అనుకోదగిన వారెవరూ లేరు. మిత్రు

లైనా మధుసూదనం తప్పించి చెప్పుకోదగిన వారెవరూలేరు. నన్ను డాక్టరు దగ్గిరికి తీసుకువెళ్లిన ప్రసాద్ నాకు మంచి మిత్రుడేగాని అతనికి నే నుంటున్న యీ కొత్త అడ్రసు తెలియదు. పైగా మధుసూదనమూ, ప్రసాదు యిద్దరూ తరచుగా జాబులు వ్రాసే అలవాటున్నవారుకాదు. "సరే. చూస్తే తెలుస్తుందిగా" అనుకున్నాను.

వంగి పరీక్షగా చూస్తూ ఆ కార్డును చేతిలోకి తీసుకున్నాను. ఎక్కువగా చదువుకోని ఆడపిల్ల దస్తూరీ. తీరా వెనకవైపు చూస్తే ఆ అడ్రసు నాదికాదు. కృష్ణమూర్తి అనే పేరుగలవారు నాకు తెలిసినంతల ఎవరూలేరు. పోస్టుమేన్ పొరపాటున దీన్ని యిక్కడ పడేసి వెళ్లి ఉంటాడు. —దాన్ని అవతల ఒక ప్రక్కగావుంచి నడుం వాల్చాను. నా లోపలి నీచుడు 'ఆ ఉత్తరం చదువుదాం' అని గోల చేస్తున్నాడు. నేను వాడి నోరు నొక్కేందుకు మరే యితర మార్గమూ లేక గొంతెత్తి బాధను అణుచుకుంటూనే "ఆపలేనే ఎంకి" అని పెద్దగా పాడటం ప్రారంభించాను. గదిలో నా కంఠస్వరం నిండుగా నిండిపోయి ప్రతిధ్వనించింది. అంతలో బయట అడుగుల చప్పుడు వినిపించింది. ఎవరో పిలిచినట్టు అయింది. పాట ఆపి లేచి చూద్దనుకదా, ఆ హిందూస్థానీ వ్యక్తి నిలబడి ఉన్నాడు. అకస్మాత్తుగా, రెండో అంతస్తులో కాపురంవుండే భాగం కాక పైన మరో రెండు గదులు కూడా అతని అధీనంలోనే ఉన్నాయనే విషయం గుర్తుకు వచ్చింది.

అతడు కోపంగా చూస్తూ, "మిషర్! మీరు యింత రాత్రివేళ యిట్లా పెద్దగా పాటలు పాడుతూ మమ్మల్నెందుకు బాధ పెడతారు? అంత 'యిది'గా వుంటే ఎక్కడైనా కచేరీ చేసుకోండి. మమ్మల్ని చంపకండి" అన్నాడు. అతడొకప్పుడు ఎవరితోనో "ఇంట్లో రేడియోవుంటే పెద్ద న్యూసెన్సండీ.....గోల....." అంటూ ఉండగా విని జాలిపడ్డాను. ఇంట్లో సూదికూడా క్రింద పడరాదనీ,ఎవరూ పెదవి కదపరాదనీ, అతని శాసనం. ఇప్పు డతని మాటలు విన్న తర్వాత నాకు ఒళ్లు మండింది. అతని మాటలధోరణిచూస్తే అరికాలిమంట నెత్తికెక్కింది. అసలే కసిగా ఉన్నానేమో ఒత్తి ఒత్తి పలుకుతూ స్పష్టంగా చెప్పాను.

"అయ్యా! ఇది నా రూము. దీనికి నే నొక్కణ్ణే అద్దె యిచ్చుకుంటున్నాను.నేను ఈ నాలుగుగోడలమధ్య పాడుకుంటాను. మరీ సరదా పుడితే భరతనాట్యం కూడా చేస్తాను. ఎవరూ ఆక్షేపించకూడదు. ఇకమీదట ఇలా నా రూముముందు నిలబడి రచ్చచేస్తే మర్యాదగా ఉండదు."

అతని మొహం కందగడ్డలా ఎర్రబడటం స్పష్టంగా చూశాను. ఏమీ చెయ్యలేక కోపంగా నిప్పులు చెరుగుతూ చూసి "దట్సాల్‌రైట్" అంటూ కసిగా తల వూపుతూ వెళ్లిపోయాడు.

—నేను తలుపులు మూసి పక్కమీద నడుం వాల్చి సంతృప్తిగా కళ్లు మూసుకున్నాను. అయితే మళ్లీ పాడుకోవాలనిపించలేదు నాకు. ఆ మేరకు అతడే విజయం సాధించాడనుకోక తప్పదు. ఇక పిక్నిక్‌లోనే నేను గొంతు ఎత్తటం. అదే యిక చివరిసారి అవుతుందేమో!

అలానిశ్శబ్దంగా కాస్సేపుగడిచేసరికి నాలోపలిఆక్షుద్రుడు విజృంభించాడు. నేను ఆ ఉత్తరం చేతుల్లోకి తీసుకున్నాను. పైన వూరిపేరుగాని తేదీగాని లేవు. ఉత్తరంక్రింద 'సుజాత' అని సంతకం వుంది. నా చూపులు ఉత్తరంలోని పంక్తులవెంట పరుగులెత్తాయి.

"ప్రియమైనఅన్నయ్యకు మీచెల్లెలు నమస్కారములు. ఇక్కడ నేను, తమ్ముడు క్షేమం. నీవు ఉద్యోగంలో చేరేందుకు వెళ్లిన వెంటనే వ్రాసిన ఉత్తరంతప్ప ఇన్నాళ్లు గడిచినా నీవద్దనుంచి ఉత్తరం రాలేదు. ఆ ఉద్యోగంలో సెలక్టు కాలేదనీ, మరెక్కడో ప్రయత్నిస్తున్నాననీ వ్రాశావు. నాకు మిక్కిలి ఆదుర్దాగా ఉన్నది. నీవు త్వరలో డబ్బు పంపుతానని చెప్పి వెళ్లావు. ఇంతవరకూ ఎందుకని పంపలేదు? ఇక్కడ యింటి చుట్టూ అప్పులు చేశాను. ఇక అప్పు దొరుకేటట్లు లేదు. మిక్కిలి యిబ్బందిగా ఉన్నది. నీ మీదనే అన్ని ఆశలూ పెట్టుకున్నాను. నాన్నా, అమ్మా అందరూ పోయినా నిన్ను చూసుకునే నేనూ తమ్ముడూ జీవించి ఉన్నాము. ఈ ఉత్తరము చేరగానే దీనిని టెలిగ్రాముగా భావించి వెంటనే జవాబు వ్రాయవలసినది. నీ జవాబు వచ్చేవరకూ నాకు మనశ్శాంతి ఉండదు. ఇట్లు నీ చెల్లెలు, —సుజాత."

పోస్టుఆఫీసు ముద్రలో వూరి పేరు కనుక్కుందామని ప్రయత్నించాను. కాని లాభం లేకపోయింది. ఆ ముద్రలో అక్షరాలు స్పష్టంగా కనిపించడంలేదు. నిట్టూర్చి ఆ ఉత్తరం అవతల పడేసి కళ్లు మూసుకున్నాను. ఒక చిన్న యిల్లూ, అయ్యవార్లంగారి నట్టిల్లులా అన్నీ నిండుకున్న ఆ యింటిలో ఏమీ తోచక శోకదేవతలా కూర్చునివున్న ఒక పడుచూ, ఆ పక్కనే "అక్కా ఆకలి" అంటూ గోల చేస్తున్న ఒక పసివాడూ..... ఇదీ కళ్లకు కట్టిన దృశ్యం......

5

ఆ రాత్రి.......

నాకు కంటిమీదికి కునుకు రాలేదు.

ఉక్రోషంతో, నిస్సహాయుడనై, పక్కమీద అటూ, యిటూ దొర్లుతూ వుండగానే మూడు వంతుల రాత్రి గడిచిపోయింది. కళ్లు మూసుకుని నిద్ర పట్టించు కుందామని చాలా సేపు విఫల ప్రయత్నం చేసి చివరకు తలుపు తీసుకుని బయటికి వచ్చాను. ప్రక్క గదిలో వరప్రసాద్ యింకా క్యాంపు నుంచి రాలేదు.

ఆరుబయట మంచు తీవ్రంగా కురుస్తున్నది. ఆకాశంలో బాగా ప్రకాశించే పెద్ద నక్షత్రాలు కొన్ని మినహాయిస్తే, మిగిలినవన్నీ, పలుచని సిల్కు గుడ్డ మడతలలో దాచి వుంచబడిన బుల్లి బుల్లి ముత్యాలవలె మెరుస్తున్నాయి.

నేను పిట్టగోడ కానుకుని చేతులు కట్టుకుని నిలబడ్డాను. అలా చాలా సేపు నిలబడ్డట్టున్నాను. ఆ తేమగాలి మూలంగా దగ్గు ముంచుకు రాగానే అప్పుడు హఠాత్తుగా స్పృహ వచ్చినట్టయి త్వర త్వరగా గదిలోకి వెళ్లాను. దోవ పొడుగునా దగ్గుతూనే వెళ్లి పక్కమీద వాలిపోయాను. దగ్గు, ఆ భయంకర సముద్ర జంతువులా, నన్ను లొంగ దీసుకొని కొద్ది నిముషాల సేపు ఉక్కిరి బిక్కిరి చేసింది. క్రిందటి రోజువలెనే రుమాలు మీద మరింత పెద్ద చార పడింది. ఆ తర్వాత ఎంతో సేపటికి ఆ ఉధృతం తగ్గింది. ఆ ఎనిమిది చేతుల భయంకర జంతువు తన చేజిక్కిన ఎర అలసిపోయిందన్న సానుభూతితో తన పట్టు కొంచెం వదులు చేసింది. అంతలో నా కళ్లు మూతలుపడ్డాయి.

తలుపుమీద చప్పుడూ, ఎవరో పిలుస్తున్న వైనమూ నన్ను మేల్కొలిపాయి. నెమ్మదిగా లేచి ఒళ్లు విరుచుకుని తూలుతూ వెళ్లి తలుపు తీశాను. రామమూర్తి హడావిడి పడుతూ కనిపించాడు.


—అతడు నన్ను చూసి కంగారు పడ్డట్టున్నాడు. నేను "మీరా.....రండి....." అంటూ తలుపులు బార్లగా తెరిచాను.

అతడు లోపలికి వొస్తూనే "ఇదేమిటి? మీ రిప్పుడా నిద్ర లేవడం? నిన్న మళ్లీ గుర్తు చేద్దామనుకుంటే, ఏదీ, మీరు ఆఫీసుకు రాకనేపోతిరి. అసలేమిటి సంగతి? మీకు ఒంట్లోగాని నలత ఏమీ లేదుకదా?" అన్నాడు.

నేను కిటికీలోనుంచి లోపల పడుతున్న ఎండ వంక చూశాను. బాగా పొద్దెక్కినట్టున్నది.

"వొంట్లో బాగానే ఉంది....." అంటున్నాను నేను. మళ్లీ అతడుఅంతలోనేతొందరపడుతూ, "మీరు తొందరగా తయారు కావాలి. అవతల అందరూ మనకోసం కనిపెట్టుకుని ఉంటారు. బస్సు సిద్ధంగా ఉంది నేను మీకోసం బయలుదేరి వచ్చేటప్పటికి. మీదే ఆలస్యం....అసలు మీ వరస చూస్తే పిక్నిక్ విషయం మీకు అసలు గుర్తున్నట్లేలేదు..... అయ్యో! ఇలాగయితే ఎలాగండీ మరీనూ" అని గును స్తూనే ఉన్నాడు. నేను నా పనులు కానిస్తూనే అతని మాటలు విన్నాను. తర్వాత "అయిదు నిముషాల్లో బయలు దేరకపోతే అప్పుడు మీ యిష్టం వచ్చినట్టు అనండి" అంటూ క్రిందికి దిగి వెళ్లాను. నాకు అతడు చాలాసార్లు చెప్పాడు. పైగా రెండు రోజుల క్రితం కూడా నా దగ్గర చందా వసూలుచేస్తూ "మీ పాట ప్రోగ్రాంలో మొదటి అయిటం" అంటూ గుర్తు చేస్తే నాకు విసుగు కలిగింది.

అన్ని కార్యక్రమాలూ చాలా త్వరగా ముగించుకుని దుస్తులు వేసుకుని 'రెడీ' అన్నాను. అతడు ముళ్లమీదకూర్చున్న వాడిలా అంతవరకూ అసహనంగా కూర్చుని అప్పుడు బంతిలా లేచి వాచీ చూసుకుని "భలే మంచివారండీ మీరు......" అన్నాడు. గదికి తాళం వేసి మెట్లు దిగుతూ ఉండగా అతడు, "అన్నట్టు చాలాసార్లు అడుగుదామనుకున్నాను. మీరీ మధ్య హుషారుగా లేరు.....ఏమిటి సంగతి?" అని అడిగాడు.



"ఏమీ లేదు. ముందు మీరు త్వరగా నడవండి" అన్నాను నేను. మెట్ల మధ్యలో మాకు రాజేంద్ర పైకి ఎక్కి వస్తూ ఎదురుపడ్డాడు. మేము వెళ్లేసరికి అందరూ మా రాక కోసమే ఎదురు చూస్తున్నట్టున్నారు. బస్సు సిద్ధంగావుంది. లోపల మా సహోద్యోగులూ, నలుగురు సహోద్యోగినులూ కూర్చుని ఉన్నారు. బస్సు వెనక ఖాళీలో ఏవేవో తిను బండారాలతో నిండిన పాత్రలు సర్ది ఉంచారు. మే మిద్దరమూ ఎక్కగానే బస్సు ఒక్క కుదుపుతో బయలు దేరింది.

అందరూ హుషారుగా ఏవేవో కబుర్లు చెప్పుకుంటున్నారు. నా ఒంటరితనం మళ్లీ నన్ను ఉక్కిరి బిక్కిరి చేయడం ప్రారంభించింది. ఆదిగులుమరిచిపోయేందుకు చూపులుమళ్లించుకున్నాను. కొండ పక్కగా మెలికలు తిరిగిన ఆ రోడ్డువంకా, ఎర్రని రాళ్లు ఎప్పుడు క్రిందికి దొర్లుతాయో అనిపించే ఆ కొండవంకా చూస్తూ కూర్చున్నాను. అంతలో నా కో అనుమానం వచ్చి శరీరం కొంచెం జలదరించింది. రోడ్డుకు ఒక ప్రక్కన కొండ, రెండో వైపున లోతైన లోయ. ఆ రోడ్డు వెంట యున్ని ప్రాణాలను తన గుప్పిటలో వుంచుకుని డ్రైవరు బస్సును సునాయాసంగా వేగంగా నడుపుతున్నాడు. అతని పద్ధతిలో నాకు నిర్లక్ష్యం కూడా గోచరించింది. "ఎక్కడ ఏ 'స్క్రూ' ఒదులయినా, ఏ 'బోల్టు' ఒదులయినా పెద్ద దారుణం జరుగుతుంది. అలా జరిగిన మరుక్షణంలో అందరం ఆ లోతైన లోయలో పడి కిక్కురుమనకుండా దిక్కులేని చావు చావడం ఖాయం......నేను ఈతరహాఆలోచనలను అరికట్టే ఉద్దేశంతో దూరంగా ఆకాశం వంకా, అంతలోనే ఆకృతులు మార్చుకుంటున్న మబ్బుల వంకా, అక్కడొకటీ, అక్కడొకటిగా ఎగురుతున్న ఏవో పక్షులవంకా చూస్తూ కూర్చున్నాను. అయినా నాలోపలి క్షుద్రుడి నోరు మూయడం నా తరమా?

ప్రక్కనేవున్న రామమూర్తి వంక తిరిగి అనకూడదనుకుంటూనే అన్నాను.

"ఇప్పు డీ బస్సులో ఏ స్క్రూ ఒదులయినా, ఏ బోల్టు వూడినా, గోవింద......ఆ లోయలోపడి మచ్చుకు కూడా మిగలకుండా పోతాంకదూ? అయినా నలుగురితో చావుమాత్రం కోరుకున్నంతలో దొరుకుతుందా?"

తీరా ఆ మాటలు అన్న తర్వాత నేను ఆశ్చర్యంతో తలమున్కలైనాను. నా లోపలి ఆ పశువు నామీద యింత అధికారం సంపాయించినందుకు నాకు దిగ్భ్రమ కలిగింది. రామమూర్తి నా మాటలు విని కళ్లు పెద్దవి చేసుకుని నావంక కనురెప్ప వాల్చకుండా కొద్ది క్షణాలు చూసి "శుభం పలకరా అంటే" అన్నట్టు ఏమిటండీ ఆ మాటలు? మీకు "వేపకాయంత వెర్రిగాని లేదు కదా?" అన్నాడు.

నా ముఖం ఎర్రబడి ఉండాలి. నవ్వడానికి ప్రయత్నించి తల త్రిప్పుకున్నాను. అరగంట తర్వాత అంతకుముందే నిర్ణీతమైన ప్రదేశంలో దిగాము. అక్కడ అంతా హాయిగావుంది. చల్లని చెట్లు సూర్యుని ఎండను భూమిమీద పూర్తిగా పడనివ్వడంలేదు. ఆ కొమ్మల, ఆకుల సందులలోనుంచి నేలమీద పడుతున్న వెలుగు, గుండ్రంగా లెక్క లేనన్ని సున్నాలు గీసినట్టున్నది. పక్కనే కొద్ది గజాల దూరంలో తామర ఆకులతో దట్టంగా కప్పబడిన చక్కని కొలను ఉన్నది. అక్కడ రకరకాల పక్షులు చేసే విచిత్ర ధ్వనులన్నీ ముద్దకట్టి రొదగా వినిపిస్తున్నాయి.

అందరూ చాపలు పరుచుకుని కూర్చున్నారు. జట్లు జట్లుగా కబుర్లు చెప్పుకుంటూ కొందరూ, సిగరెట్లు కాలుస్తూ కొందరూ, ట్రాన్సిస్టర్లు నెమ్మదిగాట్యూన్ చేసుకుని వింటూ కొందరూ కూర్చున్నారు.

ఆ ఆడ పిల్లలు నలుగురూ—నలుగురూ పెళ్లికానివారే—ఒక ప్రక్కన కూర్చుని తరిగిపోని కబుర్లలో పడ్డారు. ఈ ఆడ వాళ్లలో చిత్రమైన విషయమేమిటంటే కనీసం ఏ యిద్దరు ఒక్కచోట కలుసుకున్నాచాలు కల్పాంతం వరకూ కబుర్లకు లోటుండదు. ఏవేవోవిషయాలు త్రవ్వుకునిత్రవ్వుకుని మాట్లాడుకుంటూనే ఉంటారు. అలా ఎడతెగకుండా మాట్లాడుకుంటూనే, ఒకరి వంక ఒకరు – చీరె, జాకెట్ల మొదలుకుని ఒంటిమీది బంగారం వరకూ సర్వవివరాలూ విప్పారిన కళ్లతో గమనిస్తూనే ఉంటారు.

నేను కొంచెం పక్కగా నడిచి వెళ్లాను. వెళ్లినవాణ్ణి అక్కడే అలాగే నిలబడిపోయాను. అక్కడికి కొంచెందూరంలో ఏదో జంతువు కళేబరాన్ని తీరికగా భక్షిస్తున్నాయి రాబందులు. అటూ యిటూ నేలకుకొంచెంఎత్తులో రెండు రౌండ్లు ఎగరటం, తర్వాత మళ్లీ ఆ శవంమీదికి వ్రాలి, భోజనం బల్లమీద రొట్టె గుచ్చుకునే సాధనంవంటి పదునైన ముక్కుతో కొంచెం మాంసం పీకి మళ్లీ కొద్ది ఎత్తుకు ఎగిరి రౌండ్లుకొట్టడం—అలా చేస్తున్నాయి అవి.

రామమూర్తి నా వెనకవచ్చి నిలబడి "ఏమిటి చూస్తున్నా రక్కడ? పదండి" అంటూ నన్ను లాక్కుపోయాడు. అక్కడ ఎవరిపాటికివారు కాలక్షేపం చేస్తున్నారు. నేను వెళ్లి పేక ఆడుతున్న ఒక బృందం దగ్గర కూర్చున్నాను. వాళ్లాడుకుంటున్నంతసేపూ అలాచూస్తూనే కూర్చున్నాను. నేను చిన్నతనం నుంచీ చాలామంది పేకాడుతూ వుండగా చూశాను. ఆ ఆటలో ఒడుపు లేవీ నాకు బొత్తిగా తెలియవు. మా దూరపు చుట్టం ఒకాయన ఉండేవాడు. ఆయనకు యిటువంటి విద్యలు బాగా తెలుసు. పేకాటలో ఆరితేరిన వాడని అందరూ అనుకుంటూ ఉండేవారు. అందుకే అతి త్వరగా ఆరిపోయాడు. సర్వస్వమూ కోల్పోయి చివరకు నీళ్లుమోసుకుని బ్రతికాడు.

అంతలోనే "లేవండి.....లేవండి......భోజనాలు కానిచ్చేదాం" అంటూ ఒకాయన వచ్చాడు. ఆయన భోజనాల 'ఇన్‌ఛార్జి' అన్నమాట. నేను ఉదయం లేచింది మొదలు గుక్కెడు నీళు కూడా గొంతులో పోసుకోలేదు. నేనూ లేచాను. ఆ పేకాటలో కూర్చున్న నలుగురూ "ఇదుగో.....ఒక్క క్షణం.." అంటున్నారేగాని లేవడంలేదు. ఆయనేమో మొండిగా "లేస్తే

గాని కుదురదు. భోజనాలా మరోటా? అందరూ ఆకలితో నకనక లాడిపోతున్నారు......" అంటున్నాడు. వాళ్లు జీడిపాకంలా సాగుతున్నారు. ఆయన వారిని ఒదలటంలేదు. నా కాయనను చూస్తే మునుపు మా యింటి ప్రక్కన వుంటూ వుండిన ఒకాయన గుర్తు వచ్చాడు. ఆయన ఎప్పుడూ భోజనం, తిండి విషయంతప్ప మరోటి మాట్లాడేవాడుకాదు. ఎవరేమని పలుకరించినా, ఏ విషయం గురించి మాట్లాడినా, చివరకు భోజనం దగ్గరికి సంభాషణను మళ్లించుకు వచ్చేవాడు. —భోజనాలముందు కూర్చున్నాం. రకరకాల పదార్థాలు వడ్డిస్తున్నారు. ఆ భోజనాల 'ఇన్‌ఛార్జి' హుషారుగా 'సర్వ్' చేస్తున్నాడు.

నేను భయపడ్డట్టే గొంతు మంట ప్రారంభం అయింది. అదేమి శాపమో తిండి గురించి అనుకుంటే చాలు గొంతు మండుతున్నది. ముద్ద ముద్దకూ కళ్లు నీళ్లతో నిండి పరమాత్ముడు కనబడుతున్నాడు. అయినా పట్టుదలగా కొన్ని ముద్దలు మింగాను. ఒకప్పుడు నేను స్నేహితులతో పందెం కట్టి పది పచ్చిమిరపకాయలు ఏక బిగిన నమిలి మింగి పందెం గెల్చిన విషయం గుర్తుకు వచ్చింది.

ఆ నలుగురు ఆడపిల్లలూ చాలా నాజూకుగా అన్ని పదార్థాలూ, కొంచెం కొంచెంగా రుచి చూసి ఒదిలేస్తున్నారు. నాకు వాళ్లనుచూస్తే చిత్రమనిపించింది. "అసలు ఈ ఆడ వాళ్లు 'ఆవురావురుమ'ని భోజనం చేయడం అంటూ ఉంటుందా?" అనిపించింది.

భోజనాలు పూర్తి కాగానే మరో పావు గంట విశ్రాంతి తర్వాత అసలైన కార్యక్రమం (అంటే సాంగ్సు.....మిమిక్రీ.) జరుగుతుందని రామమూర్తి చెప్పాడు.

అందరూ కిళ్లీలు నములుతూ, సిగిరెట్లు కాలుస్తూ భుక్తాయాసంతో చాపలమీద కూలబడ్డారు. నేను కిళ్లీ వేసుకుని సిగిరెట్టు ముట్టించాను. ఎన్నో ఏళ్లయినట్టనిపించింది సిగిరెట్టు కాల్చి. పొగ ఘాటుగా లోపలికివెళ్లి వూపిరి తిత్తులనిండా నిండి నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఎన్నడూ లేనంతగా గొంతులో మంట పుట్టింది. దూరంగా వెళ్లి సిగిరెట్టు విసిరి పారేసి దగ్గుతూ కిళ్లీ ఉమ్మివేసి కళ్లు తుడుచుకున్నాను.

మరో పావుగంట గడిచినట్టే అనిపించలేదు. ఈలోపల అక్కడ మైక్ ఏర్పాటు చేశారు. ఒక చెట్టుకు స్పీకర్ బిగించారు. పలుకుతున్నదో లేదో అని ఒక వ్యక్తి టెస్ట్ చేస్తూ వుంటే స్పీకరుకు దగ్గరగా కూర్చునివున్న ఒక బుల్లిపిట్ట అదిరిపడి ఎగిరి దూరంగా వెళ్లిపోయింది. అంతలో రామమూర్తి అందర్నీ ఒకచోటికిచేరి కూర్చోమన్నాడు.

అందరూ ఎలా కూర్చున్నారంటే—నాకు ఆ సముద్రాల అడుగున విహరించే ఎనిమిది చేతుల జంతువునోరు గుర్తుకు వచ్చింది. "ప్రోగ్రాంలో మొదటి అయిటం" గుర్తుకు రాగానే ఎందుకో చిత్రమైన అనుభూతి కలిగింది. డాక్టరు పెట్టిన గడువు దాదాపు పూర్తి కాబోతున్నది.

రామమూర్తి నా పేరు చెప్పి నన్ను గురించి ప్రశంసా పూర్వకంగా నాలుగుముక్కలుమాట్లాడి నన్ను 'మైక్‌ముందరకు రమ్మ'ని కోరాడు. అందరి చూపులూ నామీదికి మళ్లి నామీదనే నిలిచాయి. హఠాత్తుగా ఆ భయంకర సముద్ర జంతువుకోరలమధ్య చిక్కుకుపోయినట్టయింది. నేను తడబడుతూ, "ముందు మిగతాది కానివ్వండి" అంటున్నాను.

అంతలో రామమూర్తి "సరే అయితే.....అందుకు ఏమీ అభ్యంతరం లేదు మాకు" అంటూ, "అయితే యిప్పుడు కుమారి లలితగారు గానం చేస్తారు" అని ఆమెను ఆహ్వానించాడు. అందరి చూపులూ ఆమెమీదనే కేంద్రీకరింపబడ్డాయి.

అయితే ఆమె నావలె కాకుండా ధైర్యంగా పమిట విదిలించివేసుకునివెళ్లి మైక్‌ముందునిలబడి గొంతుసర్దుకుని పాడటం ప్రారంభించింది. నేను అన్నీ మరిచిపోయి వింటూ కూర్చున్నాను. మొత్తంమీద ఆమె కంఠంలో మాధుర్యమే తప్ప సులువూ సౌలభ్యమూ గోచరించలేదు. కంఠంమీద అధికారం సంపాయించదగినంతగా అభ్యాసం ఆమె చెయ్యలేదనిపించింది. చాలా పర్యాయాలు తాగుతున్న పాలలో వెంట్రుకలవలె అపశ్రుతులు పడ్డాయి. ఆమె పదినిముషాలసేపుపాడి ప్రేక్షకులకు నమస్కారం చేసి యివతలికి వచ్చింది. అందరూ కరతాళ ధ్వనులు చేశారు.

రామమూర్తి లేస్తున్నాడు. "సరే యిక తప్పదు....." అనుకుంటూ అతడు ఎనౌన్స్ చేయకముందే వెళ్లి మైక్ ముందు నిలబడ్డాను. నా ఎదురుగా తల ఎత్తి తెల్లత్రాచులా వుంది మైక్...ప్రేక్షకులవంకచూస్తే ఆసముద్రజంతువు కోరలు గుర్తువచ్చాయి. ఆకాశంవంకచూడగా సొరచేప ఆకారంలో వున్నమబ్బు కనిపించగానే ఒళ్లు జలదరించింది. హఠాత్తుగా కళ్లు మూసుకున్నాను. అప్పుడు పరిస్థితి కొంచెం మెరుగనిపించింది. గొంతు సర్దుకున్నాను.

ఆ తర్వాత, ఒకటి తర్వాత ఒకటిగా పాటలు ఎంత సేపు పాడానో నాకే తెలియదు. కళ్లు మటుకు తెరవనేలేదు. నారక్తం పరవళ్లు త్రొక్కింది. నా నరాలు శ్రుతి చేయబడిన ఫిడేలు తీగలవలె బిగుసుకున్నాయి. సర్వశక్తులూ కంఠంలో కేంద్రీకరించి పాడాను. నా ఒళ్లు నాకు తెలియలేదనిపించింది. ప్రేక్షకులు పాట పాటకూ కురిపించిన కరతాళ ధ్వనులూ, వారు ప్రకటించిన ఉత్సాహమూ మాత్రం నాకు స్పష్టంగా తెలిశాయి.

దాదాపు అరగంటకుపైగాపాడానేమో! ప్రాణాలుగొంతులోకి చేరుకున్నట్టనిపించింది. వూపిరాడలేదు. ఉన్నట్టుండి పడిపోతానేమో అనిపించింది. చివరిపాట ముగించి కళ్లు తెరిచి ప్రేక్షకులకు నమస్కరించి యివతలకి రాబోతూ వుండగా శరీరం తూలింది. నోటినిండా ఏమిటో తడి. దూరంగా వెళ్లి నీళ్లు పుక్కిలించి ఉమ్మివేశాను. ఆ తెల్లని నీళ్లు ఎర్రనై బయటికి వచ్చాయి.

మళ్లీవెళ్ళి జనంలోకూర్చున్నాను. అందరికళ్లూ అభినందన పూర్వకంగా నా వంకకే చూస్తున్నాయి. ఆ లలిత అనే

అమ్మాయి వంక నేను చూడలేదు. నాకు తెలుసు. ఈ రాత్రికి గొప్పగండంఉంది. గొంతులో నిప్పులుచెరిగే సుదర్శన చక్రం గిరగిరా తిరుగుతున్నట్టనిపించింది.

తర్వాత అందరమూ అక్కడ మరికొంచెంసేపు కాలక్షేపం చేశాము. ఒకాయన చాలాకాలంనుంచీ ధ్వన్యనుకరణం అభ్యాసం చేస్తున్నాడట. ఒక అరగంటసేపు ఆయన ప్రదర్శన సాగింది. ఆయన సృష్టిలో సమస్త ధ్వనులనూ అనుకరించ గలడనిపించింది. ఒక్కొక్కటి వింటూ. ఆశ్చర్యంతో ఉప్పొంగి పోయారందరూ. నేను లేచి మహా సముద్రపు అగాధాలలో షికార్లు చేసే ఆ ఎనిమిది చేతుల భయంకర జంతువు చేసే సవ్వడిని—అసలు అటువంటిదేదైనా ఉంటే—అనుకరించమని అడుగుదామనుకున్నాను. అది ముగియగానే అందరూ బిలబిల మంటూలేచి సామాన్లుసర్దుకోవడం ప్రారంభించారు. ట్రాన్సిస్టర్ల నోళ్లు నొక్కి భుజాలకు తగిలించుకున్నారు కొందరు. పేకలు తీసి కవర్లలోఉంచి జేబుల్లో ఉంచుకున్నారు కొందరు. కొందరు పాత్రసామగ్రినంతటినీ బస్సువరకూ మోసుకుపోయి లోపల సర్ది ఉంచుతున్నారు.

మరో అయిదు నిముషాలలో బస్సు కదిలి వేగం పుంజుకున్న తర్వాత వెనుదిరిగి చూశాను. కొండ చుట్టూ చుట్టుకున్న పెద్ద నల్లత్రాచుపాములావుందిరోడ్డు.ఆచెట్లూ,చెరువూ,అందులోనీళ్ల ఉపరితలాన్నిపూర్తిగా కప్పివేసిన తామర ఆకులూ,వాటి మధ్య అక్క డొకటీ అక్కడొకటీ పువ్వులూ, నేల మీద చెట్ల ఆకుల మధ్యగా వచ్చి పడుతున్న వెలుగు రింగులూ, ఆకాశమూ, రాబందులూ.... అన్నీ క్రమంగా దూరమైపోయాయి. బస్సు వేగంగా నగరం వైపు సాగిపోతున్నది. ఇవన్నీ మళ్లీ ఎన్నడూ చూడలేను నేను. అవును. మళ్లీ చూడలేను.

మా వీధి ముందు బస్సు ఆపించి నేను దిగేసరికి లైట్ల వెలుగులో అక్కడ అంతా పట్టపగలు వలె తోచింది. నియాన్ లైట్లూ, లెక్కలేనన్ని మెర్క్యురీబల్బులూ, "చీకటి అనేది ఒకటి ఈ సృష్టిలో వుందా?" అనిపించేటంత ఉజ్జ్వలంగా వెలుగుతున్నాయి.

నేను మిత్రుల వంక చూస్తూ చేయి వూపుతూ బస్సు కదిలిపోయిన తర్వాత మెల్లిగా నడక సాగించాను.

అలా నెమ్మదిగా నడుస్తూ వుంటే ఊపిరితిత్తులలో నుంచి, గొంతులో నుంచి ఏదో పొంగు ఎగదన్నుకుని వస్తున్న ట్టనిపించింది. ఊపిరితిత్తులలోనూ, గొంతులోనూ రెండు మూడు రకాల భయంకర వ్యాధులు ఒక్కుమ్మడిగా విజృంభిస్తు న్నట్టనిపించింది.

మెట్లు ఎక్కబోతూ వుండగా మామూలుగానే బ్యాంకు గుమాస్తాగారి అమ్మాయి తలఎత్తి నావంక చూసింది. ఆమె వొళ్లో అదే లావాటి పుస్తకం. పూర్తిగా పదిహేను మెట్లు ఎక్కానో లేదో అంతలోనే లోపలి పొంగును అరికట్టలేక రుమా లుతో నోరు మూసుకుని పరుగుపరుగున పైకి వెళ్లి రూము పక్కగా వాంతి చేసుకున్నాను. ఆ తరువాత బయట వున్న నీళ్లు నోట్లో పోసుకుని పుక్కిలించి ఉమ్మివేసి తలుపులు తీస్తూ వుండగా, ఆ శబ్దం విన్నాడు కాబోలు వరప్రసాద్ తన గదిలో నుంచి యివ తలికి వచ్చి "గురువుగారూ! మీరెక్కడికి వెళ్లారు? ఇవాళ అంతా కనిపించనేలేదు...అన్నట్టు ఒక చిత్రం జరిగింది తెలుసా! నేనివాళ పొద్దున పదిగంటల ప్రాంతంలో క్యాంపునించి వచ్చి తాళం తీసే సరికి లోపల అంతా గందరగోళంగా వుంది. ఎవరో అంతకు ముందు వచ్చి అన్నీ అటూ యిటూ కదిలించి గలీజుగా తయారు చేశారు. ట్రాన్సిస్టరూ, రెండు మూడు టెరిలిన్ చొక్కాలూ, ట్వీడ్‌ప్యాంట్లూ గల్లంతు. పోలీసు రిపోర్టు యిచ్చాననుకోండి" అన్నాడు. నేను కొయ్యబారిపోయి నిలబడిపోయాను. ఉదయం మేము మెట్లు దిగుతూ వుండగా రాజేంద్ర మాకు ఎదురు రావడం గుర్తు వచ్చింది. అయితే నేనేమీ మాట్లాడలేదు.

ఆతర్వాత అతను కొంచెంసేపు నా రూములో కూర్చుని పిక్నిక్ విశేషాలు విన్నాడు.

తర్వాత "అన్నట్టు మీరిప్పుడే కదా తిరిగి వొస్తున్నారు! ఈ పూటకు మా హోటల్లో భోజనం చేద్దాం రండి. ఇద్దరం కలిసి భోజనం చేసి చాలారోజు లయినట్టుంది, ఈ వెధవ క్యాంపుల మూలంగా" అన్నాడు. కాని నేను భోజనం చేయదలుచుకో లేదు. ఆకలి కూడా బొత్తిగాలేదు. అతని మాట తీసివెయ్యలేక "నేను భోంచెయ్యను. మీతోపాటుగా కూర్చుని కాసిని పాలు తాగుతాను పదండి" అన్నాను. అతడు వెళ్లి చొక్కా వేసుకుని వచ్చాడు.

ఇద్దరం క్రిందికి దిగివచ్చి హోటలు వైపు నడిచాము. దోవలో నాకెందుకో దిగులు తెర కప్పుకున్నట్టయింది. వర ప్రసాద్ చెయ్యిపట్టుకుని కళ్లలో నీటిపొర గుండా అతని వంక చూశాను. అతడు నివ్వెరపోయి "ఏమిటండీ? ఎందుకలా వున్నారివాళ?" అని అడిగాడు. ఇంకా నయం. అక్కడ వెలుతురు ఆట్టేలేదు. లేకపోతే నాకంటి నీరు అతనికి కనిపించే వుండేది. నేను అంతలోనే సర్దుకుని "లేదులేదు. ఏమీలేదు" అన్నాను నడుస్తూ.

అతడు భోజనం చేస్తూ వుండగా నేను పాలు తెప్పించు కుని చల్లగా చల్లార్చుకుని నెమ్మదిగా గుటకలు వేస్తూ కూర్చు న్నాను. ఆ కాసిని పాలూ త్రాగి లోపలికి వెళ్లి చెయ్యి కడు క్కుంటూ అద్దంలో నా ప్రతిబింబం వంక చూసుకున్నాను. అదేమి చిత్రమో, కొంచెం పెద్ద సైజు అద్దం ముందు నిలబడి నప్పుడల్లా 'అది నా ప్రతిబింబమేనా?' అని అనుమానం కలు గుతూ వుంటుంది ఎప్పుడూ.

వరప్రసాద్ భోజనం ముగించి రాగానే యిద్దరం బయటికి వచ్చాము. అక్కడ కిళ్లీ కొట్టు ముందు మనోహరం ఏవేవో పత్రికలు కొంటూ నిలబడి వున్నాడు. నేనతన్ని గమనించి కూడా అతని వంక చూడకుండా తప్పుకుపోబోయాను. కాని అతడు చప్పట్లు కొట్టి పెద్దగా పిలుస్తూ వెంటవచ్చి నా భుజం పట్టుకుని నిలిపాడు.

నేను ప్రయత్నం మీద నవ్వి ''ఏమిటి విశేషాలు?'' అని అడిగాను. అతడు 'ఏమీలేవు' అని సమాధానం చెప్పి నేనూహించని విధంగా అన్నాడు. ''మా కొత్తయింటికి రాగూడదుటోయ్ ఒకసారి...చూద్దువుగాని. మళ్లీ నిన్ను తీసుకువచ్చి మీ రూము దగ్గర దిగబెడతాలే''

నేను నవ్వి ''మా రూముకు వస్తావా మరి?''అని అడిగాను.

''ఓ, యస్. ముందు మా యింటికి పోదాం. అక్కడ కాస్సేపు కూర్చో. తర్వాత నాగుర్రం మీద యిద్దరం మీరూముకు వద్దాం. కాస్సేపు అక్కడ కూర్చుని నేను మళ్లీ యింటికి వెళ్లిపోతాను'' అన్నాడు మనోహరం.

''సరే...చివరకు అన్నీ ముడిపడుతున్నాయి'' అనుకుంటూ నేను వరప్రసాద్ వంక తిరిగాను. అతడు మా సంభాషణ అర్థం చేసుకున్నాడు. ''అలాగే. మీరు వెళ్లిరండి. నేను రూముకు చేరుకుంటాను'' అంటూ నడిచిపోయాడు. మనోహరం, మోటార్‌సైకిల్ వైపు నడుస్తూ ''ఏమిటోనోయ్? ఈ బిజినెస్ వుంది చూశావూ చాలా రిస్క్. వెధవది చచ్చిపోతున్నాననుకో. పైనుంచి చూసేవాళ్లకు బాగానే వుంటుంది. క్షణం తీరిక వుండదు. అన్ని రకాల పత్రికలు కొనుక్కుపోతానా? పేజీలు తిప్పేందుకు కూడా వీలుండదు. సరే మా ఆవిడ కోసమైనా యిది తీసుకుపోక తప్పదనుకో'' అంటూ మోటార్ సైకిల్ స్టార్టు చేశాడు. నన్ను 'వెనక కూర్చోమ'న్నాడు. అతడు దోవ పొడుగునా ఏదో మాట్లాడుతూనే వున్నాడు. అంతా అతని బిజినెస్ గురించీ, తీరిక లేకపోవడం గురించీ. చాలా దూరం వెళ్లిన తర్వాత ఒక పెద్ద మేడ ముందు ఆగి, ''మేడ ఇటీవలే కొత్తగా కొన్నాం. డెబ్బయివేలు పోశాం దీని మొహాన. ఏమిటో, అంతా డబ్బు దండగ తప్ప వసతు లసలు లేవు. అయినా ఈ మేడలు కట్టించేవాళ్లు యింత తెలివితక్కువగా ఎందుకు కట్టిస్తారో తెలీదు. చూడు ఒక అందమా, చందమా! ఈ యిల్లు ఎంత డీసెంట్‌గా కట్టించి వుండవచ్చు. వెధవ పాత పద్ధతులూ వీళ్లూనూ'' అంటూ నన్ను హాల్లోకి తీసుకువెళ్లి కూర్చోబెట్టి ''ఇప్పుడే క్షణంలో వచ్చేస్తాను'' అంటూ లోపలికి వెళ్లాడు. అతడలా వెళ్లగానే ఒక యాభై యేళ్ల వ్యక్తి లోపలి నుంచి హాల్లోకి వచ్చాడు. ఆయనను చూస్తూనే గతుక్కుమన్నాను. ఈయన మనోహరం మామగారు కాదుకదా!

ఆయన నా దగ్గరగా వచ్చి నన్ను పరీక్షగా చూసి ''నువ్వా భానూ! మావాడు తన స్నేహితుడంటే ఎవరో అనుకున్నాను. ఇప్పుడేం చేస్తున్నావు నువ్వు? ఎక్కడా ఇటీవల కనిపించనేలేదేం?'' అని పలుకరించాడు సోఫాలో కూర్చుంటూ.

'నేను కూర్చున్నది పండు నిప్పులతో నిండిన కుర్చీకాదు గదా!' అనిపించి యిబ్బందిగా కదిలి తల వూపుతూ కూర్చుండిపోయానేగాని ఆయన ప్రశ్నకు సమాధానం చెప్పలేదు.

ఆ భుజంగరావు అనే వ్యక్తిని అక్కడ చూస్తానని కలలో కూడా అనుకోలేదు. ఆయనది అన్వర్థనామధేయం. సన్నగా రివటలా వుంటాడు. జుట్టులో చాలాభాగం లోకాన్ని వంచించడంలోనే నెరిసిపోయింది. విదేశీ గడియారాలూ, యితర ఖరీదైన వస్తువులూ చాటుగా అధికారుల కన్నుగప్పి పెద్దఎత్తున తెప్పించి లాభాలు సంపాయించేవాడు. దొంగనోట్లు ముద్రించి చెలామణీ చేసేవారితో కూడా ఆయనకు లావాదేవీ లుండేవి. అయితే యిది కొన్ని సంవత్సరాల క్రిందటి సంగతి. ఇప్పుడు కూడా బాహాటంగా ఆ పనులు చేస్తున్నాడో లేదో తెలియదు. పైగా మహాదారుణమైన విషయ మేమిటంటే మనోహరం, బృంద భర్త కావడం.

అయ్యో, పాపం మనోహరం! నేనిన్నాళ్లూ నిన్ను చూసి నువ్వేదో సుఖపడి పోతున్నావని కొంచెం అసూయ చెందాను. కాని యిప్పుడు నీపట్ల జాలితో నా హృదయం నిండిపోతున్నదోయ్!

బృంద రూపం కళ్లలో మెదిలింది. చాలా అందమైన గోధుమ వన్నె త్రాచుపాము అది. ఆ భయంకర సముద్ర జంతువు తాలూకు ఎనిమిది చేతులలోనూ ఒకటి. ఆ క్రూరమైన షార్క్ ఆకలి తీరక ధరించిన మరో రూపం. మనుష్యులను కాల్చి తిని వేసే కాన్సర్ ఎత్తిన అవతారం. మనోహరం మొహం టవలుతో తుడుచుకుంటూ హాల్లోకి వచ్చాడు. నిండుగా, సంపదవల్ల సంక్రమించిన గర్వంతో, నవ్వుతున్న అతని వంక జాలి నిండిన కళ్లతో చూశాను. అతడు, అమాయకంగా సాలెగూటిలో చిక్కుకున్న చిన్నపురుగులా, అగ్ని వైపుకు వెళ్లే శలభంలా, సముద్రం అడుగున ఆ జంతువు ఎనిమిది చేతులలో చిక్కుకున్న అమాయక ప్రాణిలా, షార్క్ క్రౌర్యానికి బలి అవుతున్న చిన్న బంగారు రంగు చేపపిల్లలా, కనిపించాడు. అయినా అతని కేమీ తెలిసినట్టులేదు. అబ్బో! భుజంగరావు సామాన్యుడా? నిన్ను గురించి నీకే తెలియకుండా చేయగల దిట్ట. ఈ లెక్కన ఆలోచిస్తే తాను చిక్కుకున్న సుడిగుండం ఎంత భయంకరమైనదో మనోహరం ఎప్పటికీ తెలుసుకోలేడు. జీవితమంతా అతడు ఆ తీపిపూసిన చేదు మాత్రలే మ్రింగి మోసపోతూ వుంటాడు. తప్పదు.

గొంతులో మంటపుట్టి యిబ్బందిగా లేచి నిలబడ్డాను. మనోహరం నవ్వుతూ చొక్కాగుండీలు పెట్టుకుంటూ మామ గారివంకతిరిగి''ఇతన్ని యింటిదగ్గర దిగబెట్టివస్తాను'' అన్నాడు.

ఆయన తల వూపుతూ ''అలాగే. నిక్షేపంగా వెళ్లిరా'' అన్నాడు.

ఆ యింటి నుంచి బయటికి వొస్తూ వుండగా బృందను ఒక్కసారి చూస్తే బాగుండు ననిపించింది. ఆ కోరిక ఎందుకు కలిగిందో తెలీదు. నా లోపలి క్షుద్రుడికి అన్నీ యిటువంటి కోరికలే......

మోటార్‌సైకిల్ వెనక సీటులో కూర్చుని 'రివ్వు'న సాగిపోతూ వుండగా అంతా గుర్తుకు వచ్చింది.

కొన్ని యేళ్ల క్రిందట—అప్పటికి యింటర్మీడియేట్ తప్పి కూర్చుని వున్నాను—వారి యింటిలోనే ఒక గది అద్దెకు తీసుకుని కొందరు చిన్నపిల్లలకు చదువు చెబుతూ కాలం వెళ్ల బుచ్చుతూ వుండేవాణ్ణి. అప్పటికి యింకా జీవితం నాపాలిట

శాపం కాలేదు. తింటూ తిరుగుతూ చిన్నపిల్లలకు పాఠాలు చెబుతూ వుంటే హాయిగానే రోజులు వెళ్లిపోతూ వుండేవి. అప్పుడప్పుడు నా గదికి బృంద వస్తూ వుండేది. వచ్చి వూరికే కాస్సేపు కూర్చుని ఏదో మాట్లాడి వెళ్లిపోతూ వుండేది. నేనామెను ప్రేమించానని చెప్పడం అసంగతమే కాని అతిశయోక్తికాదు. ఆమె అంటే 'యిష్టం' వంటి భావమేదో నాలో కలిగింది. దానికి తోడు ఆమె నాతో చాలా సన్నిహితంగా చనువుగా వుండేది. ఒక్కొక్కప్పుడు ఆమెను చూస్తూ వుంటే ఎవరో అదృశ్య వ్యక్తి బాణం పెట్టి మనసుకు గురిపెట్టి కొట్టినట్టనిపించేది. ఒక పర్యాయం ఆమెను వరండాలో చూశాను. ఆమె పరికిణీ పచ్చని పిక్కలు కనిపించేలా మోకాళ్ల వరకూ పైకి కట్టుకుని, పమిట బిగించి వేసుకుని మెలిదిప్పి బొడ్లోదోపుకుని రంగుల త్రాటితో'స్కిప్పింగ్' చేస్తున్నది. ఆమె నుదుట ముత్యాల వరుస వలె స్వేదం..... అలుపుతో ఎగిరెగిరి పడుతున్న ఉన్నత వక్షం. అందమైన ఆకాశ ఖండాల వంటి ఆ నీలికళ్ళు, నాలో ఏదో తెలియని సంచలనం కలిగించాయి. హఠాత్తుగా దగ్గరికి వెళ్లి నిలబడ్డాను. ఆమె స్కిప్పింగ్ ఆపకుండా నావంక చూసి నవ్వుతున్నది. తర్వాత 'యా ఫై' అంటూ ఆయాసంతో ఒగర్చుతూ ఆగి నావంక 'ఏమిట'న్నట్టు చూసింది. నేను ''ఏమీలేదు'' అంటూ యివతలికి వచ్చేశాను. నా లోపలి క్షుద్రుడు అప్పటికి నన్ను యింతగా లోబరుచుకోలేదు మరి.....

ఒకనాడు—ఆరోజు భుజంగరావు వూళ్లోలేడు— నేను అద్దె యిద్దామని వెళ్లాను. హాల్లో నిలబడి చూశాను. లోపల నుంచి నవ్వులు వినిపించాయి. గుమ్మంపైగా వున్న పెద్ద బల్లి బొమ్మ వంక చూస్తూ కాస్సేపు నిలబడి తర్వాత లోపలికి వెళ్లి కిటికీలో నుంచి చూశాను. లోపల బృంద ఎవరో నడివయసు మగవాడికి దగ్గరగా కూర్చుని విరగబడి నవ్వుతున్నది. నేను విసవిస వచ్చేశాను. అప్పుడే ఆమె అంటే ఒకరకమైన ఏహ్యభావం కలిగింది. తర్వాత కొన్ని నెలలకు వారి యింటికి ఒక లేడీ డాక్టరు రావడం చూశాను. భుజంగరావుకు నేనెరిగినంతవరకూ ఏరోగమూ లేదు. బృంద సరేసరి స్కిప్పింగ్ అయితే చేయడం లేదుగాని మెరుపులా హుషారుగా నవ్వుతూ తిరుగుతూనే వుంది. ఇక ఆ యింట్లో పనివారు తప్ప మరెవరూలేరు. ఆతర్వాత కొన్ని రోజులకు ఆయింటి పనిమనిషి ఒకడు నాకు సన్నిహితుడైనాడు. వాడు పెద్ద రేడియో సమాచార కేంద్రం వంటివాడు. నా రూముకు వచ్చి వాడు తీరికగా చుట్ట కాల్చుకుంటూ వుండేవాడు. వేరే ఎక్కడ చుట్ట కాల్చుకున్నా యజమాని చూస్తే వూరుకోడట. వాడు నాకు ఒకదాని వెంట ఒకటిగా సమస్త వివరాలూ చెప్పి తీరా వెళేటప్పుడు ''ఇది బయటికి అన్నారంటే నా నోట్లో దుమ్మే. మీకు పుణ్యం వుంటుంది. ఎక్కడా అనకండి'' అని వొట్టు వేయించుకున్నాడు. వాడు చెప్పినవన్నీ విని సమన్వయం చేసుకుంటే భుజంగరావు అసలు స్వరూపం నాకు బోధపడింది. ఆయన యింటికి ఎవరెవరు ఎందుకు వొస్తూ వుంటారో, ఎవరెవరితో ఆయనకు ఎటువంటి లావాదేవీ లున్నాయో సర్వం తెలిసింది. వాడే లేడీడాక్టరు ఎందుకు వచ్చిందో కూడా చెప్పాడు. బృందకు నాలుగోనెలట...నేను కొయ్యబారిపోయి''మరి...పెళ్లి.?'' అన్నాను. వాడు నవ్వి ''కాకుండానే సామీ. మీదంతా అదో పిచ్చి మాలోకం. ఎవరో పెద్ద ఆఫీసరు పుణ్యం అది. ఇప్పుడు మాత్రం పోయిందేముంది? తీసేశారుగా'' అన్నాడు. భ్రూణహత్య! నా కళ్లు తిరిగిపోయాయి. అందమైన మొగలి పొదలో ఎటువంటి భయంకరమైన పాములుంటాయో తెలిసి వచ్చింది.

మనోహరం ''ఎక్కడయ్యా నీ రూము?'' అని అడుగుతున్నాడు. దాదాపు మా సింహద్వారం ముందే మోటారుసైకిలు ఆపి వున్నాడు.

నేను దిగి ''ఇదే...లోపలికి...'' అన్నాను నడుస్తూ.

అతడు మోటార్‌సైకిలు తాళం వేసి ఆతాళం చెవుల గుత్తిని చేతితో తిప్పుకుంటూ నావెనకనే వచ్చాడు. అందరూ నిద్రలు పోతున్నట్టున్నారు. ఏ భాగంలోనూ అలికిడిలేదు. బ్యాంకు గుమాస్తా మాత్రం మేలుకుని వున్నట్టున్నాడు. శబ్దం విని ''ఎవరది? రాజా...'' అన్నాడు.

''కాదండి.. నేను...'' అన్నాను నేను.

ఆయన నన్ను గుర్తించి ''మీరా? వాడింకా రాలేదండీ... వాడి కోసమే చూస్తున్నాను'' అన్నాడు.

'మీ వాడిప్పట్లో రాడులే. వరప్రసాద్ రూములో పోయిన వస్తువులుఎంత తక్కువకు అమ్ముకున్నా బోలెడు డబ్బు వస్తుంది. అదంతా వినియోగం కావద్దూ. అంతవరకూ వాడు యింటికి రాడు' అనుకుంటూ మెట్లు ఎక్కాను. మనోహరం నావెనకనే వచ్చాడు. పదిమెట్లు ఎక్కేసరికి మళ్లీ దగ్గు ముంచుకు వచ్చింది. దగ్గు ఆపుకునే ప్రయత్నంలో రుమాలు నోటికి అడ్డం పెట్టుకున్నాను. పైకి వెళ్లి చూస్తే రుమాలు చాలాభాగం తడిసింది. నీళ్లు పుక్కిలించి ఉమ్మివేశాను. తలుపులు తీసి మనోహరాన్ని లోపలికి రమ్మన్నాను.

''ఎందుకోయ్, వెడతాన్లే..'' అంటూనే అతడు లోపలికి వచ్చి కూర్చుని చుట్టూ చూశాడు. తర్వాత కాస్సేపాగి ''అద్దె ఎంత యీ గదికి?'' అని అడిగాడు.

చెప్పాను. విని చప్పరించాడు. తర్వాత ఏమీ తోచనివాడిలా రుమాలుతో విసురుకున్నాడు. నేను కూడా యిక ఏమీ మాట్లాడ లేదు. అలాగే పైకి చూస్తూ కూర్చుండిపోయాను. కాస్సేపాగి అతడు ''సరే.. యిక వెడతాను..'' అంటూ లేచాడు. నేను అప్పుడు ఏదో అడుగుదా మనుకున్నాను. కాని అడగలేదు. అతని వెనకనే లేచి వెళ్లి సాగనంపాను. అతడు మెట్లు పూర్తిగా దిగి వెళ్లాడో లేదో అంతవరకూ లోపల ఆగివున్నదేదో విరుచుకుని పైకి పొంగింది. గబగబ వెళ్లి తూము దగ్గర ఉమ్మివేశాను. వెంటనే అటువైపు చూడకుండా నీళ్లు నోట్లో పోసుకుని పుక్కిలించి వుమ్మివేసి వెళ్లి పక్కమీద వాలిపోయాను. అంతలో చలి వేసింది. కప్పుకుని ముడుచుకుని పడుకున్నాను. క్రమంగా నిద్ర పట్టిందనుకున్నాను. కాని స్వప్రహాతప్పిందనే విషయం మరునాడు వరప్రసాద్ చెప్పేవరకూ తెలియలేదు నాకు...

6

కళ్ళు తెరిచి చూసేసరికి నాచుట్టూ కనిపించింది గోడ అనుకున్నాను. కాదు. అది మంచం చుట్టూ ఉన్న తెర. నేనెక్కడ ఉన్నానో నాకు తెలియలేదు. వొళ్లంతా ఎటయినా ఎగిరిపోగలిగినంత తేలికగా అయితే వుందికాని తలనొప్పి బాధిస్తున్నది. ఎదురుగా తెర లోపలి వైపున సన్నని ఎర్రదీపం వెలుగుతున్నది. అది ఎందుకు వుంది అక్కడ? అసలు నేనెక్కడ ఉన్నాను?

తెర తొలిగింది. రెండు ముఖాలు కనిపించాయి. ఒకడు వరప్రసాద్. రెండవ ఆమె తెల్లని దుస్తులు ధరించి నర్సులా వుంది. ఆమె అంటున్నది "కదులుతున్నాడు. డాక్టరును పిలుచుకు వస్తాను."

వరప్రసాద్ నాప్రక్కనే కూర్చున్నాడు. అతని కళ్లలో నీళ్లున్నాయో? ఏమోమరి! నాకళ్ల ముందు అంతటా పలుచని తెరలు దింపినట్టున్నది. వరప్రసాద్ నా మీదికి వంగి 'ఇప్పుడెలా వుంది గురువుగారూ?' అని అడిగాడు.

నేను తల వూపానేగాని మాట్లాడలేదు. కదలబోయాను. గొంతుక దగ్గర నుంచి పొట్టవరకూ ఏవో కట్లు... వరప్రసాద్ అంటున్నాడు, "మీకు స్పృహలేదు. నేనే ఆస్పత్రికి తీసుకువచ్చి చేర్చాను."

నేనతని చెయ్యి అందుకుని "పోనీ యిది చెప్పండి. నేను బ్రతుకుతా నన్నారా డాక్టర్లు?" అని అడిగాను.

అతడు భయంగా చూస్తూ తలవంచుకున్నాడు. పాపం! అనుభవంలేని కుర్రవాడు. అతన్ని అడగటంవల్ల లాభంలేదు. డాక్టరు నోటి మీదుగానే అంతా వినాలి.

మహా సముద్రం లోతులలోవుండే ఆ భయంకర జంతువు అప్పుడే తన ఎనిమిది చేతులను ఘోరంగా కదిలిస్తూ విలయ నృత్యం చేస్తున్నది నా కళ్లముందు.

నన్ను మొదట్లో పరీక్ష చేసిన డాక్టరూ, ముక్కు పిడికి నిరంతరం జారుతూవుండే అతని కళ్లజోడూ, ఎల్లప్పుడూ చెమటలుపట్టే అతని నుదురూ గుర్తొచ్చాయి. "మహా అయితే మూడు నాలుగు నెలలు. కావలసిన వారెవరైనా ఉంటే పిలిపించండి." ఆయన మాటలు కూడా మళ్ళీ వినిపించినట్టయింది. "ఎవరున్నా రతనికి ఈ లోకంలో" అన్నాడు నా మిత్రుడానాడు. కాదు. అది తప్పు. వరప్రసాద్ లేడూ మరి....

డాక్టరు అనుకుంటాను, నామీదికి వంగి నా కళ్లలోకి చూశాడు. కాస్సేపు చూసి తల పంకించాడు. అంతలోనే నేను స్పృహతప్పినట్టు నటిస్తూ కళ్లు మూసుకున్నాను. డాక్టరు నోటివెంట వివరాలు తెలుసుకోవాలంటే మరి యిదేమార్గం. నా ఎత్తుగడ మంచి ఫలితాన్నే యిచ్చింది. ఆయన తెర దింపి వరప్రసాద్‌తో అంటున్నాడు.

"ప్చ్......అట్టే లాభం లేదండీ. ఇలాగే స్పృహ వస్తూ పోతూ వుంటుంది. స్పృహ ఉన్నంతసేపూ తెలివిగానే మామూలుగానే ఉంటాడు. మహా అయితే యిప్పటినుంచీ ఒకరోజు. ట్వొంటీఫోర్ అవర్స్. అంతే.....ఆ తర్వాత..." మాటలు పూర్తి చెయ్యకుండానే డాక్టరు బూట్లు టక టక లాడించుకుంటూ వెళ్లిపోయాడు.

నేను బాధకు ఓర్చుకుంటూనే తల కొద్దిగా విదిలించాను. వరప్రసాద్ తెర తొలిగించి చూశాడు. నా ప్రక్కన కూర్చోమని సైగ చేశాను. కూర్చున్నాడు. అతని చెయ్యి అందుకున్నాను. హఠాత్తుగా అన్నదాన సమాజానికి ఆనాడు అతడు నా వెంట రావడం గుర్తు వచ్చింది. "ఇక నాకు ఎలాగూ వీలు పడదు. మీరు దయతో కనీసం యిక్కడ ఉద్యోగం చేసి నన్నాళ్ళూ అయినా ప్రతి నెలా ఎంతో కొంత ఆ అన్నదాన సమాజంలో సత్యమూర్తి గారికి యివ్వండి. ఈసారి ఆయనను కలుసుకున్నప్పుడు నేను అడిగానని చెప్పండి" అన్నాను.

వరప్రసాద్ కళ్లలో నీళ్లు నిలిచినట్టు అనుమానం కలిగింది. నేను వెళ్లేచోట భగవంతుడంటూ ఎవరైనావుంటే చాలా మందిన్ని దయతో చూడమని చెప్పాలి.

నేను మళ్లీ ఏమీ మాట్లాడకుండా పడుకుని ఉండి పోయాను. అతడు కూడా అలాగే కూర్చున్నాడు. నా మనసు పాదరసంవలె జరజర ప్రాకి పోతున్నది. నేను మరొక యిరవై నాలుగుగంటలలో అనలులో ఉండను. అంటే ఏమైపోతాను? ఎక్కడికన్నా ఎగిరి పోతున్నట్టుంటుందేమో! అయినా తినబోతూ రుచిని గురించిన ఆరాటం ఎందుకు?

బుల్లి చేతి వాచీ మాటి మాటికీ చూసుకుంటూ, రుమాలుతో మొహం అద్దుకుంటూ రత్నావళి మామూలుగానే హంసలా నడుస్తూ రోజూ బస్సుస్టాపుకు వస్తూవుంటుంది. ఆమె చుట్టూ మామూలుగానే అయిదారు అడుగుల కైవారంలో చక్కని పరిమళం రోజూ వ్యాపిస్తూనే ఉంటుంది కాబోలు. ఎదురుగా హోటల్లో కౌంటరుముందు కూర్చుని ఉండే బట్టతల వ్యక్తీ, ప్రక్కనే స్టేషనరీ స్టోర్సులో తీరికగా కూర్చుని ఆవులిస్తూవుండే మెల్లకన్ను వ్యక్తీ గుర్తుకువచ్చారు. స్టేషనరీ స్టోర్సులో మూల పని లేక పడివుండే ఫోను గుర్తుకు వచ్చి నవ్వుకున్నాను.

వరప్రసాద్ "ఏమిటండీ, నవ్వుతున్నా రెందుకు?" అని అడిగాడు. "నేను "ఏమీ లేదం"టూ కళ్ళు మూసుకున్నాను.

అంతలో ప్రక్కనే ఏదో హడావిడి.....ఎవరినో మంచం మీదినుంచి తీసుకుపోతున్నారు. ఎవరిదో కంఠస్వరం "త్వరగా తీసుకు పదండి" అంటున్నది. ఆ కంఠస్వరం క్రూరంగానూ, నిర్దాక్షిణ్యంగానూలేదు. అలా అని మృదువుగానూ లేదు.

వరప్రసాద్ వెళ్లిచూశాడు. నా పక్క మంచంమీదవున్న మనిషి నాకు తెరగుండా కనిపించాడు. అతడు మంచం మధ్యలో కూర్చుని అవతలి వ్యక్తిని తీసుకుపోవడం కళ్లు పెద్దవి చేసుకుని చూస్తున్నాడు. అతన్ని చూస్తూవుంటే మా యింటి పక్కన, తలనొప్పి వచ్చినా అరిచీ, కేకలు పెట్టీ గందరగోళంచేసే పెద్ద మనిషి గుర్తుకు వచ్చాడు. ఈ యిద్దరికీ ఎంత భేదం?

అవతలి మంచంమీద కూర్చునివున్న వ్యక్తి వరప్రసాద్‌తో అంటున్నాడు. "అతనిపేరు కృష్ణమూర్తి. నాలు గైదు రోజుల క్రిందట ఏదో వర్క్‌షాపులో ప్రమాదంలో రెండు కాళ్ళూ తెగిపోయాయి. ఇక్కడికి తీసుకువచ్చి చేర్చారు. మొదట్లో అవిటివాడుగానైనా బ్రతుకుతాడని అనుకున్నారంతా. కాని యివాళ సాయంకాలంనుంచీ వాతం కమ్ముకుని వచ్చింది. పైగా యిక్క డెవరూ కావలసినవారు లేరు కూడా....."

నాకు వెంటనే నా గదిలో పోస్ట్‌మేన్ పడేసిన ఉత్తరం మనసులో మెదిలింది. కృష్ణమూర్తి! అవును. ఆ ఉత్తరం పేరు అదే. కాని యితడు, అతడు ఒకరు కాగూడదు. ఆ శోక దేవత అయిన పడచు అన్న నగరంలో ఎక్కడో పని చేస్తూ సుఖంగా ఉండే ఉంటాడు అనుకున్నాను. కాని నా లోపలి క్షుద్రుడు ఒప్పుకోవడం లేదు. "ఆ యిద్దరూ ఒక్కటే నోయ్! నువ్వు కాదనిమాత్రం ఏం లాభం? ఆ కృష్ణమూర్తి ఈ కృష్ణమూర్తి ఒకడే.......ఇప్పుడు లోకం వదలి వెళ్లిన నిర్భాగ్యుడిదే ఆ ఉత్తరం" అని గొంతు చించుకుంటున్నాడు వాడు.

నాకు రేకుల గదిలో కొడుకుతో సహా అద్దెకుంటున్న యాభై యేళ్ల స్త్రీ గుర్తుకు వచ్చింది. ఆ ప్రామిసరీనోటు వ్రాసి యిచ్చినవాడు ఎప్పటికయినా, అందులో కొంత అయినా ఆమెకు ముట్టచెపుతాడో లేదో!

వరప్రసాద్ మళ్లీ నా మంచం ప్రక్కనే స్టూలుమీద కూర్చున్నట్టున్నాడు. అతని నీడ తెరమీద పడుతున్నది. పాపం! ఇతనికీ నాకూ ఏమిటి అనుబంధం? ఆరోజు అతనితో అతని స్నేహితులతో చెప్పకుండా వచ్చేయడం గుర్తుకు వచ్చింది. చెయ్యి తెరలోనుంచి బయటికి పోనిచ్చి అతన్ని తట్టి పిలిచాను. అతడు లోపలికి తలపెట్టిచూసి "ఏమిటి?"అని అడిగాడు. నేను నెమ్మదిగా "ఆరోజున గ్రౌండ్‌లో ఆట చూసేందుకువెళ్లాము గుర్తుందా? నేను మధ్యలోనే వచ్చేశాను. మీరందరూ ఏమను కున్నారో.....అందుకు ఏమీ అనుకోకండి. మీ ఫ్రెండ్సుకు కూడా చెప్పండి" అన్నాను.

వరప్రసాద్ మతిపోయినట్టు చూసి అంతలోనే తేరుకుని తల వూపి, "మేమేమీ అనుకోలేదు. మీరనవసరంగా అటువంటి చిన్న విషయాలు గుర్తుకు తెచ్చుకుని బాధపడకండి. హాయిగా నిద్రపోండి కాస్సేపు" అన్నాడు.

"అవును. నిద్రపోవాలి. అయినా నిద్ర రావద్దూ. దాని వేళకుగాని అది రాదు. నాకు అంతలో మా ఆఫీసూ, నాలుగుచక్రాల బండిలో తినుబండారాలమ్ముకునే సాయిబూ, హెడ్ గుమాస్తా, కిటికీలోనుంచి చూస్తే కనబడే పెద్ద మర్రిచెట్టూ, క్యాంటీనూ, చిన్న చిన్న లోహపు బిళ్లల టోకెన్లూ, అన్నీ గుర్తుకు వచ్చాయి. మా హెడ్ నా సీటులోకి వచ్చే మరొకణ్ణి కూడా అలాగే చూస్తాడు కాబోలు! అసలు ఎవడొస్తాడో ఆ సీటులోకి? పూర్ ఫెలో.....

అగ్ని ప్రమాదం జ్ఞాపకం వచ్చింది. ఫౌండ్రీలో పని చేసే ఆ తాగుబోతు, త్రాగుడూ, జూదమూ యిక ఎప్పటికీ మానడనుకుంటాను. ఆ వృద్ధురాలూ, ఆమె కోడలూ, పిల్లలూ, మళ్లీ గుడిసె వేసుకున్నారో లేదో.

అన్నట్టు వరప్రసాద్ పోయిన వస్తువులకోసం పోలీసు రిపోర్టు యిచ్చానన్నాడు. అబ్బే, లాభం లేదు. రాజేంద్ర వచ్చే వరకూ ఆ విషయం తేలదు. అతడు వచ్చాడో లేదో! బ్యాంకు గుమాస్తా కూతురు ఆ లావుపాటి పుస్తకాన్ని యింకా చదువు తూనే ఉండి ఉంటుంది. ఆ పుస్తకాల బరువే ఆమెను క్రుంగ దీస్తున్నది పాపం! ఆ అర్భకురాలు తల్లి దండ్రులు తనమీద పెట్టుకున్న ఆశలు నెరవేరుస్తుందా?

ఆ హిందూస్తానీ వ్యక్తి ఇక హాయిగా నిద్రపోతాడను కుంటాను. నా పాటల పీడ విరగడై పోయిందని హాయిగా నిట్టూర్చాడు కాబోలు!

పిక్నిక్ దృశ్యాలన్నీ మనసులో పంచరంగుల సినిమా రీలువలె కనిపించాయి.

ఆ నీలి ఆకాశమూ, ఎప్పుడు దొర్లుతాయో అన్నట్టుండే ఆ ఎర్రని రాళ్లూ, కొండను చుట్టుకునివున్న నల్ల త్రాచు వంటి రోడ్డూ, తామర ఆకులతో ఉపరితలం బొత్తిగా కని పించని కొలనూ, ఆ ఆకుల మధ్యలో నాలుగైదు పువ్వులూ, (అవి నేను చూసినప్పుడు వికసించి ఉన్నాయా? లేక మొగ్గ లేనా?) చెట్ల ఆకుల సందునుంచి నేలమీద పడుతున్న వెలుగు మచ్చలూ, తీరికగా ఎగురుతూ వుండిన రంగు రంగుల పక్షులూ... అవన్నీ మళ్లీ నాకు కనిపించవు కాబోలు!

అంతలోనే మోటారు సైకిలు శబ్దం వినిపించినట్లయి వెనువెంటనే మనోహరం గుర్తు వాచ్చాడు. పాపం! ఇక జీవిత మంతా తన భార్యను గురించీ, మామగారిని గురించి బోలెడు విషయాలు తెలియకుండానే అలాగే మోసపోతూ గడుపుతాడు కాబోలు. అతన్నిచూసినమొదట్లో అసూయవంటిభావం మనసులో కలిగినందుకు ఎంత సిగ్గు పడినా తీరదు. నిజానికి అతన్నిచూసి జాలిపడాలి. ఆ అమాయకుడు అలాగే షార్కుచేత తినబడుతూ కూడా తెలియని పిచ్చి చేపలా, సాలెగూటిలో చిక్కుకుని కూడా ఆ విషయం తెలియని అమాయకపు పురుగులా, అలాగే కాలం గడుపుతాడు. బృంద అందం అతని కళ్లు ఎన్నడూ తెరుపుడు పడకుండా ఉంచేందుకు చాలిన శక్తికలిగిన మత్తు మందు....

నా పెట్టెలో అడుగున ఉన్న మా తాతయ్య ఫోటో గుర్తుకు వచ్చింది. 'దేవుడి దగ్గరికి వెళ్లిన వాడికి ఫోటో ఎందుకు?' అనిపించింది. వెంటనే 'దేవుడున్నాడా? లేడా?' అని పోట్లాడుకున్న యిద్దరు రైలు ప్రయాణీకులు గుర్తు వచ్చారు. మధుసూదనం ఎలా ఉన్నాడో! వాడెప్పుడూ "దేవు డుంటే మనకేం? లేకపోతే మనకేం? ఎలా అనుకుంటే లాభ సాటిగా ఉంటుందో అలా అనుకుంటే తీరిపోతుంది" అనే వాడు.

నాకు నిద్ర వస్తున్నట్టున్నది. కళ్లు మూతలు పడు తున్నాయి. కళ్లు మూసుకున్నా కనుచూపు మేర అంతటా మనో హరమైన రంగులు.......ఒత్తుగా తివాచీ పరిచినట్టున్న నేల.... ఎక్కడో పసి పాపల చిరునవ్వు.....అందమైన స్త్రీ కాలి గజ్జె కదలిన ధ్వని.....గుడిలో సంధ్య వేళ మ్రోగుతున్న గంటలు..... నీళ్ల నదిలో ఒడ్డును తాకుతున్న సవ్వడి.....హాయిగా ఎగిరి పోతున్న పక్షి రెక్కల ధ్వని.....జలార్ద్రమైన మేఘాలమధ్య మెరుపుతీగ.....ఆకాశంలో అందాల ఇంద్ర ధనుస్సు......వర్షం పడుతున్న సవ్వడి......వర్షంలో తడిసిన నేల వాసన....ఇప్పుడు నిద్రపోతే రేపు ఉదయం మెలకువ వస్తుంది అన్న భావన..... 'మరో ఇరవై నాలుగ్గంటలు' అనే డాక్టర్ కంఠస్వరం....

నాకు కళ్లు మూతలు పడ్డాయి.

పశ్చిమ ఆఫ్రికాలో

ఏకపక్షరాజ్యాంగ సంక్షోభం

శ్రీ డబ్ల్యు. ఆర్థర్ లూయిస్

1957నుంచి పశ్చిమ ఆఫ్రికాలో పదమూడు కొత్త రాజ్యాలకు స్వాతంత్ర్యం లభించింది. వీనిలో నాలుగు బ్రిటిష్ వలసలు—ఘనా, నైజీరియా, సిర్రా లియోన్, గాంబియా; తొమ్మిది ఫ్రెంచి వలసలు—మారుటానియా, సెనెగల్, మాలి ,గినీ, అప్పర్ ఓల్టా, ఐవరీ కోస్ట్, టోగో, దహోమీ, నైగర్; ఇంకో పశ్చిమ ఆఫ్రికా దేశం కూడా ఉంది. దాని పేరు లైబీరియా. ఒక వంద సంవత్సరాల నుంచి స్వతంత్రంగా ఉంటూ ఉన్నది. ఇది పద్నాలుగోది. ఇక పోతే ఈ పశ్చిమ ఆఫ్రికాలో వలస మాత్రంగా మిగిలి ఉన్న ప్రాంతం ఒక్కటే. అది పోర్చుగీసు గినీ. స్వతంత్రమైన ప్రతి ఒక్క దేశంలోను 1957 లో, ఐవరీకోస్ట్, లైబీరియాలలో తప్ప, రెండేసి పెద్ద పార్టీలు పనిచేస్తూ వచ్చాయి. ఇప్పుడు అట్లా కాదు. ఆ పరిస్థితి తారుమారై పోయింది. ఇప్పుడు ఆ దేశాలన్నీ ఏకపక్ష రాజ్యాలై పోయినాయి. ఇందుకు సిర్రాలియోన్, నైజీరియాలు మాత్రమే అపవాదు. ఇప్పుడు పశ్చిమ ఆఫ్రికాలో యీ ఏకపక్ష రాజ్యాంగ పద్ధతిని గురించి సమీక్షించి, అభివృద్ధిచెందుతూ ఉన్న రాజ్యాల సమస్యలకు దీనితో ఉన్న సందర్భ శుద్ధిని గూర్చి పరిశీలించవలసి ఉంది. ఈ వ్యాసం లక్ష్యం అదే.

ఇక్కడ మొట్టమొదట ఒక్క విషయాన్ని తెలుసుకోవలసి ఉంది. పశ్చిమ ఆఫ్రికా రాజకీయవేత్తలందరూ ఒక్క తీరువారు కాదు. ఈ పద్నాలుగు రాజ్యాలను నడిపిస్తున్న వారిలో అతితరమైన తారతమ్యాలు ఉన్నాయి. వీరిలో కొందరి నిజాయితీ ఎటువంటిదంటే, వేలుపెట్టి చూపించడానికి వీలులేనంతటిది. మరికొందరు పట్టి దగుల్బాజీలు. అదేవిధంగా అత్యంతము నిజాయితీతో కూడిన పరిపాలనము ఈ రాజ్యాలలో కొన్నింటిలో సాగుతున్నది. పట్టి అవినీతి జుష్టమైన ప్రభుత్వము కొన్నింటిలో నడుస్తున్నది. రాజకీయవేత్తల లక్షణాలను అట్లా వదిలినా, యీ రాజ్యాలలో ఏకపక్ష ప్రభుత్వాల ఆవశ్యకతను గురించి నిరూపించడానికి కావలసినన్ని యుక్తులు ఉన్నాయి. ఈ రాజ్యాలలో జరుగుతున్న కొన్ని కొన్ని పనులను అధికార వ్యామోహం దృష్ట్యా, అర్థతృష్ణ దృష్ట్యా విడమరచి చెప్పవచ్చు. ఇది మామూలు విషయం. అధికారం ఉంటే, గౌరవం ఉంది. ధనం ఉంది. మరి ఆ అధికారం అల్పమైంది కాదు. ఇంతా అంతా అని చెప్పడానికి వీలులేనంతటిది. పశ్చిమ ఆఫ్రికాలో మంత్రులు చాలామంది తాము సర్వమైన ధర్మానుశాసనాలకు అతీతులము అనుకుంటారు. పోలీసు బలం గూడా వారిని అట్లానే చూస్తుంది. నిర్ణయాలు మొదలైనవి జరుగుతాయి అంటే, వానిలో పరమ నిరంకుశమైన ధోరణి విద్యమానం అవుతుంది. ఆ నిర్ణయాలు నిరంకుశంగా జరుగుతాయి. బాగా అభివృద్ధి చెందివున్న దేశాలలో క్రింది ఉద్యోగులకు వదిలిపెట్టే నిర్ణయాలను గూడా యీ దేశాలలో మంత్రులే చేస్తారు. ఈ చేయడంలో నిపుణుల సలహాలను గూడా తీసుకోరు. ఆ మంత్రుల ప్రతిష్ట పట్టరానిదిగా ఉంటుంది. తాము ప్రజాస్వామికవాదులం అని వీరిలో కొందరు అంటూ ఉంటారు. నడవడికలో చక్రవర్తుల్లాగా నడుస్తారు. వారే రాజ్యం, రాజ్యమే వారు అన్నట్లు ఉంటుంది. యూనిఫారంలు ధరిస్తారు. ఉండేందుకు

భవంతులు నిర్మించుకుంటారు. వాళ్ళు అట్లా పోతూఉంటే, రాకపోకలన్నీ ఇట్లా నిల్చిపోతాయి. విలాస విన్యాసాలకుకొదువ ఉండదు.వాళ్ళు మామూలుగా అనుకుంటూ ఉంటారు. అందరూ తమ్మ ఈజిప్టును పూర్వం పాలించిన ఫరావోలు అనుకోవాలి— అని. వారిని వలె తమ్ము చూడాలి—అని.

పశ్చిమ ఆఫ్రికా రాజ్యాల అధ్యక్షులలో నేమి, లేక ప్రధాన మంత్రులలో నేమి జనాకర్షణ గల, జనాదరణం గల వాళ్ళు వేళ్ళమీద లెక్కకు వస్తారు. ప్రజలలో వారిపట్ల వైరస్యము, ద్వేషము అధికము. అందువల్ల విరోధం పుడుతున్నది. వారు జనాన్ని అణు స్తున్నారు. అట్లా ప్రజలను అణచడం గొప్ప అని గూడా వారు అనుకుంటున్నారు. పశ్చిమ ఆఫ్రికా రాజకీయవేత్తలలో ద్వేషము, రోషము ఏస రేగుతూ ఉంటాయి. సామరస్యం వారి భాషలో లేదు. జనా దరణ ఉన్న నాయకత్వానికి సామరస్యం ఇది జీవగఱ్ఱ. అదే అక్కడ లేదు. అది ఉన్నచోట దమననీతికి చోటు ఉండదు.

ఈ కొత్త రాజకీయవేత్తలు ప్రజాస్వామ్యాన్ని నమ్మినవాళ్ళు కాదు. వారి జీవితంలో ఎప్పుడూ ఈ ప్రజాస్వామ్యపు వాసనలు గుబాళించలేదు. వారి అనుభవంలో దానికి స్థానం లేదు. వారు దానిని అనుభ వించలేదు. ప్రజాస్వామ్యానికి ఒక చరిత్ర ఉంది. ఒక తాత్విక లక్షణం ఉంది. ఈ రెండూ వారికి ఆకాశ పుష్పాలు. పదిహేను సంవత్సరాల క్రిందట, రాజ కీయాలు కొద్దిమందికి మాత్రం పరిమితమై ఉండేవి; రాజకీయవేత్తలు విధిగా గట్టిగా చదువు కున్నవాళ్లయి ఉండేవాళ్లు. బ్రిటిష్ విశ్వవిద్యా లయంలోనో, ఫ్రెంచి విశ్వవిద్యాలయంలోనో విద్యా భ్యాసం చేసిన వాళ్లయి ఉండేవాళ్లు. వారికి కొంత చరిత్ర, కొంత తాత్విక విజ్ఞానం, కొంత ప్రజా స్వామ్యం తెలిసి ఉండేవి. ఇప్పుడు పశ్చిమ ఆఫ్రికా రాజకీయాలలో యీ రకం మనుష్యులు చూద్దా మన్నా ఆట్టేమంది కన్పించరు. కొత్త రాజకీయ వేత్తలు—వీధి పాఠశాలల్లోంచి ఉద్భవిస్తున్నారు. ఐరోపా చరిత్ర వారికి తెలిసిన విషయం కాదు. వారు ఆట్టే తిరిగిన వాళ్లని కూడా అనలేము. తమ తమ దేశాలు విడిచి ఇంకో దేశం ముఖం ఎప్పుడు చూచిన వారు వీరిలో చెప్పుకో దగినంత మంది ఉండరు. అధికారంలోకి వచ్చిన తర్వాత సంగతి వేరు.అప్పుడు ఒక నాల్గు దేశాలు వీళ్ళు దర్శించి ఉండవచ్చు. వీరు అధికారంలోకి రాక పూర్వం ఆ దేశాలలో బ్రిటిష్ నిరంకుశత్వమో, ఫ్రెంచివారి నిరంకుశత్వమో ఏలు బడిలో ఉండేది. ఇప్పుడు వీరు తాము ఆ నిరంకు శత్వానికి వారసులం అనుకుంటున్నారు. పూర్వపు గవర్నర్లు, పూర్వపు జిల్లా కమిషనర్లు వీరికి ఆదర్శం. అదే పద్ధతిలో వీరు గూడా తయారై నారు. అంతకంటే వారికి వేరే యేమీ తెలియదు. అందువల్ల.

ఈ రాజ్యాలను గురించి ఒక్కమాట వింటూ ఉంటాము. ఆ మాట వింటే నిజంగా నవ్వు వస్తుంది. ఏకపక్ష రాజ్యం అన్నది ఆఫ్రికాలో పుట్టిందట. ప్రత్యేకం దాని అవతారం అక్కడే నట. ఆఫ్రికన్ వ్యక్తిత్వం, ఆఫ్రికన్ సమాజ పద్ధతి దానికి ఆధారాలట. ఈ 20 వ శతాబ్దంలో ఈ ఏకపక్ష రాజ్యం సర్వసామాన్య విషయం కానట్లు; ఇప్పుడు ప్రతిఖండంలోను ఈ ఏకపక్ష రాజ్యాలంటూ ఉంటూనే ఉన్నాయి. కొంతమంది ఈ ఆఫ్రికన్‌లంటే వేరే మనుష్యులని తమ్ము తాము వంచించుకుంటూ ఉంటారు. వారికి, ఇతరమనుష్యులకు సంబంధం లేనట్లు; ఇటువంటివారు మానవ సహజమైన సర్వ సభ్య ప్రమాణాలను వదిలిపెట్టి మాట్లాడుతున్నట్లు నాకు అనిపిస్తుంది. ఈ రకమైన అభిప్రాయం యొక్క ఫలితం ఏమిటంటే, ఆఫ్రికాలో ఏమి అయినా ఫరవాలేదని; మరి ఐరోపాలో గాని, ఉత్తర అమెరికాలో గాని అట్లాగే జరగడం అంటే, సహించనుకూడా సహించరు. ఆలోచించనుకూడా ఆలోచించరు.

పశ్చిమ ఆఫ్రికాలో యీ ఏకపక్ష రాజ్యాంగ పద్ధతి కాదన్నవాళ్ళు లేరని కాదు. చాలామంది ఉన్నారు. దాన్ని ప్రతిఘటించారు. ప్రతిఘటించినందుకు బలివేయ బడ్డారు. జైళ్లలో బంధింపబడ్డారు. ప్రవాస శిక్షకు గురియైనారు.వాళ్లను మరిచిపోకూడదు. ఇప్పుడుకూడా ధృతి, నిజాయితీ గలవాళ్ళు ఆ దేశాలలో లేకపోలేదు. ప్రస్తుతానికి అంతకన్నా మార్గం లేదని యీ ఏక పక్ష రాజ్యాంగ పద్ధతిని అంగీకరించి పూరుకుంటు న్నారు. ఈ విషయాన్ని గూర్చి ఇట్లా అనుకుంటే చాలదు. ఈ ఏకపక్ష రాజ్యాంగ పద్ధతి యొక్క

అర్హతను గురించిన బాగు వోగులేమో పరిశీలించడం అవసరం.

అనుకూలంగా చెప్పుతగింది

ప్రజాస్వామ్యం అంటే ఏమిటి ? ఎన్నికలు జరుగుతాయి.ఆ ఎన్నికలయొక్క ఫలితాలను అంగీకరించి నడుచుకునే భావం ప్రజలలో ఉంటుంది. అందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు. ప్రజాస్వామ్యం అంటే ఇది. ఈ ఎన్నికలు ధర్మంగా జరగాలి. ప్రజా సమూహములయొక్క ఇష్టం బాలెట్ పెట్టె ద్వారా తేల్చబడి, వారిని ఎవరు పరిపాలించడానికి అర్హులో పరమంగా నిర్ణయించడం ఇక్కడ ఉంది.

బాలెట్ పెట్టెల యొక్క ఫలితాలను అంగీకరించడానికి ఇష్టపడటం అనే దానిలో బహుజన సంబంధమైన సమ్మతి ఉంది. ఐకమత్యం యొక్క ఒకానొక విధమైన విలసనం ఉంది. అధికారం కోసం పోటీలు పడుతున్న, ప్రధానమని వారు భావిస్తున్న విషయాలపై తీవ్రమైన అభిప్రాయభేదాలు ఉన్నప్పుడు, అవతలిపక్షంవారిని అధికారంలోకి రానీయరానంతటి అభినివేశ ప్రకర్షకు కారణమైనంతగా ఆ అభిప్రాయభేదాలు ఉన్నప్పుడు, అక్కడ బాలెట్ పెట్టెలు ఏమి చెబుతున్నవి అన్న దానితో ప్రసక్తే ఉండదు. అక్కడ యీ బహుజన సమ్మతి అంటూ కూడా ఉండదు. లేబరుపార్టీ కన్సర్వేటివ్ పార్టీలు ఉన్నాయి! రిపబ్లికన్‌పార్టీ, డెమోక్రాట్ పార్టీ ఉన్నాయి. ఈపార్టీలు వోటమినిఅంగీకరిస్తాయి. అవతలి వాళ్లు అధికారంలోకి వచ్చి చేసే ఘోరం ఏమీ ఉండదని అక్కడ విశ్వాసం. ఇదే బహుజన సమ్మతి అంటే; ఐకమత్యం అంటే. ఇది లేనిచోట బాలెట్ పెట్టె ఉండిన్నీ లాభంలేదు.

బడుగు దేశాలలో ఆర్థిక సంబంధమైన అభివృద్ధిని తెచ్చిపెట్టాలి గనుక, అక్కడ పటిష్ఠమైన ప్రభుత్వాలు అవసరమని అంటూ ఉంటారు. మనం వింటూ ఉంటాము. వర్గ సమాజాలకు సంబంధించినంతవరకు అది అంతే. ఆసియాలోను, మధ్య ప్రాచ్యంలోను కొన్ని ప్రాంతాలలో భూస్వాములు రైతుమాత్రుడికి ఏమీ మిగలకుండా, ఆ రైతు పండించిన పంటలో సగానికి సగం పుచ్చేసుకుంటూ ఉంటారు. అటువంటి చోట రైతుకు ప్రోత్సాహం ఇవ్వడానికి భూమి సంస్కరణల అవసరం ఉంది. దక్షిణ అమెరికా దేశాలలో చాలాచోట్ల పెద్ద పెద్ద భూస్వాములు సారవంతమైన భూములను తమ భుక్తంలో ఉంచుకొనడం ఉంది. అటువంటి చోట్ల మామూలు రైతులు కొండల వెంట, గుట్టల వెంట పడి పొట్టకూటి కోసం నేలను గీక్కుని నానా అవస్థలు పడుతూ ఉంటారు. పరిస్థితి ఇట్లా ఉన్నప్పుడు అభివృద్ధి కోసం రాజకీయ కార్యాచరణం ఆవశ్యకం అవుతున్నది. పశ్చిమ ఆఫ్రికా ఇటువంటిది కాదు. ఇక్కడ భూస్వాములు లేరు. తెల్లజాతి జనం ఇక్కడ వలస త్రొక్కుకోలేదు. ఆర్థికమైన అభివృద్ధిమీద అంకుశాలు ఉన్నాయంటే అవి రాజకీయ సంబంధమైనవి కావు.

తమ ప్రజలకు ఆధునాతన లక్షణాలు అబ్బాలి అంటే, పశ్చిమ ఆఫ్రికా ప్రభుత్వాలు బలవంతపు పద్ధతులకు దిగవలసిన అవసరంలేదు. ఆధునాతన లక్షణానికి కీలకం విద్యలో ఉంది. ఇక్కడ జనం తమ పిల్లలను బడులకు పంపించి ప్రభుత్వాలను చీకాకు పెడుతున్నారు. ఆ బడులు చాలవు. వ్యవసాయంలో శాస్త్ర పద్ధతులను అనుసరించాలని కొన్నిచోట్ల ప్రభుత్వాలు రైతును బలవంతం చెయ్యవచ్చు. అట్లా చేయాలన్న భావం ఆ ప్రభుత్వాలకు కల్గవచ్చు. మంచి ఎరువులు వాడాలని, మేలిరకం విత్తులు ఉపయోగించాలని, సహకార సంఘాలలో, సమిష్టి వ్యవసాయ క్షేత్రాలలో చేరాలని బలవంతం చేయవచ్చు. కాని అట్లా చేయడం తెలివికాదు. రష్యాలో, చైనాలో ఇది అంతా జరిగింది. కాని సాధించింది ఏమీ లేదు. ఆర్థికమైనఅభివృద్ధికి వ్యవసాయంలోఅభివృద్ధి, అధికోత్పత్తి ప్రాణం; అత్యంత ముఖ్యం. మరి దీనిని సాధించడానికి విద్య, ఆదర్శము, ఆర్థికరూపమైన ప్రోత్సాహము తప్ప మార్గం అంటూ లేదు.

అభివృద్ధి నిమిత్తం ఎత్తుకోవలసిన నియంత్రణం ఒక్కటే ఉంది. అది పన్నులు విధించడం. ఇది ముఖ్యమైంది. పశ్చిమ ఆఫ్రికా ప్రభుత్వాలు తమ తమ దేశాల జాతీయ ఆదాయాలలో 15 మొదలు 20 శాతం దాకా పన్నులను విధించి ప్రజలకు సౌకర్యాల కోసము, పెట్టుబడి నిర్మాణము కోసము ఆ వచ్చిన మొత్తాన్ని వినియోగించవలసి ఉంది. ఇప్పుడు అట్లా జరగడంలేదు. ఇక్కడ చాలా

దేశాలలో ఈ పన్నులు జాతీయ ఆదాయాలలో 10 శాతానికి మించి ఉడటంలేదు. ఈ ప్రభుత్వాలు గనుక పన్నులను త్వరితగతిని హెచ్చుచేయగల్గితే, ఈ రాజ్యాలలో ఏకపక్ష ప్రభుత్వాలు ఏర్పడినందుకు ఒక సార్థక్యం ఒనగూడుతుంది. ఆ ప్రభుత్వాలు తగునని చెప్పడానికి ఒక ఉపపత్తి కుదురుతుంది. అయితే మార్పు ఎప్పుడూ తొందరగా, హఠాత్తుగా సాధ్యమై వచ్చే విషయంకాదు. ఆర్థికలభివృద్ధి, సమకూర్చే ప్రోత్సాహ ప్రోద్బలాలమీద ఆధారపడిఉంటుంది. పన్నులు పోను ప్రతి శీర్షస్య ఆదాయం ఎంతో, దాని కన్నా ఎక్కువ ప్రతి శీర్షస్య వస్తూత్పత్తి అధికంగా పెరగదు. పెరగదు కాదు. పెంచలేము. పన్నులవల్ల ఆదాయాన్ని తొందరగా పెంచుకో చూడటం ప్రోత్సాహ కారణాన్ని చంపడమే అవుతుంది. అభివృద్ధికి ప్రతిబంధకం అవుతుంది. బహు రాజకీయపక్షాలు ఉన్న చోట్లలో ఎట్లాగో అట్లాగే అవి లేని ఏకైక రాజకీయపక్ష ప్రభుత్వాలు చలామణిలో ఉన్న చోటులలో కూడా ప్రజలలో వైమనస్యాన్నిరెచ్చగొడుతుంది. ఘనాలో ఇటీవల యిటువంటి ప్రయత్నం ఒకటి జరిగింది. అంతే, సమ్మెలు జరిగాయి అల్లర్లు చెలరేగాయి. ప్రజలు వద్దన్న పన్నులను ప్రభుత్వం రద్దుచేయవలసి వచ్చింది.

ఆర్థికమైన అభివృద్ధి మూలంగా ఏదో సంక్షోభం సంప్రాప్తమవుతుంది కాబట్టి దాన్ని తట్టుకోడానికి ఏకపక్ష ప్రభుత్వం ఆవశ్యకమవుతున్నది అన్న వాదం ఒకటి ఉంది. మార్పు అంటేనే ఆయాసం; అందులో సంక్షోభం ఉంది. రైతులు ఎక్కువ ధరలు కావాలంటారు. అందుకోసం వారు సంఘాలు కట్టుకుంటారు. కార్మికులు కూలీ పెరగాలంటారు; వీధిబడులలో పరీక్షలు ఇచ్చినవారు పెద్ద చదువులకోసం పట్టణాలకు ఎగబడుతూ ఉంటారు. ఇక నిరుద్యోగుల సంగతి చెప్పనే అక్కర్లేదు. వారు సహాయం కోసం అంగలారుస్తూ ఉంటారు. ఇక్కడ అధికార దాహంతో నీతి నియమాలు లేనివారు వ్యక్తిగతమైన అధికారం కోసం ఉపయోగించుకొనడానికి అస్కారం కాగల సాధన సామగ్రి ఇంధన ద్రవ్యం ఎంతో అమరి ఉంటున్నది. ఏకపక్షం ఈ ఉద్రేకాలను అదుపులో పెట్టడానికి ప్రయత్నిస్తుంది. ట్రేడ్ యూనియన్‌లు ఇక్కడ ఆ పార్టీకి చెందినవే అయిఉండాలి. కర్షక సంఘాలు, యువజన వ్యవస్థలు, మహిళల కూటములు, ఇంకా తదితరమైన సంస్థలు అన్నీ— పార్టీ చట్రంలో ఉండి పనిచేయాలి. ఇందుకు కారణం ఉంది. ఇవి అన్నీ ఉద్రేక స్థావరాలు. వీటిని అదుపులో పెట్టడమే కాక, సర్వమైన వైమత్యాల మీదను ఒక కన్ను వేసి వుంచడానికి, పార్టీ నాయకులు సహేతుకమని అనుకున్న తీర్మానాలను వివిత వర్గాలుకూడా ఆమోదించేట్లు చెయ్యడానికి ఇట్లా అయితే సాధ్యం కాగలదన్న అభ్యూహతో ఇది అంతా చేయబడుతుంది.

ఇచ్చట ఈ స్థితిలో విజయం పూర్ణంగా లభిస్తున్నదని చెప్పలేము. ఆ విజయం పాక్షికంగా మాత్రమే ఉంటున్నది. ట్రేడ్ యూనియనిస్టులు వారు యదార్థంగా ట్రేడ్ యూనియనిస్టులే అయితే, పార్టీ పెట్టే ఒద్దీలను నిరసిస్తారు. స్వతంత్ర కార్యాచరణం కావాలని పట్టుబడతారు. ఆ హక్కు తమకు కావాలని కూర్చుంటారు. రైతుల మనోభావం కూడా ఇందుకు భిన్నంగా ఉండదు. ప్రజలు ఉన్నారంటే తమ స్థితిగతులు ఏమాత్రమున్నా బాగాలేవని వారిని అనుకోకుండా యీ పార్టీ ఆపలేదు.

ఇది ఒక మానదండం వంటిది. ఒక కొసను— సాలజార్‌గారి పోర్చుగల్‌లో వలె—స్తబ్ధత, శాంతి ఉండవచ్చు. మరి ఒక కొసను,—స్టాలిన్‌గారి రష్యాలో వలె,— మార్పు, కారావాసము, సంహారము ఉండవచ్చు. ఈ మార్పు త్వరగా కల్గినదైనప్పుడు, ఏకైక రాజకీయ పక్షము ఉద్రేకాలను, సంక్షోభాలను నివారించలేదు. అది చేయగల్గినదల్లా ఒక్కటే. సర్వమైన ఆందోళనను నిర్దాక్షిణ్యంగా అణిచివేయడం. అప్పుడు ఆ అసంతృప్తి ఏమవుతుంది ? అంతరంగికంగా ఆ పార్టీ వైపునకు మళ్ళుతుంది. అది జరిగినప్పుడు ఆ పార్టీ కూడా స్థిమితంలేనిదై పోతుంది. దానికి నిలకడ చిక్కదు. ఇది కారణంగా ప్రతిఘటనను పూర్తిగా కాలరాచివేద్దామన్న యత్నం అధికం అవుతుంది. ప్రతిఘటిస్తున్నవారు అజ్ఞాతవాసంలోనికి వెడతారు. ప్రతిఘటన అజ్ఞాతస్థితి పొంది సాగుతుంది. మధ్యే మధ్యే హింసానిష్ఠురమైన ప్రదర్శనల రూపంలో ప్రబద్ధలవుతూ ఉంటుంది.

ప్రజాస్వామ్యం కావాలనడం, అది ఈ సంక్షోభాలను నివారిస్తుందని కాదు; అది చర్చకు అవకా

కాశం యిచ్చి, దమననీతిని అనుసరించి సాధించగల సమాజంకన్నా ఉన్నతమైన, నిరుపద్రవమైన సమాజాన్ని సృష్టిస్తుంది. బాధ్యతల విభక్తి వలన సంఘర్షణ గూడా విభక్తం అవుతుంది. మన అందరి యోగక్షేమాలు ఒక్కటే కాదు. వేరువేరు. ప్రతి ఒక్కరము వేరువేరు వర్గాలకు చెందినవాళ్లము. ఒక మనిషి ఒక అందుకు మనకు ఇష్టుడు కాక, మనచే ప్రతిఘటింపబడినా, ఇంకో అందుకు ఇష్టుడై మనచే మన్నింపబడటము ఇక్కడ ఉన్నది. ఇందుమూలంగా మన తగాదాలు ఏమో అవి మన ఆవేశముల వెంబడి పరుగులు వారడంలేదు. ఆ పద్ధతి ఇచ్చట ఈ ఇష్టాయిష్ట సమ్మిశ్రణము వలన నివారించబడుతున్నది. సంఘర్షణను ఇట్లా అదుముకొనడము దానియొక్క తీవ్రతను కేంద్రీభవించ చేసుకొని ఏకపక్ష నిష్ఠము చేయడము వాంఛనీయము కాదు. ఇప్పుడు పశ్చిమ ఆఫ్రికా దేశాలు ఉన్నాయంటే, అక్కడ రాజకీయ వేత్తలు అనుభవశూన్యులు. అవర ప్రమాణులు. నీతి నియమాలు తక్కువ. అటువంటి స్థితి ఉన్నచోట రాజకీయమైన ఆలోచనకు, స్వతంత్రమైన విమర్శకు ఆధారాలు ఉండాలి. ఇది చాలా ముఖ్యం. మరి తమ మనుగడకు వీరు రైతుల స్వేచ్ఛను, ట్రేడ్ యూనియన్ల స్వాతంత్ర్యాన్ని, విశ్వవిద్యాలయాల హక్కులను, క్రైస్తవ దేవాలయాల ఇష్టాన్ని బ్రతకనీయడం శ్రేయస్కారి కాదనుకుంటున్నారు. సమాజ సంబంధమైన ఏ సంస్థయొక్కగాని స్వాతంత్ర్యాన్ని వీరు నిల్వనీయడంలేదు. అన్నింటిని పార్టీ అదుపులోకి తెచ్చిపెడుతున్నారు. వీరి చేతుల్లో ప్రజాస్వామ్యం ఊషరక్షేత్రం అయిపోతున్నది. దానికి వీరు సామాజిక శాంతి అని నామధేయం ఉంచుతున్నారు.

క్లుప్తంగా చెప్పాలంటే ఏకపక్ష రాజ్యాంగ ధర్మం, అభివృద్ధిని త్వరితగతిని సాధించడంకోసము, సంక్షోభాలను అదుపులో పెట్టడము కోసము, అవసరం అంటున్నారు. ఈ రెండు అభ్యూహలనే అందుకు ఆధారం చేస్తున్నారు. వీనిలో మొదటి అభ్యూహ అసత్యం, కృత్రిమం. రెండవది అనుమానాస్పదం; అవాంఛనీయం. పశ్చిమ ఆఫ్రికా ఎదుర్కొంటున్న వర్తమాన కాలిక ఆర్థిక సమస్యలకు ఏకపక్ష రాజ్యాంగ పద్ధతి పూర్తిగా అనుపపన్నం. అది ఇక్కడ అన్వయించదు.

పశ్చిమ ఆఫ్రికా దేశాలలో ఆర్థిక విధానంగాని విదేశాంగనీతిగాని ప్రధానమైన రాజకీయ సమస్య కాదు. ఆ దేశాలలో నానా తెగలకు చెందిన జనం ఉన్నారు. ఆ తెగలను అన్నింటిని కలుపుకొని ఆ దేశాలు జాతులుగా ఏర్పడవలసి ఉంది. ఒక్కొక్క దేశంలో అనేకమైనతెగలుఉన్నాయి. ఆర్థికంగా ఈఅన్ని తెగల అంతస్థూ ఒక్కటి కాదు. తెగను గూర్చిన దురభిమానం అధికం. ఇదీ, ఆర్థిక సంబంధమైన అసమస్థితి కలిసి, పరస్పర విరోధాలను, వైరుధ్యాలను సృష్టిస్తూ ప్రతి ఒక్క రాజ్యంయొక్క సుస్థితికి ప్రమాదకారణాలుగా పరిణమిస్తున్నవి.

పరస్పరమైన యీ విరోధాల మూలంగా ఒక పని జరుగుతున్నది. ఆ దేశాలలో ఏ రాజకీయ పక్షానికి ఆ పక్షం ఒక ప్రత్యేక ప్రాంతం స్థావరంగా నిలువ ద్రొక్కుకుంటున్నది. కొన్ని తెగలు ఆ పార్టీని బలపరుస్తాయి.మరికొన్ని తెగలు దానితో విరోధం చేస్తాయి. లేదా ఉదాసీనంగా ఉంటాయి. ఇది ఒక అదృష్టం. ఇక అన్ని తెగలు బలపరచే ఏకైక రాజకీయ పక్షం అంటూ ఏర్పట్టం జరిగేపని కాదు. జరుగుతుంది అనుకొనడం వట్టి కల. హెపోయెట్‌బోయ్‌నీ గారి పార్టీ ఉన్నది. ఈపార్టీ తక్కిన పార్టీలకన్నా నాడెం; చాలా తెగలు దీనిని బలపరుస్తున్నాయి. అయితే ఇందులో కూడా తెగల తగాదాలు తెగలేదు. దాని వ్యవస్థకు ఈ తెగలు ఆధారం; ఆబిడ్జాన్‌లో కూడా ఇంతే. ఇది రాజధాని. ఇక్కడ ప్రతి తెగకు చెందిన వారు నివసిస్తున్నారు. ఇక్కడ పార్టీ వీధినిబట్టీ, జిల్లానుబట్టీ గాక, తెగలనుబట్టీ ఏర్పడిఉంది. పశ్చిమ ఆఫ్రికాలో కుటుంబము, గ్రామము, తెగ—ఇవి సామాజిక విభాగాలు. ప్రతి దేశంలోను రెండు మూడు రాజకీయ పక్షాలు ఉంటాయి. ఇవి ప్రాంతం వారీగా తెగలు ఆధారంగా ఏర్పడ్డవి. ఈ పార్టీలలో ఈ పార్టీలకు విరోధం ఉండాలని లేదు. ఒక పార్టీని ఇంకో పార్టీ సహిస్తూ ఉంటుంది. ఇందుకు రెండు కారణాలు ఉన్నాయి. (1) కేంద్ర ప్రభుత్వంలో ఈ అన్ని పార్టీలు భాగస్వాములై ఉండాలి. (2) ధనిక ప్రాంతాలపై నిర్ధనిప్రాంతాల సుఖం కోసం పన్నులు విధించకూడదు. ఇందులో మొదటి కారణం కోసం మిశ్రమ ప్రభుత్వాలు అవసరం అయినాయి. రెండవదాని కోసం ఫెడరల్ పద్ధతి వాంఛనీయం అయింది.

ఇచ్చట మిశ్రమ ప్రభుత్వాల ఏర్పాటు కావలయుటకు ఇంకో అవసరం కూడా ఉంది. ఎక్కడగాని అధిక సంఖ్యాకులైన ప్రజలు, రాజకీయంగా చైతన్యము కలిగిఉన్న ప్రజలు ఇతరులచేత పరిపాలింపబడటాన్ని అంగీకరించరు. ప్రభుత్వం అనగా తారతమ్యములు గల పన్నులు ఉంటాయి. ఉద్యోగాలు ఉంటాయి. పబ్లిక్‌వర్క్సు మీదను, పాఠశాలల మీదను, పరిశ్రమల మీదను, ఇంకా ఇతరమైన పనులమీదను డబ్బు వెచ్చించవలసిన సందర్భాలను పురస్కరించుకొని నిర్ణయాలు చేయవలసిఉంటుంది. ప్రతిపక్షాలలో చేరిఉండటం అంటే,యీ నిర్ణయాలతో సంబంధంలేకుండా నిరామయంగా ఉండటం అని అర్థం. ఇందులో ఆర్థిక సంబంధమైన నష్టం కూడా ఇమిడిఉంది. అన్ని పార్టీలు కలిస్తే అప్పుడు మిశ్రమ ప్రభుత్వాలు అనవసరం. అన్ని ప్రాంతాలున్నూ సమమైన ఆర్థిక స్థితి కల్గినవి అయినప్పుడే ఇట్టిది సాధ్యమవుతుంది. అట్లా కాని పక్షంలో ధనవంతమైన ప్రాంతం కలిసిరాదు. తన ప్రత్యేకత తనకు ఉండాలంటుంది. ఆత్మరక్షణ కోసం అట్లా అనక తప్పదు. అటువంటి సందర్భంలో కలిసిపోవడాలు కుదరవు. మారుటానియా మాలీ వంటి చోట్ల ఆయా పార్టీలు స్వచ్ఛందంగా ఏకం అయిపోయినాయి. అక్కడ అది సాధ్యం. అంతేగాని, ఇదే ఏ ఘనాలోనో, లేక దహోమీలోనో జరగాలంటే జరగదు. జరగలేదు.

ధనవంతమైన వర్గాలు ఎప్పుడూ ఫెడరల్ పద్ధతి రాజ్యాంగాన్ని వాంఛిస్తాయి. అప్పుడు దేశములో ఇతర ప్రాంతాల అభివృద్ధికి తాము సమకూర్చవలయు ధనం పరిమితం అయి ఉండటానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఆ ఇతర ప్రాంతాలకన్నా యీ ధనికవర్గం ఉన్న ప్రాంతం, తన ఉన్న ఆ ప్రాంతంలో ప్రజోపయోగి కార్యక్రమాలమీద ఎక్కువ డబ్బును ఖర్చుపెట్టగల్గుతుంది. అన్నిచోట్ల ఒకేవిధంగా ఉండాలంటే, యీ ధనిక ప్రాంతంలోని ప్రమాణాలు తగ్గుతాయి. తక్కిన ప్రాంతాలతో సమానమైనస్థాయికి తగ్గవలసి ఉంటుంది. పైగా ఇక్కడ తన ప్రాంతం ఖర్చులనే గాక, అవతలి ప్రాంతాలలో పనులకు అయ్యే వ్యయాన్ని గూడా భరించవలసి ఉంటుంది. నిర్ధనములైన ప్రాంతాలు మొత్తం ప్రాంతంలో అల్పసంఖ్యాకమైనవైతే ఇబ్బంది లేదు. కాని అట్లా ఎక్కడా ఉండదు. ధనిక ప్రాంతాలే అల్పసంఖ్యాకంగా ఉంటాయి. ఆ ప్రాంతాలు, అంతా ఒకేపోతపోసిన విధంగా ఉండే సమాన స్థాయి పద్ధతిని అంగీకరించవు. నిరసిస్తాయి.

ఇప్పుడు ఆయా పార్టీల విలీనానికి ఇట్లా ఆర్థిక సంబంధమైన హెచ్చు తగ్గులు అడ్డం వచ్చినప్పుడు ఫెడరల్ రాజ్యాంగము, అందులో మిశ్రమ ప్రభుత్వము, కాకపోతే రాజకీయమైన సంఘర్షణమే మార్గాంతరం. ఏకపక్ష రాజ్యాంగ పద్ధతిని గొప్ప చేస్తున్నవారు ఇది ఇట్లా అని అంగీకరించరు. ఇందుకు పూర్తిగా సద్వ్యతిరిక్తంగా వాదిస్తారు. ఒక దేశంలో జాతి అన్నది రూపు పొందాలి అంటే, తెగలకు సంబంధించిన అభిప్రాయభేదాలు సమసిపోయేట్లు చూడాలి. అధునాతనమైన స్థితిని పొందడం అంటే, తెగకు అతీతమైన స్థితిని పొందాలి. అక్కడ తెగకు, భాషకు, మతానికి, రాజకీయమైన ప్రత్యేకత ఏమీ లేదు. అప్పుడు అందరూ ఒకేజాతికి చెందినవారు అవుతున్నారు. అక్కడ జాతీయతకు తప్ప మరి దేనికి విధేయతను చూపనవసరం లేని పద్ధతి ఏర్పడుతుంది—ఇట్లా వాదిస్తారు.

వీరు ఇంకా ఇట్లా గూడా అంటారు. పైన చెప్పిన'దానికి ఫెడరలిజం ఒక ప్రతిబంధకం. ఈ ఫెడరలిజంలో ఆంతరంగిక విభేదాలను గుర్తించడము వాటిని మూర్తి కట్టించడము ఉంది. బహుపక్ష పద్ధతి అంటే, అది ఇంతకన్నా హేయమైంది. ఎందుచేతనంటే, అందులో ప్రతి ఒక్క రాజకీయ పక్షము తాను ఏ అభిప్రాయభేదాలను పట్టుకొని ఏర్పడి ఉన్నదో వానిని పట్టుకొని ప్రేళ్లాడటానికి ప్రయత్నం చేస్తుంది. అందువల్ల దేశం అంతటా వ్యాప్తిని పొందివున్న ఒకే ఒక పక్షం ఉండి ఆ పక్షం ఒక కేంద్రప్రభుత్వం ద్వారా పనిచేస్తూ ఉన్నప్పుడే తెగల తత్వాన్ని తెగనాడి, అఖండమైన, జాతీయమైన ఐకమత్యం కోసం కృషిచేసి దానిని సాధించగల్గుతుంది.

ఈ మాటలు బాగానే ఉంటాయి. అవి గొప్ప మాటలు కూడాను. అయితే యీ మాటలకు అర్థం అంటూ కుదరాలి అంటే, అది ఆ ఏకపక్షం నిజంగా తెగల తత్వాన్ని అధిగమించి, దానికి అతీతమై

వ్యవహరించగల్గి ఉండాలి. తెగలమధ్య ఆర్థిక తారతమ్యాలు ఉన్నవో లేవో అన్న స్థితిలో ఉన్నప్పుడు ఆ పార్టీ పైన పేర్కొన్న విధంగా చేయగల్గుతుంది. కాని ఆ తారతమ్యాలు ఎక్కువ అయినవైనప్పుడు అట్లా చేయడం సాధ్యంకాదు. ఉన్నతమైన భావాలకన్నా, ఆర్థిక సంబంధమైన అభినివేశాలు బలమైనవి. శక్తివంతమైనవి. ఏకపక్ష పద్ధతి చెల్లుతూ ఉన్నప్పుడు కూడా ఆ పక్షం బడుగు ప్రాంతాలను నెత్తిన పెట్టుకొని మోయవలసిందని చెప్పి ధనిక ప్రాంతాలను ఒప్పించలేదు.

ఇటువంటి సందర్భాలలో ఫెడరల్ రాజ్యాంగ పద్ధతిలో ఏకపక్ష ప్రభుత్వ వ్యవహారం ఎట్లా ఆలోచించినా బాగా ఉండేట్లు తోస్తుంది. అయితే ఇక్కడ ఒక చిక్కు వుంది. ఈ ప్రభుత్వాధికారంయొక్క కేంద్రస్థానం ఆదేశంలోని ధనికప్రాంతం అయి ఉండాలి. లేకపోతే ఇది కూడా కుదరదు. అధికారం యొక్క కేంద్రం ఆ దేశంలోని నిర్ధని ప్రాంతాలమీద ఆధారపడివున్న పక్షంలో అయితే, అప్పుడు ప్రాంతీయ ద్రవ్యాధారాలకు బదులు ఫెడరల్ ద్రవ్యాధారాలను వినియోగం చేయాలన్న వ్యామోహం అధికతరం అవుతుంది. నిర్ధనులు ధనికులకంటే ఎప్పుడూ అధికంగా ఉంటారు. (అట్లాలేని పక్షంలో సమస్యఅంటూనే లేదు.) అప్పుడు అధికారంయొక్క కేంద్రస్థానం నిర్ధని ప్రాంతాలమీదనే ఆధారపడివుంటుంది. ఈ కారణంచేత ఫెడరల్ పద్ధతి రాజ్యాంగంలో ఏకపక్ష ప్రభుత్వ పద్ధతి కూడా అవశ్యకం అయిపోతున్నది.

ఇటువంటి సమస్య పశ్చిమ ఆఫ్రికాలో కొన్ని రాజ్యాలలోకన్నా కొన్నిరాజ్యాలలో తీవ్రంగా ఉంటున్నది. దక్షిణ ప్రాంత దేశాలలో ఇది ఎక్కువ. ఉత్తరప్రాంతపు దేశాలలో తక్కువ. ఉత్తర దేశాలలో భౌగోళికంగా కొంత సంవాదంవుంది. అవి అన్నీ దాదాపుగా బీద దేశాలు. దక్షిణ దేశాలలో అట్లాకాదు. ఈ దేశాలలో వర్షపాతం 100 అంగుళాల మొదలు 30 అంగుళాల వరకు తారతమ్యం కల్గి ఉంటుంది. ఈ దక్షిణ దేశాల ఉత్తర ప్రాంతాలలోఈ వర్షపాతం 30 అంగుళాలదరిదాపుల్లో ఉంటుంది. దక్షిణ ప్రాంతాలలో 100 అంగుళాల దాకా పడుతుంది. ఇందుమూలంగా ఆర్థిక సంబంధమైన తారతమ్యాలకు ఆ దేశాలు ఆలవాలం అయిపోయినాయి. ఆర్థికంగా అసమస్థితి ప్రవర్తిల్లుతున్నది. ఖనిజ సంపద విషయంలో కూడా ఇటువంటి తేడాలు ఉన్నాయి. ఈ తేడాలు తగాదాలను తెస్తూ ఉంటాయి. గనులవలన ప్రత్యక్షంగా లాభాలు పొందేవారు ఆట్టేమంది ఉండరు.అదీ ఇందుకు కారణం. ఇప్పుడు యీ పశ్చిమ ఆఫ్రికా దేశాలలో నైజీరియా, దహోమీ, టోగో, ఘనా, లైబీరియా, సియెరాలియోన్‌లలో ఆర్థికసంబంధమైన తారతమ్యాలు రాజకీయ వ్యవహారాలలో తీవ్రతర పరిస్థితులకు కారణములై పోతున్నాయి. గినీ, సెనెగల్ మొదలైన మిగిలిన ఇతర దేశాలలో అట్లా కావడంలేదు.

బ్రిటన్ ఫ్రాన్సు మొదలైనటువంటి దేశాలలో ఐకమత్యము, ఏకత్వభావము అన్నవిశతాబ్దాలుగా చెల్లుబడి అవుతూ వున్న కారణంచేత, ఫెడరల్ పద్ధతి పరిష్కారం అనగానే వారిలో నైసర్గికంగానే ఏవగింపు కల్గుతుంది. ఆఫ్రికా దేశాలు ఫెడరలిజంను అవలంభించతగినంత ఉన్నతి కల్గినవి కావని, ఈ దేశాలలోని ప్రజలు అంటారు. ఫెడరల్ పద్ధతి అనగానే ప్రభుత్వం రెండు స్థాయిలలో నడపవలసి ఉంటుంది. అందుకు తగిన రాజకీయ దక్షతగాని, పరిపాలనా సామర్థ్యంగాని యీ ఆఫ్రికా దేశాలకు

లేవని కూడా బ్రిటన్‌లోనివారు, ఫ్రాన్సులోనివారు భావిస్తారు. ఈ రాజ్యాలు గనుక ఒక్కటిగా ఉండగల్గాలి అంటే, అందుకు కేంద్రాయత్తమైన కార్యాచరణమునకు, ప్రయోజనములకు సంబంధించిన అనుభవ విశేషం గూడా వారికి అవసరమని వీరి భావం.

ఇప్పుడు ఈ పశ్చిమ ఆఫ్రికా రాజ్యాలు చిన్నవి అనడం సబబుకాదు. నిజంగా ఆ రాజ్యాలే గనుక చిన్నవి అయితే, ఏ సమస్యాలేదు. ఈ దేశాలు పెద్దవి, విశాలమైనవి అయి ఉండటమే ఇక్కడ ఇన్ని చిక్కులకు కారణం. పైగా ఇచ్చట భౌగోళికమైన తేడాలు తారతమ్యాలు ఉన్నాయి. జనాభా పెద్ద విశేషంగా లేకపోవచ్చు; దేశం విశాలం కావడం మూలంగా కొన్ని రకాల సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఇవి ప్రత్యేకమైన లక్షణం కలవి. ఒక దేశం అతి విశాలమైన దైనప్పుడు, ఆ దేశంలోని వివిధ ప్రాంతాల మధ్యను తార తమ్యాలు అంటూ ఉన్నప్పుడు, ఒక పట్టణంనుంచి ఆ దేశాన్ని పాలించడం సుఖతరంకాదు. పైగా ఇక్కడ ప్రభుత్వం సర్వ విధానాలనుగూర్చిన నిర్ణయాలను తానే చేయడంగా పెట్టుకొని, ఈ నిర్ణయ వ్యవహారంలో గుత్త పద్ధతిని అవలంబించినప్పుడు ఆ ఏలుబడి మరీ కష్టతరం అవుతుంది. ఇక్కడ రాజకీయాలకు సంబంధించిన సమస్యలను అట్లా వుంచివేసి, పరిపాలనా సంబంధమైన వ్యవహారాలనుమాత్రమే తీసుకొని చూచినా, అధికార వికేంద్రీకరణం జరిగి, స్థానికులకు కూడా నిర్ణయాలు చేసే బాధ్యతలను అప్పగించడమే సరియైన మార్గంగా తోస్తుంది. కాని పశ్చిమ ఆఫ్రికా దేశాలలో ఇప్పుడు ఇట్లా జరగడం లేదు. ఈ దేశాలలో ప్రభుత్వాలు అధికతరంగా కేంద్రీకృతమై ఉన్నాయి. బ్రిటన్ ఫ్రాన్సులు ఉన్నాయంటే, స్వపరిపాలనను పెద్దగా అభివృద్ధి పరచలేదు. విఫలం అయినాయి. అధికారాన్నంతా తమ చేతుల్లో ఉంచుకోవాలని యీ రెండు దేశాలు తాపత్రయపడి అట్లా చేశాయి. తెగలకు సంబంధించిన సమితులు, గ్రామాలకు సంబంధించిన మండలులు వున్నా, వానికి అధునాతనమైన స్థానికస్వపరిపాలనంలో అనుభవం అన్నది ఏ కోశానాలేదు. స్థానిక ప్రభుత్వాలు ప్రజలకు ఏరకమైన సౌకర్యాలను చేకూర్చాలో వానికి తెలియదు. అందువల్ల, ఇక్కడ ఫెడరలిజం అన్న దాని సంగతిని అట్లా ఉంచినా, కేంద్ర ప్రభుత్వం మధ్య, ప్రాంతాలమధ్య విధి విధానాల పునఃపరిష్కృతి అవసరం అవుతున్నది. అవసరం అవడమేకాదు, వాంఛనీయం అవుతున్నది

ఫెడరలిజం అన్నది చాలా పెద మాట. ఒక్క నైజీరియాను మినహాయిస్తే, యీ దేశాలలో ఎక్కడగాని అమెరికా పద్ధతి ఫెడరలిజము పనిచేయదు. ఆ పద్ధతిని ఈ దేశాలవారు వాంఛించడంలేదు. ఏదో ఒక పద్ధతిలో అధికార వికేంద్రీకరణం జరగాలనిమాత్రమే వాంఛిస్తున్నారు. ఇటువంటి దేశాలలో పటిష్ఠమైన కేంద్రమేగాక, సమర్థమైన ప్రభుత్వాలు రాష్ట్రాలలో గూడా ఉండాలి. ఇందులో విప్రతిపత్తిలేదు. ఇప్పుడు ప్రభుత్వాలు ఉన్నాయి అంటే, అవి నిర్వహించవలసిన విధులు అనంతంగా ఉంటున్నాయి. ఆ కారణంచేత అటు కేంద్రానికి, ఇటు రాష్ట్రాలకు యీ అధికారాలనిర్వహణ విషయంలో ఎంతో అవకాశం వుంది. పటిష్ఠమైన కేంద్ర ప్రభుత్వం అంటూలేని పక్షంలో దేశాన్ని ఒక్క త్రాటిమీద త్రిప్పడం అన్నది కష్టం అయ్యేమాట నిజమే. అంటే అందరికీ సమ ప్రయోజనాలను ఒనగూర్చే అన్ని రంగాలలోను ధైర్యంతో, ఉపజ్ఞతో పనిచేయగల కేంద్ర ప్రభుత్వం అవసరమేనని అర్థం. అయితే ఆ దేశంలో ప్రబలమైన ప్రాంతీయ లేక రాష్ట్రీయ తారతమ్యాలు అంటూ ఉన్నప్పుడు, ఆ రాష్ట్రాలకు వాటి సంగతి ఏమిటో అవి చూచుకోగల విసులుబాటును కల్పించవలసిన పని కూడా ఇక్కడ ఉన్నది. అట్లా చేసినప్పుడే రాజకీయమైన ఐక్యానుసంధానం వారి అనుభవానికి గూడా వస్తుంది. దీన్ని ఫెడరలిజం అంటారా, అనండి; అభ్యంతరం లేదు. అట్లాకాక అధికార వికేంద్రీకరణ అంటారా, అన్నండి; అంతకన్నా అభ్యంతరంలేదు. [సశేషం]

[ఎన్‌కౌంటర్ సౌజన్యంతో]

స్వప్న వాస్తవదత్త

శ్రీ సోమసుందర్

ఆహో చీకటీ !
అనంత పరివ్యాప్త క్రుద్ధభృకుటీ !
ఎంత ప్రశాంత సాధువర్తన వయ్యా వీరాత్రి;
నా చేతిలోని కిమిడిన అపరూప గ్రంధానివిగా
ని న్నాద్యంతం పఠిస్తానీ రాత్రి
నినుంచి అనాదినీ అనంతాన్నీ
ఆమూలాగ్రం పరిశీలిస్తా నీ రాత్రి.

1

కాలాగురుధూపంగా నల్లగా మనోహరంగా
గ్రంధించబడిన రెండట్టల మధ్య
ఉద్దండమైన చెలియలికట్టల మధ్య
రూపొందిన తమస్సాగర మహాకావ్యాని వీవు.
ఒక అట్ట నింగి కాగా—వేరొకటి నేల
రెంటి నడుమా లక్షనక్షత్రాల అక్షరాలు
ఆద్యంత రహిత నిర్వేదనా గానాలు
సితాసిత వపుర్వల్లి వికసిత లోచనాలు
జీవనాతీత తలాతల గభీర సోపానాలు.
సురవధూ అపాంగ వీక్షణా చాపాలు
గతానేక పతితాస్తోక కల్పశాఖీ కుసుమ స్తబకాలు
కుటిలాలకల చూపుల తూపుల పాశాలు
అరవిరిసిన తమాలకుట్మలాల సమ్మోహనాస్త్రాలు.

2

అబ్బా .... చీకటీ .... విప్పుకో !
నీలో ఎన్నెన్ని రహస్త్రాలు
పాతాళ లోకాల యిరుల దారులు
ఇరుకులలో నలిగిన మూల్గులు
దురాశా మనోరథ చక్రాల వక్రదంతాల క్రింద పడి
లేవలేని హతాశుల అసహాయుల తుది ఆక్రందనలు

నీ శరణువేడి హాయిగ నిద్రించిన అర్ధరాత్రిలో
హఠాత్తుగా విరిగిపడిన కొండకొమ్ము, జలప్రళయం
అగ్నిపర్వతం—క్రక్కిన అనల ద్రవ హాలాహలం
ఒక్కుమ్మడిగా తుత్తునియలుగా త్రుంచిన
ముంచెత్తిన, భస్మీపటలం కావించిన
క్షతగాత్రుల, నీడలేని నిర్భాగ్యుల
అసంఖ్యాక శోకాకులిత మానవుల హాహాకారాలు—
ఓహో చీకటీ—నీలో ఎన్ని దుర్భర దుఃఖాలు ?
నీ హృదయంలో ఎన్నెన్ని వేదనామయరహస్తరంగాలు !

3

ఆకార వికార రహిత మహాధ్వాంత నిశీథీ
సుస్వర మురలించని సుప్తదుందుభీ
విశ్వమోహినికి యిరులే కురులై—కుటిలాలకలై
కబరీభరమై, తారాకోరకాలు సిగపూలై
చిరు వెలుగుల పరిమళాల పరీరంభ మొనరించునటే—చీకటీ ?
నీవీ లోకానికి చిరంతన సంగాతివైన దెప్పుడు ?
భావోజ్వల దీపిక జనతా హృత్కుహరంలో
శత సహస్ర దీప్తులతో వెలిగించిన దెప్పుడు ?
భీభత్సప్రధానమై రసావేశపేశలమై
పరగిన ఒక బృహత్కవిత వినిపించిన దెప్పుడు ?
ఇంద్రనీల శ్యమంతమణిద్యుతుల
ఈ కుటిలో తెరలించిన దెప్పుడు ?
శతకోటి తమ స్సుమాలను కూర్చిన
సురభిళ మాలిక జగతీగళాన కీలించిన దెప్పుడు ?

4

అలనాడు కలలు కలలే
నా కుచ్ఛ్వాస నిశ్వాసాలైన జీవిత ప్రకరణంలో
యౌవ్వన మహా సాగర తటాన ఆశీనుడనై
సికతాతలంలో ఒకే ఒక్క లలనామణి
నామాక్షరాలు లిఖిస్తున్న తొలినాళ్ల మునిమాపులలో
నే నలిగి దూర దూరంగా పాదచారినై గడచి
ఏకాంత వనాంతర సీమల కరగినపుడు
నా వెనకాలే మెల్లగ వచ్చి చల్లని నిట్టూర్పు విడచి
నీ మెత్తని మంచు ముంజేతుల నా కన్నులు మూసినపుడు

నేనకస్మాత్తుగా హడలి కంపించినప్పుడు
ఫక్కున నవ్విన నీ వికటాట్టహాసాలు—కుటిల నిశ్వాసాలు
నా లోపలి చెవిలో నెమ్మదిలో
ఇంకా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి కదే చీకటీ !

5

ఒకనాడు విశాఖలో అల్లిపురం చౌరస్తాలో
మేడమీది బాల్కనీలో బహుజనుల మధ్య అజ్ఞాతవాసంలో
నిద్రరాక నేనొంటరిగా నన్ను నేనే వెక్కిరించుకుంటున్న
తుంటరి సాహసాల అంధకారపు టర్ధరాత్రిలో
నే నేకాకిగా ఆశీనుడనై నిన్నర్థిస్తూన్నప్పుడు
నా ఎట్టఎదుట నిద్రలో కదిలే నీడ మాదిరిగా
మెల్లగా నిశ్శబ్దంగా నడిచే ఛాయారూపిణియొక్కతి
రోడ్డు ప్రక్కబావిలో భళ్లున దుమికేసిన దృశ్యం
చూస్తూ చూడలేక—వింటూ వినలేక
నిస్సహాయత భయానకమై ఊపిరి పీల్చలేక
నా సర్వస్వాన్నీ నిశ్చేతనత్వ మాక్రమించగా
విద్యుదాఘాతం నను ముంచెత్తగా
కెవ్వున కేకేసి మూర్ఛిల్లిన సమయంలో
నీవే కదే చీకటీ, ఆ నిర్భాగ్యురాలి దీనగాథ
నా చెవులకు వినిపించావు. చిరతర ముద్ర కలిగించావు.
ఎంతని వర్ణించను చీకటీ—నీ మహత్తును ?

6

వెదికాను వేదాల చతుశ్శాఖల
వనస్పతులతో నిండిన నైమిశారణ్యాలను,
శోధించాను బైబిళ్ల ఖొరాన్ల ఉపనిషద్వీధుల గుయ్యారాలను,
కంటకమయసంక్లిష్ట మార్గాల దుర్గమ బదరికావనాలను,
నాకు ప్రతిచోటా సాక్షాత్కరించిన వొకే గాథలు—
తమస్సముద్ర తరంగాల వివిధ విన్యాసాల రొదలు.
మానవ సముపార్జిత జ్ఞానసింధువులో
నిబిడీభూత మానసికాజ్ఞానాంధతమో తిమింగలాలు.
నరునిపైన కారాల్ మిరియాల్ నూరే రకరకాల వికారాలు
చీకటి రోకటి పోటుల హాహాకారాలు
అబ్బా **హా**! చీకటీ, ఎన్నెన్ని నీ ప్రతాపాలు ?
కనుకనే చీకటీ, నేను వాంఛించను సుతరామూ—

నీలో గుప్తాగుప్తంగా మార్మికంగా దాగొన్న మరణాన్ని:
కనుకనే చీకటీ, నే నారాధిస్తాను ఆద్యంతం
నిన్నధిక్కరించే కార్ముకమై ధిక్కరించే జీవన సంఫుల్ల కిరణాన్ని
ఇస్సీ చీకటీ— పిశాచీ ! నీ వెంత శక్తిమంతురాల వైనప్పటికీ
ఒక్క నలుసంత వెలుతురు ముందు పీగిపోక తప్పదు కదే ?
కొండంత దూదిమేటు పిసరంత నిప్పురవ్వకు
లొంగక తప్పదు కదే ! ఓటమి తథ్యం కదే !!

7

జాలిలేని గాలి తుఫాను విజృంభించి నీకు సాయపడినప్పుడు
లోకం గుండెలలో మిణుకుమనే పిల్లా పిసరా దివ్వె లారినపుడు
నీ సహస్ర తమిస్రాచ్ఛ స్వరూపం విశ్వరూపమై
విశృంఖల మదేభమై మిడిసిపడినపుడు,
రేయి రేయెల్ల శోకాకులిత నేత్రంగా మృతగాత్రంగా
మూతపడినపుడు, ఇరులోక ప్రేతంగా పాడినిపడినప్పుడు,
పాకిస్తాన్ యమ నియంత కింకర శ్రేణులు మానవతా ధర్మాల విడచి
అంబాలా జలంధర్ అమృతసర్ నగరాలలో
హాస్పిటళ్లపై పౌరుల యిళ్లపై మసీదుల చర్చిల గురుద్వారాలపై
బాంబుల అంగార వృష్టి కురిపించగా న్యాయం చచ్చిపడినపుడు,
నీ వికటాట్టహాసాలు చీకటీ—జగాలకు జనాలకు మృగాలకు ఖగాలకు
భయభ్రాంతమై కోలాహల క్రేంకారమై శాపవహ్ని జ్వాలాతోరణమై
అనంతమై అగాధమై, ప్రగాఢమై ప్రదీప్తమై
విరాడ్రూప సంకులమై నీరవ నిర్వేదమై విజృంభించి
కుటిల శర్వరీ నిటలముపై పొటెత్తిన రక్తధ్వజముగ నిశాంత మవగా
తూరుపులో దూరపు ప్రత్యూషములో అరుణోదయ మైనట్లుగ
తెలివెలి రేకుల బాకుల తళత్తళల రీతిగ
వీరవరుల అక్షౌహిణి లక్షకాంతి కిరణాలై
సాగెనులే, సాగును చీకటీ ! నీపై
అమేయ దీధితీ విజయోత్సవం ! అదే
చైతన్యజీవన సుస్మేరోత్క్రమణం.
అదే నా చిరంతన స్వప్నం ......
అస్మదమల తపఃఫల వాస్తవం ......
యాతనామయ జీవితానుభవ దత్తం ......
ఇతి శివమ్ ! ..... ఇతి శివమ్ !

సమగ్ర ఆంధ్ర సాహిత్యం

శ్రీ నిడుదవోలు వెంకటరావు

"ఆరవీటి రాజుల యుగం" అనే పేరితో వెలువడిన— సమగ్ర ఆంధ్ర సాహిత్యం తొమ్మిదవ సంపుటంలో ఉన్న కవుల వివరాలు.

(1) పచ్చకప్పురపు తిరువెంగళరాజు. (2) దోనూరి కోనేరునాథుడు. (3) సిద్ధిరాజు తిమ్మరాజు. (4) రామరాజు రంగప్పరాజు. (5) జక్కరాజు వెంకటకవి అయ్యలురాజు కవులు (6) చక్రపురి రాఘవాచారి (7) ఏకామ్రనాథుడు చరిత్రకారులు. (8) పెదపాటి జగ్గన (9) ఒక అజ్ఞాత గ్రంథ సంధాత. (10) మట్ల అనంతరాజు. (11) కవి చౌడప్ప. (12) తురగారాజకవి— అయ్యంకి బాల సరస్వతి. (13) తరిగొప్పుల మల్లన (14) బమ్మెర కవులు పేరయలింగం. (15) బొడ్డుచెర్ల తిమ్మన—బిజ్జల తిమ్మరాజు. (16) ముద్దరాజు సోదరులు చిత్రకవి పండితులు (17) కామినేని కవులు ఆశ్రితులు (18) మారన వెంకయ మఱికొందరు శతకకవులు. (19) ఇతర కవులు—వీరు నలభై యిద్దరు.

(1) పెద కెంపరాయడు (2) భద్రకవి (3) ఎల్లకర నరసింహకవి (4) భాస్కరాచార్యులు (5) మల్లారెడ్డి దేశాయి (6) కలిదిండి భావనారాయణ (7) పొన్నతోట ఓబళకవి (8) రాజలింగకవి (9) కావూరి ఎల్లయ్య (10) గూళికల్లు వెంకట రమణకవి (11) తామరపల్లి తిమ్మయ్య (12) మోచర్లనన్నయ్య (13) కంచెర్ల అయ్యన్న (14) నారన్నగారి సూరన్న (15) ఒడ్డెపూడి పెద్దయ్య (16) రాయసం వెంకటపతి (17) ఉప్పుగుండూరి పెరియన్నకవి (18) కుందుర్తి పండితులు (19) రేటూరి కవులు (20) ఎలుగంటి పెద్దన (21) బద్దెవీటి దత్తప్పకవి (22) నెప్పెల్లె అప్పన్న (23) మల్లవరపు వీరేశ్వరుడు (24) పెనుమర్తి వెంకటార్యుడు (25) కోట శివరామకవి (26) కొటికెలపూడి సోమనాథకవి (27) నేబది కృష్ణమంత్రి (28) పెద్దిరాజు రామరాజు (29) పలకలూరి గోపన (30) ఎడవల్లి పర్వతన్న (31) పొట్ల్పూరి గోపన్న (32) వణుకూరి గురవరాజు (33) రాచపూడి వెంకటయ్య (34) గౌరరాజు (35) కంచి వీరశరభయ్య (36) సర్వజ్ఞ పద్మనాయక భూపాలుడు (37) వెణుతుర్ల వడ్డికవి (38) ముడియం వెంకట రమణకవి (39) వేగినాటి కొండన్న (40) చెన్న బసవయ్య (41) ముకుందయోగి (42) చరిగొండ నరసింహకవి.[1]

ఈ సంపుటంలో 106 మంది కవులున్నా, ఇంకా ఇందులో చేరవలసిన వారీ క్రిందివారున్నారు.

1. సవరము చిననారాయణనాయకుడు—కువలయాశ్వ చరిత్ర.

   ఈతని కృత్యవతరణికలో—"తన కీర్తి మట్లనంత నృపాలముఖ్యగోత్రామరేంద్రులు కొనియాడికొనగ" అని మట్ల అనంతరాజు ప్రస్తావన ఉన్నది.
2. పైడిమఱ్ఱి వెంకటపతి, చంద్రాంగద చరిత్ర.
3. చెన్నమరాజు చెన్నమరాజు– చారుచంద్రోదయము.
4. దామెర వెంకటపతి, బహుళాశ్వచరిత్ర.
5. దామెర్ల అంకభూపాలుడు, ఉషాపరిణయము.
6. నడిమింటి వెంకటపతి, అభిషిక్త రాఘవము.
7. ఎలకూచి బాలసరస్వతి, ఆంధ్రశబ్దచింతామణి వ్యాఖ్యాత—చంద్రికా పరిణయ భర్తృహరిసుభాషితాది బహు గ్రంథకర్త.
8. శేషము తిరుమలార్యుడు, అంబరీషోపాఖ్యానము.
9. శ్రేష్మలూరి వెంకటాచార్యుడు, శ్రీనివాసవిలాససేవధి.
10. రేవణూరి వెంకటార్యుడు—శకుంతలా పరిణయ శ్రీపాద రేణు మాహాత్మ్య గ్రంథకర్త.
11. బాలపాపాంబ, యక్షగాన కవయిత్రి.
12. గార్లపాటి లక్ష్మయ. ఈతడే—యాగంటివారి పదములు రచించిన ప్రశస్త పద రచయిత.
13. వెణుతురుబల్లి విశ్వనాథకవి—శేషధర్మ కావ్యాదికర్త.
14. లోకేరావు సోమన, శివరాత్రి మాహాత్మ్యము.
15. కాళ్లకూరి లక్ష్మీపతి—భద్రాపరిణయ కర్త. ఇంకనూ కొందఱు గలరు.

క్రిందటినెల భారతిలో—నేను గ్రంథకర్తలు విడిచి పెట్టిరని సూచించిన కవు లీ సంపుటములో నున్నట్లు పై

---

1. ఇది వాఙ్మయ చరిత్రకు సంబంధించినది కాబట్టి ఈ పట్టిక చూపక తప్పినదికాదు.

వివరణమువలన విశదము. అయితే, వానిని గూర్చి సమీక్షించ వలసి వచ్చినది. ఆ ప్రత్యేక కవి సమీక్షకు ముందుగా, ముఖ్య విషయ మొకటి ముందు ప్రస్తావించుచున్నాను.

ఈ సంపుటములో పెదపాటి జగ్గన, అజ్ఞాత గ్రంథ సంధాత ఇరువురు 47 పుట లాక్రమించారు. వారుదాహరించిన కవులు కావ్యాల గూర్చి—వివరణ లున్నవి. కాని ఈ వివరణలలో విషయాలన్ని విపులంగా సమీక్షించవలసిందే. గ్రంథ విస్తర భీతిచేత—కొన్ని మాత్రమే—తెలియపఱుస్తున్నాను.

క్రీ. శ. 1918 లో ఈ రెండింటిని సంధానించిన—'ప్రబంధ రత్నావళి' ప్రకటితమైనది. అప్పటికిగల సాధన సామగ్రితో అది చక్కగా రూపొందింది. ఈనాడు గ్రంథములో ఉదాహరింపబడ్డ పద్యాలు — ఆకరాలు, మునుపటికంటె హెచ్చుగా తెలుసుకోవడానికి అవకాశం కలిగింది. గ్రంథనామం కర్తనామం తెలియవన్న పద్యాలను—నేను చాలా గుర్తించాను. కవుల శీర్షికలలో ఉన్న పద్యాలలో విపర్యాసాలు పరిశీలించాను. వానిని చూచినట్లయితే, మన మీ గ్రంథంలో ఉన్నవానిలో కొన్నింటిని జాగరూకతతో గ్రహించాలి.

మచ్చుకు ఒకటి చూపుతాను.

పుట 104 .మాధవుడు ఫణిధవు (ప్రద్యుమ్న విజయము.)

గీ. అత్రిమునికంటె పసు బిడ్డ డాకసమున
నుడుగణము లాడ కాడకు నొడ్డగిలిన
బాల భానుండు నలుగడ బర్వ మీాటు
వెండి గుండన నుదయించె వేగుఁజుక్క.

ఇది అద్దంకిగంగాధరకవిరచిత తపతీసంవరణోపాఖ్యానంలో తృతీయాశ్వాసం, 105 వ పద్యముగా నున్నది.

సమగ్ర ఆంధ్ర సాహిత్యం—మొదటి మూడు సంపుటాల సమీక్షలో2 చిమ్మపూడి అమరేశ్వరుని విక్రమసేనంలో ఇతర పద్యా లెట్లు చేరినవో నిరూపించాను. ఈ సంపుటంలో 110 వ పుటలో జైతరాజు ముమ్మయ్యనుగూర్చి యిట్లున్నది.

''ఇతడు విష్ణు కథా నిధానం అనే గ్రంథాన్ని వ్రాశాడు. ఇందులోని 43 పద్యాలను సంకలన కర్త లుదాహరించారు.''

కాని—43 పద్యాలన్నీ ముమ్మయ్యవి కావు.

1. ఆడెందాండవ మూర్భటిన్

(మూలము) బటహ లీలాటోప విస్ఫూర్జిత
(371) క్రీడాడంబర ముల్లసిల్ల గరళ
గ్రీవుండు జూటాటవీ
క్రోడా ఘూట కరోటి కోటర
కుటీ కోటీ లుఠత్సింధు వీ
చీ డోలా పటలీ పరిస్ఫుటతరస్ఫీత
ధ్వని ప్రౌఢిమన్—ఇది యీా సంపుటంలో ఉదహరించింది. ఇది భీమఖండంలో 4—148పద్యము.

2. సీ. ఊకరల్ గొట్టక యుబ్బనంబందక
(376) వెఱనక దేహంబు విఱుచుకొనక.

. . . .

గీ. చదువలేదని పొగడిరి సభికవరులు
ఇది సకల నీతి సమ్మతములో 307 పద్యము.

3. మ. కరషట్కారవ వాద్యమింపొదవ
(381) . . . . .సర్వేశ్వరా.
ఇది యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకము లోనిది.

4. మ. జయనారాయణ పుండరీకనయనా....,...
(385) మురారిహరీ
ఇది నాచన సోముని హరివంశము 6—20 లో నున్నది.

5. చ. వెనుకకు బోక యీా యనక—వేసట నొందక
(399) —వాచకుడంద్రుడు భూవరా.
ఇది సకలనీతిసమ్మతములో 306 వ పద్యము.

పోలమరాజు—పర్వత పురాణము

(301) సీ. ఒనరంగ కమలంబు నుపహార సంధియు
సంతాన సంధియు సంగడంబు
షోడశ ప్రకార సునిశితసంధి వి
ధానమెరుగవలయు ధరణిపునకు—

ఇది సకలనీతిసమ్మతములో 512 వ పద్యం.

ఈ విధముగా—ప్రబంధ రత్నావళి పరిశీలించాలి.—స్థాలీపులాకన్యాయంగా చూపాను.

ఇక ప్రత్యేక కవి సమీక్ష

పచ్చకప్పురపు తిరువెంగళరాజు

పచ్చకప్పురపు తిరువెంగళకవి—అనే వాడుక యుండగా, నీ గ్రంథంలో తిరువెంగళరాజు అని వ్రాశారు. ఆశ్వాసాంత గద్యలలో తిరువెంగళేంద్రుడనియే ఉన్నది.3 తిరువెంగళకవి అనియే వ్యవహారము. ముద్రిత గ్రంథమునగల పేరునుబట్టి ఈ శీర్షిక ఉంచినా, ఇదివరలో ఈ కవినిగూర్చి, గ్రంథమును గూర్చి ప్రసక్త

---

2. భారతి—ఆగస్టు 1965—పుటలు 99, 100.

3. (అ) ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారము. ద్విపద కావ్య సంపుటి. (4). పుటలు—1387, 88, అనుక్రమణిక పుట—5. ((1936).

(ఆ) భారతి—1946—ఏప్రియలు. ముద్రితా ముద్రిత గ్రంథములు. కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు.

(ఇ) భారతి—1949—జూన్. కవికాలనిర్ణయము శాసనాధారములు. ప్రస్తుత వ్యాసకర్త.

వైనప్పు డంతటా 'కవి' అనియే ఉన్నది. దీనినిగూర్చి కించిత్తైనా చెప్పకుండా తిరువెంగళరాజు అని వ్రాయడ మెంత మాత్రమును సరికాదు.

ఇట్లే గ్రంథమును గూర్చి వ్రాయడం జరిగింది.

"తిరువెంగళరాజు వ్రాసిన ద్విపద కావ్యంలోని "ఆఖ్యాన శైలియు వర్ణనాశైలియు ప్రౌఢము లనుటకన్న ప్రసన్నము లనుట మేలు" అని యీ పుస్తకాన్ని ప్రకటించిన తి. చంద్ర శేఖరన్‌గారు చెప్పారు" (చొక్కనాథ చరిత్ర. మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయ ప్రచురణ. నెం. 35—1954.) అధోజ్ఞాపిక—పుట 25. గ్రంథకర్తలు—పీఠిక యడుగున గల తి. చంద్రశేఖరన్—అను పేరును పురస్కరించుకొని పై వాక్య ముదాహరించుట పొరపాటు. ఆ తి. చంద్రశేఖరన్‌గారు పాచ్య లిఖిత పుస్తక భాండాగార విచారణ కర్త (క్యూరేటరు) అయిన ఉద్యోగి మాత్రమే. ఆ తెలుగు పీఠిక వ్రాసినవారు—అక్కడి తెలుగు పండితులు మల్లంపల్లి శరభయ్యగారు. అయితే అచ్చటి నిబంధనల ననుసరించి—అధికారియైన ఉద్యోగస్థుని పేరే—వానిలో ఉంటుంది.4

దీనినిబట్టి—చొక్కనాథ చరిత్ర గూర్చిగాని—తత్కర్తను గూర్చిగాని యింతకు ముందెవరును వ్రాయలేదని తేలినది. కాని అదియు విమర్శనీయమే. గ్రంథకర్త—'ప్రమాణ గ్రంథాలు" గా స్వీకరించిన వానిలో 21 సంఖ్యగల 'దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయం' అనే గ్రంథంలో 16 నుండి 23 వ పుటవరకు—ఈ కావ్యము కవి వివరాలున్నవి. ఈ గ్రంథమును కొన్నిచోట్ల గ్రంథకర్తలు పేర్కొని తిరువేంగళరాజునుగూర్చి వ్రాసినపుడు పేర్కొనకపోవుట దురూహ్యముగ నున్నది.

చొక్కనాథ చరిత్ర—12000 వేల ద్విపదలుగల మహా కావ్యం. ఆంధ్ర శైవ వాఙ్మయానికి సంబంధించిన కృతి. కథావస్తువేకాక, భాషా సంప్రదాయాల శివకవుల త్రోవనే అనుసరించినది. ఇందులో మధుర సుందరేశ్వరుని (తమిళమున చొక్కనాథుడు) 64 లీలలు వర్ణితములైనాయి. ప్రస్తుత గ్రంథంలో ఈ 64 లీల లేవేవో వివరింపబడలేదు. ఈ కావ్యము పదకొండేండ్ల క్రిందటనే తెలుగు సాహిత్య లోకానికి పరిచితమైనది. ఇందలి కథలూ క్రొత్తవి. ఇట్టి సందర్భంలో లీలల పేర్లేకాక, వాని కథా స్వరూపాలను రేఖామాత్రంగా తెలపడం ఆవశ్యకం. ఉదాహరణకు ఒక పట్టు వినిపిస్తాను. 31 వ లీలలో చొక్కనాథుడు—గాజుల వాని వేషం ధరించి అక్కడి స్త్రీలకు గాజులు తొడుగుతాడు—ఆ వేష మెంత స్వాభావికంగా ఉందో చూడండి.5

"చొక్కనాయకుడు గాజులసెట్టి యగుచు
జక్కగా ముతుకవేషముతోడ జల్లి
పట్టు సూత్రపుద్రాళ్లు పైడుంగరములు
బెట్టు బసవని చేసి పెట్టిన ముద్ర
పట్టు వస్త్రము గూర్చి బాగుగా బిగియు
గట్టిన దేవుండు కంఠాన నమర
నొసలను విభూతి నునుపుగా దీర్చి
యొసపరి పెండె కట్లొరపుగా బెట్టి
సన్నపు రుద్రాక్షసరములు వైచి
వన్నెమీరగను దోవతికట్టుగట్టి
పైమించు గజము పప్పలి పచ్చడంబు
వామాంగమున వల్లెవాటుగా వైచి
నెఱిమించు తలపాగ నేర్పుగా జుట్టి
కరమొప్ప వ్రేళ్ల నుంగరములు వెట్టి
బుజముపై గాజులపాది చాల బెట్టి
భుజగేంద్ర భూషుండు పురవీధులందు—

గాజుల రకాలు

"గాజులు బొద్దులు కమ్మ దుద్దులును
గాజులు కొనరాలో! గాజులో!" అనుచు
పచ్చలు బూదెలు పచ్చరటాకు
పచ్చలు పొన్నాకు పచ్చగాజులును
నీలాలు మఱితట్టు నీలాలు రంగు
నీలాలు పచ్చల నిగ్గు గాజులును
ఆవ పూవన్నె రాజావర్తనములు
గోవాళ సరములు గొమ్మనంబులును
పువ్వగ గాజులు—పొన్న పూ చింత
పువ్వులు సంపంగిపూ చామపువ్వు
పొగడ గాజులు జెఱ్ఱిపోతు వన్నియలు
చిగురాకు తేనెలు జీనిగాజులును
గలవు మా కడ ననేకములైన వగలు.

గాజుల రకాలేకాక, అవి తొడగడము—తొడిగినప్పుడు—జరిగే వాదులాటలు ఎంతో చక్కగా ఇందు నిరూపితాలైనవి. నత్కీరుని కథ తెలుగులో ధూర్జటి—తిరువెంగళకవి మాత్రమే వ్రాసినా, ఆ కథా సంవిధాన మెల్లాగ రెండింటిలో ఉన్నది అన్న సంగతి—రెండింటిని గూర్చి వ్రాసినప్పుడు లేదు. దాక్షిణాత్య సంస్కృతి సంప్రదాయాలు ఎన్నో దీనివలన తెలియును.

దోనూరి కోనేరునాథుడు

కోనేరునాథుని కృతులు— రెండు. రెండునూ బాల భాగవతాలే. ఒకటి పద్య కావ్యం. ఇంకొకటి ద్విపదకావ్యం.

---

4. ఆ భాండాగారములోనే—వివరణాత్మకములు—త్రైవార్షికములూ అయిన ఇరవై సంపుటముల వివరాలు వ్రాసిన ప్రభాకరశాస్త్రి గారి పేరెందులోను కనబడకపోవుట కిదే కారణము. అందుచేతనే—వారు వ్యంగ్యముగా—"నేను కొంత కాలము మట్టిముద్దలు మోసితిని" అని వ్రాసుకొన్నారు. (భారతి—జూన్—1940.) ఇచ్చట గ్రంథ పీఠికలో ఇట్లున్నది—అని వ్రాసిన సరిపోయెడిది.

5. పంచమాశ్వాసము—పుట 161—162.

వీనిలో ద్విపద కావ్యంలో కొంత భాగము—అనగా నాల్గాశ్వాసాలు ఈ వరకే అచ్చయినవి. ఈ కావ్యానికి చారిత్రకంగా ఒక విశిష్టత ఉన్నది. కోనేరునాథుడు గ్రంథాంతమున కృతిపతి వంశ చరిత్రను తెలిపేడు. అది రెండు భాగాలు; ఒకటి పరీక్షిత్తు మొదలుకొని కృతిపతి వంశమైన— ఆర్వీటి రాజుల మూల పురుషుని వరకు తెలిపేది; రెండవది—ఆ మూల పురుషుడైన తాత పిన్నమరాజు నుండి కృతిపతివరకు తెలిపేది.

ఈ రెండవ భాగము—ఆర్వీటి వంశ చరిత్ర—అనే పేర. ముద్రితమై, పరిశోధకుల కందుబాటులో నున్నది.[6] మొదటి భాగములో తూర్పు పశ్చిమ చాళుక్యులను గూర్చిన—అంశాలు చాలా ఉన్నవి. రెండింటిలోను—పరిక్షిత్తునుండి 45 తరాల వారి వృత్తాంత మున్నది. ఈ మొదటి భాగంలో సారంగధరుని కథకు సంబంధించిన పది పంక్తులీ వరకు నేను ప్రకటించాను.[7] తక్కిన భాగమంతా, వ్రాయించి అచ్చుకు సిద్ధం చేశాను. ఈ రెండింటిని జోడించి, పూర్తిగా ప్రకటించినట్లయితే—తెలుగు దేశ చరిత్ర కెంతో మేలు కలుగుతుంది. చారిత్రకు లెవ్వరూ ఈ మొదటి భాగా న్నింతవఱకు పరిశీలింపనే లేదు.

పద్య బాలభాగవతము

ఈ సంపుటంలో ద్విపద బాల భాగవతాన్ని గూర్చే ఉన్నది గాని పద్య బాలభాగవతాన్ని గూర్చిన వివరాలులేవు. ఆపైగా ఇట్లా వ్రాశారు. ఈ 'కవి సార్వభౌముని' గ్రంథాలు పూర్తిగా అచ్చుపడితే విపులమైన అంచనా వేయడానికి వీలవుతుంది." (పుట 33.)

పద్య బాల భాగవతము—పన్నెండేళ్ల క్రిందటనే అచ్చయినది.[8] తిరుపతి దేవస్థానంవారు ప్రకటించారు. దీనిని గ్రంథకర్తలు చూచినట్లేలేదు. కనుక కొంచెము వివరిస్తున్నాను.

ద్విపద బాల భాగవతమువలె ఇది ఆరాశ్వాసాలకావ్యము. అందులో ఆరో ఆశ్వాసంలో కొంత భాగంలోపించింది. 69 పద్యాల వఱకు మాత్రమే లభించింది. ప్రథమాశ్వాసంలో ఇష్ట దేవతా స్తుతి. భారతీ స్తవముతో ప్రారంభమవుతున్నది. కాబట్టి ముందింకా కొన్ని పద్యములు లోపించినవి. గ్రంథంలో అచ్చటచ్చట గ్రంథపాతములున్నాయి. లోపించిన పద్య భాగాలను పరిష్కర్తలు—పూరించి వానిని కుండలీకరణం చేశారు.[9]

ఆరవ ఆశ్వాసం పూర్తిగా లేకపోయినా ఉన్న గ్రంథము పరిశీలిస్తే అయిదవ ఆశ్వాసముతోనే దశమ స్కంధము పూర్తి అయింది. లభ్యమైన ఆరో ఆశ్వాస భాగంలో ఏకాదశ స్కంధ భాగము చాలవఱకున్నది. కాగా, ద్వాదశస్కంధ భాగము మాత్రమే లోపించినదని చెప్పవచ్చును.

ఇందు 1801 గద్య పద్యాలున్నాయి. (1—216, 2—307, 3—427, 4—384, 5—398—6—69). ఇది పురాణమే యైనను పురాణ లక్షణములేకాక ప్రబంధ లక్షణములు పాటింపబడినవి. ఆరాశ్వాసముల పరిమితిలో ప్రబంధ వర్ణనలు కొన్ని గలవు. కోనేరునాథు డీ బాలభాగవతమును విశిష్టాద్వైత మత సిద్ధాంతానుసారముగా రచియించియున్నాడు. సంస్కృతాంధ్ర భాషలలో, అనర్గళ పాండిత్యము, కవితాధార, అలవడుటచేత, దీనిని ప్రౌఢకావ్యముగా సంతరించాడు. కవితలో నన్నయ శ్రీనాథ కవుల పోకడల ననుసరించాడు. పాండిత్య స్ఫోరకములైన సంస్కృత పదాలు, దేశి పలుకుబడి ఈ కావ్యంలో ప్రస్ఫుటమవుతున్నది. ఇందలి కవితా గుణాలను, వివరించడానికి స్థలసంకోచముచేత విరమిస్తున్నాను. దీనిని గురించి కూలంకషమైన వ్యాసంగం—అత్యావశ్యకంగా రావలసియున్నది.

చక్రపురి రాఘవాచార్యుడు

రాఘవాచార్యుని నలచరిత్ర క్రీ. శ. 1841 లో అచ్చువేయించిన బ్రౌనుదొరగా రీతని కాలము క్రీ. శ. 1620 ప్రాంతమని వ్రాశారు.[10] దీనిని పరిగణించకుండగనే— కాల నిర్ణయము చేయకుండగనే ఈ సంపుటంలో రాఘవచార్యుని చరిత్ర వ్రాయబడి ఉన్నది. రాఘవాచార్యుడు పేర్కొన్న దొడ్డయాచార్యులు, అప్పయ దీక్షితునితో వాద ప్రతివాదములు చేసినట్లు ప్రపన్నామృతములో ఉన్నది.[11] దీనినిబట్టి ఈతడు క్రీ. శ. 1650 ప్రాంతమువాడని చెప్పాలి. ఇంతేకాక, ఈ కవినిగూర్చి మఱొక విడ్డూరమైన వాక్యం గ్రంథకర్తలు వ్రాశారు.

"నీరసమైన ద్విపద కావ్యాలు వ్రాసిన ఈ ప్రథమేతర శ్రేణి రచయిత ఒక్క విషయంలో ప్రథమ స్థానాన్ని నోచుకొంటున్నాడు" (పుట 67). ఆ వెనుక దీన్ని సమర్థించడానికి—

"రెండో రుద్రకవి సుగ్రీవవిజయం వ్రాశాడనుకోవడం భావ్యం. అప్పు డతని కాలం క్రీ. శ. 1558—ప్రాంతాలు అవుతుంది. సరిగ్గా ఈ కాలంలోనే చక్రపురి రాఘవాచార్యులు

---

6. భారతి—1929. జూన్— పుటలు. 845 — 857; డా. నేలటూరి వెంకటరమణయ్యగారు.
7. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము. పుట 58.
8. శ్రీ వెంకటేశ్వర ప్రాచ్య గ్రంథావళి—సంపాదకులు— పరిష్కర్తలు— విద్వాన్ సాహిత్య శిరోమణి—పంగనామముల బాల కృష్ణ మూర్తి, ఎమ్. ఏ.; దేవస్థానము ముద్రాక్షరశాల—1954. ఇందు 32 పుటల పీఠిక యున్నది.
9. ఈ కుండలీ కరణ విధానం—నాచన సోముని ఉత్తర హరివంశంలో పాటింపబడకపోవడంవల్ల ప్రసిద్ధ విమర్శకులే తబ్బిబ్బయినారు. అందులో ప్రథమాశ్వాసం చివర భాగం—సోమునిదికాదు. సోముని దనుకొని విమర్శ సాగించినందువలన గలిగిన విపర్యాసాలనుగూర్చి కీ. శే. నడకుదిటి వీరరాజుగారి—సోముని హరివంశము అను వ్యాసము చూడదగును. (విమర్శ తరంగిణి.)
10. ద్విపద కావ్య సంపుటి (4) పుట. 1397.
11. Sources of Vijayanagar History. Note—No. 60.

కూడా యక్షగానం వ్రాసిన సాక్ష్యాలు కవబడుతున్నాయి'' అని 68 పుటలో వ్రాసి, ''విప్రనారాయణ చరిత్ర'' అనే యక్షగానాన్ని గూర్చి చెప్పి—చివరకు—ఆ పుటలోనే—

''తొలి యక్షగాన రచయితగా చక్రపురి రాఘవాచార్యుల రచనలను సమీక్షించి స్మరించాలి'' అని ముగించారు.

ఈ వాక్యాలన్నీ పరస్పర విరుద్ధాలు. 1558 లోనే రాఘవాచార్యులు రచన చేసినట్లు సాక్ష్యాలు చూపలేదు. పైని పేర్కొనబడిన విప్రనారాయణ చరిత్రలో దానిని రచించిన కవి పేరులేదు. ఆ రచయిత తాను దొడ్డయాచార్యుని శిష్యుడనని మాత్రమే చెప్పుకున్నాడు.12 అసలు గ్రంథకర్త పేరే లేనప్పుడు అది రాఘవాచార్యుని కృతి అని చెప్పడం—అప్రామాణికం. ఇంతకూ, ప్రస్తుత గ్రంథంలో గ్రంథ కర్తలే, ఇతర కవుల శీర్షికలో 'పెద కెంపరాయడు—' అనే కవిని గూర్చి వ్రాసిన వాక్యాలు చూడండి.

''యక్షగాన రచయితలలో ప్రోలుగంటి చెన్నయ్య ప్రథముడు. అతని తరవాత పెదకెంపరాయడు చెప్పదగిన యక్షగాన కర్త. ఇతని రచన కొంతైనా లభ్యమైంది. అందుకు సంతోషించాలి.'' (పుట—229.)

ఒకే సంపుటంలో ఒకచోట ''తొలి యక్షగాన రచయితగా చక్రపురి రాఘవాచార్యులను సమీక్షించి స్మరించాలి'' అని, వేరొకచోట ''యక్షగాన రచయితలలో, ప్రోలుగంటి చెన్నయ ప్రథముడు'' అని యెట్లా వ్రాయబడియున్నదో దురూహ్యం. ఈ గ్రంథ రచనా ధోరణిని చూపుటకుమాత్రమే దీని నుదాహరించాను.

ఏకామ్రనాథుడు ; చరిత్రకారులు

ప్రతాప చరిత్ర వ్రాసిన ఏకామ్రనాథుడు—దోనూరి కోనేరు కవికి సమకాలికుడని గ్రంథకర్తలువ్రాశారు. (పుట 79.) కాని ఈత డంతకంటె ముందు వాడని క్రీ. శ. 1369 ప్రాంతమువాడని ఇంతకుముందే నిర్ణీతమైనది. సిద్దేశ్వరచరిత్రలో ఉన్న పంక్తులే దీని కాధారం.

''నాగనాథుని యడుగులకు మ్రొక్కి చాల
యతని యనుమతిని నేకామ్రనాథుండు
మతి మీఱ చెప్పిన కత వచించెదను.''

నాగనాథుని''యనుమతిని''అని చెప్పుటచేత, ఏకామ్రనాథుడును నాగనాథుడును సమకాలీనులు.13 నాగనాథునికాలము—క్రీ.శ. 1369. ఏకామ్రనాథుడు, ఏకోరామనాథుడని, ఏకోరాముడని ప్రసిద్ధి కెక్కిన శైవాచార్యుడు.

''ఏ నుపన్యసింతు నేకామ్రగురులింగ
నలినభృంగ సోమనాథలింగ''.

అను మకుటముతో, ''అన్యవాద కోలాహలము'' అను పేర—పాల్కురికి సోమనాథుని గ్రంథముల సారమును శతకముగా గూర్చిన కవి యీతడే. ఈ ఏకోరామునిగూర్చి, ప్రస్తుత గ్రంథ సంపుటములలోలేదు. ఈతడు—ప్రసిద్ధులైన మల్లంపల్లి వారికి మూల పురుషుడు.14

ఏకామ్రనాథుని పేర్కొనిన సిద్ధేశ్వరచరిత్రకర్త కాసె సర్వప్పయు—క్రీ. శ. 1400 ప్రాంతమువాడు కాగదగును.

ముద్రితాలైన—ప్రతాపచరిత్రలకు (ఆంధ్ర సాహిత్య పరిషత్తు—వరంగల్లు శైవ ధర్మ ప్రచారిణీ సంఘము వారివి) అముద్రితమైన—తెలుగురాజులచరిత్రకు (గ్రంథ సంఖ్య ఆర్. 749.) భేదాలున్నవి. వీని నన్నింటిని సమన్వయించి నట్లయితే—ఏకామ్రనాథునిదీ, సిద్ధేశ్వరచరిత్ర రచయిత సర్వప్పకాలమూ క్రీ. శ. 1400 ప్రాంతమని స్పష్టపడుతుంది. వీరేశలింగముగారి ననుసరించి నేలటూరివారు దీనిని 'సరి కావచ్చును' అన్నారు. (భారతి—1945—ఫిబ్రవరి, కాకతి గణపతి దేవుడు—కులోత్తుంగ చోళుడు.)

''ఏకామ్రనాథుని ప్రతాప చరిత్ర, స్థానాపతి వ్రాసిన రాయవాచకం తొలి చారిత్రక గ్రంథాలేకాక తొలి వచన రచనలుగాకూడా మన సాహిత్యంలో విశిష్టస్థానాన్నిఆక్రమిస్తాయి.'' (పుట 85)—ఈ వాక్యమెంతమాత్రమున్నూ సరికాదు. వచన వాఙ్మయ ప్రథమాచార్యుడు—కృష్ణమాచార్యుడని, అతడు క్రీ. శ. 1295—1323 వఱకు పాలించిన ద్వితీయ ప్రతాపరుద్రుని సమకాలికుడనీ, వాఙ్మయ చరిత్రకారు లెల్లరు అంగీకరించి గ్రంథస్థము చేసినారు.15

మట్ల అనంతరాజు

మట్ల అనంతరాజునుగూర్చి 18 పుట లున్నవి. వీనిలో 10 పుటలు, చారిత్ర కాంశాలే. గ్రంథకర్తలకు, అనంతరాజు వేయించిన సిద్దవట శాసనము అన్న ఒక పద్య మయ శాసన మున్నదని తెలిసినట్లయితే, ఇన్ని పుటలు వ్రాయవలసిన ఆవశ్యకత లేకపోయేది. ఆ శాసనాన్ని యిచ్చుట ఉదాహరిస్తున్నాను.

---

12. యక్షగాన—దండక— గ్రంథ సంపుటి (8) పుట 2191. పై వానిలో 1, 3 మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగార ప్రచరణలు.
13. ఈతడే పశుపతి నాగనాథుడు—అనపోతానాయుని అయ్యనవ్రోలు శాసనకర్త. విష్ణు పురాణ ప్రథమ రచయిత. ఈతని చరిత్ర కవి చరిత్ర కెక్కినది.
14. మల్లంపల్లి బుచ్చికవి అను వ్యాసము (త్రిలింగ 24—12—49. 3—1—50). ఇందు చాల వివరము లున్నవి.
15. భారతి—1945—సెప్టెంబరు; వచన వాఙ్మయ ప్రథమాచార్యుడు— ఆంధ్రకవితరంగిణి. ఇతర వాఙ్మయ చరిత్రలు.

మట్ల అనంతరాజు సిద్ధవటశాసనము

సీ. శాలివాహన నామ శకవర్షములు వేయు
నేనూట యిరువదియేడు చనిన
విశ్వావసు వసంగ వెలయు వత్సరమున
సకల హిందూ రాజ్య సార్వభౌమ
వీర వేంకటరాయ విభుడు చంద్రగిరీంద్ర
సీమ సామ్రాజ్యంబు చేయునపుడు
భాను వంశాంభోజ భాను డంభోరాశి
గంభీరుడై వరగండమూర్తి
బిరుద సామజ సింహ భీమ కేతన భర్త
దేవ చోడాన్వయ భూవిభుండు—
రణభూ బలీభూత రావెల వెలికొండ
వెంకటాద్రి మహీశ వీరవరుడు
జంబులమడక భూ సంగ్రామ జయశాలి
కటకపురీ చూరకారహారి
నందేల కృష్ణమ నరనాథ భయ దాన
దక్షదోర్దండ విచక్షణుండు.
అఖిల కర్నాట సింహాసనాధీశ్వర
దక్షిణ బాహాభిధాన ధారి
విదళిత కొండ్రాజు వెంకటాద్రి విభుండు
చెన్నూరి హరణ సంపన్న గృహుండు
విబుధ స్తుత కకుత్స్థ విజయ ప్రబంధాది
కావ్య నిబంధన గ్రంథకర్త
శ్రీమ దెల్లమరాజుచెఱువుపేర తటాక
ఘటనానుభావసంఘటితయశుడు
ద్రవిడ భూ మధురాధి రా డచలద్రయ
బలరక్షణాక్షీణ బాహు బలుడు
పెనుగొండ సమర యావన పాదుషా గర్వ
ఖర్వీకరణచణాఖర్వభుజుడు
రంగమాంబా......రవతంస రత్నంబు
పరభీమ బిరుదుల భాయబంట్టి(?)
విమతావనీశ్వర వేశ్యాభుజంగుండు
బలరంగగండాంక భాసురుండు
మన్నెహంవీరుండు మగలరాయుడు రాచ
బెబ్బులి పరరాజ భీకరుండు
మట్ల తిర్వేంగళ మానవాధిపరత్న
రత్నాకరు డనంతరాజశౌరి
తమ తండ్రి యెల్ల భూరమణుండు కొండ్రాజు
తిరుపతిరాజుపై బెరిగి కొట్టి
తన కత్తిమొన దెచ్చుకొనిన సిద్ధవటంబు
చెల్లంగ తన పేర చెఱువుచేసె.

గీ. హృదయ ముప్పొంగ సిద్ధవటేశ్వరునకు
జొపచారికమైన సాలాంతరముగ
పురము చుట్టును వరణమై పరిణమింప
ధాత్రీ గట్టించె నాచంద్రతారకముగ—16

ఈ శాసన కాలము—శా. శ. 1527. క్రీ. శ. 1605. ఈ శాసన రచయిత అనంతరాజే. దీనినిబట్టి విజయములు సాధించిన వెనుక, కకుత్స్థ విజయ రచనానంతరము—ఈ శాసనము వేయించినట్లు విశదమగుచున్నది. విషయములు విశదముగా నున్నవి గాన వివరింపలేదు.

తురగారాజకవి—అయ్యంకి బాలసరస్వతి

తెలుగులో జంటకవిత్వము ప్రారంభించినవారు నంది మల్లయ ఘంట సింగయకవులని 6 వ సంపుటం 228, 254 పుటలలో గ్రంథకర్తలు వ్రాశారు. ఈ శీర్షికలోను అట్లే వ్రాసి, జంట కవుల పట్టికలో వారినే ప్రథములుగా యిచ్చారు. కాని తెలుగులో జంట కవులు నందిమల్లయ ఘంట సింగయ కవులు కారని రంగనాథ రామాయణము—ఉత్తర కాండ రచించిన కాచవిభుడు విఠలరాజు అని-6 వ సంపుటాన్ని విమర్శించినపుడు తెలిపియున్నాను.17

1965 మే నెలలో వెలువడిన 3 వ సంపుటంలో కాచ భూపతి విఠలరాజును గూర్చి వ్రాసినపు డీ విషయము వ్రాయక పోయినా—ఈ ఫిబ్రవరి నెలలో వెలువడిన సంపుటంలో, ఇది వరకు వ్రాసిన విషయాన్ని పురస్కరించుకునైనా దీనిని వ్రాయక పోవడం సమంజసంగాలేదు.

ఈ కవులు వ్రాసిన నాగరఖండము క్రీ. శ. 1891 లో బందరు గొడుగుపేట నివాసులగు—రాయవరపు పూర్ణయ్యాచార్యుల వారిచే ముద్రితమై ప్రకటితమైనది. అందలి పీఠికనుబట్టి చూడగా— ఈ గ్రంథ ముద్రణ 1884 లోనే వారు ప్రారంభించారట. అంతరాయములచేత ఏడేండ్లకు పూర్తి చేశారు.

ఈ ముద్రణ చాలా ప్రశస్తమైనది. దీనికి టీకా తాత్పర్యములు ఉన్నవి. టీకా రచయితలు—మతుకుమల్లి కృష్ణశాస్త్రిగారు.వారు పూర్ణయాచార్యులవారినిగూర్చి 8 నాంది పద్యములు వ్రాసి వానికి టీకా తాత్పర్యాలు వ్రాశారు. ఇందు సృష్టి క్రమము—మేరు పర్వత—సప్త సముద్ర—సప్త ద్వీప విశేషాలు—వాని విస్తీర్ణము-గ్రహ మండలావిర్భావము—విశ్వకర్మ భవన నిర్మాణము—అతని ప్రభావము మున్నగు విషయాలెన్నో వివరింపబడి ఉన్నవి. విశ్వకర్మకులజులకేగాక వీరశైవులకు ఉపాదేయ

---

16. Sources of Vijayanagar History81. శాసన పద్యమంజరి—ప్రథమ భాగము. (1930.) దీనిని ఇంగ్లీషు వివరణతో మద్రాసు విశ్వ విద్యాలయమువారు ప్రకటించిన Selected Inscriptions అను గ్రంథమందు ప్రకటించారు.

17. చూడుడు భారతి—అక్టోబరు 1965. గ్రంథ విమర్శలు—పుట—80.

మైన కావ్యం. రచన సరసము. కైలాసవర్ణననుండి ఒక పద్య ముదాహరిస్తాను.

> హరమకుటేందుచంద్రికలనాని కరంగు విధూపలంబులన్
> దొరగుజలంబు లేఱులయి తుంపెసలారును సానుసీమలన్
> బరువడి గాలి వేగమునఁ బైకి నెదిర్చిన శీకరావళుల్
> సురవనితాకుచాగ్రముల సొంపగు ముత్తెపుపేరులోయనన్

ఈ గ్రంథమేకాక గ్రంథావతారిక బాగా పరిశీలించవలసిన ఆవశ్యకత ఉన్నది.

తరిగొప్పుల మల్లన

మల్లన దత్తాత్రేయ సంప్రదాయానికిచెందిన కవి. చంద్రభానుచరిత్రలో మాహుర క్షేత్రాన్ని పేర్కొనడమే దీనికి తార్కాణం. తెలుగుదేశంలో దత్తాత్రేయుని యోగీశ్వరనిగానే భావించినట్లు కనబడుతుంది. కేవలమూ దైవముగా భావించినట్లు లేదు. ఇందుచేతనే కాబోలు, సంస్కృత మూలంలో నైషధీయ చరిత్రలో దత్తాత్రేయ స్తుతి(20 వ సర్గ 100 వ శ్లోకము) ఉండగా శ్రీనాథ మహాకవి తెలుగు నైషధంలో ఆస్తుతి విడిచి పెట్టాడు. మల్లన చంద్రభానుచరిత్రలో 'అంతట రుక్మ బాహు వసుధాధిప నందన' అనే పద్యాన్నే అప్పకవి చంద్రికా పరిణయములోనిదిగా ఉదాహరించాడు. (3—183.)

చంద్రికా పరిణయము వ్రాసిన సురభి మాధవరాయకవి మల్లనకు 'సమీప కాలంలో' అర్వాచీనుడు కాడు. ఆతడు క్రీ. శ. 1650 ప్రాంతమువాడు.

అజ్జరపు పేరయలింగం '

పేరయ లింగకవి ఒడయనంబివిలాసమును గూర్చి వ్రాసిన విషయాలుచూస్తే గ్రంథకర్తలు, మూల గ్రంథం పరిశీలింపకుండగనే, ఇతరుల రచనలనే ఆధారంగా చేసుకొని వ్రాసినట్లు స్పష్టమవుతుంది. తమిళ, కన్నడ, తెలుగు దేశాల శైవ వాఙ్మయంలో ఒడయనంబి కథ ప్రచుర ప్రచారంతో ఉన్నది. ఒడయనంబి తమిళుడైనా—అతని చరిత్రలో చంటి నుండి శివుడు ప్రత్యక్షమైన కథ తెలుగు దేశంలోనే సంఘటించినదని—పేరయలింగం కృతి తెలుపుతుంది. ఈనాటి వారికిది విడ్డూరంగా తోచినా, తెలుగు సాహిత్యంలో పదకొండవ శతాబ్ది నుండి నంబికథ నిలిచియేయున్నది. గ్రంథ విస్తర భీతిచేత యీ విషయం విస్తరించను.

ఒడయనంబివిలాసం—శైవ వాఙ్మయ గ్రంథంగా పరిగణితమైనా, అది తెలుగు సాహిత్యంలో పద్య కావ్యాలలో ఒక ప్రత్యేకత గడించింది. ఆంధ్రదేశం— ఆంధ్ర ప్రజానీకం— ఆహార విహారాలు—పాల్కురికి సోమనాథ శ్రీనాథుల తరువాత పేరయలింగకవే విశదంగా వర్ణించాడని విజ్ఞుల అభిప్రాయం. దీనికన్న మించిన విషయం మఱొకటి.

తెలుగు సాహిత్యంలో, ప్రాచీనకాలంనుండి పేరయలింగకవి కావ్యంవరకు భార్యపేరుదాహరించిన ప్రబంధముగాని కావ్యముగానిలేదు. ఒడయనంబివిలాసంలో భార్యను గూర్చి వ్రాసిన విషయంచూస్తే, అది భార్య కంకితముగా ధ్వనింపజేసినట్లు స్పష్టమవుతుంది-పేరయలింగం—ఆశ్వాసాంత గద్యలో ఇట్లున్నది.

''ఇది శ్రీమదివటూరి పెదరామనాథ గురూపదిష్ట శైవ పంచాక్షర జపపరాయణ లింగప్రాణిపాదారవింద వందనానంద భారద్వాజగోత్ర పేరయామాత్యపౌత్ర కొండమంత్రి బాపమాంబా సుపుత్ర—యల్లమా కళత్ర అజ్జరపు కుల పవిత్ర పేరయలింగ నామధేయ ప్రణీతంబైన యొడయనంబి విలాసం బను మహా ప్రబంధంబునందు షష్ఠాశ్వాసము.''

పై గద్యలో 'ఎల్లమాకళత్ర' అన్న విశేషణము గమనింపదగినది. పూర్వ కవు లెవ్వరునూ తల్లిపేరేగాని భార్యపేరు తలపెట్టనే తలపెట్టరు. అట్టి సందర్భములో తన భార్యపేరు శాశ్వతముగా తన పేరుతో అనుసంధించిన పేరయ లింగకవి ప్రగతి దృక్పథం ప్రశంసనీయం!18-19

గ్రంథం మొదటి పద్యమే ఈ నూతన భావాన్ని సమర్థిస్తుంది.

> సీ. శ్రీకంఠు పద పద్మసేవచే నాదిమ
> శివభక్తి రూఢిచే జెలగినాడ
> పెంపొంద నివటూరి పెదరామగురువర్య
> దత్తమంత్రస్ఫూర్తి దనరినాడ
> మహిత భారద్వాజమౌని సద్గోత్రాంబు
> రాశి చంద్రుండన ప్రబలినాడ
> ఘన సాధ్వి పాపాంబకును గొండమంత్రికి
> బుత్ర రత్నంబన బొలిచినాడ
>
> గీ. సరవి నెల్లాఖ్య కులసతీసదయహృదయ
> పద్మపద్మాప్త మూర్తియై ప్రబలినాడ
> నజ్జరపుసత్కు లాధ్యక్షు డనగ బుధులు
> లెస్సగానెంచ బేరయలింగ కవిని.

పై పద్యములో ఎల్లాఖ్య కులసతీ సదయహృదయ పద్మ పద్మాప్తమూర్తిని—అన్న పాదములు—రెండును చూడగానే

''పద్మావతీ చరణ చారణ చక్రవర్తి'' అన్న జయదేవుని గీతగోవింద వాక్యము స్మరణకు రాకమానదు.

డెబ్బయి యేండ్ల క్రిందట అచ్చుపడి అలభ్యంగా ఉన్న ఒడయనంబి విలాసం గుజిలీ ప్రతిని—కోమల రూపంతో ముద్రణలో దిద్దితీరిస్తే—అది నవ్య ప్రబంధ విలాసంగా భాసిస్తుంది.

18-19. కన్నడభాషలో క్రీ.శ. 990 ప్రాంతములలో ఉన్న మొదటి నాగవర్మ తన ఛందోంబుధిని తన భార్యకే కృతియిచ్చాడు. తెలుగు కవులలో పేరయలింగము వెనుక, కూచిమంచి తిమ్మకవి తన భార్య పేరు చెప్పాడు. ఇంకా కొంతమంది చెప్పారు. నవ్య సాహితీ విమర్శకులు గవేషణ చేస్తారని భావిస్తాను.

Statement about ownership and other particulars about newspaper

BHARATI

1. Place of Publication : Madras
2. Periodicity of its publication : Monthly
3. Printer's Name : Sri S. Radhakrishna
   Nationality: Indian
   Address: 6&7, Thambu Chetty Street, Madras-1.
4. Publisher's Name : Sri S. Radhakrishna
   Nationality: Indian
   Address : (As above)
5. Editor's Name: Sri S. Sambhu Prasad
   Nationality Indian
   Address: 29, Chamier's Road, Madras-28.
6. Names and addresses of individuals who own the newspaper and partners or share-holders holding more than one percent of the total capital.

NAMES	ADDRESSES
1. Mr. S. Sambhu Prasad	29, Chamier's Road, Madras-28.
2. Mrs. S. Kamakshamma	Do
3. Mr. S. Nageswara Rao	Do
4. Mr. S. Radhakrishna	6 & 7, Thambu Chetty Street, Madras-1.

I, S. Radhakrishna, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

S. RADHAKRISHNA,

1-3-66. Signature of Publisher.

బొడ్డుచెర్ల తిమ్మన

ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధకర్త బొడ్డుచెర్ల తిమ్మన అనీ, అతడు కృష్ణరాయల కాలమువాడని యిదివరకే నిరూపించి యున్నాను.[20] ఈ సందర్భమున దీనికి సంబంధించిన మఱియొక కొప్పోలు వృత్తాంతమును ఉదాహరిస్తున్నాను.[21]

కొప్పోలు వృత్తాంతము

"శ్రీ కృష్ణదేవరాయలచేఁ గొప్పోలు గ్రామమును బొడ్డుచెర్ల తిమ్మన యగ్రహారముగా బడసెను. ఆ తిమ్మన మంత్రి కుమారుడు వెంగన్న యా కొప్పోలు గ్రామమునకు బావఘ్ని నది నుండి కాలువ త్రవ్వించి నాగులకుంట యనుపేర నొక చెఱువు త్రవ్వించి యా నీటిచేతఁ దన యగ్రహారము గావించుకొని యుపపన్నుడగుచుండెనట. దాని కోర్వక తన కేదో నష్టము గలుగుచున్నదని వెంబాక నాగిరెడ్డి యను నాతడు తద్గ్రామాధికారిగానున్న పోచిరాజు ఓబన్న తోడ్పాటున వెంగన్న మీద తగవు సాగించెనట. అప్పుడు దేశాధీశ్వరుడుగా నున్న మట్ల కుమారనంతరాజుగారి కడకేగి బొడ్డుచెర్ల వెంగన్న విన్నవించుకొన్న విధము :

సీ. కొప్పోలు కవి దిశాకుంజరంబులమీద
గోలాహలంబాడేఁ గోలకట్టె
తగఁ గృష్ణరాయేంద్ర దత్తాగ్రహారంబు
నాశంబుగా బూనె నాగిరెడ్డి
యారాజనరనాథ ? కృతమైన పెనుగాల్వ
కూలఁద్రొబ్బగఁబుట్టె గుంటకట్ట
వెలయువామనమహోత్పలశాసనంబులు ?
, తల్లడంబులుచేసి నల్లడహహ
గీ. విని పరామరిసించు మా విన్నపంబు
చిత్తమున నుంచు పోషితాశ్రితకలాప
మట్లకులదీప మత్తారి వంశహరద
నర్గళ ప్రతాప కుమార యనంత భూప.

దీనిపై అనంతరాజుగారు వెంగన్న కనుకూలముగా దగవు దీర్చిరట!". దీని వెనుక పోచిరాజు ఓబనమీద బొడ్డుచెర్ల వెంగన చెప్పిన పద్యములు రెండు గలవు.

ఇదియును—బొడ్డుచెర్ల తిమ్మన కర్తృత్వమునే స్థిరపఱచును. బొడ్డుచెర్ల తిమ్మనను గూర్చి తొలుత చెప్పిన గురజాడ శ్రీరామమూర్తిగారు నీ విషయము చెప్పినారు.[22]

" కామలాపురమునకు రెండు పరుగుల దూరమున నాగ్నేయమున కొప్పులూరను గ్రామము కృష్ణరాయలతో చదరంగ

---

20. భారతి—మార్చి—1963.

21. చాటుపద్యమణిమంజరి. ద్వితీయ భాగము. (పూర్వ ముద్రణము.) 1922—పుట—119—120.

22. కవి జీవితములు—కృష్ణరాయలు. పుట 521 (1893)

మాడి గెలుచుకొన్న తిమ్మన్న యను నాంధ్రకవీశ్వరునకు బ్రాహ్మణునకు సర్వమాన్యాగ్రహారముగా నిచ్చెను.—''

బిజ్జుల తిమ్మరాజు

ఈతనిపేరు బిజ్జుల తిమ్మరాజుగాని 'బిజ్జల' తిమ్మరాజు కాదు. తెలుగు అనర్ఘరాఘవము వ్రాతప్రతిలోను, ముద్రిత ప్రతిలోనూ 'బిజ్జుల' అనియే యున్నది. 'బిజ్జుల' అను రూపమే కాని 'బిజ్జల' రూపము కానట్లు అవతారికలోని యీ క్రింది పద్యపాదము నిర్ధారణ చేస్తున్నది.

గీ. . . . .
మహిత పాతివ్రతీ మహామహిమ ననమ
సుగుణ నికురంబయగుచు బిజ్జులకులేందు
కొండ భూపాల చంద్రు శ్రీ గోపమాంబ (1—56)

మువ్వురుయియేండ్లు క్రిందటనే సంపూర్ణంగా ముద్రిత మైనా, ఈ అనర్ఘరాఘవ నాటకాన్నిగూర్చి గ్రంథకర్తలు యిలా వ్రాశారు.

"పిల్ల మురారి నాటకమైన ప్రసన్న రాఘవానికి అనువాదం అచ్చుపడి తల్లి మురారి నాటకమైన అనర్ఘరాఘవం తెనిగింపు అచ్చుపడకపోవడం అన్యాయమే.''

మూలం—ఏడు అంకాల నాటకాన్ని 5 ఆశ్వాసాలలో 1546 పద్యాలతో (1—280; 2—414; 3—226; 4—361; 5—265) తిమ్మరాజు అనువదించాడు.

తెలుగులో పాల్కురికి సోమనాథ శ్రీనాథాది మహాకవుల కనుసరణీయుడైన—మురారి—ఆంధ్ర దేశీయుడని కీర్తిశేషులు కొమర్రాజు వెంకట లక్ష్మణరావుగారు సోపపత్తికంగా చాలా కాలం క్రిందట నిరూపించారు.23 మురారి క్రీ. శ. 850 కి తరువాతివాడని, క్రీ. శ. 920 ప్రాంతములో ఉన్న రాజశేఖర కవికి—వృద్ధసమకాలికుడని ఈవలకే నిర్ణీతమైనది.24 తిమ్మరాజు ఆంధ్రీకరణ విధానాన్ని సూచించడానికి, సప్తమాంకంలో ఒక ఘట్టాన్ని మూలంతో కూడ ఉదాహరిస్తున్నాను.

విభీషణః—(దక్షిణతో దర్శయన్) దేవ! ప్రణత్యతామయ మంధ్ర విషయ లక్ష్మ్యాః సప్త గోదావరీహారకలాపైకనాయకో భగవాన్ భీమేశ్వర—అయంహి.

శ్లో. తత్కాలారభటీ విజృంభణ పరిత్రాసాదివ భ్రశ్యతా
వామార్ధేన తదేక శేష చరణం బిభ్రద్వపుర్భైరవమ్
తుల్యం చాస్థి భుజంగ భూషణ మసౌ భోగీంద్రకంకాళకై
ర్బిభ్రాణః పరమేశ్వరో విజయతే కల్పాన్త కర్మాన్తికః
రామః—(కృతాంజలిః) (103)

శ్లో. నృత్యారంభపరిత్రసద్గిరిసుతా రిక్తార్ధ సంపూర్తయే
నిర్వ్యాఘ్ర భ్రమి విభ్రమాయ జగతామీశాయ తుభ్యంనమః
యశ్చూడా భుజగేశ్వర ప్రభృతిభిస్తైర్దృగ్భువస్త్రిదశః
వశ్యద్భిర్భ్రమ ఘూర్ణమాననయనైః శాన్తో పినశ్రద్ధధే (104)

అపిచ—శ్లో. క్రీడానటస్య ప్రళయాంధకారైః
కంఠేనపీతేతవ నీలకంఠః
పృథక్కబంధం పృథగుత్తమాంగమ్
నృత్యద్భయాద్వైక్షిత కాలరాత్రిః (105)

తెలుగు గీ. నావుడు విభీషణుండు దక్షిణంబు చూపి
తెలియ నిట్లనె నిది యాంధ్ర దేశలక్ష్మి
పూను గోదావరీనాయకంబునకు నాయ
కంబు భీమేశ లింగంబు గాననయ్యె (5—178)

మ. అలకాలంబునఁ బుట్టి బిట్టడరు నత్యంతార్భటీధాటి భీ
తిలి వామార్ధముజార నేక చరణాప్తిన్ భైరవంబై నమే
నలరన్ శేష కళేబరంబును సమంబౌ నట్టుగాఁ గీకసా
హికల సొమ్మొని లయాంత యాజ్ఞికతచే నొప్పారు
నీతండిలన్ (5—179)

అనిన విని పరమానంద కందళిత హృదయారవిందుండై రఘునందనుండు కృతాంజలియై యిట్లనియె. (5—180)

మ. భ్రమదాశా నిచయంబుఁ జూచుచు
జటాభ్యర్ణాహి రాణ్ముఖ్యులో
క్క మొగిన్ ఘూర్ణిత వక్త్రులై యలసినం
గానీ నినున్నమ్మరై
రి మదిందన్నటపత్ర సద్గిరిసుతారిక్తార్ధసంపూర్తికై
భ్రమిఁ గావించితినట్టి నీకు
ద్రిజత్వాలా! నతు ల్సేసే సెదన్ (5—181)

క. గళము ప్రళయాంధ తిమిరము
గిళనం బొనరింప వేఱ గిరికొని నృత్యం
బులు సలుపు కబంధ శిరం
బులు గనుగొని కాళరాత్రి పొందెన్ భీతిన్ (5—182)

శతకవులు—మారనవెంకయ్య

భాస్కర శతకకర్త మారన వెంకయ్య అని యీ గ్రంథమున కలదు. కాని ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారపు ప్రతిలో (సంఖ్య 1646) గ్రంథాంతమున నీ క్రింది రీతిగా ఉన్నది.

"ఇది శ్రీ సూర్యనారాయణ వర ప్రసాద లబ్ద కవితా మహత్వంబున మారవికవిత్వంబునుభాస్కరశతకము అష్టోత్తర వృత్తములు సంపూర్ణము శ్రీ సూర్యనారాయణార్పణమస్తు.''

పై దానిలో 'మారవి' అని కలదు. ఈ శతకమునకు వ్యాఖ్యానము కలదు. వ్యాఖ్యానముగల ప్రతులు — 1636

---

23. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము. ద్వితీయ ముద్రణము. ఆంధ్ర గ్రంథమాలా ప్రచురణ (1943). ప్రథమ సంపుటము. 25—26 పుటలు.

24. మురారి అనర్ఘ రాఘవ నాటక సమాలోచనము. శ్రీ ఈయుణ్ణి వెంకట వీర రాఘవాచార్యులుగారు.(1937) ఇందు మురారికవిని గూర్చి ప్రశస్తమైన విమర్శ గలదు.

1637, 1638 మూడున్నవి. ఈ ప్రతులలో 110 పద్యము లున్నవి. ఈ ప్రతులవివరముగాని 110 పద్య సంఖ్య విషయము గాని యిందు లేవు.

చ. భుజ బల శౌర్యవంతులగు పుత్రుల గాంచినవారికెయ్యెడన్
నిజ హృదయేప్సితార్థములు నిక్కము చేకురు కుంతిదేవికిన్
విజయ బలాఢ్యు డర్జునుడు వీర పరాక్రమ మొప్ప దేవతా
గజమును దెచ్చి తల్లి వ్రత కార్యము దీర్చడె తొల్లి భాస్కరా

ఇది గజ గౌరీ వ్రత కథకు సంబంధించినది. ఈ కథ తెలుగు భారతమునలేదు. కన్నడభారతమున నున్నది. తెలుగున అమృతకవి త్రిపురారికవి వ్రాసిన ఐరావత చరిత్ర పద్య కావ్యమందలి యితివృత్తము పై కథయే. దీనినిబట్టి భాస్కర శతక రచన, 1550 ప్రాంతమునాటిదని చెప్పవచ్చును. హిరణ్య కశిపన్ దనుజుండు'—కొలంకు—ఇత్యాది ప్రయోగము లిందు గలవు. అముద్రిత వ్యాఖ్యానముతో భాస్కర శతకము ముద్రితము కాదగినది.

శతానందయోగి

ఇతడు 'శాంతానందయోగి' కాని శతానంద యోగి కాడు. శతకకవుల చరిత్రలో 'శాంతానంద యోగి' అనే ఉన్నది.25 ఇతడు 'శాంతానంద యోగి'యే కాని వేఱొకడు కాడనుటకు ఈ గ్రంథంలో ఉదాహరింపబడ్డ కంద పద్యాలు—మూడు.—

(1) వెన్నెల కందము పున్నమ (2) పురుషు సుషుప్తి జేసియు (3) వనితలచే శృంగారము—అనునవి శతకకవుల చరిత్రలో శాంతానందయోగి శీర్షిక క్రిందనే యున్నవి.

పట్టాభిరామ కవి

మరున్నందన శతక కర్త— చిత్రకవి పెద్దన యని నా తలంపు.26 అప్పకవి ఉదాహరించిన ''కోపాటోపము కుప్పిగంతులు'' అన్న పద్య మొకటే యీ వరకు తెలిసినది. కాని నేను మఱొక పద్యం కనిపెట్టాను. అది కాచిరాజు బసవన ప్రయోగసారంలో ఉన్నది.

నీబం టెవ్వడు వాని బంటను సమీ నిర్నిద్ర శౌర్యాధిక
ప్రాబల్యోజ్జ్వల కింకిణీ కరణసౌభాగ్యంబు లెవ్వానికా
శాబా సక్ష కుమార సంహరణ ముష్టాముష్టి సంగ్రామ బా
హాపాటవ్వరరామదాస తవదాసోమ్మరున్నందనా.

గువ్వలచెన్నడు

గువ్వలచెన్నని, తరువాతి కవు లెవ్వరూ స్తుతించకపోయినా కొక్కొండవారు తమ బిల్వేశ్వరీయంలో యిట్లు ప్రశంసించారు.

క. ఎవ్వరు కవి సంశ్లాఘ్యులొ
ఇ వ్వసుమతి వారె పుట్టు వెనసిన వారల్
నువ్వె మరి కీర్తి నిత్యులు
గువ్వల చెన్నండుగాదె గుణి పరికింపన్
ప్రథమ బింబము 173 పద్యం.

ప్రాచీన నవీన సాహితీ సంస్కృతులకు ప్రతిబింబమని చెప్పదగిన బిల్వేశ్వరీయంలో అద్భుత విషయా లెన్నో ఉన్నవి. ఆ గ్రంథాన్ని సావధానంగా పరిశీలిస్తే వీరేశలింగం పంతులుగారి కన్న కొక్కొండవారే నవ్యయుగప్రవర్తకులని స్పష్టమవుతుంది. నవయుగ చరిత్రకారు లెవ్వరూ, ఇంతవరకు ఈ విషయాన్ని స్పృశించినట్లే కన్పట్టదు.

ఇతరకవులు

ఎల్లకర నృసింహకవి

ఈతని గూర్చి యిదివరకే తెలుపబడియున్నది.'27

భాస్కరాచార్యులు

వైశ్యపురాణకర్త అయిన భాస్కరాచార్యులు క్రీ. శ. 1528లో అనగా కృష్ణదేవరాయల కాలంలో ఉన్నట్లు శాసన నిదర్శనమున్నది. ఈ వైశ్యపురాణములో ''ఉష్ణీషంబున గట్టవచ్చునే మదవ్యాఘ్రోగ్రశుండాలమున్'' అన్న అథర్వణుని కవితా ఛాయలు కానవస్తున్నవి. వైశ్య పురాణాన్ని పద్య కావ్యంగా కాక, ద్విపద కావ్యంగాకూడా భాస్కరాచార్యులు రచించాడు.28 ఇది 'నగరి'లోని వైశ్యుల కంకితం—ఇది అముద్రితం.

''తెనుగుంగావ్యముజెప్పవయ్య మృదువై దేశియమై భవ్యమై
వినవింపై, సరసత్వమై విరళమై విఖ్యాతమై కీర్తిమై
జనతా మోదక హృద్య పద్య యుతమై సద్ధర్మమై చోద్యమై
తనరం బల్కవె చింత యేలయనుచున్ ధర్మజ్ఞ భాషింపవే''
ఇట్లాంటి పద్యమే—ఒకటి వ్యాప్తిలో ఉంది.
తెనుగుం బద్యము సెప్పనేర్తు మృదువై దేశీయమై భారమై
వినవింపై రసవంతమై, జతనమై, విఖ్యాతమై, మార్గమై
జనితానంద వసుంధరావలయమై, శాస్త్రోక్తమై యుక్తమై
ఘనమై లక్ష్యనిబద్ధమై, నిబిడమై, కల్పాంతర స్థాయిగాన్.
ఏది ముందు ఏది వెనకో?

మల్లారెడ్డి దేశాయి

గంగాపుర మాహాత్మ్యం-ఇది అముద్రితం అని వ్రాయడం సరికాదు. క్రీ. శ. 1946 లో హైదరాబాదు విజ్ఞాన వర్ధనీ పరిషత్తువారు సికిందరాబాదు ఓరియంట్ ముద్రాక్షరశాలలో దీనిని ముద్రించారు. ఈ కృతిని ప్రకాశింప జేసినవారు కృతికర్త మల్లారెడ్డి వంశీయులైన రామకృష్ణారెడ్డి దేశముఖు. దీనికి కీర్తిశేషులు సురవరం ప్రతాపరెడ్డిగారు, 27 పుటల విపుల

25. పూర్వముద్రణ 379.
26. లక్షణ సారసంగ్రహము—పీఠిక—పుట 4. ఆంధ్ర సాహిత్య పరిషత్ప్రచురితము.
27. ఆంధ్ర వచన వాఙ్మయము—పుట. 39. ద్విపద వాఙ్మయ సూచిక. పుట 52.
28. ద్విపద కావ్య సంపుటి. (4) సంఖ్య 1011.

పీఠిక వ్రాశారు. అది చదివినట్లయితే—మల్లారెడ్డి తనస్వస్థానం గొప్పదని వ్రాశాడో—చారిత్రక విషయాలు స్థానికంగా ప్రచారంలో ఉన్నవి ప్రచారం చేయడానికి వ్రాశాడో—స్పష్టమవుతుంది. ఈ కావ్యం మొదటినుండి 4 వ ఆశ్వాసంలో 410 పద్యాలవరకు లభిస్తున్నది. గంగాపురం—తెలుగు దేశంలో బహు ప్రాచీనమైన పురాల్లో ఒకటి.

పొన్నతోట ఓబళకవి

ఓబళ కవిని గురించి గ్రంథకర్తలు ఈ సంపుటంలో క్రొత్తగా తెలిపినట్లుగా—మద్రాసు—ట్రైకేట్లాగు సంఖ్య—ఆర్. 607 సంఖ్య యిచ్చారు. పుట 234. కాని ఓబళ కవిని గూర్చి అతని పోషకుడైన ఇమ్మడి జగదేవరాయనిగూర్చి దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము (ఇది గ్రంథకర్తలుదాహరించినదే) లో 483—488 పుటలలోను, 492—494 పుటలలోను వివరా లున్నవి. ఇమ్మడి జగదేవరాయడు మైసూరి రాజ్యంలో చెన్నపట్టణాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. ఆ చారిత్రకాంశాలు—పై గ్రంథంలోనే ఉన్నవి.

కావూరియెల్లన

కస్తూరి రంగకవి, తన ఛందోగ్రంథంలో "సమదేభాళి' అన్న వృత్తాన్ని ఉదాహరిస్తూ, అది బ్రహ్మాండ పురాణము నుండి అని వ్రాశాడు. కాని ఆ పద్యమే శూద్రక రాజ చరిత్ర నుండి అని యితర లాక్షణికులు పేర్కొన్నారు. దీనినిబట్టి కస్తూరి రంగకవికిముందు ఒక బ్రహ్మాండ పురాణం ఉన్నట్లు స్పష్టపడుతున్నది. అది కావూరియెల్లన దైతే ఆతడు రంగకవికంటే ముందువాడని వూహించవచ్చును.

గూళికల్లు వెంకటరమణకవి

ఈతడు క్రీ. శ. 1600 ప్రాంతాల వాడెంతమాత్రము కాడు. వీరేశలింగంగారు, ఈతనిగూర్చి నూరేండ్ల క్రిందటివాడని (క్రీ. శ. 1895 లో) వ్రాశారు. ఈతని గురువు సుమతీంద్రుడు. మధ్వయతి.రాఘవేంద్రయతి వెనుక మఠాధిపత్యం స్వీకరించాడు. ఈతడు క్రీ. శ. 1770 ప్రాంతంలో ఉన్నవాడు. "ఇతని హరివంశం నామమాత్రావశిష్టమయింది" అని 236 పుటలో ఉన్నది. ఇంతేకాదు. ఈతని కనక రంజిత శిఖామణీ పరిణయం, అసమగ్రం, అముద్రితం అని 237 వ పుటలో ఉన్నవి. ఇవి గ్రంథాలు పరిశీలింపకుండా వ్రాసినవి. వెంకట రమణ కవి హరివంశము, కనక రంజిత శిఖామణీ పరిణయము—రెండు నెల్లూరిలో 46 యేండ్ల క్రిందట "వాగ్వల్లి" అనే పత్రికలో ముద్రితములై ప్రకటితమైనవి.

మోచర్ల నన్నయ్య

మోచర్ల నన్నయ సాంబోపాఖ్యానంనుండి-అప్పకవి పద్యము లుదాహరించినాడని—అందుచేత—నన్నయ అప్పకవికి పూర్వుడని 240 పుటలో గ్రంథకర్తలు వ్రాసి, ఈ సంపుటంలో అతని చేర్చారు. కాని అప్పకవి ఉదాహరించిన పద్యాలు—(3—102, 3—128) సాంబోపాఖ్యానంలోనివికావు. అచ్చులోఉన్న కనబడుతూన్న పేరునుబట్టి భ్రమించారు.అప్పకవీయం తాళపత్ర ప్రతులు చూస్తే తెలుస్తుంది. వానిలో 'సాంబ విలాసము' అని ఉన్నదిగాని సాంబోపాఖ్యానమనిలేదు. ఈ 'సాంబ విలాసము' చిత్రకవి పెద్దన మనుమడు—అనంతకవి కొడుకూ అయిన వెంకటరమణకవికృతము.

నారన సూరన

ఈతనినిగూర్చి—ఇతర కవుల శీర్షికలో 18 పంక్తులు వ్రాయడంచూచినట్లయితే ఈ గ్రంథరచనావిధాన మెట్లున్నది విశదమవుతుంది. సూరననుగూర్చి మానవల్లివా రేమన్నారో చూడండి.

"సూరన వనమాలివిలాసము నుదయనోదయమును రచించెను......ఇక్కవి కవిత యపార మాధుర్యము గలది. మనోహరమగు శబ్ద సంచయమును లలితభావములునుగల బృహత్కథను రచించిన యిమ్మహాకవి వాసవదత్తా వివాహ కథను ముగించి పరలోక ప్రాప్తుడయ్యెను. ఆ యుత్తమ గ్రంథము సాంతముగా రచించి యుండునేని యీ సూరన తిక్కనాదులతో యశస్తుల్యమున దులఁ దూగుచుండును."[29]

సూరన రెండు కావ్యాలనుండి—అరవై పద్యాలు క్రీ. శ. 1700 లకు ముందు వెలసిన సంకలనగ్రంథంలో ఉదహరింపబడి ఉన్నవి. వేటూరివారు వీనిని గూర్చి వ్రాశారు.

ఎలుగంటి పెద్దన్న

"ఈయన యేవూరివాడో,ఎప్పటివాడోసరిగ్గాతెలియదు" (పుట 247). అప్పుడీ సంపుటములోని కెట్లా వచ్చాడో దురూహ్యం.

బద్దెవీటి దత్తప్ప

ఈతనిగూర్చి—దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయం 489 వ పుటలో ఉన్నది. ఇది చూడకపోవుటచేత దత్తప్ప గణిత దీపికకు వ్యాఖ్యానమున్నమాట యిందులేదు.

మల్లవరపు వీరేశ్వరుడు

ఇతడు మల్లవరపు 'వాలేశ్వరుడు' కాని వీరేశ్వరుడు కాడు. వ్రాత ప్రతులందేకాక, కవుల చరిత్రలోను 'వాలేశ్వరుడు' అనియే కలదు. బహుజనపల్లివారు శబ్దరత్నాకరంలో 'వాలేశ్వరుడు' అనే వ్రాశారు. వారికవి కృతి భల్లాణచరిత్రనుండి చాలా ప్రయోగా లిచ్చారు.భల్లాణుని కథ ప్రత్యేకంగా ప్రథమంగా

29. ప్రబంధమణిభూషణము—పీఠిక 6 వ పుట.

వ్రాయడమే దీని ప్రత్యేకత. భల్లాణకథనే కవిసార్వభౌముడు కూచిమంచి తిమ్మకవి రాజశేఖర చరిత్ర అనే ప్రౌఢ ప్రబంధంగా రచించాడు. ఇతడు—అజ్జరపు పేరయలింగం సమకాలికులు.

కంచి వీరశరభయ్య

వీరశరభకవి శంకరకవికి రెండు శతాబ్దాలు తర్వాతి వాడు. ప్రసిద్ధ శైవారాధ్యుడు—కైలాసవాసి కాశీనాధుని నాగేశ్వరరావుపంతులుగారికి అయిదవతరం పూర్వుడూ అయిన కాశీనాథుని వీరనారాధ్య డీతని మాతామహుడు. ఈతని కాలం క్రీ. శ. 1700 ప్రాంతము. కాబట్టి వీరశరభకవి 1750—80 ప్రాంతాలవాడు.

చెన్నబసవయ్య

ఈతని పేరు—కాశీ చెన్నబసవేశ్వరుడు—తాను 'చెన్న బసవేశ్వరుడను' అనే తన గ్రంథంలో చెప్పుకొన్నాడు. ఈతని గూర్చి యిదివరకే తెలుపబడినది![30]

ముకుందయోగి

ఇతని గ్రంథం—'శ్రీరంగ మాహాత్మ్యం 'అముద్రితం' అని ఉన్నది. పుట—261. కాని యిది 1892 లో మద్రాసులో రంగ నాయక విలాస ముద్రాక్షరశాలలో ముద్రితమైనది.

ఈ సమగ్ర ఆంధ్ర వాఙ్మయ సమీక్షలో కేవలము వాఙ్మయ చారిత్రక విషయాలే తప్ప సాహిత్య విషయాలు చర్చింపబడలేదని పాఠక లోకానికి విన్నవిస్తున్నాను.

[సమగ్ర ఆంధ్ర సాహిత్యం, తొమ్మిదవ సంపుటము. రచయిత: శ్రీ ఆరుద్ర. వెల రు 5 లు. ప్రాప్తిస్థానము: ఎం. శేషాచలం అండ్ కంపెనీ, మచిలీపట్నం, మద్రాసు, సికింద్రాబాదు.]

---

30. ఆంధ్ర వచన వాఙ్మయము పుట 43—44.



సామెతలు: ఛందస్సామ్యతలు

శ్రీ బండి నాగరాజు

"సామెతలు" వైకృతమని శబ్దరత్నాకరము. 'ఇది ప్రకృతి శబ్దార్థము కంటె భిన్నమగు నర్థమును దెలుపునది' అని సూచించు నక్షత్ర చిహ్నము (*) గూడ అందు గుర్తింపబడినది. 'సామెత'కు ఒక ప్రకృతి ఉండవలెను; ఆ ప్రకృతి శబ్దార్థము, "లోకోక్తి" అను నర్థము కంటె భిన్నము కావలెను— అని బహుజనపల్లి సీతారామాచార్యులవారి అభిప్రాయము.

'సామ్యత' అను పదము నుండి 'సామెత' ఏర్పడి యుండవచ్చునని చిలుకూరి నారాయణరావు గారి మతము.

సమము యుక్క భావము సామ్యము; దానిపై మరల నొక భావార్థక తద్ధిత ప్రత్యయము వచ్చుట— సామ్యత అగుట—అశాస్త్రీయము. కాని, తెలుగువారి నోట ఇట్టివి "ప్రాముఖ్యత" పొంది ఇంపితములే ఐనవి !

సామ్యత, సామెత అయిపోయినది.
సామ్యత=సామ్+యత, సామ్+యెత,
సామ్+ఎత, సామ్మెత,
సామెత.

ఈవిధముగా శబ్ద విపరిణామము పొందినట్లు వూహింపవచ్చును. అంతేకాదు, అది సామిత, సామితె గూడ అయినది. వాడుకలో సావిత, సావితె గూడ గలవు !

ఐతే, ఇది సమతాశబ్దభవమని బ్రౌణ్యము.

"సామిత, సామితె or సామెత Samita. [from Skt. సమతా.] n. A Proverb, a Comman Saying, ఒక సంగతికి దృష్టాంతముగా లోకులు వాడుకగా చెప్పే మాట, లోకోక్తి."[1]

సామెత అనగా లోకోక్తి; కాని, సామ్యత అనగా సమత్వము (పోలిక). ఈ రెండు అర్థములకును పొందిక లేదు. అందువలననే శబ్దరత్నాకరము, సమానత్వమను ప్రకృతి శబ్దార్థము కంటె లోకోక్తి అను నర్థము భిన్నమని సూచించినది; ఇట్టి అర్థ విపరిణామము ప్రకృతి వికృతుల యెడ గలదనుట పండిత సంప్రదాయము. ఆ సంప్రదాయమును ఆశ్రయించి ఆచార్యులవారు సర్దిపెట్టినారు !

కాని, సామెతకు సామ్యత—2 పోలిక మాట— అని అర్థము చెప్పుటయు సరసమని భావింపనగును. అట్టి భావనకు, మనకు రెండు అవకాశము లున్నవి : (1) సమయము, (2) స్వరూపము.

సామెతను మనము ఎట్టి సమయములందు ఉపయోగింతుము ?

మనము మాటలాడు సమయమునకు, ఉపయోగింపబడు సామెతకు సందర్భానుగుణ్యమైన 'సామ్యత' ఉండవలెను గదా ? అట్టి సామ్యత లేనిచో ఆ సామెతకు గల బలము వ్యత్యస్తమగును.

1. "ఆడలేనమ్మ, మద్దెల—ఓడన్నదట !"

ఈ సామెతను, సామర్థ్యము లేనివాడు చెప్పెడు సాకును కొట్టివేయుటకు—లేదా చెప్పబడిన సాకు బలహీనమైన దనుటకు—ఉపయోగింతుము. ఆడలేనమ్మకు, సామర్థ్యము లేనివానికి సామ్యత

1. Brown's Telugu-English Dictionary.

2. బ్రౌను దొరవారి అభిప్రాయానుసారము 'దృష్టాంతపు మాట' అనవచ్చును. బింబ ప్రతిబింబ భావము గలది దృష్టాంతము.

సూచింపబడుచున్నది యీ వ్యవహారమున! 'నీవు ఆడలేనమ్మవు' అని భంగ్యంతరముగా చెప్పుటకు ఈ సామెతను ఉపయోగించితివి. సామ్యత ఉన్నందు వలన, వినువాడు వెంటనే గ్రహింపగలడు. ఓటి మద్దెలకును, బలహీనమైన సాకునకును అట్లే సామ్యత ఉన్నది. ఓటి మద్దెలతోనే తెల్లవార్చవలె నని నియమమా ?—అట్లే, సామర్థ్య మే ఉన్నచో మరొక విధముగా ప్రయత్నింపరాదా ?—అను సామ్యత సూచితమగు చున్నది

ఈవిధముగా, సమయమునకు సామ్యతగా చెప్పు మాటలు—సామ్యతలు—సామెతలు అనితలంచుట చక్కగా నుండును.

అంతేగాక సామెతల (వాక్య) స్వరూపములోను సామ్యత— అనురూపత—ఏదో రూపమున కానవచ్చు చుండుట బహుళముగా గమనింపవచ్చును. ఇవియు, ఛందోఽలంకారముల గుణగణములను గలిగియుండుట చూడనగును.

ఈ రూపమైన చర్చ చేయుటయే నాకు ఇచ్చట ప్రస్తుతము.

మాటలు కలకాలము నిలువవలె నన్న, అవి ఛందోఽలంకారముల చట్రములందు బిగింపబడి యుండవలె నన్నది పండిత ప్రపంచమందలి ఆదిమ నివాసుల అభిప్రాయము. కాని, భావము బలమైన దైనప్పుడు—మాటల కూర్పు నేర్పు లేకపోయినను— దానిని మరచి పోవుటకు వీలుండదు. 'ఆ శ్లోకము మరచినాను గాని అందలి భావ మిది' అని చెప్పవలసి వచ్చుట మనకు అనుభవములోని విషయమే !

అట్లే మన సామెతలలోను స్వరూపమందు సామ్యత గలిగి ఛందోఽలంకారముల చట్రములందు ఇమిడిపోగలవియు, కేవలము అభిప్రాయ బలము గలిగి స్వరూపమందు చాలవరకు సామ్యత లేనివియు దండిగానే కలవు. ఇక్కడ నేను ఛందోఽలంకారము లకు సంబంధించిన కొన్ని సామ్యతలను మాత్రము మనవిచేయ మనసుపడితిని.

2. "<u>అంగడిలో</u> అన్నీ ఉన్నవి—
<u>అల్లుడి</u> నోట్లో శని ఉన్నది."

ఈ సామెతను గమనింపుడు. దీనిని పైవిధ ముగా రెండు సమభాగములు చేసి చూచినప్పుడు ఇందలి స్వరూప సామ్యత చక్కగా గోచరించును. "అంగడి—అల్లుడి" అనునది ఒక సామ్యత; చివరలు చతుర్మాత్రాక పదము లగుటయు, నడుమ ఆరు మాత్రల గణములు నిలుచుటయు మరియొక సామ్యత; అంతేకాదు, యతి కూడ పడినది; ఇట్లు చెరిసగముగా—విషయానుగుణముగానే—వాక్యము విరుగుటయు, యతియో ప్రాసయతియో, కాక ఏదైన ఒక శబ్దాలంకారమో పడుట సామెతలందు తరుచుగా చూడవచ్చును.

3. "అంగిట బెల్లము—ఆత్మలో విషము."

ఈ సామెత ద్విపద భణితిలో నడచినది! అంత కంటె ఎనిమిది మాత్రల కొక సగముగా విరిగిన దనుట మరింత రమ్యమైన సామ్యత! యతి యుండనే యున్నది. ఈవిధముగా కొన్ని సామెతలు పద్య పాదములుగా, వాటి ఛాయలుగా నడచుట పట్టవచ్చును.

4. "గాడిదె పుండుకు—బూడిదె మందు".
ఇది అచ్చు ద్విపదపాదము!

5. "గతిలే నమ్మకు—మతిలేని మొగుడు."

6. "కన్నుతగిలే పుల్లను—కనిపెట్టవద్దా?"

7. "కాపు వచ్చిన యేడే—కరువూ వచ్చి నది."

ఇవి ద్విపద చ్ఛాయలో నడచినవి. వీటిని అక్షరపు మార్పులతో శుద్ధ ద్విపద పాదములుగాను మార్చ వచ్చును. అది పనిగా ఏరుటకు తీరిక పడవలెగాని ఇట్టివి వేనకు వేలు!

పై 4, 5 ఉదాహరణములలో యతికి బదులు ప్రాసయతి పడినది.

ఈ క్రింది ప్రాసయతిగమనింపుడు:

8. "దండమయ్యా బాపనయ్యా! అంటే మీ తండ్రి నాటి పాతబాకీ ఇమ్మన్నాడట!"

ఈ సామెతలందలి ప్రాసయతిలో మరొక విశే షము గమనింపవచ్చును. యత్యక్షరములకు ప్రక్క నున్న యక్షరములు (ద్వితీయాక్షరములు) ప్రాసమైత్రి గలిగి యుండుట గదా ప్రాసయతి అనబడును? కాని—

9. "<u>బ్రాహ్మలలో</u> — <u>బెస్తలలో</u> పెద్ద."

10. "బావి <u>లోతు</u> చూడవచ్చును గాని—
మనసు <u>లోతు</u>—చూడకూడదు."

11. "బుర్రకు ఒకగుణము—చిహ్వకు ఒక రుచి."

12. "రొట్టెలవాడికంటె—తునకలవాడు—ఘనుడు."

వీటిలో యతిస్థానములందలి పదముల చివరలు అంత్యప్రాసనియమము గలిగియుండుటయు, ఆ పదములు సమమాత్రాకములగుటయు గమనార్హము. ఇట్టి విధముగు సామ్యతయు వీటియందు సుసాధ్యము.

13. "పెదిమకుమించిన పల్లు—
ప్రమిదకు మించిన వత్తి."

ఇందు 'పెదిమ—ప్రమిద'లు మనోహరమైన భ్రష్ట సామ్యత కలిగియున్నవి! ఇట్లు ఏదో ఒక తమాషా సామ్యతను సామెతలందు ఎక్కువ భాగము తీయ వచ్చును.

14. "నాచేతి మాత్ర—వైకుంఠ యాత్ర"
ఇచ్చట అప్పటమైన అంత్యప్రాసము పడినది. మరికొన్ని—

15. "తీటపట్టినవాడు— గోకుకొంటాడు."

16 a. "తియ్యగా తియ్యగా రాగము—
మూలగగా మూలగ్గా రోగము."

16. b. "రాయగా రాయగా కరణము—
దగ్గా దగ్గా మరణము."

17. "తిండికితిమ్మరాజు పనికి పోతురాజు."

18. "కాసుకు దోవాలేదు— నూటికి పరవా లేదు."

19. "ముందుకు వస్తే గొయ్యి—వెనక్కు పోతే నుయ్యి."

సామెత లన్నియు చెరిసగముగా తునుగునని నేను చెప్పరాలేదు. విరతి పడినచోటునకు పూర్వమునగల మాత్రల సంఖ్యకును, తరువాతగల మాత్రల సంఖ్యకును అధికమైన భేదము గూడ ఉండవచ్చును. మీద చూపిన ఉదాహరణములలోనే ఈ విషయము గమనింప వచ్చును.

ఇంక కొన్ని చూతము.

20. "లేక లేక ఒక్క—లోకాయపుట్టితే,
లోకాయ కన్నూ—లొట్టపోయినది."

ఇది ఒక చక్కని గేయ గమనము సంతరించుకొన్నది. ఇందు యతిప్రాసల అలంకారములునుకొల్లలు:

అట్లే ఈ క్రిందిది ఒక రమణీయగేయము!

21. "నాడు ఉంటే—నవాబు సాయెబు
అన్నముంటే—అమీరు సాయెబు
బీదపడితే ఫకీరు సాయెబు
ఛస్తే పీరు సాయెబు!"

మరియొకటి—

22. "ఎరువుల సొమ్ములు—బరువుకుచేటు
తియ్యా పెట్టా—తీపుల చేటు
వాటిలో ఒకటిపోతే
అప్పుల చేటు!"

తరువాత—

23. "మాధవభొట్లుకు పడిసెము ఏటా
రెండు మార్లు రావడము—
వచ్చినప్పుడెల్లా ఆరేసి మాసములు
ఉండడము!"

24. "మానము పోయిన వెనక—ప్రాణ మెందుకు?"

కొన్నిటిని, చాల కొద్దిగా సవరింపవలెనని మనసు పోవుటయు తటస్థించును. కారణము, గణ గుణములకు యతిప్రాసలగతిప్రీతికి మనము అలవాటుపడి యుండుట ! అస లివి మొదట, మనము సవరింప దల పెట్టిన రూపములలోనే ఉండియుండునేమో అన్న భ్రమయు కలుగవచ్చును.

25. "మాటల తేటన మాయింట—
మాపటి భోజనం మీ యింట!"

ఈ సామెతలోని 'భోజనం', 'బోనం' అయిన చక్కని 'లయ'కుదురగలదు. 'బోన పుటిక' వంటివి వాడుకలో ఉండనే ఉన్నవి. 'బోనం' వ్యవహారదూరము కాలేదు గదా !

26. "కొండనాలుకకు మందు వేయగా—
ఉన్న నాలుక వూడిపోయినది !"

ఇందు 'కొండనాలుక'ను దీసి 'చిన్న నాలుక (చిర్నాలుక)'ను పెట్టినను, 'ఉన్న నాలుక'ను దీసి 'ఉండే నాలుక'ను వేసినను ప్రాసానుగుణముగా నుండగలదు. ఐతే ఇది ఒక చాపల్యము మాత్రమే.

సామెత లన్నిటిని ఏరుటగాని, మాండలిక పాఠ భేదముల గుర్తుపట్టుటగాని, వాటి స్వరూప స్వభావ ముల కొక సుష్ఠు ప్రమాణము చూపుటగాని ఎవని యబ్బతరము? అదే కూడుగా పెట్టుకొన్నను, ఒకని బ్రతుకు చాలదు!!

పండిత కవులు కొందరు, సున్నితములైన సామెతలను పద్యపు చట్రములందు బిగించుటకు వాటి నాజూకు చెడగొట్టి సాగదీసి ఛప్పరించి రసాభాసము చేసిరి! ''నిజం నిలకడమీద తేలుతుంది'' అను దానిని ఒకరు, ''నిలుకడపై నిజంబు భువివిన్ విశదంబయి ప్రాకునంచుఁ బ్రాజ్ఞులు వచియింత్రు''—ప్రాజ్ఞులు గాబట్టి వారింత దీర్ఘము తీసిరి !—అని కూర్చి 'లోకోక్త్యలంకారము' సాధించిరి !

ఈ సామెతలలో దరిదాపు సగము, వచన పద్యములవంటివి—కేవల విషయ ప్రధానములైనవి—ఛందో౽లంకారముల పొలిమేరలు దాటి భావాంబర వీధిని తేలియాడునవి కలవు.

27. ''చదువవేస్తే ఉన్నమతి పోయినదట.''

28. ''చల్లకువచ్చి ముంత దాచుకొన్నట్టు.'' వీటిలో అలంకారపు శుష్కప్రియములు లేవు.

29. ''చిత్త చిత్తగించి స్వాతి దయచేసి
విశాఖ విసరి కొట్టకుంటే,
పీసానికి పుట్టెడు పండుతా నన్నదట!''
ఇందు అలంకార ప్రతీతి కొంత చూపట్టును.

30. ''బావా ! నీ భార్య ముండ మోసిన
దోయీ! అంటే మొఱ్ఱో అని
ఏడ్చినాడట !''

31. ''బొంకరా, బొంకరా పోలిగా అంటే,
టంగుటూరి మిరియాలు
తాటికాయ లంతేసి ! అన్నాడట.''

32. ''ఎలుక చావుకు పిల్లి మూర్ఛపోవునా?''

33. ''ఏట్లో వంకాయలు కాస్తవా? అంటే
కాస్తవి అన్నట్లు !''
(ఈ 'కాస్తవి' శ్లేషోక్తులు తీస్తవా?)

34. ''ఏడ్చేదాని మొగుడు వస్తే
నా మొగుడూ వస్తాడు అన్నదట!''

ఇట్టివానిలో ఎక్కువ విషయబలమేగాని ఛందస్సామ్యతలు చూపబూనుట వ్యర్థ ప్రయత్నము. ఐతే, అట్టి వాసనలు బొత్తిగాలేని సామెతలు అరుదే అనవలెను !



కకుద్గిరి క్షేత్రము : కాకతీయ ప్రతాపరుద్ర చక్రవర్తి

శ్రీ కె. ఎస్. కోదండరామయ్య

పూర్వ చాళుక్య సామ్రాజ్య మంతరంచిన పిదప ఆంధ్రదేశమంతటిని తమ ఏకచ్ఛత్రాధిపత్యము క్రిందికి దెచ్చుకొని, అనుమకొండ మరియు ఏకశిలానగరముల నుండి దాదాపు మూడు వందల సంవత్సరములు నిరుపమానముగా పరిపాలించి, కీర్తి ప్రతిష్ఠల గడించిన వారు కాకతీయాంధ్ర చక్రవర్తులు. 'వీరి సామ్రాజ్యము ఉత్తరమున సింహాచలమునుండి దక్షిణమున కాంచీపురము వరకును, తూర్పున బంగాళాఖాతము నుండి పడమట కల్యాణ కటకమువరకును, నైరుతి దిశయందు మైసూరు రాజ్యములోని కోలారు మండలములో చింతామణి తాలూకాకు చెందిన మార్జ్జవాడి (కైవారము)వరకును వ్యాపించియుండెనని, కీ. శే. శ్రీ చిలుకూరివీరభద్రరావుగారు నిశ్చయించారు. (చూ. ఆంధ్రుల చరిత్ర. రెండవ భాగము. పుట. 258).

కాని, యీ ప్రాంతమందు నేడు లభించు చుండు చారిత్రిక విషయములు, గ్రామ నామములు మొదలగువానిని పరిశీలించి చూడగా, ఈ కడపటి సరిహద్దు శ్రీ రావుగారు నిర్ణయించిన స్థలమున కంటెను, ఇంకను గొంతదూరము దక్షిణముగను, పడమరగను వ్యాపించియుండినట్లు తోచుచున్నది. ఈ సరిహద్దు గీతను, మరింత కచ్చితముగ నిర్ణయించుటకు వీలగునేమో చూడవలయునను తలంపుతో, ఇటీవల నేను, సేలంజిల్లా గజెటియరులు, మైసూరు శాసన సంపుటములు, గ్రామ నామముల పట్టికలు మొదలగు వానిని పరిశీలించుచుండగా మైసూరు శాసన సంపుటములలో, తుమకూరు జిల్లాకు సంబంధించిన సంపుటములో నొకచోట కాకతీయ రెండవ ప్రతాప రుద్రదేవ 'చక్రవర్తికి సంబంధించిన ఒక శాసనము కంటబడినది. ఈశాసనమందు గొన్ని నూతన విషయము లున్నవి. ఇంతవరకు ఆంధ్రచరిత్ర పరిశోధకులెవ్వరు ఈ శాసనమునంతగా పరిశీలించినట్లగపడదు. అందు వలన నందలి విషయముల నీ వ్యాసమున దెలియజేయు చున్నాను.

శాసన వృత్తాంతము

ఇది యొక తామ్ర శాసనము. ఇది మైసూరు రాజ్యములోని తుమకూరుజిల్లాకు జెందిన ములుకుంట అగ్రహార వాస్తవ్యులయిన అన్నయ్యప్ప మరియు సుబ్బా శాస్త్రులనువారినుండి మైసూరు ప్రభుత్వపు శాసన పరిశోధనాధికారులకు లభించింది. మూల శాసనమును వీరి పూర్వులు కారణాంతరమువలన భూస్థాపిత మొనర్చిరనియు, నది మరల వారికి దొరకలేదనియు, నందువలన వారు తమయొద్దనుండిన నకలు ప్రతిని యిచ్చిరనియు శాసన పరిష్కర్తలగు శ్రీ లూయీ రైసుదొరగారు తెలిం[illegible]న్నారు.(చూ. ఎపిగ్రాఫిక కర్నాటక.సంపు X. [illegible] 1921—22.సంఖ్య14. పుట. 27).

ఈ శాసనపు భాష సంస్కృతము. ఇందు మొత్తము 51 శ్లోకము లున్నవి. దానమొసగబడిన గ్రామమునకుసంబంధించిన సరిహద్దులపేళ్ళమాత్రము దేశ భాషయం దున్నవి. ఇందలి విషయములు సంగ్రహముగ నిట్లున్నవి "ఆంధ్రదేశ ధరాపద్మ మధ్యస్తకోశమువలెనున్నదియు, సౌధమాలా విరాజిత మైనదియు, ఉద్యానవన శతములతో నొప్పినట్టిదియు

నగు ఓరుగంటిపురములో కాకతీయ వంశ దుగ్ధాబ్ధి చంద్రుడును, సర్వగుణోపేతుడునునగు మహా దేవరాజు నివసించుచుండెను. అతనికి ఉమాంశ సంభవయగు ముమ్మడాంబయను భార్య యుండెను. ఆ దంపతులకు మహాదేవ ప్రతాపుడగు ప్రతాపరుద్రుడు జనించెను. ఆతడుకందర్పునివంటియాకారమును, శుభలక్షణములను గలిగి, సంపూర్ణచంద్రునివలె ప్రకాశించుచుండెను. రాజపరమేశ్వరుడగు నతడు దోర్బలముచేత నరాతుల ఖండించెను. దుష్టుల శిక్షించి శిష్టులగాపాడెను. అతడు కేసరివలె విపక్ష గంధ మాతంగములను విదళించెను. ఆ రాజు ఆత్మప్రతాపతపనతేజముచే రిపులను తపింపజేసెను. అతడు మహారాష్ట్రులను, కాళింగులను, సౌరాష్ట్రులను, ఘూర్జరులను, వరహాటులను, కర్ణాటులను, ద్రావిడులను మరియు తౌళ్యులను జయించెను. నవలక్ష సేనా సమేతుడైన ఆరాజు ఆహేమాచల సేతు విశ్రుతమగు కీర్తితో రాజ్యమును పాలించుచుండెను.

ఆధరాధీశు డొకప్పుడు భార్యతోను, మంత్రి పురోహితులతోను తీర్థయాత్ర చేయుచు కకుద్గిరి క్షేత్రమున కేతెంచెను. ఆ పర్వతము పైభాగము నందుండు శిలా స్థంభమునుండి ప్రతి సంవత్సరము మకర సంక్రాంతినాడు గంగోత్పత్తియగునని యచ్చట నుండిన అర్చకు లాతనితో జెప్పిరట. అందుల కాత డాశ్చర్యపడి, యచ్చట నెలకొనియుండిన గంగాధర స్వామిని పూజించి, గిరిజా కల్యాణ మహోత్సవము చేయించెనట. ఆ పిదప నతడు పయనించుచుండగా నా పర్వతమునకు పడమట సుమారు మూడు క్రోసుల దూరమున నొకచోట భూమియంతయు బూడిద మయమై యుండుటను గాంచెనట. అచ్చటి వారతనితో పూర్వ మా స్థలమందు శ్రీరామచంద్రమూర్తి యజ్ఞము చేసెననియు, నందువలన నచ్చట బూడిద రాసు లేర్పడినవనియు జెప్పి, యచ్చటనుండిన రామేశ్వర లింగమును, హనుమలింగమును జూపిరట. అత డది యొక పుణ్య స్థలమని గ్రహించి, అచ్చట నొక అగ్రహారమును గల్పించి, యొక చెరువును త్రవ్వించి, ఆ నూతన గ్రామమునకు "అనంతపురము" అను నామ కరణము గావించి, ఋగ్వేదియు, భారద్వాజస గోత్రుడును, తపోనిరతుడును, బ్రహ్మతేజో విరాజితుడును, రామచంద్రాఖ్యుని పౌత్రుడును, లక్ష్మి నృసింహ దీక్షితుని పుత్రుడునునగు నృసింహదీక్షితునకు హిరణ్యోదకపూర్వకముగా విజయ సంవత్సర మాఘకృష్ణ చతుర్దశినాడు దానమొనర్చెను. తానొనర్చిన దానమున కెప్పుడును భంగము గలుగకూడదని సూచించుచు నతడు వెలిబుచ్చిన భావము లీ క్రింది శ్లోకములలో మిక్కిలి మనోహరముగ వర్ణింపబడియున్నవి. "మద్దత్తా భూమ రమాసుతా భగినీ భవతాం నృపాః, ఇత్యువాచ మహీపాలో భవిష్యద్భూమిపాన్ప్రతి"॥ మద్వంశజాః పరమహీపతి వంశజా వాయో భూమిపాః సతత ముజ్వల ధర్మచిత్తాః మద్ధర్మమేవ సంతతం పరిపాలయంతి, తత్పాదుకాద్వయ మహం శిరసావహామి." 49.

దీనికి ఆంగ్లమున తర్జుమా యిట్లున్నది.

"The city which was famed as the Kakatiya capital, like an overy to the lotus of Andhradesa was Orugal, in which the chief of Kings, the moon to the ocean of the line of Kakatiya maharajas, Maha deva took up his abode. He married the princess Mummudiyamba, by whom he had a valiant son, Prataparudra, who having subdued the Maharastras, Kalingas, Sourastras, Gurjaras, Varahatas, Karnatas, Dravidas and Toulas was their Lord. He had an army numbering nine lakhs, composed of the four arms. In the course of a tour to the holy bathing places, he came to Kakudgiri and at the Summit of the mountain saw the Ganga, which raises when the sun enters Makara. The reference is to one of two pillars on the highest peak from beneath which about a quart of water oozes on the day of the winter solistice or Makarasankranthi. The attendant priests receive the tiny stream in a vessal and devoting half to the God, Convey the other half to he palace at Mysore. Having witnessed this miracle, he made a festival to the god Gangadhareswara and celebrated the Girija-kalyana. At three kroses west of the Mountain he came to a place where Rama-

chandra had offered sacrifice and where the earth was like ashes. Here he fonunded an agrahara called "Ananthapuramu" built a tank and had a copper sasana written with which to bestow the gift and on the specified date the king Rudra granted to Narasimhadikshita..." [vide page 21]

కకుద్గిరిక్షేత్రము

ఇది మైసూరు రాజ్యములోని బెంగుళూరు జిల్లాయందలి నెలమంగలము తాలూకాలో నున్నది. దీనికి "శివగంగ క్షేత్రము" అను మరియొక పేరు కూడ గలదు. దీని యెత్తు 4559 అడుగులు. ఇది యొక సుప్రసిద్ధమైన శైవక్షేత్రము. దీనిని, "దక్షిణ కాశి" యని కూడ పిలుతురు. ఈ పర్వతముమీద గంగాధరేశ్వరుని దేవాలయము, హొన్నాంబా దేవాలయము, అష్ట తీర్థములు, శృంగేరిశాఖామఠము మొదలగునవియున్నవి. మకర సంక్రాంతినాడు ధ్వజ స్థంభమునుండి గంగోత్పత్తి యగును. ఆనాడు గిరిజా కల్యాణోత్సవమును,, చైత్రమాస మందు రథోత్సవమును, నిత్యోత్సవాదులును యథాక్రమముగ జరుగును. తెనుగులో వచన భారతమును రచించిన కళువె వీరరాజు కుమారుడైన నంజరాజు "కకుద్గిరి మాహాత్మ్యము" అను గ్రంథమును రచించెను. ఈతడు సంస్కృతాంధ్ర కర్ణాట భాషలలో కవి, పండితుడు, కృతికర్త, మరియు కృతిభర్త.

శా స న కా ల ము

ఈ శాసనమును పరిశీలించి ప్రకటించిన రైసు దొరగారు ఇది క్రీ. శ. 1234 వ సంవత్సరమున వేయబడినదని చెప్పియున్నారు. వారు శాసనమందు పేర్కొనబడియుండు విజయ సంవత్సరమునుబట్టి నిర్ణయ మొనర్చినట్లు గనబడుచున్నది. కాని వీరు చేసియుండు కాల నిర్ణయము సరిగాలేదని చెప్పవలసి యున్నది.ఏలయనగా వారు నిశ్చయించియుండు విజయ సంవత్సరమున కాకతీయ రాజ్యమును పాలించుచుండినది గణపతిదేవ చక్రవర్తియే. (క్రీ. శ. 1198—1261) కాని ప్రతాపరుద్రుడుకాదు. అందువలన పై శాసనమందు పేర్కొనబడియుండు విజయ సంవత్సరము తర్వాత రాగల విజయ సంవత్సరమై యుండును. ఇది క్రీ శ. 1294 వ సంవత్సరమగును. దీనికి బిదప రాగల విజయ సంవత్సరమునాటికి కాకతీయ రాజ్యము చితికిపోయియుండెను. అందువలన క్రీ. శ. 1294 వ సంవత్సరమునకు సరియగు విజయ సంవత్సర మందే పై శాసనము వేయబడినదని నిస్సందేహముగ నిర్ణయింపవచ్చును. ఈ విజయ సంవత్సర మాఘ కృష్ణ చతుర్దశి క్రీ. శ. 26—1—1294 మంగళవార మగును.

కాకతీయ రాజుల చరిత్ర గ్రంథములనుండి ప్రతాపరుద్రుడు క్రీ. శ. 1295 వ సంవత్సరమున సింహాసనమునకు వచ్చినట్లు తెలియుచున్నది. ప్రస్తుతపు శాసనమునుబట్టి అతడు పట్టాభిషిక్తుడగుటకు ముందే తీర్థయాత్ర గావించెనని తెలియుచున్నది. మరియు నతడు మహారాజ బిరుదులతోను, నించు మించుగ చక్రవర్తి స్థాయిలోను, మంత్రి పురోహితుల తోను, మహా వైభవముగ పుణ్యస్థల యాత్రకు వెళ్లియుండినట్లు వర్ణింపబడియున్నది. కావున నిది యెట్లు సాధ్యమో పరిశీలించి చూడవలయును. ప్రతాపరుద్రుడు సింహాసనమునకు వచ్చిన సంవత్స రమును గురించి కొంత అభిప్రాయభేదమున్నది. క్రీ. శే. ఎస్. కృష్ణస్వామి అయ్యంగారు అది క్రీ. శ. 1291 అని యూహించియున్నారు. శ్రీ వీరభద్రరావుగారు క్రీ. శ. 1295 అని నిర్ణయించియున్నారు. శ్రీ మారేమండ రామారావుగారు క్రీ. శ. 1296 అని చెప్పియున్నారు. కృష్ణస్వామి అయ్యంగారు తలంచిన క్రీ. శ. 1291 వ సంవత్సరమును పెక్కుమంది చరిత్రకారు లామోదించలేదు.

ప్రతాపరుద్రుడు సింహాసనమునకు వచ్చుటకు ముందే మహారాజ బిరుదులతో రాజ్యకార్యములను నిర్వహించుచుండినటుల దెలియుచున్నది. కాకతీయ చక్రవర్తులలో నొకరాజు పరిపాలనము ముగియుటకు ముందే మరియొకరు వారితో గలసి రాజ్యపాలనము చేయుట వాడుకగ నుండినట్లు దెలియుచున్నది. గణపతిదేవ చక్రవర్తి రాజ్యపాలనము చేయుచుండగా నాతని కుమార్తెయగు రుద్రాంబ రాజ్య కార్య నిర్వహణము చేయుచుండినటుల దెలియుచున్నది. శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారీ విషయమును గురించి

యొకచోట "కాకతీయ గణపతి చక్రవర్తి బ్రతికి యుండగానే రుద్రమదేవి రత్న సింహాసనము నధిష్ఠించి, ఆంధ్ర సామ్రాజ్య భారమును వహించి మిక్కిలి మనో రంజకముగా బరిపాలనము సేయ నారంబించెను" అనియు, మరియొకచోట "రుద్రమదేవి గణపతిదేవ చక్రవర్తి కాలమునందునే రాజ్యాంగమున జోక్యము కలిగించుకొని పరిపాలనము చేయుచున్నట్లు కొన్ని నిదర్శనములవలన గనుబట్టుచున్నను, క్రీ. శ. 1261 లో సింహాసనము నధిష్ఠించినట్లు గనబడు చున్నది" అనియు వ్రాసియున్నారు. (చూ. కాకతీ, యాంధ్ర రాజ యుగ చరిత్రము. పుటలు. 466, 491.)

ఇంతేకాక, రుద్రాంబ తన దౌహిత్రుడగు రుద్ర దేవుని క్రీ. శ. 1280 లో యువ రాజ్యాభిషిక్తుని జేసి కొంత పరిపాలనా భారము నతనిపై బెట్టెనని కాకతీయ సంచికా సంపాదకులగు శ్రీ మారేమండ రామారావుగారు వ్రాసియున్నారు. మరియు నతడు యువరాజుగ నుండినపుడే తిరుగబాటు చేసినయాదవులను, పాండ్యులను జయించి పారదోలెననికూడ శ్రీ రావుగారు తెలియజేసియున్నారు. (చూ. కాకతీయ సంచిక. పుట 231, 232)

ఈ విషయమును గురించి సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులగు శ్రీ కే. ఏ. నీలకంఠశాస్త్రిగారు సయుత మిట్లు వ్రాసియున్నారు.

"The hostility of the yadavas continued after Mahadeva's reign and the young prince Prataparudra, grand son of Rudramba won spurs as a warrior in these conflicts. He was made yuvaraja adout A. D. 1280 and when eight years after Ambadeva rebelled anb got support from the Hoyasalas and yadavas, the young Raja succeeded in snpressing the revolt by about A. D. 1291....." [Vide A. History of South India. Page 211.]

విద్యానాథకవి తన ప్రతాపరుద్రీయ నాటక మందు ప్రతాపరుద్రుడు యువరాజుగ నుండగనే రాజ్య భారమును వహించి యనేక దేశములను జయించెనని విశదపరచియున్నాడు. ఇంతేకాక ఆంధ్రదేశమందలి పెక్కు శాసనము లీ విషయమును బలపరచుచున్నవి. ఉదాహరణముగ గణపవరశాసనములోనికొన్ని పంక్తులు నిట వ్రాయుచున్నాను "గణపవర శాసనము:— శా. శ. 1214 నందనసంవత్సరచైత్రశుద్ధ౧.... శ్రీ మన్మమహామండలేశ్వర ప్రతాపకుమార రుద్రదేవ మహారాజులు ప్రిథివి రాజ్యము సేయంగాను శ్రీమన్మహాదేవ ప్రధాని గంగిదేవనింగారి......" (చూ. కాకతీయ సంచిక—పుట.86.) ఈ శాలివాహనశకము క్రీ. శ. 1292 కి సరియగుచున్నది.

ఇట్లు ప్రతాపరుద్రుడు సింహాసన మెక్కుటకు ముందే, సామ్రాజ్య నిర్వహణ కార్యములందు నియోగింపబడుచుండెనని తెలియుచున్నది.

ప్రస్తుతపు అనంతపుర శాసనమందు రుద్ర దేవుడు, మహారాష్ట్రులు, ఘూర్జరులు, కర్ణాటులు, ద్రావిడులు మొదలగువారిని జయించెనని చెప్పబడి యుండుటకు ఇంతకుముందతడు అంబదేవాదుల తోను, నాతనికి సహాయముగా వచ్చియుండిన ఇతర రాజులతోను యుద్ధముచేసి,జయించెననుటను పరిశీలించి చూచిన, ఈ విషయములే అనంతపుర శాసన మందు వర్ణింపబడినవని స్ఫురించుచున్నది. ఈ శాసన మందు బేర్కొనబడిన మహారాష్ట్రులు సేవణ దేశమును పాలించుచుండిన యాదవులుగను, (The Marathi speaking yadavas of Sevanadesa), కర్ణాటకులను హొయసలలుగను, ద్రావిడులను పాండ్యులుగను దలంపవచ్చును. అందువలన వీరిపై గావించినయుద్ధములు,మరియు సాధించిన విజయములు రుద్రదేవుడు యువరాజుగ నుండినపుడు జరిగినవియే యని దృఢముగ జెప్పవచ్చును. ఈ యుద్ధము లన్నియు క్రీ. శ. 1290 నాటికి ముగిసియున్నందున నా పిదప దేశములో శాంతి యేర్పడియుండెను. దీనినే కాకతీయ సంచికా సంపాదకులు, "ఈ యుప ద్రవములు అణగిన పిమ్మట సామ్రాజ్యమున తిరిగి శాంతి యేర్పడెను" అని వ్రాసియున్నారు. (చూ. కా. సం. పుట 24.)

ఇంతేకాక క్రీ. శ. 1290 వ సంవత్సరము నాటికి రుద్రాంబ వయసు ముదిరినదగుటచే,మనుమడగు ప్రతాపరుద్రుని రాజ్యాంగమున నియోగించియుండును. బాహు బల పరాక్రమము, రాజకీయ చతురత,

అధిక సామర్థ్యము గలిగియుండిన రుద్రదేవుడు యువరాజుపదవియందుండి రాజ్యమునకు నలువైపులను శత్రుభయమును దొలగించి, శాంతి యేర్పరచి, సమస్త రాజ్య కార్యములను నిర్వహించుచు, రుద్రమ దేవి పరిపాలనము కట్టుదిట్టముగను, ప్రజారంజకము గను నుండుటకు దోడ్పడుచుండెనని తెలియుచున్నది. అందువలననే ప్రతాపరుద్రీయ నాటకకర్త రుద్రమ వార్ధకమున ప్రతారుద్రునకు రాజ్యము నప్పగించి, వంశాచారముగ వానప్రస్థాశ్రమమును గైకొనియుండి నటుల వర్ణించియున్నాడు. పై అంశములనుబట్టి ఆలోచించిన, విద్యానాథకవి ప్రతాపరుద్రుని గురించి చేసియుండు వర్ణనలలో చారిత్రిక సత్యమున్నదనియు, మరియు నీ అనంతపుర శాసనములో బేర్కొనబడి యుండువిషయములు యదార్థమనియు తేలుచున్నది.

ప్రతాపరుద్రదేవుని వయస్సు

ఈ సందర్భమున ప్రతాపరుద్రరాజు వయస్సును గురించి తెలిసికొనవలసియున్నది. ఇతడు క్రీ. శ. 1254 వ సంవత్సరవమున జనన ముందినట్లు శ్రీమారేమండ రామారావుగారూహించియున్నారు. (చూ. కాకతీయ సంచిక పుట 64.) శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారీ యూహ నంగీకరించియున్నట్లు తెలియుచున్నది. (చూ. కాకతీయాంధ్ర రాజయుగ చరిత్ర. పుట 478.) దీనినిబట్టి గణపతిదేవుడు మరణించునాటికి రుద్రదేవున కారు సంవత్సరముల వయస్సని తెలియుచున్నది. అందువల్లనే యతడు తన మరణ కాలమునకు గొంతముందుగా ప్రతాప రుద్రుని రుద్రాంబకు దత్తుచేయించి, ఆమె యనంతరము అతనికి కాకతీయ సామ్రాజ్యము సంక్రమించవలెనని కట్టడి చేసినట్లు దెలియుచున్నది. (చూ. తెలుగు విజ్ఞాన సర్వస్వము.భాగ III ;పుట. 231.) ఆపిదప రుద్రరాజు యువరాజ పదవికి వచ్చునప్పటికి ఇరువది యారేళ్ల వయస్సువాడని,క్రీ. శ.1294 లో తీర్థయాత్రలకేగు సమయమునకు నలువదియేళ్ల వయసువాడుగను, నుండినట్లు తేలుచున్నది. ప్రతాపరుద్రుడు క్రీ. శ. 1326 వరకు బరిపాలనము చేసియుండెనని చరిత్ర కారులు నిశ్చయించి యున్నందున, నప్పటి కతనికి డెబ్బదిరెండు సంవత్సరముల వయస్సని తలంపవచ్చును.

తీర్థయాత్రకుదగినకాలము

క్రీ. శ. 1294 లో అనగా తన నలువదియవ యేట ప్రతాపరుద్రుడు తీర్థయాత్రకేగియుండెనని తెలిసినది. అది అన్ని విధముల తీర్థయాత్రకు దగిన వయస్సని చెప్పవచ్చును. అప్పటి కతనికి వివాహమయి యుండెను.సంతానము గూడ గలిగియుండును. ఇతనికి జుట్టయలంక గొంకారెడ్డి యను కుమారుడుండి నటుల దెలియుచున్నది. అతడు క్రీ. శ. 1313 వ సంవత్సరమున ముటికినాడు, మరియు గండికోట సీమలను బరిపాలనముచేయుచుండెనని తెలియుచున్నది. క్రీ. శ. 1294 నాటినుండి క్రీ. శ. 1313 నాటికి 19 సంవత్సరములగుచున్నది. అందువలన దీర్థ యాత్ర కేగునపుడీ గొంకారెడ్డి జన్మించియుండె ననియు, శిశిపిల్లవాడుగ నుండెననియు దలంపవచ్చును. ఇట్లనుకూలమైన కుటుంబము, అద్వితీయమైన పరా క్రమము, విశ్వాసపరులు, మరియు సమర్థులగు మంత్రులు, సేనాధిపతులు, నిష్కంటకముగను, ప్రశాం తముగను నుండిన రాజ్యము, సామ్రాజ్య భారమును వహించియున్న మాతామహి, యౌవ్వనము కొంతజారి, వృద్ధాప్యమడుగుబెట్టని మంచి వయస్సు, నవలక్ష ధనుర్ధరులతోనొప్పుచుండిన మహా సైన్యము, అచిర కాలమందే విశాల కాకతీయ సామ్రాజ్యమునకు పట్ట భద్రుడు కాగలనన్న ఉత్సాహము, ఇన్ని అనుకూల పరిస్థితులుక్రీ.శ.1294 వ సంవత్సరమున తటస్థించి యుండెను.కావుననే యా సంవత్సరమున నత డే చీకు చింత లేక, నెమ్మదిగ, విరామముగ తీర్థయాత్ర కేగెను. ఈ సమయమందే రుద్రరాజు దక్షిణ దేశమందలి పుణ్యక్షేత్రములను సేవించుచు, జంబుకేశ్వరము, శ్రీరంగము,రామేశ్వరములవరకు పోయి యుండవచ్చును. జంబుకేశ్వరాలయములోనుండు ఈతని శాసన మీ సందర్భమున వేయించినదేయై యుండును.

రుద్రరాజు తలిదండ్రులు

కాకతీయరాజులకుసంబంధించినచరిత్రగ్రంథము లందు ప్రతాపరుద్రరాజు తండ్రి మహాదేవరాజనియు, తల్లి ముమ్మడాంబయనియు గలదు.దీనిని ప్రస్తుతపు శాసనము స్థిరపరచుచున్నది. కాని, యీ మహా దేవరాజు వ్యక్తి నిరూపణ విషయమున చరిత్ర కారులు భిన్నాభిప్రాయము గలిగియున్నారు. క్రీ. శే.శ్రీ

చిలుకూరి వీరభద్రరావుగారొకచోట "ఇతడు నిరవద్యపురాధీశ్వరుడును, చాళుక్య విష్ణువర్ధన వంశీయుడును నగు మహాదేవ చక్రవర్తియై యుండును..." అనియు, మరొకచోట, "అన్యులైన ముమ్మడంబకును, మహాదేవరాజునకు బుట్టిన రెండవ ప్రతాపరుద్రుని, రుద్రమదేవి పెంచుకొన్నదన్నను, రుద్రమదేవి చాళుక్య వీరభద్రుని పెండ్లాడియుండుటచేత ప్రతాపరుద్రుడు చాళుక్యరుద్రుడే యగునుగాని, కాకతీయరుద్రు డెట్లగును? ఎన్ని విధములచేత జూచినను రెండవ ప్రతాప రుద్ర చక్రవర్తి కాకతీయుడుమాత్రము గాడనిస్పష్టమగుచున్నది....."(చూ: కాకతీయాంధ్ర రాజయుగచరిత్రము. పుటలు 482,109) అనియు వ్రాసిరి.

కాని, కాకతీయ సంచికా సంపాదకులు వీరభద్రరావుగారి అభిప్రాయము నంగీకరించక, "ఈ మహాదేవరాజెవ్వరో నిర్ణయించుటకు ఇంతవరకు సరియైన ఆధారములు గానరావు........ప్రతాపరుద్రుని తండ్రి యీతడే యనుటకు గొన్ని యభ్యంతరము లున్నవి. చాళుక్యాన్వయుడగు వీరభద్రునికిని, గాకతీయ రాజపుత్రికయగు రుద్రమదేవికిని, కూతురగు ముమ్మడాంబ తాను చాళుక్యాన్వయుడగు మహాదేవు నుద్వాహమగుట విహితముగ గన్పట్టుటలేదు....." అని వ్రాసియున్నారు. (చూ. కాకతీయ సంచిక. పుట 71—72).

సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశకర్తలు ఈ విషయమును గురించి వ్రాయుచు, రుద్రరాజు తల్లి ముమ్మక్కయని పేర్కొని, ఎందువల్లనో ఆతని తండ్రిపేరు చెప్పక మౌనము వహించిరి.

శ్రీ కొత్త భావయ్య చౌదరిగారు వీరభద్రరావుగారి వాదము నంగీకరించి, మారేమండ రామారావుగారి సందేహమున కొక విధముగ సమాధానమును దెలియజేశారు. వారిట్లు వివరించియున్నారు. "వీరప్రతాపదేవ చక్రవర్తి:—ఈయన చాళుక్యరాజగు నిడుదవోలి మహాదేవచక్రవర్తి కుమారుడగుటచే చాళుక్యాన్వయుడయ్యును, కాకతీయ రాజ్యము సంక్రమించుట కారణముగ కాకతీయులతో గలిపి చెప్పుచున్నాము." (చూ. కమ్మవారి చరిత్రము. భాగ 2 పుట 73).

ఇట్లు ఈ మహాదేవరాజు వ్యక్తి నిర్ణయ విషయమున నభిప్రాయ భేదములున్నను, ప్రస్తుతపు అనంతపుర శాసన మింతవరకు నుండిన సందేహములను దొలగించి, రెండవ ప్రతాపరుద్రుడు కాకతీయాన్వయుడేయని స్పష్టముగ జెప్పుచున్నది. దీనిని బట్టి వీరభద్రరావుగారి యూహ సరిగాదని చెప్పవలసియున్నది. కాని యీతని తలిదండ్రు లెవ్వరో, ఇతడెట్లు కాకతీయుడయ్యెనో తెలిసికొనుటకు ప్రస్తుతము మనకు తగిన ఆధారములు దొరకలేదు. అయినప్పటికిని, యీ యదనున, శ్రీ శేషాద్రి రమణ కవుల అభిప్రాయము మనకు గొంతవరకు దోడ్పడుచున్నది. ఈ జంట పరిశోధకులు, "రుద్రమదేవి" యను వ్యాసమున ఈ మహాదేవరాజును గురించి యిట్లు వ్రాసియున్నారు. "ముమ్మడమ్మ చాళుక్య వీరభద్రుని భార్య యని స్థానిక చరిత్రములలో గలదు. ఇది ప్రమాదము. ముమ్మడమ్మ భర్త మహా దేవరాయలు. ఈ యంశమును దెలుపు నితరాధారములు గలవు. ఈ మహాదేవరాయలు నిడదవోలు పురాధీశుడని యొక వాదము గలదు. నిడదవోలు పురాధీశులలో నొకడగు మహా దేవరాయల శాసనములు ప్రతాపరుద్రుని రాజ్యకాలమునుండియే కనబడుచున్నవి. కాన నీతడు వేరొకడనియు సామంతవర్గములోనివాడనియు దలంపనగును. రుద్రమదేవికల్లుడైయైనచో సామ్రాజ్యమును వదలి చక్రవర్తియైన తన కుమారుడగు ప్రతాపరుద్రుని వదలి తన స్వల్ప సంస్థానమున కంత్యకాలమున రాబనియుండదు. ఈ మహాదేవరాజు కాకతీయ వంశమునకు జెందిన వేరొక మహాదేవుడై యుండును. కాకున్నచో ప్రతాపరుద్రుడు కాకతీయుడగుట పొసగదు. రుద్రమదేవి కుమారునిగా గైకొనుటచే ప్రతాపరుద్రుడు కాకతీయుడయ్యెనను పక్షమున విశ్వసనీయము గాదు. మహాదేవరాజు పుట్టు పూర్వోత్తరములు భావి పరిశోధనమునగాని తేలనవకాశములు లేవు...." (చూ. ప్రమోదూత ఉగాది సంచిక. పుట 179).

ఈ అనంతపుర శాసనము కాకతీయాంధ్ర రాజుల చరిత్రమునకు మహోపకారము చేయుచున్నది. ప్రతాపరుద్రుడు కాకతీయాన్వయుడైనందువల్లనే రుద్రాంబకు దత్తత స్వీకారమున కర్హుడయ్యెను. ప్రతాపరుద్ర చక్రవర్తి తల్లి ముమ్మడమ్మ "ఉమాంశ" సంభవ యని యీ శాసనమునుండి తెలియుచున్నది.

(సశేషము.)

తాష్కెంట్ ప్రకటన

శ్రీ కౌండిన్య

తాష్కెంట్ ప్రకటనపై సంతకాలు జరిగి సుమారు రెండు నెలలైంది. ఈ రెండు నెలల కాలములో భారత పాకిస్తాన్ సంబంధాలలో ఎంతో మార్పు కన్పించింది. ఉభయదేశాల మధ్య యుద్ధం వెనుకబట్టడమే కాక, ఇక యుద్ధం రాదనే భరోసా కూడా చిక్కింది; సమర సన్నద్ధమై పరస్పరాభిముఖంగా నిలచిన సైన్యాలు ఆగస్టు 5 నాటి స్థావరాలకు---అంటే యుద్ధానికి పూర్వం ఉన్న చోట్లకు మళ్ళాయి; ఉద్రిక్తత సమసిపోయింది. దీనితోపాటు ఉభయదేశాల మధ్య దౌత్య సంబంధాలు తిరిగి ఏర్పడ్డాయి. ఆర్థిక వాణిజ్యాది సంబంధాల అభివృద్ధికి కూడా ప్రయత్నం జరుగుతోంది. గతంతో పోల్చి చూచినప్పుడు అసంభవం అనిపించే ఈ మహత్తర పరివర్తనకు తాష్కెంట్ ప్రకటనే కారణం. అయినా ఇప్పటికింకా ఈ ప్రకటనపై దేశంలో విమర్శలు వినవస్తూనే ఉన్నాయి. పార్లమెంటు ఉభయసభలు ఈ ప్రకటనను ఆమోదించినప్పటికీ ఈ విమర్శలు ఆగలేదు. భారత ఉపఖండంపై ప్రాబల్యం సంపాదించడానికే సోవియట్ రష్యా ఈ తాష్కెంట్ సమావేశం ఏర్పాటు చేసిందని, సోవియట్ ప్రధాని ఒత్తిడికి శాస్త్రి లొంగిపోయారని, చివరి నిముషం వరకూ కుదరదనుకున్న సమాధానం కుదరడానికి కారణం ఇదేనని ఈ విమర్శకుల వాదం. ఇటీవల కాలంలో సోవియట్ విధానంలో వచ్చిన మార్పు గాని, అది అనుసరిస్తూన్న దౌత్య నీతి కాని ఈ విమర్శకులు అర్థం చేసుకోలేదనే చెప్పాలి. అదేవిధంగా ఏ ప్రధాన లక్ష్యసాధనకై స్వర్గీయ శాస్త్రి తాష్కెంట్ సమావేశంలో పాల్గొనడానికి వెళ్ళిందీ వీరు గుర్తించడంలేదు.

క్రుశ్చేవ్ హయాం వరకూ సోవియెట్ రష్యా కమ్యూనిజం స్థాపనకు ప్రపంచ వ్యాప్త యుద్ధం అనివార్యమనే సిద్ధాంతానికి కట్టుబడి ఉంది. ఆ సిద్ధాంతాన్ని అనుసరించే, స్థానికంగా ఎక్కడ అల్లకల్లోలం, యుద్ధ పరిస్థితి ఏర్పడినా ప్రోత్సహిస్తూ ఉండేది; క్రుశ్చేవ్ హయాం నాటినుండి ఆ వైఖరిలో మార్పు వచ్చింది. అణ్వస్త్రయుగంలో యుద్ధం అంటే సర్వ నాశనం తప్ప మరేమీ ఉండదని రష్యా గ్రహించింది. విభిన్న సాంఘిక వ్యవస్థల మధ్య శాంతియుత సహజీవనం సాధ్యమని అంగీకరిస్తూ, బాండుంగ్ సూత్రాలలో శాంతియుత సహజీవన సూత్రాన్ని ఆమోదించింది. ఆరకంగా యూరపుకు యుద్ధ ప్రమాదాన్ని తగ్గించింది. పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మూలించడానికి యుద్ధమే అక్కర లేదని, రాజకీయ, ఆర్థిక వ్యూహాల ద్వారా దానిని సాధించవచ్చునని సోదర కమ్యూనిస్టు దేశాలకు ఒక కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది. అయితే ఈ విధానాన్ని సిద్ధాంతాల్ని చైనా తిరస్కరించి యుద్ధానికి దారితీసే పరిస్థితులను ముఖ్యంగా ఆసియాలో సృష్టిస్తూ, రష్యా ప్రాబల్యాన్ని నిర్మూలించడానికి యత్నిస్తోంది. యుద్ధానికి ఎక్కడా అవకాశం లేకుండా చైనా వ్యూహాన్ని ఛిద్రం చేసివేయాలన్నది రష్యా ప్రధాన లక్ష్యం. ఇప్పుడు భారత ఉపఖండంలో ఈ సంఘర్షణకు చాలామటుకు చైనా కారణం. చైనా ప్రేరేపణ మధ్యలో లేకపోతే పాకిస్తాన్

భారత్‌పై యుద్ధానికి సాహసించి ఉండేది కాదు. కాగా చైనా కబంధ హస్తాలనుండి పాకిస్తాన్‌ను వేరుచేస్తే ఉపఖండానికి తద్వారా ఆసియాకు యుద్ధం ప్రమాదం తొలగిపోతుంది. తాష్కెంట్ సమావేశాన్ని రష్యా ఏర్పాటు చేయడానికి ఇది ఒక కారణం. రెండవది భౌగోళికంగా తనకు సమీపంగా ఉన్న భారత ఖండంలో ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే, ఇందులో ఇతర దేశాలు కూడా పాల్గొని యుద్ధాన్ని విస్తృతం చేయగల ప్రమాదం ఉంటుంది. అందుకు చైనా ఎలాగూ ప్రయత్నిస్తోంది. అప్పుడది తన ప్రాదేశిక భద్రతకు ముప్పుగా పరిణమిస్తుందని, తాను కూడా యుద్ధంలోకి దిగవలసి రావచ్చని రష్యా భయపడి ఉంటుంది. ఇందుచేత కూడా తాష్కెంట్ సమావేశాన్ని రష్యా ముఖ్యమైనదిగా భావించి భారత పాకిస్తాన్‌లను ఒప్పించడానికి శాయశక్తులా ప్రయత్నించింది.

భారత పాకిస్తాన్ల మధ్య యుద్ధం మరోలా పరిణమించి ఉన్నట్లయితే రష్యా ఈ ప్రయత్నంపట్ల పాకిస్తాన్ వైఖరి ఎలా ఉండేదో చెప్పలేము. కాని పాకిస్తాన్ వ్యూహాలు సాగిరాలేదు. అమెరికా ఆయుధబలంతో, చైనా అండదండలతో భారత సైన్యాలను తేలికగా నిర్జించవచ్చని ఆశపడింది. చైనాతో యుద్ధంలో భారత్ వెనుకంజ వేయడం, కచ్ బాడవలో తన దురాక్రమణవల్ల ఫలితం కనిపించడంవల్ల పాకిస్తాన్ ఆశకు తగిన ప్రోది లభించింది. కాని ఇదంతా వట్టి అడియాస అని తేలిపోవడానికి ఆట్టే కాలం పట్టలేదు. భారత సైన్యాలు యుద్ధాన్ని కాశ్మీర్‌కు మాత్రమే పరిమితం చేయక పాకిస్తాన్‌పై విరుచుకుపడి విశాల ప్రాంతాలను ఆక్రమించుకోగలిగాయి. భారత్‌కు చైనా హెచ్చరికలు అల్టిమేటంలు వట్టి బుకాయింపులు తప్ప తనకు అండగా సరిహద్దున సంఘర్షణ రగుల్కొల్పే అస్కారం కూడా పాకిస్తాన్‌కు కన్పించలేదు. ఏతావాతా 22 రోజుల యుద్ధంలో కలిగిన అనుభవాన్ని

బట్టి సైనికంగా భారత్‌ను జయించడం అసంభవమని, భద్రతామండలి జోక్యం ఫలితంగా తాత్కాలికంగా ఆగిన యుద్ధం తిరిగి చెలరేగే పక్షంలో ఈసారి భారత సైన్యాలు పాకిస్తాన్‌ను నామరూపాలు లేకుండా తుడిచిపెట్టగలవన్న భయం కూడా పాకిస్తాన్ నాయకులకు ఏర్పడిపోయింది. సైనికంగా తమ ప్రతిష్ట అడుగంటింది; ఆర్థికంగా దేశం చితికిపోయింది. కాగా తాము సృష్టించుకొన్న ఊబిలోంచి బయటపడే మార్గాన్వేషణమే తప్ప పాక్ నాయకులకు మరో గత్యంతరం కన్పించలేదు. సరిగా ఆ తరుణంలో తాష్కెంట్ సమావేశ సూచన వరప్రసాదంలా వచ్చింది. రష్యన్ నాయకులు కూడా సమయం కనిపెట్టే ఈ ప్రతిపాదన చేశారని అనుకోవాలి. మొదట్లో పాకిస్తాన్ వైఖరిని బట్టి, తాష్కెంట్ చర్చలవల్ల ఆట్టే ప్రయోజనం ఉండదని ప్రధాని శ్రీ శాస్త్రి సందేహం వెలిబుచ్చినా సోవియట్ యూనియన్, కోరికను పాటించి తాష్కెంట్ సమావేశానికి హాజరవడానికి ఆయన ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నారు. అయినా శాంతి, సామరస్యం ధ్యేయంగా కల భారతదేశం ఈ చర్చలలో పాల్గొనడంలో ఆశ్చర్యమేమీ లేదు.

ఈ సమావేశానికి శ్రీ శాస్త్రి హాజరవడంలో ప్రధాన లక్ష్యం భారతఖండంలో సుస్థిరమైన శాంతికి అవకాశం కల్పించాలని, భారత పాకిస్తాన్‌ల సంబంధాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని. అంతేగాని ఆక్రమిత స్థావరాల విషయమై ఎలాంటి బేరసారాలకు ఆయన వెళ్లలేదు. తాష్కెంట్ సమావేశం జరిగిన తొలిరోజున ఆయన ప్రసంగిస్తూ ''ఉభయ దేశాల ప్రజలు శాంతంగా బతికినప్పుడే అభ్యుదయం సాధ్యం. విభేదాలనేవి ఏ రెండు రాజ్యాల మధ్య నైనా ఉండేవే. బలీయమైన రాజ్యాలే శాంతియుతంగా తమ వివాదాలను పరిష్కరించుకోడానికి ప్రయత్నిస్తున్నప్పుడు భారత పాకిస్తాన్‌లు ఆపని ఎందుకు చేయలేవు. సంఘర్షణ ద్వారా ఏ సమస్యా పరిష్కారం కాదు. దానివల్ల ఇంకా అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయి. ఇప్పుడీ సమావేశం ఫలితంగా వివాదాలకు బలప్రయోగం ద్వారాకాక శాంతియుతముగా చర్చల ద్వారా తేల్చుకోగలమని మనం ఒక అంగీకారానికి వచ్చే పక్షంలో అది తాష్కెంట్‌లో సాధించిన మహత్తర విజయమే అవుతుంది'' అన్నారు. అంటే శాంతి మార్గానికి పాకిస్తాన్‌ను ఒప్పించడం ప్రధానం. అది సాధ్యమైనప్పుడు తతిమ్మా సమస్యలు, వివాదాలు పరిష్కారసాధ్యాలౌతాయి. ఈ లక్ష్యంతోనే శ్రీ శాస్త్రి పాకిస్థాన్‌తో నిర్యుద్ధ సంధిని తాష్కెంట్ చర్చలలో ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను సంధి రూపంలో ఆమోదించడానికి ఆయూబ్ తిరస్కరించినా, సోవియెట్ ప్రధాని సమక్షంలో చేవ్రాలు చేసిన ప్రకటన ద్వారా ఆమోదించారు. అది చాలు. ఒకవిధంగా నిర్యుద్ధ సంధికి ఆయూబ్ అంగీకరించినట్లే అయింది. కాశ్మీర్ సమస్య పరిష్కారం కానిదే నిర్యుద్ధసంధికి అవకాశం ఆస్కారంలేదని మొదటినుంచీ పాకిస్తాన్ నాయకుల వాదం. ఆఖరికి తాష్కెంట్ సమావేశంలో కూడా ఆయూబ్ దీని విషయం ప్రస్తావించి ''ఇదివరలో అంగీకరించిన సూత్రం ప్రకారం (ప్లెబిసైట్) ప్రధానమైన సమస్య (కాశ్మీర్) పరిష్కారమైనప్పుడు నిర్యుద్ధసంధికి మేము సిద్ధం. వివాదాల పరిష్కారానికి నిర్దిష్టమైన చర్యలు తీసుకోకుండా నిర్యుద్ధసంధి కుదుర్చుకోవడంవల్ల ప్రయోజనం ఉండదు'' అని స్పష్టం చేశారు. మరి కాశ్మీర్ సమస్య పరిష్కారం కాకుండా, కనీసం ఆ ప్రసక్తి లేకుండా కూడా నిర్యుద్ధ ప్రతిపాదనకు 'పరోక్షంగానైనా' పాక్ అధ్యక్షుడు అంగీకరించడం విశేషమే గదా! అంటే ఏ ప్రధాన లక్ష్యంతో శ్రీ శాస్త్రి తాష్కెంట్ చర్చలకు వెళ్లారో అది నెరవేరిందనే అనుకోవాలి. అయితే సమితి ప్రణాళికలో వివాదాల పరిష్కారంలో బలప్రయోగం కూడదన్న— అన్ని రాజ్యాలు ఆమోదించిన— సూత్రాన్నే పాకిస్తాన్ పునరుద్ఘాటించింది తప్ప ఇందులో విశేషం ఏమీ లేదన్న వాదం లేకపోలేదు. కాని తాష్కెంట్

సమావేశం జరిగిన పరిస్థితి, సంయుక్త ప్రకటన వెలువడిన సందర్భం—దృష్టిలో పెట్టుకుని చూస్తే సమితి ప్రణాళికలో గల మామూలు సూత్రమే అయినా దానికి కట్టుబడి ఉంటానని పాకిస్తాన్ యిప్పుడు ప్రకటించడానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉండితీరుతుంది.

ఇది గమనించే హాజీపీర్, తిత్వాల్, కార్గిల్ లాంటి కీలక స్థావరాలు వదులుకున్నా ఫర్వాలేదని శ్రీ శాస్త్రి భావించి ఉంటారు. ఈ స్థావరాలను మనం ఆక్రమించడంలో ఉద్దేశ్యం కాశ్మీర్‌లో పాక్ దుండగీళ్ల అక్రమ ప్రవేశాన్ని, పాక్ సైన్యాల దురాక్రమణను నిరోధించాలనే. ఇక అటువంటి ప్రమాదం లేదన్న నమ్మకం చిక్కినప్పుడు వీటిని వదలుకోడంలో గొప్ప తప్పిదం ఏమీలేదు. పాకిస్తాన్ నమ్మకద్రోహంతో తిరిగి బలప్రయోగానికి సాహసిస్తే మనం ఎదురుదెబ్బ తీయరాదని, తీయలేమని అనుకోరాదు! ఇదికూడా శ్రీ శాస్త్రి తను తాష్కెంట్ ప్రసంగంలో స్పష్టంచేసి ఉన్నారు. ''బలప్రయోగానికి దిగరాదని మన ఉభయులం పరస్పరం పూచీపడాలంటే అర్థం ఒకరి సార్వభౌమాధికారాన్ని ఒకరు గుర్తించాలని, ఒకరి ప్రాదేశిక సమగ్రతను ఒకరు ఉల్లంఘించరాదని. అలా కాక ఎవరు దురాక్రమణకు దిగినా దానిని తిప్పికొట్టడానికి బలప్రయోగం చేయడం సమర్థనీయం అవుతుంది'' అన్నారు. అంటే కాశ్మీర్ భారత అంతర్భాగమని, దానిపై భారత సార్వభౌమాధికారాన్ని పాకిస్తాన్ గుర్తించితీరాలని హెచ్చరిక. ఈ హెచ్చరికను పాకిస్తాన్ తృణీకరించి బలప్రయోగానికి పూనుకోవడం జరిగితే సోవియెట్ యూనియన్ అండదండలు సంపూర్ణంగా భారత్‌కు లభించగలవని, తమ సాహసానికి పరిణామాలు విపరీతంగా ఉండగలవని పాకిస్తాన్‌కు తెలియకపోలేదు.

కనుక కాశ్మీరుపై తమ హక్కు, అధికారం ఎలాంటిదైనా దానిని సాధించుకోడానికి పాకిస్తాన్ ఇక శాంతియుతంగానే తన ప్రయత్నం కొనసాగించగలదని అనుకోవచ్చు. ఆ సమస్యను పరిష్కరించుకోడానికి మనం కూడా ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉన్నాం. అయితే ఇదొక్కటే భారత పాకిస్తాన్ల మధ్య వివాదానికి హేతువుకాదు. ఇంకా అనేక ఇతర సమస్యలు కూడా ఉన్నాయి. కాశ్మీరే ప్రధాన మన్నట్లు, పాకిస్తాన్ మిగతా సమస్యల విషయంలో ఏ ప్రయత్నము చేయక ఉద్రిక్తత పెంచడంతో ఏ సమస్యా పరిష్కారం కాలేదు. అలా పరిష్కారం కాగల వాతావరణం కూడా ఏర్పడలేదు. ఇప్పుడు తాష్కెంట్ ప్రకటన ఫలితంగా అటువంటి అనువైన వాతావరణం ఏర్పడింది. భారత్‌పై కక్ష పెంచుకొంటూ చైనాతో పొత్తు కలియుడంవల్ల కలిగే ప్రమాదాన్ని ఇప్పటికే గ్రహించి ఉంటుంది గనుక, తాష్కెంట్ ప్రకటన ద్వారా లభించిన ఈ మహదవకాశాన్ని సద్వినియోగం చేసుకోడానికి పాకిస్తాన్ ప్రయత్నించేట్లయితే, ఉభయ దేశాల మధ్య ఇన్నాళ్లుగా తేలని వివాదాలు ఒక్కొక్కటీ పరిష్కారమై భారత పాక్ సంబంధాలలో నూతన శకం ఆవిర్భవిస్తుంది.

కలగూరగంప:

ఆంధ్రదేశమునకు ఓడ్యాణదేశమని పేరున్నదా?

క్రొందరు మిత్రులతో కలసి 'హఠయోగ' దీపిక పరిశీలించుచు "ఓడ్యాణబంధము"ను గురించి నేను ఈమధ్య ప్రసంగించుట జరిగినది. మిత్రులలో నొకాయన అన్నాడు—"ఆంధ్రదేశమునకు ఓడ్యాణ దేశమని పేరున్నట్లు భారతిలో వ్యాసము చూచితిని" అని.

1956 డిశంబరు భారతిలో కలగూరగంపలో శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు "ఉడ్డియాన దేశము"ను గురించి వ్రాసిరి.

శ్రీ శాస్త్రిగారి వ్యాసములో బౌద్ధ యాత్రికుడు ఫాహీన్ వ్రాతల ప్రకారము భారతదేశంలో ఉడ్డియానమనే ప్రాంతముండేదని వివరములున్నవి. ఉడ్డియాన ప్రాంతమున్నదని చెప్పుటకు, అది ధాన్య కటక సమీప ప్రాంతమగుటకు శ్రీ శాస్త్రిగారు చక్కని ఆధారములు చూపినారు. వారు చూపించిన ఆధారములనుబట్టి "ఉడ్డియాన దేశమనగా ధాన్య కటకప్రాంతమని, ఇదే వజ్రయాన దేశమని, ఇచటి శ్రీ పర్వతమే వజ్ర పర్వతమని, ఇచట వజ్రయాన బౌద్ధము క్రీ. శె. 16 వ శతాబ్దందాకా ఉన్నదని చెప్పవీలగుచున్న"ట్లు వ్రాశారు. కాని ఆంధ్రలో ఏ ప్రాంతానికి ఉడ్డియానమనే పేరు వచ్చిందో ఈ పేరు ఎలా వచ్చిందో చెప్పడానికి శ్రీ శాస్త్రిగారు జరిపిన చర్చ తృప్తిగాలేదు. ఈ శబ్దార్థ నిర్ణయంలో శ్రీ శాస్త్రిగారి అభిప్రాయము లిట్లున్నవి.

"పైకి ఎగిరిపోవుట అనే అర్థంలో ఉడ్డియన మనే శబ్దం కనిపిస్తుంది. ఉడ్డీయన శబ్దానికి కూడా ఇంచు మించు ఇదే అర్థమున్నది. తాంత్రిక మంత్ర ప్రయోగాలను వివరించే ఉడ్డీశమనే గ్రంథమొకటి కన్పిస్తుంది. అణిమాదిసిద్ధులు మొదలగు తాంత్రిక యోగభ్యాసాలను తెలిపే అర్థంలో ఉడ్డియాన శబ్ద ముండ వీలున్నది. అప్పుడు వజ్రయానమనే మాటకు ఉడ్డియానము, ఒడియానమనేది తాంత్రికపర్యాయాలు కావటానికి వీలున్నది.

అడివి జాతికి చెందిన బియ్యమనే అర్థంలో 'ఓడీ' అనే శబ్ద మొకటి ఉన్నది. ఈ బియ్యాన్ని ఆధారంగా చేసుకొని జీవించేవారు 'ఓడివాసులు' కావచ్చును. ఏది ఎట్లున్నా వజ్రయానికులే ఓడియానులు, ఉడ్డియానులు అని పిలువబడినారు. వీరి మంత్రాలకు ధారణీలని పేరు. అందుచేత వీరికి ప్రధానాశ్రయము నిచ్చినధాన్యకటకము—ధారణీకటకము, ధరణికోట ఐనది. వీరి ముఖ్యపీఠము వజ్రపర్వతమనబడిన శ్రీపర్వతము. నేడు వజ్రాలదిన్నె అనబడెడిది వీరి ఉప పీఠము కావచ్చును. పైగా జగ్గయ్యపేట దగ్గరగా నేడు ధనంబోడు అనబడె ఒక దిబ్బ యున్నది. ఈ ధనంబోడులో మళ్లీ ధారణీ శబ్దమే కన్పడగలదు. వజ్రయానికులని పిలువబడిన ఉడ్డియానికుల కిది కూడా స్థావర మొసగిన ప్రదేశమే అనుటలో సందేహములేదు.

బౌద్ధుల యోగాభ్యాసములో అతిప్రాచీనకాలము నుంచి ధ్యానాలు, సమాధులేకాక బుద్ధిపాదాలనేవి కూడా ఉన్నవి. బహుశః బుద్ధి అనే శబ్దానికి ఉడ్డి అనేది వికృతి కావచ్చును. వృద్ధి శబ్దము వడ్డి అయి

నట్లు బుద్ధి శబ్దము ఉడ్డి కావటానికి వీలున్నది. ఈ వజ్రయానికుల దోరణిలో బుద్ధి పాదాల కతి విశిష్టమైన స్థానమున్నది. అతిలోక శక్తులను వశ పరచుకొనుట, తత్వమును సాక్షాత్కరింపచేసికొనుట, సిద్ధులను పొందుట అనేవన్నీ బుద్ధియానములో ఉన్నవి. ఇదే ఉడ్డియానము. ఇది ఆచరింప బడిన దేశానికి కూడా ఉడ్డియానమనే పేరు వచ్చినది.''

పై వాక్యములు శ్రీ శాస్త్రిగారి వ్యాసమునుండి యథాతథముగ ఉదహరింపబడినవి. శ్రీ శాస్త్రిగారి ఊహలు చక్కగనే ఉన్నవిగాని యాథార్థ్యమునకు దూరములో నున్నవి.

ఉడ్డీశమనే తాంత్రిక గ్రంథమునకాపేరు శాక్తేయ సంబంధముగా వచ్చినదిగాని బౌద్ధసంబంధము కాదు. 'ఉడ్డియాన, ఉడ్డీశ, ఓడ్యాణ' శబ్ద ములు అతి సన్నిహిత సంబంధములు కలవే. వాని అర్థములకై ఊహాగానము లక్కరలేదు. ఇదివరకే రూఢి అర్థము లున్నవి. ఆ అర్థములు మంత్ర శాస్త్రజ్ఞులకు తెలిసినవే.

శ్రీదేవికి ఉడ్డీశమయి అని నామమున్నది. ("మిత్రేశమయి, షష్ఠీశమయి, ఉడ్డీశమయి, చర్యానాథ మయి, లోపాముద్రామయి"—శ్రీ దేవీ ఖడ్గ మాలా స్తోత్ర రత్నమ్). శ్రీ దేవియే "ఓడ్యాణపీఠ నిలయ. (శృఙ్గార రస సమ్పూర్ణా జయా జాలన్ధరస్థితా, ఓడ్యాణ పీఠ నిలయా బిన్దు మణ్డల వాసినీ—379 వ నామము శ్రీ లలితా సహస్రనామస్తోత్రమ్). కాబట్టి 'ఉడ్డీశ', 'ఓడ్యాణ' శబ్దములు రెండును శాక్తేయ సంబంధములుగా నిశ్శంకగా అంగీకరింపవలయును.

ఈ శబ్దార్థములు వివరింతును. లలితా సహస్ర నామావళియొక్క కాలము క్రీ.వె. 5, 6 శతాబ్దములు కావచ్చునని పాశ్చాత్య విద్వాంసులు (Most Conservative Western Orientalists) అంగీకరించు చున్నారు. భారతీయ విద్వాంసులదృష్టిలో నిది క్రీస్తు పూర్వము మహాభారతకాలమునాటిది. ఏది ఎట్లైనను శ్రీ శాస్త్రిగారు ఉదాహరించిన బౌద్ధచారిత్రకుల కాలమునాటికే ఈ శబ్దములకు శాక్తేయ పరిభాషలో రూఢి అర్థములు ఏర్పడి ఉన్నవి.

పిండాండ బ్రహ్మాండములకు ప్రధానకారణము శుద్ధ బ్రహ్మ స్వరూపము. జనిష్యమాణ ప్రాణ్యాదృష్టకాలము తటస్థించినపుడు సృష్ట్యాది నిర్వికల్ప సచ్చిదానంద మయ తేజో మండలము మాత్రము ద్వైతవస్తురహితముగా నున్నది.

వెనుకటి సృష్ట్యంతమందు నామరూపాత్మక ప్రపంచము వాసనామయముగా అవ్యక్తమునందు క్రమముగా లీనమైనది. అవ్యక్తము బ్రహ్మమందు లీనమైనది. మరల సృష్ట్యావిర్భావ కాలమందు నిర్గుణ బ్రహ్మము బిందుభావమును పొందినది. నిస్త రంగ సముద్రమునం దలలవలె బిందువునందున్న మాయాశక్తి విజృంభణచేత ఆ బిందువు వికసించి నది. మొదటి బిందువు సర్వ కారణమై బిందు వికసనము అవ్యక్తమును త్రిభుజా చక్రముగా ఏర్పడినది. ఆది బిందువు పురుషుడు. అవ్యక్తము మూలప్రకృతి. ఇదియు కారణముగానేయుండి ఈ ఉభయ మేళనము వలన నామరూపాత్మకమైన కారణ బిందువువలన జగదుత్పత్తి అయినది.

ఆది పురుషుడైన పరశివ కామేశ్వరుడు జగత్తును సముద్ధరింపగోరి ఆత్మ విద్యా రూపమైన శ్రీవిద్యను మూల ప్రకృతి (అవ్యక్తము) రూపమైన శ్రీ కామేశ్వరీ పరాభట్టారికాదేవికి ఉపదేశించెను. ఆ విద్యోపదేశకాలమున పరశివకామేశ్వరుడు 'ఊర్ధ్వ దేవనాథ' నామమును ధరించెను. శ్రీ కామేశ్వరీ పరా భట్టారికాదేవికి 'మిత్రేశ దేవనాథ' నామము నిచ్చెను. ఆ మిత్రేశ ఊర్ధ్వ దేవనాథద్వంద్వము సర్వానంద మయమైన "ఓడ్యాణ" పీఠమందు పురాణ దంప తులుగా నున్నారు.

శ్రీ కామేశ్వరీ పరాభట్టారికాదేవి కృపచేత జాలంధర పీఠగతులైన ద్వంద్వమునకు, ఆపైన 'పూర్ణగిరి' పీఠస్థ ద్వంద్వమునకు, పిమ్మట 'కామ

గిరి' పీఠస్థ ద్వంద్వమునకు ఈ శ్రీవిద్య లభించి వారి వలన ఉపదేశ పరంపరగా ప్రవర్తించి దివ్యౌఘ (ఇంద్రాది) సిద్ధౌఘ (సనకాది) మానవౌఘ (శ్రీ శంకర భగవత్పాదాది) రూప గురు మండల క్రమముగా నీవిద్య అవతరించి జగత్తునందు వ్యాపించినది.

'ఊర్ధ్వ దేవనాథునికే' ఉడ్డీశుడని నామాంతరము. ఆయన వామాంకస్థ పరాభట్టారిక 'ఉడ్డీశమయి' అనబడుచున్నది. ఉడ్డీశమయి ఓడ్యాణ పీఠస్థ శ్రీదేవి.

మనదేశము పూర్వమునుండి భక్తిమయము' దేశములో నాలుగు మూలల ననేక దేవాలయములు శాక్తపరములై యుండుట నేటికిని గోచరమగుచున్నది. ముఖ్యముగా యావద్భారతమునందు అష్టాదశ (18) శక్తి పీఠస్థానములున్నవని ప్రఖ్యాత విషయము. దేవీగీతలో 7—5—30 అరువది కంటె ఎక్కువ ముఖ్యమైన శాక్త క్షేత్రములున్నట్లు తెలియుచున్నది. అట్టి శాక్తేయ పీఠములలో "కాశీ విశాలాక్షి, మధుర మీనాక్షి, కంచికామాక్షి శ్రీ కాళహస్తి జ్ఞాన ప్రసూనాంబికా, శ్రీశైల భ్రమరాంబికా" మన మెరుగున్నవే.

భిన్న భిన్న దేవతాయతనములందు భిన్న భిన్న 'యంత్రములను' ప్రతిష్ఠింతురని సామాన్యులు కూడ నెరుగుదురు. అట్లే శ్రీశైలమందును ప్రతిష్ఠ జరిగినది.

'శ్రీచక్ర' సమగ్ర స్వరూపమైన ఓడ్యాణ పీఠ పురాణ దంపతులను శ్రీ కామేశ్వర శ్రీ కామేశ్వరీదేవి ద్వయమును శ్రీశైలమందు ప్రతిష్ఠించినారు. (శ్రీగిరి మల్లికార్జున మహాలింగం! శివాలింగితమ్). అందుచేతనే శ్రీశైలమునందు ఉభయ దేవతలకు (శివాభ్యాం) మల్లికార్జున భ్రమరాంబికలకు సమాన ప్రతిపత్తి. రెండును దివ్య క్షేత్రములు. ఇట్లు ఉభయ దేవతా సమాన ప్రతిపత్తి అన్ని దేవస్థానములందుండదు. ఇది అరుదు. శ్రీశైలమందు ప్రతిష్ఠితమైన యంత్రము శ్రీ చక్ర బిందువైన ఓడ్యాణ పీఠ యంత్రమే. అందుకనియే ఆ పర్వతము శ్రీ చక్ర నామముతో శ్రీశైలమైనది. అమ్మవారు బిందుగత సంచలన స్వభావ సూాల ప్రవృత్తి గనుక భ్రమరాంబికయైనది. బిందు వికాసమును చెప్పినాము. వికాస భావమునకు ప్రతీక 'మల్లిక' శ్రీ స్వామివారి నామమందున్నది. ఈ విశేషము లిట్లుంచుడు. ఇంతకును శ్రీశైలము ఓడ్యాణపీఠ యంత్ర యుక్తము. అది ఆంధ్రులకందరకు నిత్యస్మరణ హేతువై—'దేశకాల' సంకీర్తనమున నిత్యమును ఆంధ్రులిప్పటికి—'మేరోః దక్షిణ దిగ్భాగే—శ్రీశైలస్య ఆగ్నేయ (ఈశాన్య) ప్రదేశే' అని చెప్పుకొనుచున్నారు. ఆంధ్రులకు నిత్యనైమిత్తికములలో శ్రీశైలమే నిత్య స్మరణీయమై—ఆంధ్రము శ్రీశైల దేశమయినది. కాబట్టి ఆంధ్రము ఓడ్యాణ పీఠ ప్రాంత భూమిగా పిలువబడినది. ఓడ్యాణపీఠ (ఉడ్డీశస్థాన) ప్రాంతమే ఉడ్డియన దేశమైనది. ఇది శ్రీశైల సంబంధియేగాని బౌద్ధసంబంధికాదు.

హఠయోగ విషయముగా ఓడ్యాణ బంధమని ఉన్నది. అది ప్రాణాయామ విషయము. శరీరాంతర్గత ఆజ్ఞాచక్రప్రాంత సంబంధి ఈ బంధము. దాని వివరము లిచ్చుట అప్రస్తుతము.

—తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు.

సిరియూరు తామ్రశాసనము: దానస్థల నిర్ణయము

1965 నవంబరు నెల భారతిలో (సంపుటము 42—సంచిక 11) శ్రీ మునునూరి సాంబశివరామమూర్తిగారు రెండవ అమ్మరాజు విజయాదిత్యుని సిరియూరు (కడలి) తామ్ర శాసనమును ప్రకటించుచు, దానస్థల నిర్దేశ విషయమై కొంత విచికిత్సకు లోనై, తుదకు తణుకు తాలూకా ఏ "రామన్నపాలెమో" లేక కాలగర్భమైన "ఏ మఱియొకయూరో" యని అనిశ్చయముగ వదలివైచి, జిజ్ఞాసువులకు కొంత పనికల్పించినారు. ఇటనే వారు లోగడ "వరణఏన్డి" శాసనమును ప్రకటించుచు

నం దుదాహృతమైన "తోలివాయి"ని గుర్తించుటలో గూడ డోలాయమాన స్థితికి లోనైరి. ఇట్టి తడబాట్లు శాసన పరిశోధనలో నెంతటివారికైనను తప్పని పోట్లే!

ఇక ప్రస్తుతాంశమునకు వత్తము. సిరియూరు (కడలి) తామ్రశాసనములో స్థలనిర్దేశ మొనర్చు పట్టున శాసనపాఠమిట్లున్నది :

42.........పూర్వతః విప్పర్తి
పొలగరుసుసీమా। దక్షిణతః దేవ

43. పొలగరుసుసీమా॥ పశ్చిమతః మోరం
బర్తిపొలగరుసుసీమా। ఉత్తరతః నొడలి

44. పొలగరు సుసీమా॥

దీనినిబట్టి సాంబశివరామమూర్తిగారు తమ వ్యాసమున దానస్థల నిర్దేశ మొనర్చుగడంగి "సిరియూరు" గ్రామ అగ్రహారమునకు సరిహద్దుగ్రామములుగా తూర్పున "విప్పర్తి," దక్షిణమున "దేవ" పశ్చిమమున "మోరంబర్తి" ఉత్తరమున "నొడలి" అని యుదహరింప బడినవి. ఇందలి విప్పర్తి పశ్చిమ గోదావరి యందలి తణుకు తాలూకాలోను, "నొడలి"వడలియను పేరున తణుకు తాలూకాలోను, "దేవ"నరసాపురము తాలూకాలోను యిప్పటికిని గలవు. మోరంబర్తిగూడ ఆ తణుకు తాలూకాలోనే గలదు. కావున ఆ యూళ్ల మధ్యనున్న "సిరియూరు" గ్రామము కాలగర్భమున నేడు లీనమై పోయినను"వసిష్ఠ గోదావరి"తీర సమీప మందున్నట్లు గోచరించు చున్నది..................... కావున యీ శాసనమునందుదహరింప బడిన "సిరియూర"ను గ్రామము పశ్చిమ గోదావరిజిల్లాయందలి తణుకు తాలూకాలోని విప్పఱ్ఱు (ఇలపఱ్ఱు),దేవ,మోరంబర్తి (ములపఱు) నొడలి (వడలి) మధ్యస్థమైన ఏ"రామన్నపాలెమో" లేక కాలగర్భమైన ఏ మఱియొక గ్రామమోయని నిర్ధారింప ననువుగలుగు చున్నది. అంతేగాక వేరొక తావునగాదు" అని తమ అభిప్రాయమును తెల్పియున్నారు.

ఇట్టి నిర్ణయమునకు వచ్చుటలో వారు కొన్ని సంగతులను విస్మరించి, భ్రమ ప్రమాదవశమునబడి, అపసిద్ధాంతీకరణ దోషమునకుపాల్పడినారు. శాసనములో నుదహరించిన విప్పర్తి గ్రామము తణుకు తాలూకాలోనున్న మాట వాస్తవమే! అట్టి గ్రామమే మరొకటి తాడేపల్లిగూడెం తాలూకాలోగూడ గలదు. ఈ రెండు గ్రామములను వివక్షించి తెలుసుకొనుటకు ననువుగా తణుకు తాలూకాలోని"విప్పర్తి"ని "తూర్పు విప్పఱ్ఱు" అనియు, తాడేపల్లిగూడెం తాలూకాలోని "విప్పర్తి"ని "పడమర విప్పఱ్ఱు" అనియు పిలుచుట సామాన్యమైనది. అందుచేత శ్రీ సాంబశివ రామమూర్తిగారు "విప్పర్తి" గ్రామము తణుకు తాలూకాలోనిదని నిర్ణయించుటజేసి, యది "తూర్పు విప్పఱ్ఱు" అనియే మనమనుకొనవలసి వచ్చుచున్నది. కాని—తూర్పు విప్పఱ్ఱు చుట్టును శాసనములో నుట్టంకింపబడిన ఇతర గ్రామములులేవు. అందుచే శాసనములోని "విప్పర్తి" గ్రామము నేటి "తూర్పు విప్పఱ్ఱు" కానేరదు. అట్లనే తాడేపల్లిగూడెం తాలూకాలోని "పడమటి విప్పఱ్ఱు" కూడ శాసనోక్త గ్రామ వర్ణనకు సరిపోవుటలేదు. అయిన నీ "విప్పర్తి" గ్రామమేది?

శ్రీ సాంబశివరామమూర్తిగారు పక్షాంతర వాదనచే "విప్పర్తి" గ్రామము నేటి తణుకు తాలూకాలోని "ఇలపఱ్ఱు" గ్రామముగా గుర్తించిరి. అట్లనే "మోరంబర్తి" గ్రామము "ములపఱ్ఱు"గా గుర్తించిరి. ఈ గుర్తించుటలో వారు పొరపడిరనియే చెప్పవలసి వచ్చినందులకు క్షంతవ్యుడను. ఈ గుర్తింపునకు మూల కారణము వారు తొలుదొల్తనే "సిరియూరు" గ్రామము, "రామన్నపాలెము" అయియుండవలెనను నిర్ణయమునకువచ్చి, తరువాత సరిహద్దుగ్రామములను గుర్తింపదొరకొని తమకు వీలుగా నుండులాగున ప్రాచీన గ్రామ నామములను తమ యూహల ప్రకారము నేటి గ్రామనామములకు అనుసంధింపజూచుటయే గాని అన్యముగాదు. అదియునుగాక "రామన్నపాలెము" పశ్చిమ దిశను "ములపఱ్ఱు" గ్రామము లేదను మాటనే వారు విస్మరించినట్లున్నారు! శాసనములోని "సిరియూరు" గ్రామమునకు పశ్చిమ హద్దు "మోరంబర్తి" గ్రామముగా వర్ణింపబడినది. కావున శ్రీమూర్తిగారి గ్రామసీమానుసంధానము అసంబద్ధముగా తేలిపోవుచున్నది!

పై గ్రామనిర్దేశక్రమములో కొంత సవరణ చేసితిమేని యథార్థ స్థితి సాక్షాత్కరించుకొనుట కష్టమైన పనిగాదు. అదేదన—శ్రీ మూర్తిగారూహించి

నట్లు "విప్పఱ్తి" గ్రామమును "ఇలపఱ్రు" గనో లేక "ములపఱ్రు" గనో అంగీకరించి "మోరంబఱ్తి" గ్రామముకొరకన్వేషించినచో నీ సమస్య కొక సరిష్కార మార్గ మొనగూరుచున్నది. "విప్పఱ్తి" గ్రామ నిర్ణయము సిద్ధముగా నొనరించుటతో "మోరంబఱ్తి" గ్రామ మేదై యుండు ననున దొక్కటే మిగులు చున్నది. దాని ప్రత్యుత్తరమునకై మన మంతగా వెద కుచూ పోనక్కరలేదు!

ప్రాచీన శాసనములలో నేటి "మునమఱ్రు" గ్రామము "మొనంబఱు" "మునంబఱ్జు" అని ఉదహరింపబడుట శాసన పరిశోధకులకు క్రొత్తగాదు. క్రముగా "మొనంబఱు", "మోనంబఱు", "మోరంబఱ్రు" లు ఆ యా కాలములందు వాడుకలోనుండి చాళుక్యుల కాలమున నీ శాసన మందున్న రూపమున "మోరంబఱ్తి"గా నిలిచియుండి యుండవలెను. చాళుక్యుల శాసనములలో గ్రామాంతనామము "నొఱ్తి" పదముచే విలసిల్లుటను మనమెక్కువగా గాంచ వచ్చును. ఉదాహరణగా "సర్వలోకాశ్రయ" బిరుదాంకితుడు పూర్వ చాళుక్య కులజులలో ప్రథముడునగు "మంగి యువరాజు" భీమవరం తాలూకాలోని నేటి "బొండాడ" గ్రామమును "బొండాడనోర్తి" యను పేరున దానమిచ్చినటుల శాసనాద్యాధారములు గలవు. ఇటులనే"మట్టపఱ్జు","మొట్టపఱితి"గను "పాండువ్వ" "ప్రొందొఱ్తి" గను ప్రాచీన శాసనములలో నుదహరింపబడియుండెనని తెలిపినచో నా వాదనలోని బలము తేటతెల్లము కాగలదు. అందుచే "మోరంబఱ్తి" యన "మునమఱ్రు" గ్రామమని నిర్ణయించుటకు మనము వెనుకాడవలసిన అవసరము లేదని తేలుచున్నది. ఈ నిర్ణయమును శాసనోక్త గ్రామములకు వర్తింప జేసి చూచితిమేని "సిరిపురము" నకు హద్దులు యీ క్రింది విధముగా నేర్పడుచున్నవి.

తూర్పు : విప్పఱ్తి పొలగరుసుసీమ (నేటి "ఇలపఱ్జు" లేక "ములపఱ్రు" సరిహద్దు సీమ.)

దక్షిణము : దేవ పొలగరుసుసీమ (నేటి దేవ గ్రామ సరిహద్దుసీమ)

పశ్చిమము : మోరంబఱ్తి పొలగరుసుసీమ (నేటి మునమఱ్రు గ్రామ సరిహద్దుసీమ).

ఉత్తరము—నొడలి పొలగరుసుసీమ (నేటి వడలి గ్రామ సరిహద్దుసీమ.)

ఈ గ్రామ సీమల మధ్యస్థమైన గ్రామము శాసనమునందలి "సిరిపురమునకు" తుల్యమై వెలుగుచున్న నేటి"తామరాడ" (తామరవాడ లేక తామర వాటిక) గ్రామమని నిస్సంశయముగా చెప్పనగుచున్నది. తామరాడ గ్రామము నేటికిని అగ్రహారముగనే వ్యవహరింపబడుచున్నది. దీని యెల్లలు శాసనములో చెప్పబడిన వాటితో నెట్టి వ్యత్యాసమును లేక సరిపోవు చున్నవి. కావున శాసనములో దానమీయబడినటుల నుదహరింపబడిన "సిరిపురము" తణుకు తాలూకా లోని నేటి "తామరాడ" గ్రామమని నిశ్చయించుట సర్వవిధముల యొప్పియున్నదని నా నమ్మకము.

ఈ సందర్భమున వేరొక విశేషమును తెల్పుట అప్రస్తుతము కాదనుకొందును. శతావధానులు, గీర్వాణాంధ్ర భాషా పండితులు వడలి గ్రామవాస్తవ్యులు, నాకు గురుతుల్యులునైన శ్రీ మంచం బుచ్చిలింగప్ప శాస్త్రిగారు వారి యూరిలో లభ్యమైన మూడు అసంపూర్ణ తామ్రశాసన ఫలకములను నేటి కొక దశాబ్దము క్రిందట ప్రచురణార్థము నా కొసంగియుండిరి. అవి కారణాంతరములచే శివసాన్నిధ్యవర్తులు శ్రీ భావరాజు వేంకట కృష్ణరావు పంతులువారిచేతబడి, భారత ప్రభుత్వ పురాతత్త్వ పరిశోధకశాఖవారి హస్తముల జేరి, హస్తినాపుర మ్యూజియము భవనమున సురక్షిత స్థాన మేర్పరచుకొన్నవి. వాని ప్రతిబింబములను నేను ప్రభుత్వాధికారులనుండి పొంది, భద్రపరచియుంచితిని. అందొకదానియందుగల శ్లోకముల నీసందర్భమున నుదహరించుట ప్రస్తుత చర్చకు కొంత సహాయకారి యగునని తోచుచుండుటచే వాని నీ క్రింద నుదహరించుచున్నాను :

సామ బుగ్యజుష శూరవిశ్రుతా
న్బ్రాయసా సమచెనోదనెహసా
సోదరేభ్య ఒడలీతి విశ్రుతం
గ్రామమాశ్రితజనాయచాప్యదాత్
క్లుప్త భాగ నవతిం పృథక్కృత
గ్రామ దైవతిక పంచభాగకం
తేభ్యయేవ చెలువూరు సంజ్ఞకం
గ్రామమన్యమపి సో దదాత్పునః

సంప్రదానజనవృత్తి పూర్తయే
వాత్ర లాభపరితోష నిర్భరః
ఐశ్వర్యభోగైర్యుతమష్ట సంఖ్య
స్వకర్షకారామ గృహేష్వరాంకం
చతుర్దిగంత ప్రవిభక్తసీమ్యం
గ్రామద్వయం ప్రాదిశ దగ్రహారం

లభ్యమైయున్న యీ శాసనపు రేకునందలి పై శ్లోకములవలనతేలినసూక్ష్మార్థమేమనః—"ఒడలి" "చెలువూరు" యను గ్రామద్వయమును పురాణ పారగులును, వేద విదులునునగు బ్రాహ్మణోత్తములకు (తత్ప్రాంతముపై ప్రభుత్వము నెరపుచున్న నాటి ప్రభువు?) సీమా విభాగ మొనర్చి అగ్రహారములుగా నొనర్చి దానమిచ్చెనని. అగ్రహారములుగా నీయబడిన యీ రెండు గ్రామముల యెల్లలు స్పష్టీకరించు తరువాయిరేకు లభ్యముగానందున నీ రెండు గ్రామముల సరిహద్దులును మనకు తెలియరాకుండ బోయినవి. అయిననేమి? ఈ శాసన భాగమునుబట్టి మనకు "ఒడలి" "చెలువూరు" గ్రామము లొక చోటనే యున్నట్లు తెల్లమగుచున్నదికదా! "ఒడలి" (వడలి) విషయమై మనకీవరకే తెలిసియున్నది. దాని నంటియున్న గ్రామము "చెలువూరు". "వడలి" గ్రామపుప్రాచీనపు టెల్లల నొకపరి పరికింతుమేని "చెలువూరు" ప్రస్తుతాంశమైన రెండవ అమ్మరాజ విజయాదిత్యుని "సిరియూరు" (కడలి) తామ్ర శాసనమునందలి "సిరియూరు" గాని అన్యము గాదని నిస్సంశయముగా చెప్పదగు సాహసము వహించవచ్చును. పదియవ శతాబ్దమునందు "సిరియూరు"గా పేర్వడసిన గ్రామము పదునాల్గవ శతాబ్దము వచ్చుసరికి "చెలువూరు"గా మార్పుచెందుటలో నాశ్చర్యపడవలసిన యవసరమేమియులేదు. ఇట్టి నామ పరివర్తనలు ప్రభుత్వము మార్పులతోబాటు సంభవించుట చారిత్రక సమ్మతములని వేరుగా నుడువబనిలేదు! కావున "సిరియూరు", "చెలువూరు" లు యొకటికాగా నేటి "తామరాడ" యే "సిరియూరు" అనగా"చెలువూరై" వెలసెనని సిద్ధాంతీకరించుటలో ప్రత్యవాయమేమియు నుండరాదు.[1]

ఈ సిద్ధాంతీకరణ కొక యాటంకమున్నది. "ఒడలి" కి "చెలువూరు" సన్నిహితమై యుండవలెనుగదా! అట్లాటచే "చెలువూరు"గా నిర్ధరింపబడిన "తామరాడ" 'వడలి'కి సన్నిహితమై యున్నదా? యన్న ప్రశ్న ముదయించుచున్నది. ఆ ప్రశ్నకు సదుత్తర మొసంగగల్గిననాడు మన సమస్య తీరిపోయినటులే!

జనశ్రుతినిబట్టియు, వయోవృద్ధులకైఫీయతుల బట్టియు నేటి "రామన్నపాలెము" యొకనాడు "వడలి గ్రామ"పు శివారుగా నుండియున్నటుల దృష్టాంతములున్నవి. మాంజీగ్రామమగు 'వడలి'కి శివారు గావుననే యేతత్ గ్రామ పరిశిష్టమగు నీ భాగమునకు "పాలెము" యను నామము వచ్చినది. అదియునుగాక రామన్నపాలెమునకు వడలిగ్రామమునకు మధ్య సరిహద్దు పుంతలు లేక యేకఖండముగా నొకే గ్రామముగా నుండుట యీ యూహను బలపరచుచున్నది. రామన్నపాలెమునకు మిగిలిన మూడు వైపులనుగల గ్రామములతోగల వేర్పాటును సూచించు సరిహద్దు పుంతలుండియున్నవి. కావున వడలి, రామన్నపాలెములు యొకానొకకాలమున నొకేగ్రామముగా, నేకఖండముగా యుండియున్నవని చెప్పుట నిర్బాధకమని తేలుచున్నది. కావున "రామన్నపాలెము", "వడలి" యు నొకే గ్రామముగా నిర్ధరించిన సందర్భమున "రామన్నపాలెము" నంటియున్న "తామరాడ" గ్రామము "వడలి"ని యంటియున్నట్లేగదా! ఆ విధిని "చెలువూరు", "వడలి" గ్రామపుపొలిమేర గ్రామమై, పైన ఉదహరించిన అసంపూర్ణ తామ్ర శాసనములోని శ్లోక వర్ణనలకు సరిపోవుచున్నది. అందువలన అగ్రహారద్వయముగా వెలసిన "ఒడలి", "చెలువూరు" లు నేటి "వడలి" "తామరాడ" గ్రామములుగా నొకదాని పొలిమేర నొకటి యుపస్థితములైయుండి అష్టైశ్వర్యములతో తులతూగినటుల స్పష్టమగుచున్నది. 'సిరియూరు" గా మొదట పేరందిన "చెలువూరు" ప్రస్తుత కాలమున "తామరాడ" (తామరవాడగా)పరివర్తనము బొంది యుండెననుట కాదనరాని సత్యము. ఇప్పటికినీ "తామరాడ" =లక్ష్మికి అనగా శ్రీ (సిరి) కి స్థానమైన తామరలు గల వాడ గ్రామము అను అర్థమును సాధించవచ్చును.'

1. సిరియూరు=సిరి (శ్రీ) లేక సంపద (గల) గ్రామము; చెలువూరు=చెలువు (సంపద లేక సొంపు)గల గ్రామము. ఈ రెండును యొకేయర్థము నిచ్చుచుండుట గమనార్హము. ఇందలి అర్థ సాదృశ్యము గుర్తించుటావశ్యకము. అటులనే తామరవాడ (తామ

రాడ'' అగ్రహారమై యుండుట ఈ సత్యము కొట్ట వచ్చినట్లు కన్పించుచున్నదన సందియపడనవసరము లేదు!

ఇంకొకమాట చెప్పి యీ వ్యాసమును ముగింతును. శ్రీ సాంబశివరామమూర్తిగారికీ శాసనము నొసంగిన శ్రీ చెలికుమిల్లి సీతారామచంద్రమూర్తిగా రే ప్రాంతమువారో నేనెరంగనుకాని ''వసిష్ఠ గోదావరీ తీర ప్రాంతములోనున్న యొకయూరు అగ్రహారముగా నీయబడిన శాసనము, ఆ గ్రామమును దాటి, నదుల నుత్తరించికొని క్రోసుల దూరము ప్రయాణించి యెక్కడో వేరొకచోట లభ్యమైనదన్న ఆ దానము పొందినవారి సంతతియో, బంధుగులో, సన్నిహితులో యైన వారెవరో యొకరివలన స్థానచలనము పొంది యుండవలెననుట నిర్వివాదాంశము. ఆదిలో ''సిరియూరు'' గ్రామదాన ప్రతిగ్రహీతల సంతతిలో నెవరేని యీ శాసనమును తమతోబాటుగా గొంపోయి వివిధ ప్రదేశములలో నివాస మేర్పరచుకొనుచు కాల క్రమేణ అవస్థా భేదముచే నన్యవృత్తుల మెలుగుచు, దేశ కాల పాత్రానుగుణ్యముగ జీవయాత్ర సాగించుచు వచ్చి వచ్చి తుదకు శాసనము విలువనే విస్మరించి యేమరుటలో నది నిలువులోతు పాటిమట్టిలో పూడిపోవుట సంభవించియుండవచ్చును. నేటి కది ''శ్రీ కాశీభట్ట'' వారి ధర్మమా యని బయల్పడి శ్రీ ''చెలికుమిల్లి'' వారి సహాయముతో వెలుగుచూచుట సంభవించినది. ''తామరాడ''లో అగ్రహారీకులుగా పేర్వడసినవారు ''చెలికుమిల్లి''వారు. ఇటీవలి కాలములో ''మొగలితుర్రు'' సంస్థానాధిపతులచే వేదాధ్యయనమం దందెవేసిన చేయిగా మాన్యాదిక బహూకరణములచే సన్మానములందిన చెలికుమిల్లి నారాయణ సోమయాజులుగారు ''తామరాడ'' చెలికుమిల్లివారి కుటుంబీకుల లోనివారనియే నేను వినుచున్నాను. అంతియే గాక వేద వేదాంగవిదులగు మనీషులు ''చెలికుమిల్లి'' వారిలో పలువురుండిరనియు,''తామరాడ''లోముప్పాతిక ముప్పిసమువంతు భూమి వారి కుటుంబీకులదై యుండెడిదనియు, కాలక్రమేణ తద్వంశీయులు ''తామరాడ''ను వదలి అన్యగ్రామవాసులై పోయిరనియు వారి విద్యతోబాటు యీనాములుగూడ పరాశ్రయాసక్తములై చనెననియు తద్గ్రామవాసులు చెప్పుచుండగ నేను వినుట తటస్థించినది. అందుచే శ్రీ చెలికుమిల్లి సీతారామచంద్రమూర్తి గారివలన నీ శాసనము వెలుగు చూచుటగూడ నొక విధముగ సమంజసము గానేయున్నది.

—తురగా కృష్ణమూర్తి.

పోతన పద్యశాసనము

క్రీ. శ. 1965 సం. జులై భారతిలోని 'పోతన దశమస్కంధ పద్య శాసన' విమర్శలో శ్రీ అప్పారావుగారు నా వాదముమీద కొంత జిజ్ఞాస ప్రకటించి, సందేహించినారు.

శ్రీ రావుగారు సూచించినట్లు శాసన ప్రతిబింబములు మరల తీయ నక్కరలేదు. ఆ రెండు శాసనములలో కూడ పోతన భాగవత దశమస్కంధ పూర్వ భాగ గద్య పద్యములు కలవనుట నిర్వివాదము.

క. యాదవ కులమున నమరులు
యే (మే)దినిపైం బుట్టం జనుండు
—మాయం(శ)మునన్
శ్రీ దైత్యుండు వసుదేవున
కాదరమునంబుట్టె భార
—మంత్తయుం బాపును.

(పూ. 15.)

.......వోరుగంటి ప్రతాపుని కాలమున కాటమ రాజు ౩౭ రాజ్యంసేసి లింగాల కొండ యరగడ పాటను నలసిద్ధిరాజుం గూడి యుద్ధంబూసేశి బడుగులు వారు చనిపొయ్యే నాంటికి కలియుగంబొచ్చి ౩౯౬౫ యేండ్లాయను వీరుల మహత్యం.......దశమ స్కంధమ్........శ్రీ శ్రీం జేయునూ.......

*   *   *

స్వస్తిశ్రీ శాలివాహనశక వర్షంబ్బులు ౧౧౭౦ అగు నేంటి కాళయుక్తి సంవత్సర కార్తిక శు. ౫ గు........ వల్లురాజు లతని సుతులు పోలు రాజు పెద్దురాజు వారి పుత్రులు మొదలైన యాదవులు నలసిద్ధిం గూడి యుద్ధము సేసి మృతులైరి !......

సీ. గోపికా జనములు—గో
పాలకులుంన్న

పసుల మంద్దకునేంగు—
భద్ర నీవు. (పూ. 59.)

క. నానావిధ సంపదలకు
నానకమై... ... ...
మానవులు భక్తిం గొలుతురు
కానికలును బలుల నిచ్చి..... (పూ. 60)

....

భాగీరతి దుర్గస్థానం కొండయ్య కొడుకు రామయ్య వుద్ధరించిన శాసనం."

ఇది నెల్లూరుజిల్లా, కందుకూరు తాలూకా (నెం.26 రు) గుండ్లపాలెం శాసన సంగ్రహ మూలము.

పై రెండు శాసనములలో 'హోరుగంటి ప్రతాపరుద్రుదు కాలము' చాల తప్పుగా చెప్పబడినది. క్రీ. శ. 863 లో కాని, క్రీ. శ. 1258 లో కాని వీరుల మాహాత్మ్యం జరిగినట్లు చెప్పుట కాధారములు లేవు. కాటమరాజు కథ (ద్విపద) కాలమును బట్టి చూడగా క్రీ. శ. 1281—83 మధ్యకాలములో నెల్లూరి నలసిద్ధిరాజుతో కాటమరాజు పుల్లరి యుద్ధము జరిగినట్లు ఏర్పడుచున్నది.

కాబట్టి, గుండ్లపాలెము శాసనములలోని శక కాల దోషమును మాస పక్ష తిథి వార సమన్వయ కాలముగా లెక్కించుట దోషముకాదు. కాగా,

'పై పోతన దశమస్కంధ పద్యోదాహరణమును బట్టి 23–10–1438 తేది గురువారమునాటి గుండ్లపాలెం శాసనమునకు పూర్వమే పోతన భాగవత రచన పరిసమాప్తమై దూర దేశములో సైతము కంఠస్థమై ప్రచారమునందున్నట్లు స్పష్టమగుచున్నది.'

అని మే నెల 1965 భారతిలో నే వనుట కాల దోషముకాదు. ఇతరచరిత్రకార శ్రీ శాసనాధారకాలము నెందుకు అనుమానప్రమాణముగా నైనను తీసికోలే దనుటకు బాధ్యత నాదికాదు.

తన పోతనలో శ్రీ నిడుదవోలు వెంకటరావు గారేమి చెప్పిరో శ్రీ రావుగారు గుర్తించినట్లు లేదు.

'పోతన భాగవత రచనము క్రీ. శ. 1480 ప్రాంతములకు ముందే పూర్తియై యుండవలెను గదా !'

అని యితరాధారములతో నూహించుటకంటే క్రీ. శ. 1438 సం. కాళయుక్తికి ముందే పోతన భాగవత దశమ స్కంధ పద్యములు నెల్లూరు పాకనాటి శాసనములలోని కెక్కిన వనుట వృథాశ్రమ యగునేమో యోచింప వేడుకోలు.

కాటమరాజు యుద్ధము[1] తర్వాత నూటయాభై యేండ్లకు పైనగాని గుండ్లపాలెము శాసనములు పుట్టలేదు. ఉద్ధరింపబడలేదు.

—దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి.

1. 'చిత్రభాను సంవత్సరము—
చెలగి కార్తిక
చెతుర్దశి దినమున
శెనివారమునాడు
ఆ రాత్రి వేగిన—ఆవుల పబ్బము.'
(ఆవుల మేపు: తాటియాకు 32)

శా. శ. ౧౨౦౪ అగు చిత్రభాను కార్తిక శు ౧౪ శనివారము 17—3—1282 తేదీతో సమకాలమగుచున్నది.



లేఖలు :

స్ఫోటవాదము

ఆర్యా !

జనేవరు (1966) భారతిలో మిత్రులు శ్రీ బి. వి. శ్రీనివాసాచార్యులుగారు "స్ఫోటవాదము"ను గురించి చక్కని వివరణము వ్రాసినారు. వారి వివరణమువలన దుర్గ్రాహ్యమైన శబ్దనిత్యత్వవాదము సామాన్యుల గ్రాహ్యశక్తికి అందుబాటులోనికి వచ్చినది. శ్రీ ఆచార్యులుగారు ఆ వ్యాసములో వివరించక వదలిన రెండు మూడు ముఖ్యాంశములు నేను పొందుపరచుచున్నాను.

"స్ఫుట్యతే=వ్యజ్యతే వర్ణైః ఇతిస్ఫోట" అను వ్యుత్పత్తిగల ఈ స్ఫోటవాదము "వర్ణ, పద, వాక్య, అఖండపద, అఖండవాక్య, వర్ణ పద 'వాక్య జాతి స్ఫోటములని ఎనిమిది విధములు. కాని వీనిలో అఖండ వాక్య, వాక్య జాతి, వాదములు రెండు మాత్రమే పరమ సిద్ధాంత భూతములు.

"అనేక వ్యక్త్యభివ్యంగా జాతిః స్ఫోటఇతిస్మృతా
కైశ్చిద్వ్యక్తయ ఏవాస్య ధ్వనిత్వేన ప్రకల్పితాః
సత్యాసత్యౌతు యౌ భాగౌ ప్రతిభావం వ్యవస్థితౌ
సత్యం యత్ తత్ర సా జాతిః అసత్యావ్యక్తయోమతాః
ఇత్థం నిష్కృష్యమాణం యచ్ఛబ్దతత్త్వంనిరంజనమ్
బ్రహ్మైవేత్యక్షరం ప్రాహుః తస్మై పూర్ణాత్మనేనమః"

అని అర్వాచీన వ్యాకర్తలు చెప్పినారు.

శ్రీ శంకరభగవత్పాదాచార్యులవారు శారీరక మీమాంసా భాష్యములో దేవతాధికరణమునందు "శబ్ద ఇతిచేన్నాతః ప్రభవా త్ప్రత్యక్షానుమానాభ్యా" మను సూత్రమునకు వ్యాఖ్యానము వ్రాయు సందర్భమున ఆచార్య ఉపవర్షుని స్ఫోటవాదమునుగురించి పేర్కొనిరి. (వర్ణా ఏవతు శబ్దః ఇతి భగవానుపవర్షః).

ఈ స్ఫోటవాదము వైయాకరణులది. దీనిని సాంఖ్యులు, నైయాయికులు, మీమాంసావాదులు ఖండించిరి.

శ్రీనివాసాచార్యులవారు స్పృశించిన పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ వాక్కుల విషయములో వారిచ్చిన వివరములకు ఈ క్రింది ఉపనిషద్వాక్కులు జోడించుచున్నాను.

ఋగ్వేదీయే సరస్వతీ రహస్యోపనిషత్ :
చత్వారివాక్పరిమితా పదాని తాని విదు బ్రాహ్మణా
యే మనీషిణః
త్రీణి గుహా నిహితా నేంగయంతి
తురీయం వాచోమనుష్యా వదంతి.

తా॥ వాగ్దేవతకు పరా, పశ్యంతి, మాధ్యమా, వైఖరీలను నాలుగు స్థానములు. ఈ నాలుగు స్థానములను తెలుసుకొనిన సాధక జనులు విద్వాంసులు. ఆ నాలుగు స్థానములలో మూడు గుప్తముగా నున్నందున మనుష్యులు తెలుసుకొనజాలరు. నాలుగవదగు వైఖరి మాత్రము వాక్కుచే నుచ్చరింపబడు చున్నది.

సకల వ్యవహారమును ప్రథమమందు సహస్రార మధ్యవర్తియగు సాక్షి స్థానమందు స్ఫురణ శక్తి కలుగుచున్నది. పిదప నా క్రియ యే ఇంద్రియ సంబంధమైనదో ఆ యింద్రియము ప్రేరేపింపబడి ఆ యింద్రియముచే నా క్రియలు జరుగును. కాబటి ఒక శబ్ద ముచ్చరించదలచినపుడు ముందు సహస్రారమందు ఇచ్ఛ జనించును. ఇది పరావాక్కు స్థానము. పిదప వాక్కునకు వాయు వాధారము గాన నా శబ్దోచ్చారణ ఇచ్ఛట జనించిన వెంటనే అచటి నుండి వ్యాపించియున్న నాడి ద్వారా ప్రేరణమయి మూలాధారమందు వాయువు ఉత్పన్నమగును. అది

పశ్యంతీ స్థానము. ఆ వాయువు పరా నాడీ ద్వారా స్వాధిష్ఠానమణిపూరములు దాటి అనాహతమును సంవిత్కమలమును పొందినపుడు 'మధ్యమ' అనబడును. అంతటనుండి విశుద్ధకమలమును పొందినపుడు వైఖరియని తేజోమయమయి స్పష్టాక్షరములు గలిగి ఆ శబ్ద ముచ్చరింపబడుచున్నది.

ఈ నాలుగు స్థానములలో 1. సహస్రారగతమయిన పరాస్థానమును 2. మూలాధార గతమైన వాయూత్పత్తి రూప పశ్యంతీ స్థానమును 3. సంవిత్కమలమును పొందిన మధ్యమస్థానమును మనుష్యులు తెలుసుకొనజాలరు.

సమయ (వేద విహిత) ఆచారము ప్రకారము పరా పశ్యంతీమధ్యమావైఖరీ స్థానములు పై విధముగా నున్నవి.

కౌళ వామాచారమున (మాతృకా వివేకమను గ్రంథమున) పరా వాక్ స్థానము మూలాధారమని యున్నది. వేద విహిత సమయ మతమున హంస ద్వంద్వము సహస్రారగతము. వాక్కునకు ప్రథమ మందు ఇచ్ఛ కలుగును. ఆ ఇచ్ఛ సహస్రారగతము గాన పరావాక్ స్థానము సహస్రారమని సమయ మతము.

శ్రీనివాసాచార్యులవారివివరణము పై సంగతులతో మరింత పుష్టివంతమగునని వ్రాసితిని.

—తు. రా.

'సోమర్సెట్ మామ్"

ఆర్యా,

జనవరి భారతిలో సోమర్సెట్‌మామ్‌పై శ్రీ బుచ్చిబాబుగారి వ్యాసం సమగ్రంగా ఉన్నది. మామ్ ముఖ్యమయిన రచనల లక్షణాలూ, వాటి ఔన్నత్యం చక్కగా వివరించారు. ఈ వ్యాసాన్ని అందజేసిన మీకు ధన్యవాదాలు.

"The Painted Viel" సారాంశాన్ని వివరించటంలో ఒక పొరపాటు దొర్లింది. హాంకాంగు వెళ్లిన డాక్టరు భార్య, భర్తతో అసంతృప్తిచెంది అక్కడొక ఉన్నతోద్యోగిని ప్రేమిస్తూంది. వ్యాసంలో అతడొక స్త్రీని వివాహమాడతాడని వ్రాశారు. కాని ఈమె ఇతనిని ప్రేమించటానికి పూర్వమే అతడికి వివాహం అయింది. అది ఈమెకు తెలుసు. ఆ ఉద్యోగి తన భార్యకి విడాకు లిచ్చి ఈమెను వివాహం చేసుకొంటానంటాడు. చివరికి మోసం చేస్తాడు.

కథలని వర్గీకరిస్తూ మామ్ ముద్రపడిన కథలూ, గొప్పకథలూ, మంచికథలూ అని విభజించారు. చివరి రెండు విధములైన కథలకీ గల తేడా వివరిస్తే బాగుంటుందేమో. ఒక కథను మంచిదంటూ, గొప్ప కథ కాదనటం ఎలా? ఏ సందర్భాల్లో అలా అనవచ్చు?

మన రచయితలకీ మామ్‌వంటి రచయితలకీ ఒక ముఖ్యమైన తేడా ఉంది. మన కథారచయితలూ, నవలాకారులూ తమ రచనల్లో తమ అభిమాన సిద్ధాంతాల్ని గురించి సుదీర్ఘ ఉపన్యాసాలు వర్షిస్తారు. సంఘ సంస్కరణ, స్త్రీల స్థానంవంటి విషయాల మీద వీరి రచనలు వ్యాసాల్లా కనుపించి సహజత్వం ఏర్పడుతుంది. వివిధములైన పరిస్థితుల్లో వివిధ మనస్తత్వాల వ్యక్తులూ ఏవిధంగా వ్యవహరిస్తారో రచయితలు పరిశీలించి తమ రచనల్లో వివరించాలి.

మామ్, ఓ హెన్రీ, మొరేవియా వంటి ప్రథమశ్రేణి రచయితలను చదివి సహజత్వం అలవర్చుకోవాలి. తరువాత ఎప్పుడూ సాంసారిక, గ్రామ విషయాలే గాకుండా ఇతర సమస్యలని గురించి కూడా రాయాలి. రాజకీయ ఆర్థిక అవినీతులు ప్రస్తుత సమస్యలు మనకి. కాని మన రచయితలు వాటిని అంతగా పట్టించుకుంటున్నట్లు కనపడదు.

—ధా. వెంకటరావు.

ఆంధ్రవాఙ్మయంలో స్తబ్ధత

ఆర్యా

1965 డిసెంబరునెల భారతిలో శ్రీ శ్రీపాదుక గారు వ్రాసిన "ఆంధ్రవాఙ్మయంలో స్తబ్ధత: ఒక లేఖ" అన్న వ్యాసం చదివాను. అందులో వారొకచోట శాస్త్ర విజ్ఞానంలో ఉన్నత పరీక్షలు ప్యాసైన వారిపై దాడిచేస్తూ వారందరూ అవసరం లేనట్టి

తక్కువ రకపు సాహిత్య వ్యాసంగానికి పూనుకుంటున్నారని గుండె బాదుకున్నారు. పైగా "అట్టివారు బుద్ధి మాంద్యమువల్లనేకాక కీర్తి వ్యామోహముచేత, అయోగ్యమైన దురహంకారముచేతకూడ బాధపడుచున్నారని ఒప్పుకోవాలి" అంటూ అనాంఛనీయమైన ఆరోపణలు చేశారు. పెద్దమాటలే వాడారు. బుద్ధిమాంద్యమనేది పైతెగ వారికే పరిమితమయినట్టు రచయిత భావిస్తున్నారు కాబోలు! పోతే, కీర్తి కండూతిలేని వాడెవడీ రోజుల్లో! ఇటువంటి ఆరోపణలు వ్యాసకర్త సంకుచిత మనోభావాలను తెలుపుతాయితప్ప ఏ ప్రయోజనాన్నీ సాధించబోవని చెప్పడానికి సాహసిస్తున్నాను.

సాహిత్యం సంకుచితత్వాల కతీతమైనది. సర్వజన సమ్మోదానికి హేతువైనది. అట్టి సాహిత్యాన్ని సాధనచేసే స్వేచ్ఛ ఏ కొద్దిమందికీ పరిమితంకాదు. సహృదయతతో విమర్శించే హక్కు సైతం పాఠకులందరికీవుంది. స్వేచ్ఛతోపాటు బాధ్యతల నెరిగిన రచయిత పాఠకుల ఆమోదాన్ని పండించుకొంటాడు. బాధ్యతా రహితంగా ప్రవర్తించే రచయిత బలంగా దేన్నీ చెప్పలేక మందలో కలిసిపోతాడు. పాఠకు లెవరిని మెచ్చుకోవాలో చెప్పవలసింది రచయితకాదుగదా! ఆ పని కొంతవరకూ విమర్శకునిది. ఎవరు వ్రాయాలో ఎవరు వ్రాయకూడదో శాసించే హక్కెవరికుంది? అయినప్పుడు, సాహిత్య వ్యాసంగం ఏ కొద్దిమందికో పరిమితమైనట్టు మాట్లాడే ధోరణి వింతగానూ, విపరీతంగానూ కనిపింపదా? పారిశ్రామిక యుగంలో నివసిస్తూ కూడ ఇలాంటి అభిప్రాయాలు వెలిబుచ్చేవారిని గురించి ఏమనుకోవాలి?

శాస్త్ర విజ్ఞానంలో డిగ్రీలు పుచ్చుకున్నంత మాత్రాన సాహిత్యాన్ని అధ్యయనంచేసే అర్హత ఎవరైనా ఎలా కోల్పోతారో అర్థంకాని సంగతి. ఒకడు డాక్టరో, ఇంజనీరో అయినంతమాత్రాన సాహిత్యంలో గల అభిరుచికి తిలోదకా లిచ్చుకోవాలా? తను చదివిన విద్యనే పట్టుకుని వూగులాడాలా? సంపూర్ణ మానసిక వికాసానికై ప్రయత్నించకూడదా? మనో ధర్మాన్ని కాదని అభిలాష చంపుకుని వ్యవహరించాలా? సాహిత్యం అవసరం లేనట్టి తక్కువ రకం వ్యాసంగమా? ఏమిటీ వ్యాసకర్త వింత ధోరణి?

సాహిత్యాధ్యయనం ఎవరి గుత్తాధికారమూ కాదు. వైయక్తిక మానసిక వికాసాన్ని సాహిత్య ప్రక్రియలద్వారా వెల్లడింప బూనుకోవడం బుద్ధిమాంద్యమూ కాదు. తక్కువ రకపు సాహిత్య వ్యాసంగమూ కాదు. వ్యాసకర్త వెల్లడించిన భావాలు సామరస్య వైఖరికి సుదూరంలో ఉన్నాయని చెప్పడానికి విచారిస్తున్నాను. మానవత్వానికీ సాహిత్యానికీ విడరాని సంబంధముందని ఒప్పుకుంటే సాహిత్య సాధన ఏ కొందరికో పరిమితం కాదని కూడ ఒప్పుకోవలసి వుంటుంది. ఎవరేమి రాస్తారో, ఏది కాలానికి తట్టుకొని నిలువ గలుగుతుందో నిర్ణయించడానికి పాఠకు లున్నారు, కాలముంది! అంతేగానీ, విశాల దృక్పథాన్నేర్పరచుకోవడానికి బదులు కొందరిని వెలివేసే దృష్టితో కించపరుస్తూ రాయడం సహృదయత అనిపించుకోదు. దురభిప్రాయాలకు దారితీసే యిట్టి రాతలు సాహిత్యానికి మేలు కలిగించలేవు.

—పరిగి రాధాకృష్ణ.

ఉమ్రావ్ జాన్ అదా

అర్యా,

ఫిబ్రవరి, 1966 భారతిలో "సమకాలిక భారతీయ సాహిత్యము" (కేంద్ర సాహిత్య అకాడెమీ ప్రచురణ—కీ. శే. తల్లావఝ్ఝల కృత్తివాసతీర్థులవారి అనువాదం) గురించి శ్రీ వాణీకుమారగారు వ్రాసిన సమీక్ష చదివాను. శ్రీ వాణీకుమారగారు ఉర్దూ, పారసీ భాషల్లో మంచి పాండిత్యం ఉన్నవారు కనుక నాకు పరమాప్తులు. రెండు నెలల క్రిందట భారతిలో నా అమ్జద్ రుబాయీల అనువాదానికి వారే సమీక్ష వ్రాశారు. పీఠికలో నన్ను గురించి నేను వ్రాసుకున్న వాక్యాలను సమర్థించి సమీక్షచేసినప్పటికీఅనువాదంలో నేను చేసిన ఒండు రెండు తప్పులను సరిగానే గుర్తించారు. నా తప్పులను ఒప్పుకున్నాననీ, అవి చూపినందుకు కృతజ్ఞున్ననీ వారికి లేఖ ద్వారా తెలుపవలెననుకున్నాను.కాని అది ప్రచ్ఛన్న నామం కనుక పేరూ, అడ్రసూ తెలియదు కనుక వ్రాయలేకపోయినాను.

ప్రస్తుత గ్రంథాన్ని సమీక్షిస్తూ ఒకచోట వారు తొందర పడినారనిపించినది. ఉమ్రావ్ జాన్ అదా అనే గ్రంథ ప్రసక్తి వచ్చినప్పుడు మూలంలో ఆత్మకథ

అవి ఉంటే అనువాదకులు దాన్ని నవల అన్నారని, అది నవల కాదు జీవిత చరిత్ర అని వ్రాశారు శ్రీ వాణీకుమారగారు. మూలంలో ఆ గ్రంథ ప్రసక్తి నవలల్లోనే ఉన్నది.

నిజాని కది నవలే కాని జీవిత చరిత్ర కాదన్న సంగతి ఆ గ్రంధాన్నీ, ఉర్దూ సాహిత్యాన్నీ ఎరిగివున్న మాకు తెలుసు. లఖ్నోలో నివసించే నర్తకీ కవయిత్రీ అయిన ఒక వేశ్య తన గాథ తాను చెప్పుకొన్నట్లు వ్రాయబడిన నవల అది. ఆ నవల వ్రాసిన మీర్జా హాది రుస్వా బహుముఖ ప్రజ్ఞాశాలి. శ్రీ నోరివారి రుద్రమదేవినీ, భగవతీచరణవర్మగారి చిత్రలేఖనూ జీవిత చరిత్ర అంటామా ? కీ. శే. తీర్థులవారు వ్రాసినది తప్పుకాదు. 'అది తప్పు' అని సమీక్షకులు ప్రత్యేకించి చెప్పవలసినది కాదు.

గ్రంథ సమీక్ష చాల పవిత్రమైన పని. పత్రికల్లో, అందునా భారతి వంటి పత్రికలో సమీక్ష వ్రాసేటప్పుడు నిదానంగా ఆలోచించి, విషయాన్ని సాకల్యంగా గ్రహించి, మరి వ్రాయువలె. సరిగా తెలియనిదాన్ని స్పృశించక వదిలిపెడితే మంచిది. అలా కాకుంటే సమీక్షకుడు తన తెలియమిని రచయితకు అంటగట్టినవా డవుతాడు. రచయితకు ఏమీ రాదనే భావంతో సమీక్ష జరుగగూడదు—ఇది సద్భావంతో చేసిన సూచన కాని విమర్శ కాదని మనవి. శ్రీ వాణీ కుమారగారికి తెలియనిది కాదు. సమీక్షకునికి, విమర్శకునికి "ఖులూస్" ఉండవలె అంటారే, అది వారి సమీక్షల్లో కనిపించదు—

—సదాశివ

స మా ధా న ము

ఆర్యా !

శ్రీ సదాశివగారి లేఖ చదివాను. 'ఉమ్రావ్ జాన్ అదా' అనే పుస్తకమును గూర్చి చర్చ లేవదీశారు. మంచిదే. అనువాదకుడు వ్రాసినది తప్పుకాదు అని శ్రీ సదాశివ అన్నారు. ఆంగ్ల మూలంలో ఇట్లా ఉన్నది:

Mirza Hadi Rusva is Famous for his Umrao Jan Ada, an autobiography of a literate dancing girl of Lucknow, Umrao Jan, poetically surnamed Ada."

దీనిని ఇట్లా అనువదించారు."హాదీ ఖ్యాతి ఉమ్రావ్ జాన్ అదా అనే స్వీయ జీవిత కథారూపంలో రచించిన నవలవల్ల వచ్చింది. ఆ నవలలో కథావస్తువు లక్నోలో సంస్కారమున్న నర్తకి జీవితము."

పై ఆంగ్లమునకు ఈ అనువాదము సరియైనదా! మరియు పై ఇంగ్లీషులో 'నవల' అనే మాట ఎక్కడాలేదు. అనువాదకులు 'Literate' అన్న మాటను సరిగ్గా అనువదించలేదు. 'Surnamed' అన్న పదాన్ని వదిలివేశారు. ఆంగ్ల వ్యాసమును రచించినవారు ఖ్వాజా అహమద్ ఫారూఖీ. వారీ గ్రంథ ప్రసక్తిని నవలలను గూర్చి వ్రాసేటప్పుడు తెచ్చిన మాట నిజమే. అయినా autobiography అని అన్నారు. మరి నవల అయితే ప్రత్యేకంగా ఆత్మకథ అన్నమాట వారు ఎందుకు వాడారు ? అది నిజంగా జీవిత చరిత్రే కాబట్టి. నేను కూడా ఆ పుస్తకాన్ని చూడకుండా, దాన్ని గూర్చి ఇతరులు ఏమి వ్రాశారో చదువకుండా అలా వ్రాయలేదిని సదాశివ గారికి మనవి చేసుకొంటున్నాను.డా.ఎహతెషామ్ హుసేన్‌చే రచింపబడి శ్రీ సదాశివ గారిచే తెనిగింపబడ్డ 'ఉర్దూ సాహిత్య చరిత్ర'లో(264పుట) ఈ పుస్తకము నవలల్లోనే చేర్చబడినది. శ్రీ రామ్ బాబూ సక్సేనా రచించిన "తారీఖె అదబ్ ఉర్దూ" అనే ఉర్దూ సాహిత్య చరిత్రలో కూడా ఈ పుస్తకము ఉత్తమశ్రేణికి చెందిన నవలగా అభివర్ణింపబడినది. ఈ పుస్తకమును ఆంగ్లము లోనికి అనువదించిన ఖుష్వంత్‌సింగ్, ఎం. ఏ. హుసేన్ అనువారలు గూడా దీనిని నవల అనే అన్నారు. కాని


పుస్తకాన్ని చదివిన నాకు అలా అనిపించలేదు. దీన్ని రచించిన మిర్జా రుస్వా అనునాతడు ఉమ్రావ్ జాన్‌కు సమకాలికుడు. ఆమెతో బాగా పరిచయ మున్నవాడు. ఆమెకు తన కవితలు వినిపించేవాడుట. ఆమె మిక్కిలిగా వాటిని ప్రశంసించేది. ఆమె కూడా కవిత చెప్పగల విదుషీమణి. ఒకమారు ఆమె ఆత్మాశ్రయ కవిత్వము వంటి తన రచనను అతనికి వినిపించింది. రుస్వా ఆ పంక్తులువిని ఈఆమెజీవితంలో ఏదో విశేషమున్నదని గ్రహించి ఆమె జీవితగాథను తనకు చెప్పవలసిందిగా ఆమెను పదేపదే కోరాడు. వారిద్దరూ కలుసు కున్నప్పుడల్లా ఆమె తన జీవితకథ చెబుతూ పోయింది. అతను ఆమెకు తెలియకుండా అక్కడి కక్కడే చాటుగా వ్రాసుకొంటూ పొయ్యాడు. రుస్వా తన 48వ యేట ఈ పుస్తకం వ్రాశాడు. అతని జననం 1857 లో లక్నోలో. మరణం 1931 లో. ఉర్దూ మూలం పుస్తకం ఆరంభం కావడమే ఇట్లా అయింది. ''వినండి రుస్వా గారూ, నన్ను తరచి తరచి ఏమి అడుగుతారు ! నాలోఏముందని మీరు ఇంతగాఆసక్తికనపరుస్తున్నారో నాకు బోధపడడంలేదు. మంచిది, వినండి .... బాగా వినండి''అంటూ ఫైజాబాదులో తన పూర్వీకుల గృహము మొదలుకొని ఉమ్రావ్ జాన్ తన కథ చెప్పుకొంటూ పోతుంది. పుస్తకం పూర్తిగా వ్రాసిన తర్వాత రుస్వా ఆమెకు చిత్తు ప్రతిని చూపించి ప్రచు రించాడు. తాను వ్రాసిన ప్రతి అక్షరం నిజమని చెప్ప డంలో తన కేమాత్రం సందేహం లేదని అతను పుస్తకం తొలిపలుకులో వ్రాసుకున్నాడు. పైగా దీనిని అతను నవల అని చెప్పుకోలేదు. ఖిస్సా అన్నాడు. అంటే కథ లేక వృత్తాంతము అని అర్థం. దీని ఆంగ్లాను వాదం చేసినవారు ఆ పుస్తకానికి వ్రాసిన తొలిపలు కులో ఈ లక్నో నర్తకి రుస్వా యొక్క కల్పన కాదనీ, ఆమె తన వృత్తిని లక్నోలో సాగించిందనీ, ఆమె జీవి తంతో ఆమె ప్రేమకలాపాలతో రుస్వాకు ఎంతో విమిత్తం కలదనీ వ్రాశారు. అట్టితరి దీనిని నవల అంటే ఎట్లా? రుస్వా ఈ పుస్తకమును రచించడంలో Flash back పద్ధతిని వాడాడు కాబట్టి కల్పితగాథ అనుకోవాలా ? అసలు నిజం చెప్పాలంటే కొన్ని ఇతర భాషల వలెనే ఉర్దూలో కూడా నవల అన బడే కొన్ని పుస్తకాలు సరిగ్గా నవల నిర్వచనానికి సరి పోయి ఉండవు. ఏదో వాడుకపడ్డాయి కాబట్టి నవల లని అంటూ ఉంటారు. ఇదీ అంతే. పైగా ప్రస్తుత పుస్తకం అనేకమార్లు ముద్రణ పడిందట. నాలుగు version లను పోల్చి చూస్తే అన్నీ ఒకేమాదిరిగా లేవట ! శ్రీ సదాశివగారు రుద్రమదేవినీ, చిత్రలేఖనూ ప్రస్తావించారు. రెండవదానిని నేను హిందీ మూలంలో చదువలేదు, పుస్తకం లభించక. మొదటిది చారిత్రక నవల. అది వేరు. ఉమ్రావ్‌జాన్ వేరు. కథ రూపంలో వ్రాశారు కాబట్టి ప్రస్తుత గ్రంథాన్ని నవల అంటే అది వేరేమాట. అందులో ఉన్న విషయం మాత్రం ఒక నర్తకి జీవితము. అది ఆమె చెప్పగా రచయిత వ్రాసుకు పోయి ప్రచురించి నట్టిది. ఇక ఇంతకుమించి మరేమీ నేను చెప్పను.

శ్రీ సదాశివగారు లోగడ నేను వారి అమ్జద్ రుబాయీల పుస్తకంపై వ్రాసిన సమీక్షను ప్రస్తా వించి పీఠికలో వారిని గూర్చి వారు వ్రాసుకున్న వాక్యా లను సమర్థించి సమీక్ష చేశానని అన్నారు. రచయిత పీఠికలో చెప్పుకున్న మాటలను సమీక్షకుడు ముట్టుకోకూడదని వారి భావమా ? సమీక్షకునికి లిఖితపూర్వకమైన ప్రతి ఆధారమును ఉదహరించి తన వాదాన్ని సమర్థించుకునే హక్కు ఉన్నది. ఇది సాహిత్య విమర్శలో ఉన్న సంప్రదాయమే. అయినా అందులో నేను తేల్చినది ఏమిటి ? అనువాదకుడు కవి కాకపోవడంవల్ల తెనిగించిన పంక్తులలో కవిత్వానికి ఉండే సౌందర్యం లేదన్నాను. ఉందని సదాశివగారు అను కుంటూ ఉంటే వారి ఆ స్వాతంత్ర్యాన్ని నేను కాదనను. అయినా అంజద్ ప్రసక్తి ఇప్పుడెందుకు ? అదాను చూచిన తర్వాత అంజద్ జ్ఞాపకం వచ్చి నట్లున్నాడు.

శ్రీ సదాశివగారు సమీక్షకుని బాధ్యతలను గూర్చి వ్రాశారు. కాదని నేను అనను. అయితే నాకు అవి వారు చెప్పవలసిన పనిలేదు.

రచయితకు ఏమీ రాదనే భావంతో నేను సమీక్ష చేయలేదు. చేయను. రచయితలు, కవులు ఉంటేనే సమీక్షకు లుంటారన్న సంగతి నాకు తెలుసు. అయితే అభిప్రాయభేదాలకు తావుంటుందనీ, చేసిన విమర్శలో పూర్తి సత్యం లేకపోయినా కొంత యదార్థం ఉన్నప్పుడు సహించ వలసి ఉంటుందనీ శ్రీ సదాశివగారు గ్రహించాలి. అయినా వారు సద్భావంతో సూచన చేశామంటున్నారు గనుక సమీక్షకుడుగా సమీక్షకుని ఆ లక్షణాలను అంగీకరిస్తున్నాను. నా సమీక్షల్లో ఖలూస్ కనిపించ దన్నారు. ఖలూస్, సహృదయత్వం, సరసత వంటివి పైకి చెప్పుకొనే కబుర్లు. సమీక్షకునికి కావలసినది నిశితదృష్టి, గాఢమైన పరిశీలనము, ప్రతిభతో కూడిన స్వీయ వ్యాఖ్యానము, సత్యాన్వేషణ అనే పరమ లక్ష్యము.

—వాణీకుమార.



గ్రంథ విమర్శలు

ఖుతుబ్ నామా

(కర్త : షేక్ బుడన్ సాహెబ్, వెల : 2—50, ప్రాప్తిస్థానము : యల్. అబ్దుల్ సలాం; మియ్యా సాహెబ్ వీధి, కడప.)

In Vain, O Kings, doth time aspire
To make your names oblivious sport,
While yonder hill wears like a tiar
The ruined grandeur of your fort
Though Centuries falter and decline,
Your Proven strongholds shall remain
Embodied memories of your line,
Incarnate legends of your reign.
O Queens, in Vain old Fate decreed
Your flower-like bodies to the tomb
Death is in truth the vital seed
Of your imperishable bloom.
Each new-borm year the bulbuls sing
Their songs of your renascent loves,
Your beauty wakens with the spring
To Kindle these Pomegranate groves

గోలకొండ రాచగోరీలను గూర్చి భారత విదుషీమణి సరోజినీ నాయుడు గావించిన కలకంఠ కుహూకారమిా పద్యమాల.

ఆంధ్రుల చరిత్రలో గోలకొండ కుత్బ్‌శాహుల గాథ యొక్క మధుర ప్రకరణము. విన్సెంట్ స్మిత్ బహమనీ స్రామ్రాజ్యముచే చరిత్రము రక్తార్ద్రమయినదని పేర్కొనెను. ఆ బహమనీ స్రామ్రాజ్యము పంచబంగాళ మయినది. ఆ య్యైదు ముక్కలలో గోలకొండ యొకటి. గోలకొండ నేలిన కుత్బ్‌షాహి రాజవంశమున మొదటివాఁడు కులీ కుత్బ్‌షా. ఇతడు మధ్య ఆసియాను పరిపాలించిన "కారాకునేలు" అను తుర్క్‌మన్ కుటుంబమున జన్మించెను. అట తన తాతదండ్రులు పడిన పాటులు కనులార గాంచి, పినతండ్రితో కూడి బహ్మనీ రాజ్యమునకు రాజధానియయిన బీదరు పట్టణమునకు వచ్చెను. ఆనాడు బహ్మనీ రాజ్యమునకు పాలకుడు మహమ్మద్‌షా.

బహ్మనీ రాజ్యము చితాభస్మమునుండి గోలకొండ రాజ్యము పుట్టినదని చెప్పవచ్చును. అంతకు ముందున్న సర్దారొకడు మరణించుటచే, మహమ్మద్ షా, కులీ కుత్బ్‌షాను ఆంధ్రదేశ భాగమునకు ఒడయనిగా చేసెను. కులీ కుత్బ్‌షా రాజ్యపరిపాలన దక్షత కలవాడు. సాహితీప్రియుడు. మహమ్మద్‌షా యితనికి "కుత్బ్ ఉల్ ముల్క్" అను బిరుదు నిచ్చి పంపెను. బహ్మనీ రాజ్య సింహాసనము బరీదుల కైవస మయినది. మహమ్మద్‌షా నిస్సహాయుడాయెను. కులీ కుత్బ్‌షా కోరియున్నచో ఏలిక నెదిరించి స్వతంత్ర రాజ్యరమాధిపతి యయ్యెడివాడే. కాని యాతని రాజభక్తి యట్లు చేయింపలేదు. మహమ్మద్‌షా బ్రతికినంత కాలము, కులీ కుత్బ్‌షా అతనికి ధన సైన్య సహాయము చేయుచునేయుండెను. ఆనాడు బీరారు బీజాపుర అహమ్మద్ నగర పాలకులు మహమ్మద్‌షాను త్రోసిరాజని స్వాతంత్ర్యము ప్రకటించిరి. కులీ కుత్బ్‌షా మాత్రము క్రీ. శ. 1518 లో మహమ్మద్ షా మరణించిన పిదపగాని స్వతంత్రుడు కాలేదు. ఇతడు అరువదేండ్లు పరిపాలించెను. మొదట వోరుగల్లు చుట్టుపట్టుల దాక మాత్రమే బహ్మనీ రాజ్యాంతర్భాగమయిన ఆంధ్ర రాజ్యము వ్యాపించినది. కులీ కుత్బ్‌షా తన నిశ్శంక సాహసముతో క్రీ. శ. 1543 నాటికి బందరుదాక రాజ్యమును విస్తరింపజేసెను. చెదరిన తెలుగు పాలమును ఒక గొడుగు క్రిందికి తెచ్చెను.

అఖండాంధ్ర రాజ్యమును ప్రతిష్ఠించి, ఆంధ్ర జాతి సమైక్యమును సాధించినవాడు శూరుడగు కులీ కుత్బ్షా. ఆనాటి ప్రజలితనిని "బడా మాలిక్" అని పొగడిరి.

కులీ కుత్బ్షాకు కుత్బుద్దీన్, జంషీద్, ఇబ్రహీం అను ముగ్గురు కొమరులు గలరు. వీరి కంటె ముందు పుట్టినాతడు మరణించెను. తొంబది యేండ్ల పండుముసలియగుదాక కులీ కుత్బ్షా రాజ్య మేలెను. కుత్బ్ఉద్దీనును రాజ్యమునకు ఔరసుడుగా నియమించెను. కాని జంషీద్ ఆ నియమము నంగీకరింపక తండ్రిని చంపించి గద్దె యెక్కెను. కడగొట్టువాడగు ఇబ్రహీం దిక్కుమాలినవాడై దేవరకొండలో తలదాచుకొనెను. బీదరు ప్రభువగు అమీర్ బరీదుతో కూడి, ఇబ్రహీం గోలకొండ ముట్టడింప నెంచి విఫలుడాయెను. తరువాత విజయనగరమునకు వెళ్లి, అళియరామరాయల కొలువులో ఏడేండ్లు తలదాచుకొనెను. విజయనగరమునం దున్నప్పుడే ఇబ్రహీం లలితకళాభిరుచిని పెంపొందించుకొనెను. రాజ్యతంత్ర కౌశలమును క్షోదక్షమముగా నేర్చెను. జంషీద్ యోధుడే. పండితుడే. కాని యేమి లాభము. పితృహంతయగు నీతనిని ప్రజలు ద్వేషించిరి. కఠిన చిత్తు డౌటచే ప్రజానురాగమును చూరగొనలేక పోయెను. అతడు క్రీ. శ. 1550 దాక ఏడేండ్లు రాజ్యమేలి మరణించెను.

జంషీదు మరణానంతరము గోలకొండలో గగ్గోలు పుట్టెను. రాజ్య వ్యవస్థ యవ్యవస్థ కాలవాల మయినది. రాజ్యమునందలి సర్దారులు రెండు తెగలుగా చీలిరి. ఒక తెగవారు విదేశీయుల తోడ్పాటుతో, విగతభర్తృకయగు బిల్కీస్ వైపు మొగ్గిరి. రాజపుత్రుడు సుభాన్‌ఆలీని సింహాసన మెక్కించిరి. రెండవ తెగవారు ఇబ్రహీం కోపు పట్టిరి. విజయనగరమునందున్న యతని నాహ్వానించిరి. త్రోవ పొడుగున ప్రజలు ఇబ్రహీముపయి పూలజల్లు కురియించిరి. గుండెలు కాన్క పెట్టిరి. పానుగల్లు, కోవెలకొండ దుర్గాధిపతులు సాయము చేయగా మాట యిచ్చిరి. సర్దారుల ప్రజల యాదరానురాగములలో పుక్కిలిబంటిగా మునిగిన ఇబ్రహీం క్రీ. శ. 1550 లో సింహాసన మెక్కెను. వాస్తవముగా ఇబ్రహీం గోలకొండ పారుపత్తెమును పటిష్ఠమొనర్చెనని చెప్పవచ్చును. అంతకుమున్ను నిర్మాణదశ యందున్న గోలకొండ రాజ్యము ఇతనినాళ్లలోనే సుస్థిరమయ్యెను. ఇబ్రహీం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానము నెలకొల్పెను. రాజ్య విషయము లెప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వమున కందుటకై సుశిక్షితమగు చార వర్గమును సిద్ధము చేసెను. దొంగల, దారిదోపిడికాండ్ర త్రుళ్లు నణచెను. ప్రజ లొక సీమనుండి మరొక సీమకు నిర్భీకులై రాకపోకలు కొనసాగించిరి. తత్ఫలముగా వర్తక వాణిజ్యములు పెరిగినవి. ఇబ్రహీం ప్రజాసుఖ సంపాదనార్థము పాటుపడెను. వాపీకూప తటాకములు త్రవ్వించెను. తోటలు నాటెను. నగరములు నిర్మించెను. ఆంధ్ర వాఙ్మయ పోషకుడై, ఉర్దూ సాహిత్య సేవకుడై వన్నె కెక్కెను. ఇతనిని తెలుగు కవులు మలికిభరాముడని కొనియాడిరి. అద్దంకి గంగాధర కవి ' తపతీసంవరణోపాఖ్యానము రచించి యితనికే యర్పించెను. అష్టభాషా ప్రౌఢి గలవాడై దశరథ రాజనందన చరిత్ర రచించిన ఆ సూరి మరింగంటి సింగరాచార్యులు ఇతని బహూకారమును పొందెను. ఇతని కాలమున ఫేరోజ్, మహమూద్ అను ఇరువురు ప్రజ్ఞామూర్తులు ఉర్దూ కవులు కలరు. ఫేరోజ్ "తౌసవ్ నామా" యను కావ్యము రచించెను.

ఇబ్రహీం తరువాత మహమ్మదు కులీ కుతుబ్షా సింహాసన మధిష్ఠించెను. ఆనాటి కతని ప్రాయము పదునైదేండ్లు. ఇత డక్బరునకు సమకాలికుడు. ముప్పదిరెండేం డ్లేలెను. ఆ కాలము శాంతికి నిలయము. భద్రత కాలవాలము. కులీ కుత్బ్షా కాలమున లలితకళలు లాస్యము చేసినవి. వాస్తు శిల్పము వన్నెదేరినది. ఇతడు ప్రజా సంక్షేమమునకై నూతన వ్యవస్థలను, నూతన శాసనములను సృజించెను. ఇతడు చేసిన మహా కార్యము ప్రియురాలి

పేర మహా నగరమును నిర్మించుట. కులీ కుతుబ్షా "భాగమతి" యను నర్తకిని వలచెను. వారి ప్రణయమునకు వర్షా జలపూరితయై పరవళ్ళు త్రొక్కిన మూసీనది సాక్షి. "భాగమతి" పేర భాగ్యనగరము వెలసెను. కులీ కుతుబ్షా భాగమతికి "హైదర్ మహల్" అను సమ్మానాంకము నొసగెను. అందుచే భాగ్యనగరము హైదరాబాదను నామము పొందినది. భాగ్యనగరము సకల సౌభాగ్యమయము. వీధులు సూత్రపట్టినట్లుండును. అట విశ్రాంతి భవనములు, వైద్యాలయము లెన్నో కలవు. ఈ ప్రభువు ప్రాపున పర్షియా నుండి అనేక కుటుంబములవారు వచ్చి హైదరాబాదులో, బందరులో స్థిరనివాస మేర్పరచుకొనిరి. రాజనీతి విశారదుడగు మీర్ మోమిన్అస్త్రబాది కులీకుతుబ్షాకు పీష్వాయై యుండెను. అమీనుల్ముల్క మీర్ జుమ్లా (ఆర్థిక మంత్రి) పదవిని చేపట్టి సంపత్సంధాయకములగు కార్యములొనర్చెను. పొన్నిగంటి తెలగన్న అమీన్ఖానునకే యయాతి చరిత్రమును అంకితము చేసెను. కులీ కుతుబ్షా కాలము ఉర్దూ సాహిత్యమునకు స్వర్ణయుగము. అతడు రాజకవి. కవిపోషకుడు. ఈతని కవితానామము "మానీ". ప్రకృతి వర్ణనము, శృంగారభావము, కథావస్తువు గల యీతని కావ్యములు సరళసుందరములే కాక నవీనములై యున్నవి. శ్రీకృష్ణదేవరాయలవలె సామాన్య ప్రజల లౌకిక జీవితము నిత డద్భుతముగా వర్ణించెను. హైందవాచారము లితని కవితా వస్తువు లయినవి. ఆనాటి యుర్దూ కవులలో వజీహ, అహ్మద్ విఖ్యాతులు. వజీహా మూడు తరముల యేలికలకు సమకాలికుడై వాసిగాంచెను. రాజాజ్ఞచే "లైలా మజ్నూన్" కథతో ఉర్దూభాష నలంకరించెను. ఇతడు రచించిన "సబ్రస్" ఉత్తమ ఉర్దూ గద్య కావ్యము. వజీహ యొక్క ఈ గ్రంథములన్నియు ఒక యెత్తు. ఇత డల్లిన "కుతుబె ముష్తరీ" కావ్యమొక యెత్తు. ఈ కావ్యమునకు నాయకుడు కులీ కుతుబ్షాయే. చారిత్రకాంశములు గల కల్పనా కథ యిది. ముష్తరీ యను వంగరాజ పుత్రిని స్వప్న సుందరిని వలచి, కులీ కుతుబ్షా వంగదేశమున కేగి, యామెను గోలకొండకు కొనివచ్చి పెండ్లియాడుట యిందలి యితివృత్తము.

మహమ్మద్ కులీ క్రీ. శ. 1612 లో దివంగతు డాయెను. ఆతని కొక్కతెయే కుమార్తె. ఆమెపేరు హయాత్ బక్షీ బేగము. హయాత్ బక్షీ బేగము పిన్నబ్బ కొడుకగు ముహమ్మద్ కుతుబ్షాను వివాహ మాడెను. మహమ్మద్ కుతుబ్షాయే, మహమ్మద్ కులీ తరువాత గోలకొండ రాజ్యమునకు వచ్చెను. మహమ్మద్ కుతుబ్షా సమలోష్టకాంచనుడు. సాధుశీలుడు. ఆచారనిష్ఠ గరిష్ఠుడు. ధర్మ కర్మాధీన చేతస్కుడు. పెద్ద తండ్రివలె సాహిత్య పోషణమున, సౌధనిర్మాణమున కాలము వెచ్చించెను. అమాన్ మహల్, సుల్తాన్ నగర్ నిర్మించెను. ఇతడు పునాది రాయి వేసిన మక్కా మసీదు నాలుగు తరముల తరువాత గాని పూర్తిగాలేదు. పదునాలుగేండ్లు యేలుబడి కొనసాగించిన యీ ప్రభువు క్రీ. శ. 1626 లో అకాల మరణమును పొందెను. పిదప క్రీ. శ. 1680 వఱకు జీవించిన హయాత్ బక్షీ బేగము రాజ్యమున విజ్ఞాన తేజోరాశిని ప్రసరింపజేసెను.

క్రీ. శ. 1626 సంవత్సరము గోలకొండ రాజ్య పతనమునకు నాంది పలికినది. ముహమ్మద్ కుతుబ్షా తరువాత అతని కుమారుడు అబ్దుల్లా కుతుబ్షా అవనీపాలకు డాయెను. అబ్దుల్లా కుతుబ్షా అలసుడు. విషయాసక్తుడు. భోగలంపటుడు. తత్ఫలముగా అశక్త దుర్జనులగు అధికారుల దర్పము పెరిగినది. రాజ్యమున అంతఃకలహము లావిర్భవించినవి. ప్రజలు సుఖశాంతులకు నోచుకొనలేదు. దీనికితోడు ఆర్యావర్తమునుండి మొగలాయీల యొత్తిడి యెక్కువ యయినది. క్రీ. శ. 1633 లో పతనమయిన అహమ్మద్ నగరము క్రీ. శ. 1635 నాటికి మొదలంట తెగినది. గోలకొండ విజాపురముల

పయి మొగలాయీల కన్ను పడినది. కాని వాని యేలికలగు అబ్దుల్లా కుత్బ్‌షా, మహమ్మద్ ఆదిల్‌షా పౌరుషహీనులయిన పొఱుబోతులు. ఆనాటి మొగలాయీ ప్రభువు షాజహాన్. క్రీ. శ. 1636 లో సత్వహీనమగు ఈ రాజద్వయము మొగలాయీలకు దాసులై పరాభవ నిలయమగు సంధి చేసికొనినది. వీరు తమ నాణెములపయి షాజహాన్ చక్రవర్తి పేరు ముద్రించుట కొప్పుకొనిరి. మొగలాయీ స్థానాపతిని తమ కొలువున నిలుపుట కంగీకరించిరి. ఈ స్థానాపతులు గంపల క్రింది యెలుకలై కుట్రలు పన్నసాగిరి. అర్దిస్థాన్ నుండి వచ్చిన వణిక్కు మహమ్మద్ సయీాద్ మీర్‌జుమ్లా కర్ణాటమును జయింప నియుక్తుడై, విజయగర్వాంధుడై స్వతంత్రపాలకు డగుటకు సాహసించెను. మొగలాయీల నాశ్రయించెను. గోలకొండ ప్రభువునకు ఇటు రాజద్రోహియగు సయీాద్ మీర్ జుమ్లాతో, అటు ఢిల్లీ పాదుషాతో పగ రగుల్కొన్నది. సయీాద్‌మీర్ జుమ్లాను అతని కుమారుని శిక్షింప అబ్దుల్లా కుత్బ్‌షా ప్రయత్నింపగా, దక్కనులో మొగలాయీ రాజప్రతినిధియగు ఔరంగజేబు క్రీ. శ. 1656 లో గోలకొండను ముట్టడించెను. అబ్దుల్లా కుత్బ్‌షా ఔరంగజేబునకు దాసోహ మనెను. అవమానకరములగు నియమములతోడి సంధి కంగీకరించెను. అమేయ ధనరాసుల నర్పించెను. ఔరంజజేబు పెద్ద కొడుకునకు తన కూతురు నొసగి పెండ్లి చేసెను. ఇట్టి సంధితో అబ్దుల్లా కుత్బ్‌షా కున్న కొంచెము పరువు కూడ మంట గలసెను. ప్రకృతి వర్గము వశము తప్పినది.

అబ్దుల్లా కుత్బ్‌షా క్రీ. శ. 1672 లో మరణించెను. తరువాత నితని మూడవ యల్లుడు అబుల్ హసన్ కుత్బ్‌షా రాజ్యచక్రము త్రిప్పెను. ఇతడే తానాషాగ పేరుమోసెను. తానాషా రామదాసుల గాథ తెలుగు మాగాణమున కవ్వపు పాట లయినది. అబుల్ హసన్ కుత్బ్‌షా గోలకొండ గద్దె యెక్కుట యొక రమణీయ రూపకమై యున్నది. అబ్దుల్లా కుత్బ్‌షాకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద యల్లుడు సయ్యద్ అహమ్మద్. రెండవ యల్లుడు ఔరంగజేబు కొడుకు. పెద్దయల్లుడగు సయ్యద్ అహమ్మద్ అబ్దుల్లా కుత్బ్‌షా మూడవ కుమార్తెను తన చిన్నడయిన వాని కొసగగా నేర్పాటు చేసెను. కాని మంత్రులీ యేర్పాటు నొల్లక మలొకనిని వెదుకుచుండిరి. ఇంతలో సయ్యద్ మహమ్మదునకు, అతడు తన మరదలి నొసగ నిశ్చయించినవానికి రసరసలు పొడమినవి. ఈ సందు చూచికొని మంత్రులు అబుల్ హసన్‌ను ఆహ్వానించి రాజపుత్రితో పరిణయము చేసిరి. ఈ రీతిగా అరేబియా దేశము నందలి హెజాస్ నుండి వచ్చిన ఘూా ఆముష్యాయణుడు గోలకొండ గద్దెకు ఔరసు డయ్యెను. మంత్రులు సయ్యద్ అహమ్మద్‌ను, అబ్దుల్లా కుత్బ్‌షా పెద్ద యల్లుని గద్దె నెక్కకుండ చేసిరి.

పింగళి భానుజీ పంతుల కుమారులగు అక్కన్న మాదన్నలు అబుల్ హసన్ కుత్బ్‌షా కొలువు నందలివారే. "సూర్యప్రకాశరావు" బిరుదుతో మాదన్న మహామంత్రిగా నుండెను. "అప్పర్ బహదుర్" బిరుదుతో అక్కన్న సేనాపతి యయ్యెను. మాదన్న మహా రాజనీతి కౌశలముతో స్వార్థపరులగు సచివులను తానాషా కొల్వునుండి తఱిమెను. మాదన్న అసాధారణ రాజనీతి విశారదుడు. అతడు దేశోపద్రవ మొనర్చు పర్వత జాతులవారి యాట కట్టించెను. గోలకొండ రాజ్యము సస్యశ్యామల మయ్యెను. ప్రజా కంటకులగు జమీాందారులను, సర్దారులను తొలగించెను. ప్రతి గ్రామమును సర్వే చేయించెను. కరవటి కలు వివరముగా వ్రాయించెను. అగ్రహారముల యందలి, దేవ బ్రాహ్మణ దానముల యందలి, సేవకుల మాన్యముల యందలి అక్రమ పరిపాలనమును చక్కనొత్తెను. హైందవ మహమ్మదీయ తారతమ్య బుద్ధి లేకుండ శిక్షాస్మృతిని నడపెను....గోలకొండ రాజ్యము ఆదాయము కొండంత యయినది. తానీషా రాజ్య పరిపాలనము హైందవ మహమ్మదీయ సామరస్యమునకు విజయధ్వజము.

ఆనాడు గోలకొండ రాజ్యమునకు మహారాష్ట్ర నాయకుడగు శివాజీ వలన, ఢిల్లీ పాదుషా యగు ఔరంగజేబు వలన ఇక్కట్లు ముమ్మరమాయెను. మొగలాయీలు మొదట శివాజీతో, అతని మిత్రుడు, బీజపుర పాలకుడగు ఆదిల్‌షాతో కయ్యము చేయుచుండుటచే గోలకొండపయి నెత్తి వచ్చుట వారి కంతటి గాదయ్యె. లోలోపల గోలకొండవారు మొగలాయీలకు వైరులే. వారు ఆదిల్‌షాకు ధన సాహాయ్యము చేయుచుండిరి. కాని బీజపురము గగ్గోల కాడుగా నున్నది. అట్టిచో మాదన్న శివాజీ పొత్తుగోరి లేఖలు వ్రాసెను. శివాజీ రాజైన తరువాత ఉగ్రాణము శూన్య మౌటచే ఆతడు ఆంధ్ర, ద్రావిడదేశ జైత్రయాత్ర చేయనెంచెను. ఇదితెలిసిన గోలకొండవారు శివాజీని రప్పించి నెలనాళ్లు క్రొత్త యల్లునివలె మేపి సంధి చేసికొనిరి. ఈ సంధివలన శివాజీ దక్షిణ జైత్రయాత్రకు గోలకొండ సర్వవిధ సహాయము చేయుట కంగీకరించెను. దక్షిణాపథ మందలి తన తండ్రి పారుపత్తెము చలాయించిన భూములు తాను తీసికొని మిగిలినవానిని గోలకొండ కర్పించుటకు, మొగలాయీల నుండి యుపద్రవము రాకుండ గోలకొండను రక్షించుటకు శివాజీ అక్కన్న మాదన్నల యెదుట ప్రమాణము చేసెను. కాని దక్షిణదేశ విజయానంతరము శివాజీ తన వాగ్దానము నిలబెట్టుకొనలేదు. పచ్చి మోసము చేసెను. బీజపురమును లంచాలతో వశము చేసికొన నెంచెను. శివాజీ తంత్రమునకు ప్రతి తంత్రము పన్నగా మాదన్న పూనుకొనెను. బీజపూరునకు సైన్య ధన సహాయము చేసెను. బీజపూరువారు శివాజీ పయి దండెత్తి నిశ్చయించిరి. కాని యింతలో మొగలాయీలు బీజపూరుపై దండెత్తిరి. గతిలేక బీజపూరు మహారాష్ట్రులనే యాశ్రయించెను. గోలకొండ శివాజీనేమియు చేయలేకపోయెను.

గోలకొండ బీజపురమునకు సాయము చేయుట తెలిసిన మొగలాయీలు గోలకొండపయి దండెత్తిరి. అంతకుముందే మొగలాయీలు తానాషానుమహమ్మదీయ మత ద్రోహిగా, స్త్రీలోలునిగా, సురాపాన ప్రియునిగా వర్ణించి బహు ముఖముల దుష్ప్రచారము చేసిరి. మొగలాయీలు గోలకొండ విజయమును ధర్మ సంస్థాపన కార్యముగా భావించిరి. క్రీ. శ. 1685 లో షాఆలము గోలకొండను ముట్టడించెను. ఎనిమిది నెలలు ముట్టడి సాగినది. కాని మొగలాయీలకు గోలకొండ కోట వశము కాలేదు. కాని రాజద్రోహి యగు అబ్దుల్లాఖానుపన్నీ లంచములు తిని గోలకొండ కోట తలుపులు తెరచెను. కోట మొగలాయీలకు వశమగు వీలు కలిగినది. ప్రభుభక్తి పరాయణుడు ప్రతాపఖని యయిన అబ్దుల్ రజాక్‌లారీ ఉసురుపోవుదాక పోరాడెను. తానాషా చూపిన చిత్త స్థైర్యము నిరుపమానము. గోలకొండవారు సంధి చేసికొనిరి. అపార ధనము నార్జించిన మొగలాయీలు అక్కన్న మాదన్నలను తొలగింపుమని తానాషాను కోరిరి. కాని యా ప్రభు వంగీకరింపలేదు. ఆస్థాన మందలి మహమ్మదీయులు, అంతఃపురము నందలి రాణులు తానాషాతో అక్కన్న మాదన్నలపయి కొండెములు చెప్పిరి. రామదాసు దోషమును కొండంత చేసిరి. తానాషా చలింపలేదు. మొగలు ముట్టడి సాగు నాళ్లలో, మహమ్మదీయ తంత్రజ్ఞులు దివాణము నుండి పోవు అక్కన్న మాదన్నల తలలు గొట్టిరి. మొగలుపాదుషాకు కానుకలుగా పంపిరి. వారి శవములను వీధులవెంట నీడ్చిరి. క్రీ. శ. 1687 లో గోలకొండ కోట ఔరంగజేబు వశమయినది. కుత్బుషాహి వంశము కూలిపోయినది.

అబ్దుల్లా కుత్బుషా, అబుల్ హసన్ కుత్బుషా కాలమున కూడ ఉర్దూ సాహిత్యము పెంపొందినది. అబ్దుల్లా గొప్ప కవి. గవ్వాసీ అను కవి శుకసప్తతికి ఫారసీ అనువాదమగు "తూతీనామా" ను అబ్దుల్లా కాలమున ఉర్దూ భాష కనువదించెను. అబుల్ హసన్ రచించిన కొన్ని చాటువులు లభించినవి. ఇతని కాలము నందలి కవులు పారశీక సంస్కృత సాహిత్యముల

నుండి కథావస్తువులు గ్రహించి కవిత లల్లిరి. అట్టి వానిలో "పద్మావత్" మున్నగునవి ముఖ్యములు. రెండువందల యేండ్లు తెలుగు మాగాణము నేలిన యీ కుత్బ్‌శాహి రాజవంశము సాధించిన దేమి ? అది జాతిమత సామరస్యమును సాధించినది. దివ్యప్రాసాదములను, మహా నగరములను నిర్మించినది. పటిష్ఠమగు ప్రభుత్వమును పాదుకొల్పినది. పాలితుల మతాచార వ్యవహారములను లెస్సగా గుర్తించి తదనుగుణముగా నడచుకొన్నది. స్థానిక సంప్రదాయముల నలవఱచుకొన్నది. లలితకళలకు పెంపొదవ గూర్చినది. హైందవ దేవాలయ సంరక్షణమునకయి పుష్కలముగా భూముల నిచ్చినది. అబుల్ హసన్ కుత్బ్‌షా గోదావరీ తటమునందలి భద్రాచల రామునకు భూదానము చేసిన వార్త తెలుగువాడు మఱవగలడా ?

ఇంతటి రసవత్గాథ గోలకొండ కుత్బ్‌శాహుల చరిత్ర. ఈ చరిత్రయందు రాజ్య ప్రతిష్ఠాపనాచార్యులు, సాహితీ సమరాంగణ సార్వభౌములు, ఉదాత్త ప్రణయమూర్తులు, రాజనీతి విశారదులు, ప్రభుభక్తి పరాయణులు, జాతి మత సామరస్య వాదులు, బాహాబల ప్రతాప సంపన్నులు, భోగలాలసులు, స్వోదర పోషణ మాత్ర పరాయణులు, క్షుద్ర భేద బుద్ధులు కలరు. ఇట్టి కథను ఇంతవఱకు గానము చేసిన తెలుగు కవులు లేకపోవుట విచిత్రముగనే యుండును.విజయనగర శిథిలములనుచూచి విలపించిన వారున్నారు. శ్రీ పర్వత శిల్పుల గుండెల తలపులు త్రవ్విన వారున్నారు. పల్నాటి భారతమును పాడినవా రున్నారు. రాణా ప్రతాప శివాజీల చరిత్రను చిత్రించినవా రున్నారు. ఆంధ్ర చరిత్ర ప్రశస్త యశో వైభవమునకు పురాణ రూపకల్పనముచేసినవారున్నారు.దేవానాంప్రియుని దీప్తులనువెలికిదీసినవారున్నారు.గోలకొండ కుత్బ్‌శాహుల యశస్సున కక్షర రూపము నొసగినవారు ఇందనుకలేరైరి. న్యాయవాదులగు షేక్ బుడన్ సాహెబ్‌గారు నేటి కాలోటు దీర్చిరి. ఒక మహమ్మదీయ కవి మహమ్మదీయ చక్రవర్తుల గాథను కావ్యముగా అల్లుట, ఈ యార్యభూమి సంస్కృతి లోగుట్టును వెల్లడించుచున్నది. ఈ కావ్యము పేరు ఖుతుబ్‌నామా. నామా యనగా గ్రంథము లేక పత్రము. కుత్బ్‌శాహి వంశజుల ప్రశస్తిని పాడెడు కావ్యమని ఖుతుబ్‌నామా కర్థము చెప్ప నొప్పును.

చరిత మాత్రావశిష్టులై చనిన యట్టి
శాలివాహన విక్రముల్ శకము లొంద
పుర నికేతన సంస్కృతి భూతు లిడిన
కొలము మూల విరాట్టును దలప రెవరు ?

అని బుడన్ సాహెబుగారు కావ్యారంభముచేసిరి. ఈ కవికి కుత్బ్‌శాహుల చరిత్ర పరమ ప్రీతికర మైనట్టిది. ఈ ప్రీతి యుండుటవలననే,వారు ఇబ్రహీం పాదుషా వైభవమునకు కావ్యరూపము కలిగించిన మహాకవులు లేరు గదా యని వాపోయిరి.

కన్నడంబునఁ బేరోలగములు పొంది
యాంధ్రి సగమేలు రాయల కందలములె?
గొల్లకొండన మొగసాల తిల్లికిడిన
యద్వితీయాంధ్రుఁ డిభరాముఁ డల్పుఁ డొక్కొ?

యని యీ కవిగారు, సమచిత్తముగల కవి పోగూడని దవ్వుపోయిరి. "మిన్నుమన్నుల నేలు" (పుట. 27) అను పద్య మీ కవి యావేదనమునకు పరాకాష్ఠ. కావ్యములు వ్రాయువారికి నాయకుల పట్ల (తనకు నచ్చిన వారి పట్ల) అభిమాన ముండుటయు, ప్రతి నాయకుల పట్ల (తనకు నచ్చనివారి పట్ల) రోయుంపుండుటయు చెల్లుబడి యయిన సాహిత్యము గల

దేశ మిది. ఈ కవిగారా మార్గమునే పట్టిరి. జంషీదును గూర్చి, తదితర గోలకొండ చక్రవర్తులను గూర్చి వ్రాయునపుడు కవిగారు, ఆ పాత్రలను గూర్చి పెంచుకొన్న బహుకార నికారములే బయలు వెడలినవి. ఆ పాత్రల మనసే రీతిగా పనిచేయు చున్నదో, అని చెప్పుకొనుచున్నట్లుగా ఈ కవిగారు అవకాశము కల్పించరు. ఇబ్రహీం రాయలకంటె గొప్ప వాడని యనుట, ఆంధ్ర చరిత్రలో వారి ప్రాధాన్యమును సరిగా గుర్తించి, దామాషా కట్టకుండుటకు తార్కాణము. కవి నాయకులకుగాని, ప్రతినాయకులకు గాని కథను బట్టి స్వేచ్ఛ కల్పింపవలయును. తాను మధ్యవర్తిగా నుండి ప్రాడ్వివాకుని వలె మంచి చెబ్బరల నెంచుట యనుచితము. పాత్రలు తమ తమ తలపులను చెప్పుకొనుచు పోవుటయందే కథా కావ్యములలో రక్తి యుండును. పరాశ్రయ కవిత్వమునందు కవికి సమదృష్టి ముఖ్యము. అదిలేనిచో కావ్య నాయకాదుల హృదయము కంటే మిన్నగా కవి హృదయము వెల్లడియగును. అదియే యీ కావ్యము నందు ప్రధాన లక్షణముగా నున్నది. ఈ లక్షణము కావ్యశిల్పమునకు భంజకము. తిక్కన మహాభారతము చదివినచో, ఆ కవిబ్రహ్మ యెంత సమదృష్టిని చూపుచు పోయెనో మనకు తేటతెల్లము కాగలదు. బుడన్ సాహెబ్‌గారు పాత్రలను జీవకళ నందగించిన వానినిగా చేయుటకు కారణము వానికంటె వారు ముందుండుటయే. కొన్నిచోట్ల వారు చెప్పిన మాటలను నమ్ముట సాధ్యముకాదు. లభించిన సాక్ష్యము మునుబట్టి చరిత్రయందలి రాజవంశములను పోల్చి చూచి, గొప్పదనమును కట్టబెట్టుట కెంతో నిగ్రహము కావలయును. ఇదివరకు వచ్చిన ఆంధ్రభాషా చారిత్రక కావ్యములలో ఈ నిగ్రహము అంతగా లేదు. ఈ కావ్యమందు కూడ నంతే. కుత్బ్‌శాహుల యందు మంచివారిని మింటికెత్తి (అతిశయోక్తి సహితముగా) మిగిలినవారిని రూపు కట్టనియట్లు చేసిరీ కవిగారు.

బుడన్ సాహెబ్‌గారు కులికుత్బ్‌షాను దేహ బల సంపన్నుడయిన వీరునిగా వర్ణించిరి. తెలుగు కోడె కాంద్రా "వ్యాయామస్థిర సంధిబంధు" ని నాళ్లలో ఎట్టి యెలమి పొందిరో చెప్పిరి. ఆయన వైభవమును చిత్రించిరి. ఇబ్రహీం కథను పురాణ పద్ధతిలో నడిపించిరి. అక్కన్న తానాషా కథను చెప్పిరి. భాగమతి మహమ్మద్ కులీ కుత్బ్‌షాల ప్రణయము అద్భుతముగా ప్రబంధ ధోరణితో కూడి యున్నది.

పంచదశ వత్సరంబుల
పంచశరున్ బోలు కులికిఁ బదునాల్గేడుల్
మించియు మించని భాగా
చంచల నేత్రకును బెండ్లి సమకూరె నిటుల్.

అని యీ కవిగారు అన్నారే కాని, యీ నాయికా నాయకులు ప్రౌఢ ప్రబంధ నాయికా నాయకులను మించిరి. మహమ్మద్ కుత్బ్‌షా ధర్మ ప్రవృత్తిని, అబ్దుల్లా కుత్బ్‌షా భోగలాలసతను క్లుప్తముగా వర్ణించిరి. అబ్దుల్లా తల్లియగు హయాత్ బక్షీ బేగముచే, నిగమ శర్మ అక్కవలె అతనికి ప్రబోధము చేయించిరి. వీలున్నపుడెల్ల గోలకొండ కుత్బ్‌శాహుల మత సామరస్య దృష్టిని కొనియాడిరి. ఈ కొనియాడుట తానాషా కథయందు విపులముగా నున్నది. ఆంధ్ర ప్రబంధములను క్షోదక్షమముగా పఠించి, సాహిత్యము నందు మంచి సత్తువ గడించి, ప్రబంధ గీత పద్యములకు సంవాద ప్రాయములయిన పద్యములతో బుడన్ సాహెబ్‌గారీ కావ్యమును తీర్చిదిద్దిరి. ఆ పద్యములు శయ్యా సౌభాగ్యము కలిగియుండును.

బుడన్ సాహెబ్‌గారిది ప్రబంధకవితా మార్గము. కథను పురాణ పద్ధతితో చెప్పుదురు.వర్ణనాదులుప్రబంధ మార్గమున నుండును. ప్రబంధ మార్గమును పట్టిన వారు కావున, పాత్రల యాకృతులు చెక్కుటయందు, అభివ్యక్తీకరణ రీతియందు ఆ కైవారమును దాట లేక పోయిరి. వర్ణనా కళను ఆదరించిరి. ఫలము

భావకళ మందగించుట. ఈ సమీక్ష యందలి ఆదిమ భాగము పఠించిన వారికి కుత్బ్‌శాహుల చరిత్రయందు హృదయ పారవశ్యము ఆపాదించు ఘట్టము లెన్నో యున్నట్లు కనుపట్టక మానదు. ఆ ఘట్టములను ఈ కవిగారు విడిచిరి. పాత్రలు అయా ధీర గంభీర మధుర సన్నివేశములలో నెట్లు ప్రవర్తించినవో, వాని చిత్త ప్రవృత్తు లే తీరుతో నున్నవో, వాని భావము లెట్లున్నవో ప్రతిభా వక్ష్ వుతో దర్శించి, వర్ణించి యున్నచో ఈ కావ్య మిట్లుండెడిది గాదు. అదొక భారతము వంటి మానవ జీవన రహస్యమయమై యుండెడిది. సముదాత్తముగా రసము పిండి యుండెడివారు. ప్రబంధ సంస్కారము కావున ఆ యసహజ ధోరణి ఆ వర్ణనా రచనాత్మక కళలు నెలవు చేసికొన్నవి. కుత్బ్‌శాహి ప్రభువుల జీవన లీల మసక మసకగా చివరకు సిద్ధమయినది. ఇది యీ కావ్యమందు ప్రబలముగా గోచరించు లక్షణము. ప్రబంధ పద్ధతి వలచినవారు కనుకనే

లీలా మన్మథుడగు కులీం
గాళేశ్వర భీమఖండ కమలాద్రి శ్రీ
శైల క్రీడల నిర్ఝరీ
బాలామణు లెదల మెచ్చి భావింతురొగిన్.

అని యనగల్గిరి. దిక్షితులు దేవేంద్రుని వలె, "ధరు గల్గు సర్వ నృపతులు నరుదెంతురు గులీనిం జూడ నల మిన వేడ్కన్" అని పాడిరి. కులికుత్బ్‌షా "కూర్మి సభలు" విలక్షణముగా వర్ణింపబడినవి. ప్రబంధ నాయకుని వలె మహమ్మద్ కులీకుత్బ్‌షా మిథ్యాను భవములకు లోపడి, పాఠకుల కంతయు మిథ్యయే యనిపించును. భాగమతి ప్రబంధనాయికవలె ఆప సోపాలు పడినది. ఆమె సూరన్నగారి ప్రభావతికి చెలియ లయినది. రామదాసు "గాంగేయ కుట్టిమ గారుడ మణికుడ్య గర్భాలయ మనోజ్ఞకాంతి కలరు" వాడయ్యెను. అతిసామాన్యభావములు భాషాడంబరమును పుంజుకొన్నవి. తానాషా గాథ కేవలము పేలవముగా నున్నది.

బుడన్ సాహెబ్‌గారు ప్రపంచ చరిత్ర నుండి, హైందవ పురాణములనుండి యుపమానములు స్వీకరించిరి. ఇవి కొన్నిచోట్ల అస్థానపతితములై యెబ్బెట్టుగా నున్నవి. రజాక్‌లారి "ఢక్క ప్రేమోతలం ప్రేలు డైనమైటును బోలె పరిపంథి సుభట శిలా ప్రతతిం గూల్చు, నణ్వస్త్ర సంధితయౌ నవాయువుం బోలె విధ్వంస ప్రకరంబు పెండెం జేయు" అని యీ కవి గారు వర్ణించిరి. పదేపద ఫుట యందలి సౌసాదృశ్యము వలన నే కావ్యదీప్తి కలుగుచున్నదో తెలియదు. "కులి జైత్రయాత్రల పొలుపుం జెప్పు" గా బుడన్ సాహెబ్ గారు ఏమేమో వర్ణించిరి. ఇవి కృత్రిమములై యున్నవి. ఆ కాలపుటాహారాహార్య రీతులున్నంతలో నుచితముగనే వర్ణితము లయినవి. "కన్నార్పకుండం గనుంగొని, కన్నా కయి యంతలోనె కడు దుఃఖమునన్" అని కవిగారు భాగమతిని వర్ణించిరి. ఇచట "కన్నాకు" అనుదానికి నేనేమని యర్థము చెప్పుకోవలయును ? "తోయరు హానన ! యీ ప్రకోపమున్ బాసి ననున్ ద్వదీయ వరి వస్యం గవుంగిట గారవింపుమా !" అని మహమ్మద్ కులీ కుత్బ్‌షా (శ్రీకృష్ణుని వలె) పలుకును. ఈయన రాకమునుపు భాగమతి ప్రకోపదశయందు లేదు. ఆమె "తననె రోయుచు మునుపే విభు దూఱి దూఱి ముహు రుత్కటమౌ పెనువంత మూర్ఛ మునిఁగెను". "నాతి తెఱంగులన్నియును నాథున కొక్క వయస్యయెట్టులో" తెల్పెను. ఆతడు వచ్చి పరిదీనమూర్తిని చూచెను. ఆమె శోకించినది. కోపము చూపము లేదు. అట్టిచో నాయకుడు "ప్రకోపము" ను బాయు మనుట యేమి? ప్రకోప మనగా శోక ప్రకోప మని యర్థమా ? సప్త మ్యర్థమునందు "అందునన్" అని హెచ్చుగా వాడినచో కూర్పునందు సడలింపు వచ్చును. వర్తకుడగు మహమ్మద్ సయీద్‌నకు "వణిజునిమతి" వచ్చిన దనియు, "గుణగణములు కాలముం బట్టి కూడును గాదే" యనియు కవిగారు చెప్పిరి. జంషీదు దుశ్చేష్టకు, అబ్దుల్లా కుత్బ్‌షా పోకిళ్లకు కారణ మేమై యుండును ? ఇట్టి పట్టుల కవి హృద యము లోకసత్యమును అధఃకరించినది. ఒక సన్ని

వేశమున పాత్ర నడచిన తీరునకు, కులమునకు అంతగా పొత్తుండదు. మనసు, కులము పరస్పరాశ్రయములు కావు.

ఇది కుత్బ్‌శాహుల చరిత్ర. ఈ చరిత్రకు పురాణ ప్రబంధ లక్షణములు పట్టినవి. బుడన్ సాహెబ్‌గారు కుత్బ్‌శాహుల గాథకు న్యాయము చేయలేదు. వారి భాషా పాండిత్యము కావ్యశిల్పము కళకళలాడు గ్రంథములను వారు రచింపగలరను నమ్మిక పుట్టించుచున్నది.

—"శాక్యసింహ"

మైనా

(నవల. రచన: శీలా వీర్రాజు. ప్రచురణ: సుషమా ప్రచురణలు. ప్రతులకు: ఉదయా పబ్లిషింగ్ కంపెనీ, సుల్తాన్‌బజార్, హైద్రాబాద్. వెల: రూ. 7.)

"ఈ నవలకు వస్తువు, ఒక మలుపుకూ మరో మలుపుకూ మధ్యగల జీవితం... జీవితాన్ని ఒక ప్రయాణంగా భావించాను నేను....ఈ నవలలో ఒక జీవితాన్ని యథాతథంగా చూపించడానికి ప్రయత్నించాను. ఇది ఫోటోకాదు. ఫోటో ధోరణితో వేసిన చిత్రం...నైతిక విలువలులేవని ఆరోపించవచ్చు... కళాత్మకమైన నగ్నశిల్పాలూ, చిత్రాలూ ఎలా విలువైనవో కళాత్మకమైన నగ్నజీవితం కూడ అంతే విలువైనది...ఈ కథ ఎక్కడో జరగడంలేదు. మీ ముందే జరుగుతోంది...తెలుగులో నీరసమైన బ్రతుకులే తప్ప ప్రపంచ వ్యాప్తమైన యితివృత్తంగల జీవితాలే లేవు అనేవారికి సాయిబాబా (ఈ నవలలో ప్రధాన పాత్ర) జీవితం ఒక సమాధానం..." అంటూ పాఠకుల నుద్దేశించి రచయిత, కొంత ఆదుర్దా కనబరుస్తూ, సుదీర్ఘమైన ఉపోద్ఘాతం వ్రాశారు. నిజానికి ఈ ఆదుర్దా అనవసరమే! తెలుగు నవల నేడు వాస్తవికతని అన్వేషిస్తోందనిగానీ, నైతిక సూత్రాలని ప్రబోధించటానికి బదులు కళాత్మకమైన లేక తాత్త్వికమైన జిజ్ఞాస చేస్తున్నదనిగానీ, ప్రత్యేకంగా నొక్కి చెప్పవలసిన అవసరం కనిపించదు. పై రెండు లక్షణాల దృష్ట్యా 'మైనా' నవల తెలుగు సాహిత్యంలో తీసుకువచ్చిన క్రొత్తదనమూ ఏమీ లేదు. నవల సాధించిన క్రొత్తదనం మరో విధంగా వుంది.

రచయిత తన ఉపోద్ఘాతంలో చిత్రకారుని 'పర్‌స్పెక్టివ్' (Perspective) ను గురించి ప్రస్తావించారు. తదనుగుణంగా తనకు లభించిన యితివృత్తాన్ని—ఒక కాన్‌స్టేబుల్ జీవితాన్ని, బొమ్మ గీయటానికి ప్రయత్నించారు. ఆ బొమ్మ ప్రేక్షకులకు ఎంతవరకు అర్థవంతంగా వుంది అనేదే ముఖ్యమైన ప్రశ్న. బొమ్మకు రచయిత పెట్టిన పేరు 'మైనా'. ' కారణం: కథానాయకుడు సాయిబాబా చిన్నతనంలో వాళ్ల నాన్న తెచ్చిపెంచుతున్న మైనగోరు చనిపోవటంతో, అతని జీవితం కష్టాల్లోకి ఒక మలుపు తిరిగింది అనుకుంటాడు. చాల ఏళ్ల తర్వాత, అతనే క్షయవ్యాధితో బాధపడి మృత్యువు నోటి నుంచీ తప్పించుకుని, తనకు క్రొత్తగా పుట్టిన అమ్మాయికి 'మైనా' అని పేరు పెట్టి, తన జీవితం సుఖాల్లోకి, ఆశలోకి మలుపు తిరిగింది అనుకుంటాడు. ఈరెండు సంఘటనలకూ మధ్య అతని జీవితంలో కలిగిన ఒడుదుడుకుల్ని చిత్రిస్తున్నదీ నవల. రచయిత మైనాను ఒక ప్రతీకగా గ్రహించి దానికి బలమైన అర్థాన్నే ఉద్దేశించారు. మైనగోరు సాయిబాబా అజాగ్రత్త వల్ల చనిపోవటంగాని, సాయిబాబాకు క్షయవ్యాధి నయమై కూతురు పుట్టడంగాని, కేవలం సంఘటనలుగానే తీసుకుంటే, జీవితంలో 'మలుపులు' అనిచెప్పదగినంత ప్రాధాన్యం వాటికి లేదు. కాని సాయిబాబా భావనలోనూ అతని అభిప్రాయాన్ని అనుసరించిన రచయిత ఉద్దేశంలోనూ 'మైనా'కు ఎంతో ప్రాముఖ్యమూ, హృదయగతమైన అర్థమూ ఉంది. నవలలో వర్ణితమైన ఘటనల్లో అంటే సాయిబాబా జీవితంలో, ఆ అర్థం ఎలా వ్యంజితమౌతున్నదీ, అసలు అవుతున్నదా అనే ప్రశ్నకు సమాధానం లభించినప్పుడే రచయిత కృతార్థత, నవల యొక్క సాహిత్యపు విలువా అంతు చిక్కుతవి. "Nothing can permanently please, which does not contain in itself the reason why it is so, and not otherwise" (Coleridge). కథగాని, నవలగాని, పద్యకావ్యంగాని, దానిలో ఒక ఆంతరమైన సౌష్ఠవమూ, సమన్వయమూ, పాఠకుని వివేచనకు

అందేటటువంటిది లేకపోతే అది సాహిత్యం కాదు, కేవలం ' a tale told by an idiot ' అయి వూరుకుంటుంది. సామాన్యంగా పైచెప్పిన అర్థస్ఫూర్తి రచయిత అనుభూతినీ లేక ఆలోచననూ ఆధారం చేసుకొని వుంటుంది. అంటే రచయిత సామాన్యంగా ఒక దృక్పథాన్ని లేక ఒక అర్థాన్ని ఉద్దేశిస్తాడు. ఇక్కడ 'మైనా' నవల విశిష్టత : రచయిత అలా మేధాగతమైన దృక్పథాన్నీ అర్థాన్నీ ఉద్దేశింపకపోవడం ; కారణం ఇతివృత్తం తనది కాకపోవడం ; తను చెవులారా విన్న ఒకవ్యక్తి జీవితాన్ని యథాతథంగా వర్ణించటం. రచయిత తన ఆలోచన ద్వారా సాయిబాబా జీవిత సంఘటనల్ని ఒక సూత్రంలో గుది గ్రుచ్చే ప్రయత్నం చెయ్యలేదు. ప్రతిసంఘటననీ భావనాబలంతో చేతనైన భాషలో చిత్రించే ప్రయత్నం మాత్రమే చిత్తశుద్ధితో చేసి ఫలితాన్ని పాఠకులకు వదలిపెట్టేశారు. ఇది ఒక ప్రయోగం. ఫలితం పాఠకులు నిర్ణయించాలి. కావ్యం అర్థవంతంగా వుందా లేదా? ఉంటే ఏమిటా అర్థం? అనేవి పాఠకులు సమాధానం తేల్చవలసిన ప్రశ్నలు.

మైనగోరుకు ఉద్దేశింపబడిన అర్థం—మానవుల మధ్య స్నేహం, ఆత్మీయత, నిలవాలంటే వ్యక్తి 'స్వేచ్ఛ'కు హద్దు వుండాలి ; ప్రతివ్యక్తిలోనూ ఆత్మనిగ్రహం వుండాలి, అనే భావం. "తెలివి మీరిన మనిషి స్వేచ్ఛకై విష్ణవాళ్ళి లేవదీస్తున్నాడు...రక్తాల్ని ఒలికించి, కాలువలు త్రవ్వి..బురదతో నింపేస్తున్నాడు. కాని మనిషి పెంచే జంతువూ, పక్షీ యీ స్వాతంత్ర్యాన్ని ఎందుచేతనో కోరడంలేదు.... ఆదరించిన వాళ్లను విడిచిపెట్టి గూడదని మరీ మూఢంగా నమ్ముతున్నాయి...తిరుపతయ్య (కథానాయకుని తండ్రి) పారేసిన పంజరం వెతికి పట్టుకొచ్చాడు. 'స్వేచ్ఛ'ను పంజరంలో బంధించాడు." (21 వ పేజీ) "పంజరంలో మైనగోరునిద్రలేవడంతోనే 'రామరామ' అంది. స్వేచ్ఛను సహృదయంతోనే పంజరంలో పెట్టి బంధించిన మానవుడు ఆవులించిలేచాడు."(26వ పేజీ) సాయిబాబా అజాగ్రత్త కారణంగా మైనగోరు పంజరం నుంచి బయటికి వచ్చింది, పిల్లివాత పడింది. అదీ ప్రారంభం.

ఇంట్లో తండ్రి ఆజమాయిషీ క్షీణించడంతో సాయిబాబా స్వేచ్ఛగా తిరిగాడు, మగ్గం మీద నేత నేశాడు, కొబ్బరికాయలు దొంగిలించాడు, నాటకాల్లో వేషాలు వేశాడు, కమ్యూనిస్టు పాటలు పాడాడు, పటాలంలో చేరాడు, సరిపడక తిరిగి వచ్చాడు. చివరకు నైజాం వెళ్లి పోలీసు కాన్‌స్టేబిల్‌గా ఉద్యోగంలో స్థిరపడ్డాడు. నిజామాబాద్‌లో ఉద్యోగం చేస్తూ తను అద్దెకున్న యింటి యజమాని సేట్‌జీ భార్య 'ముసియా'తో ప్రణయకలాపం సాగించాడు. ఒక ఖూనీ కేసులో ఒక అందాల స్త్రీ మీంచి రహస్యం లాగటానికి ఆమెతో పాటు ఖైదుగా నటించాడు, ఆమె నమ్మకం సంపాయించటానికి ఆమెతో [illegible], చివరకు నిజం చెప్పింది, తనను ఆత్మీయుడుగా నమ్మిన ఆమెకు ఆజన్మాంతం ఖైదు వేయించాడు—ఉద్యోగ ధర్మ నిర్వహణ కోసం, స్నేహధర్మాన్ని, వ్యక్తిగతమైన ఆత్మీయతను బలి పెట్టాడు. కాని స్నేహధర్మంతోటే మిత్రుడు దానాదాస్తుకు అన్యాయం జరిగితే దాన్ని ఎదుర్కొని, డి. ఎస్. పి. పై తిరుగుబాటు చేసే సమ్మెకు నాయకత్వం కూడా వహించాడు. నిజామాబాద్ వదలిపోవలసి వచ్చినప్పుడు ముసియా ఎంత బతిమాలినా, సేట్‌జీ వ్యాపారంలో వాటా యిస్తానన్నా, స్వేచ్ఛాప్రియత్వంతో అంగీకరించడు సాయిబాబా. పై నుదాహరించిన సంఘటనల్లో సాయిబాబాలో కనిపించేది ఒకచెంప జీవితాన్ని నిర్భయంగా అనుభవించే సామర్థ్యము; మరోచెంప అనిశ్చితమైన ధర్మ ప్రవృత్తి. అతనికి తెలిసింది 'స్వేచ్ఛ'ను పోగొట్టుకో గూడదనే సూత్రం ఒక్కటే. ఇదీ అతని జీవితంలో మొదటిభాగం.

సాయిబాబా హైద్రాబాద్‌లో ఉద్యోగం చేస్తూండగా హాఫీజా అనే అమ్మాయితో స్నేహం ఏర్పడుతుంది. ఈ స్నేహం ప్రణయంగా మారక పూర్వమే సాయిబాబా స్వగ్రామానికి వెళ్లి మేనమామ కూతుర్ని వివాహం చేసుకుని తిరిగి వస్తాడు. హాఫీజాను గురించి రొమాంటిక్‌గా ఊహించుకుంటాడు ; అవకాశాలు వచ్చినా, హాఫీజా ప్రయత్నించినా, ఎందుకో ఆమెను దూరంగానే వుంచుతాడు. కాని ఆమె మూలంగా పెద్ద పోట్లాటలో యిరుక్కుని అనవసరంగా గోలపడతాడు. భార్య ప్రసవిస్తుంది. పురిటి బిడ్డ మరణిస్తాడు. సాయిబాబా సైకిల్ మీద వెడుతూ లారీకి ఢీకొని పడిపోతాడు. ఇలా వక్రించిన అదృష్టాన్ని గూర్చి ఆందోళన పడతాడు. ఒక కట్టెల దుకాణంవాడితో

ఘర్షణపడి అది చివరకు దొమ్మీ పోట్లాటగా మారటంతో, సాయిబాబా అరెస్టవుతాడు. భార్య మళ్లీ ప్రసవిస్తుంది. మగపిల్లాడు. సాయిబాబాకు క్షయ అంకురించినట్లు పోలీసు డాక్టరు చెబుతాడు. ఇదీ అతని జీవితంలో రెండోభాగం. ఈ రెండో భాగంలో మనకు కనిపించేది కథానాయకుని 'స్వేచ్ఛ' కంటె ఎన్నోరెట్లు బలవత్తరమైన యాంత్రిక శక్తి. ప్రథమ భాగంలో అతను చూపిన చొరవా, సామర్థ్యమూ యిప్పుడు ఎందుకూ కొరగానివిగా, కష్టాలు తెచ్చి పెట్టేవిగా కనిపిస్తాయి.

సాయిబాబా టి. బి. హాస్పిటల్లో గడిపిన జీవితం మూడోభాగం. ఇక్కడే రచయితతో అతనికి స్నేహం ఏర్పడుతుంది. తన గతజీవితాన్ని రచయితకు చెబుతాడు. ఇక్కడ విజయ, ఖారీజా అనే నర్సులతో వ్యక్తిగతమైన ఆత్మీయత ఏర్పడుతుంది. ఖారీజాను గురించి ఒక ప్రవాదం వుంది. నయమౌతున్న రోగుల్లో ఒకరిద్దరు ఆమెతో సంబంధం పెట్టుకుని, రోగం తిరగబెట్టి మరణించినట్లు విన్నాడు. కాని ఖారీజాను చూస్తుంటే, ఆమెపట్ల జాలి, స్నేహభావం మరల్చుకో లేకపోతున్నాడు. వ్యాధినయమౌతోంది. పట్టణంలోకి షికారు వెళ్లి రావటానికి అనుమతి లభించింది. ఒకనాడు ఖారీజా అతణ్ణి సినిమాకు రమ్మన్నది. ఖారీజాను గూర్చి తను విన్న వార్తలకూ ఆమె ఆహ్వానానికీ పోలిక స్ఫురిస్తుంది. పైగా ఫకృద్దీన్ అనే క్షయరోగి యిలాంటి వార్తలనే ఆరోజు మధ్యాహ్నం చెబుతాడు. చివరకు సాయిబాబా బస్సెక్కుతాడు సినిమా థియేటరుకి. దారిలో 'హఫీజా' అన్న పేరు ఎవరినోటనో వింటాడు. వెంటనే హఫీజాను తాను పొందగలిగీ పొందకుండా నిగ్రహం చూపాడు కదా, ఖారీజా ఒకలెక్కా? అనిపించింది. థియేటరు దగ్గర దిగలేదు. తిరిగి వచ్చేశాడు. ఇది కథానాయకుడు మృత్యువు మీద సాధించిన విజయం. తర్వాత కొన్నిరోజులకు జబ్బు పూర్తిగా నయమై యింటికి తిరిగి వస్తాడు. ఈ చివరి సంఘటనలో సాయిబాబా 'స్వేచ్ఛను' అరికట్టి, నిగ్రహం ద్వారా యాంత్రిక శక్తుల మీద విజయం సాధిస్తాడు. తన సంకల్ప బలాన్ని నిరూపించుకుంటాడు.

ఇలా మూడు భాగాలుగా విశ్లేషించి చూస్తే సాయిబాబా జీవితంలో ఎంత వైవిధ్యం వున్నా, అది అతని 'స్వేచ్ఛాప్రియత్వం' పొందిన పరిణామం యొక్క మూడు దశలుగా అర్థస్ఫూర్తి నిస్తోంది. ముఖ్యంగా శానటోరియమ్‌లో జరిగిన పోరాటం జీవితానికీ, మృత్యువుకీ గంభీరమైన యథార్థాన్ని ఆవిష్కరిస్తోంది.

ఈ సంఘటన శ్రీ రాజుగారి 'మృత్యువు నవ్వుతోంది' అనే కథతో ('రంగుటద్దాలు' సంపుటి) ఇదివరకే రూపం దిద్దుకున్నది. అయితే ఆ కథ విషాదాంతం. దానిలో నర్సు పాఠకుల సానుభూతి సంపాయించుకుంటుంది.

'మైనా' నవల చక్కని ప్రయోగాత్మక రచన అనటంలో సందేహంలేదు. కాని శైలి విషయంలో రచయితకు కొన్ని వింత అభిప్రాయాలున్నాయి— "సంఘటనలను బట్టి శైలిని వాడాలి. భయంకరమైన వాతావరణాన్ని తేలిక మాటల్లో వివరించ గూడదు...ఆవేశాన్ని విరగ్గొట్టిన వాక్యాలతో వ్యక్తం చేయాలి." విషయాన్నీ శైలినీ వడ్డంగిలా జోడిస్తున్నానే భావంతో రచన చేస్తే ఫలితం విపరీతంగా వుంటుంది! స్త్రీ పాత్రల ఆకర్షణనీ, అందంలోని విశిష్టతనూ వర్ణించేపట్ల ఈ నవలలో శైలి తమాషాగా తయారైంది. శృంగార రసం బదులు కొన్నిచోట్ల హాస్యం పుట్టుతోంది; కొన్నిచోట్ల వికృతంగా ఏవో తోలుబొమ్మల్నీ, కొయ్యబొమ్మల్నీ చూస్తున్నట్లుంది. కొన్నిచోట్ల బొత్తిగా అయోమయత్వం సిద్ధించింది. చూడండి: ఉదా: "హఫీజా నవ్వడం మానేసింది. సూటిగా చూస్తోంది. చిన్నచిన్న కళ్లు విశాలంగా తెరుచుకున్నాయి. క్షణం తీరికలేక టపటపా కొట్టుకునే కంటిరెప్పలు కొద్దిసేపు కొట్టుకోవడం మానేశాయి. కంటి గుడ్లల్లో కిరసనాయిలు దీపం నక్షత్రాల్లా ప్రతిఫలిస్తోంది." (220 పేజీ) "చామన చాయరంగు. అల్పమైన శరీరం. బిందె పడిపోకుండా కుడి చెయ్యి పైకెత్తి, తలమీద నుండి లాగి బిందె అంచును పట్టుకుంది. పక్కనుండి చూసినప్పుడు, ఏ ఆచ్ఛాదనాలేక రహస్యంగా బయటపడ్డ శరీరం, పైకెత్తిన చేతి కింద సిగ్గుపడి గుండ్రంగా ముడుచుకుంది. పొడుగాటి జడ కొరడాలా వెనక్కుజారి, చివర్లు చిట్లిపోయినట్లు అల్లిక ఊడిపోయింది...." (202 పేజీ) 'రహస్యంగా బయటపడ్డం' ఏమిటో! బయటపడింది రహస్యమెట్లా? జడ, 'కొరడా'లా వుందట. శృంగారం కాదు భయం పుట్టుకొస్తుంది.

చివర్లు 'చిట్లిపోయా'యట! శబ్దాలకు రంగూ,రుచీ, వాసనా, వుంటాయని తెలీదా? "గదినిండా వింత పరిమళం—తుట్టను కదిపినప్పుడు తేనెటీగలు ఎగిరినట్లు..." ఆరేగిన పరిమళంతో మోహం దూర్చాలని వుంటుందా, మరి తేనెటీగలు అనగానే కుట్టేస్తాయని భయంకాదా? భాషను గూర్చిన ఇంగితంజ్ఞానం యిలా అక్కడక్కడా లుప్తం అవుతూ వుండటం నిజంగానే ఆశ్చర్యంగా వుంది! ఈ విషయాన్ని యింత దూరం సాగదీయటానికి కారణం రచయితకు శైలిని గూర్చి వున్న చాపల్యాన్ని విమర్శించేందుకే! యథార్థ జీవితాన్ని వర్ణిస్తున్న యీ నవలకు మంచి కండ పుష్టి వుంది. పాత్ర పోషణలో, నవలా నిర్మాణములో రచయిత చూపిన చిత్తశుద్ధి, ప్రతిభ మెచ్చుకోదగ్గవి. ఉత్తమ సాహిత్యం జీవిత యాథార్థ్యం నుంచీ పుట్టుకు వస్తుంది అనే సత్యాన్ని ఈనవల చక్కగా రుజావు చేస్తున్నది.

ర క్త య జ్ఞ ం

(కథలు. రచన: కలువకొలను సదానంద. ప్రచురణ: విశ్వప్రభ ప్రచురణలు,నేండ్రగుంట,చిత్తూరు జిల్లా. వెల: రు. 2—50.)

ఇది ఎనిమిది కథల సంపుటి. హాస్యం తొణికిసలాడే కథలివి. జీవితంలో భీరుత్వాన్నీ, చేతగానితనాన్నీ అపహాస్యం చేస్తూ మంచితనాన్నీ మానవత్వాన్నీ ధ్యేయాలుగా స్ఫురింపజేస్తున్నాయి. హాస్యంలో వైవిధ్యమూ వుంది. 'వికృతవాణి' అనే కథలో అసమర్థుడూ భయస్థుడూ అయిన వ్యక్తిని మూఢనమ్మకాలూ, ఊహలూ హింసించి హింసించి చివరకు ప్రాణాలు తీశాయి. ఈ కథలో రచయిత భావనాశక్తి బాగా వ్యక్తమౌతోంది. 'దానవులు' అనే కథ, మానవుని అత్యాశ ధరించే రాక్షస రూపాన్ని బీభత్సంగా చిత్రిస్తూ, మూఢనమ్మకాల్ని విమర్శించే చమత్కారపూర్వమైన వ్యంగ్యంతో ముగిసింది. పై రెండు కథలూ రచయిత 'Grim humour' ని వ్యక్తం చేస్తాయి. 'ధర్మహాని' ఒక సున్నితమైన మనస్తత్వ విషయాన్నీ, ఒక జీవిత యాథార్థ్యాన్నీ చెబుతోంది. ఇందులోని హాస్యం నవ్వు తెప్పించదు, ఆలోచించేట్లు చేస్తుంది. అబ్బాయి—అమ్మాయి ప్రేమకథల్లో (అవి మూడున్నాయి) హాస్యం సభ్యంగా, ఎంతో ఆహ్లాదకరంగా వుంది. కథాకథనంలోనే నేర్పూ, భాష మీద అధికారమూ సర్వత్ర గోచరిస్తున్నాయి. చక్కని కథలు.

—ఆర్. ఎస్.

నా భార్య

[రచయిత శ్రీ 'వెన్నం'; కవితా పబ్లికేషన్స్—విజయవాడ—2. 72 పేజీలు; వెల రూ. 1—50.]

నవ్య సాహిత్యంలో స్త్రీని నఖ శిఖ పర్యంతమూ వర్ణించటమే పరమావధి అని గాక హృదయేశ్వరిగా సంభావించే మార్పు వచ్చింది. అస్తి నాస్తి విచికిత్సతోబాటు "తపః కల్పవల్లి" అనీ, "అంతరంగ శాంతి దేవత" అనీ మనసారా పూజించే భావ కవులను కాలం ఆదరించింది. కంటికి కనుపించని ప్రేయసికోసం జీవితాంతమూ విరహంతో తపించి, విరహమే ప్రేమకు పర్యవసానంగా, పరమావధిగా ఎంచుకొని భావకవులు కల్పనలు చేశారు. మలయానిలాలూ, సమీర కుమారులు, మేఘాలు రాయబారులు, చంద్రికలు, ధవళిమలూ, పుప్పొడి తేనెలూ, సెలయేటిగానాలూ, తేటిపాటలూ, ఏటి ఒడ్డున యిసుకలో బొమ్మరిళ్లు కట్టుకోవాలనే భావనలూ మన కవిత్వ సీమను కాంతివంతం చేశాయి. నండూరి, బసవరాజు, కృష్ణశాస్త్రివంటి కవులెందరో తెలుగు సాహిత్య సీమను సంపన్నం చేశారు. వసు చరిత్రకు పిల్ల వసు చరిత్ర లెలా అనుకరణ జాడ్యాన్ని అంటు వ్యాధిగా మార్చాయో కృష్ణపక్షానికీ అనుకరణ కావ్యాలు భావ కవిత్వాన్ని "సైడు కాలువల్లో" పరికించాయి. మిన్నేటి పొంగులు గగన కుసుమాలయ్యాయి. ఇంతటితో చాలదన్నట్లు పాశ్చాత్య సాహిత్యంలోని విశృంఖల ప్రేమతత్త్వం కొందరు కవులకు వంటబట్టింది. పాశ్చాత్య కవులలోని భావ నైశిత్యాన్ని తేలేకపోయినా వారి సంప్రదాయోల్లంఘనాన్ని భావానికి నగిషీలు చెక్కకుండా నగ్నంగా పాఠకుల ముందుంచటాన్ని కొందరు కవులు తలకెత్తుకున్నారు.

సౌందర్య తపస్వి చలంగారు మైదానంనుండి ఆశ్రమ వాసానికి వానప్రస్థం పోయినా వారి అనుయాయులు మాత్రం భావ ఔన్నత్యాన్ని, స్పష్టమైన రచనా శిల్పాన్ని వదిలి విశృంఖలత్వాన్ని ఉపాదేయంగా గ్రహించి నూత్న రచనలు చేస్తున్నారు.

శ్రీ వజీర్ రహ్మాన్ రచించిన "ఎచటికి పోతా వీ రాత్రి" అనే వచన కవితా సంపుటి యీ మార్గాన్నే అనుసరించింది.

"నా భార్య" అనే ప్రేమతత్వాన్ని ప్రదర్శించే యీ గ్రంథకర్త శ్రీ 'వెన్నం', ప్రేమోత్సేకంతో మనస్సు పట్టలేని భావావేశంతో సాగించిన ఈ రచనలో సంయమనంలేదు; సంక్షిప్తతలేదు. సరసమైన ప్రేమ భావ ప్రకటన లేదు.

ఎక్కడో మెరపులె మెరిసే
"నీపదములపైనను స్పృహ పోనిమ్మా
నను రంజించుటకు యత్నించుము
నాలో నీవుఅందంచూడవద్దు, ఆత్మీయతచూడు
నాలో నీవు ఆడంబరంకోసం వెదకవద్దు;

ఆలంబనంకోసం ఆశపడు" వంటి వాక్యాలు సరసంగా రచయిత భావాలను చక్కగా వెలువరించేవిగా ఉన్నా అంతలోనే మరెన్నో భావాలు నీరసకరంగా వచ్చిపడ్డాయి. ప్రేమను ప్రకటించేందు కనువైన పదజాలం వీరికిలేదు. అంతేగాక చక్కగా తన భావాన్ని ప్రకటించాక అంతటితో వాక్యాన్ని ముగించాలనే తలంపులేదు. పోనీ ఛందము బంధ మనుకుందామంటే వీరు వ్రాసింది వచన కవితే (Free Verse). చాలచోట్ల కేవలం వచనమే. భావాన్ని వెలువరించటంలో క్రమ పరిణతి లేకున్నా పేలవమైన రచన విసుగుదలను కూడ కలిగిస్తుంది. తాను చెప్పిన భావాన్నే రచయిత మరొకచోట శంకిస్తాడు. కావ్యనాయకుడు తన భార్య హేమ నుద్దేశించి యీ గ్రంథం వ్రాస్తూ మధ్యలో ఆమె కాముకత్వాన్ని నిందిస్తూ, తన అసమర్థతకు చింతిస్తూ ఆ అసమర్థతను కప్పిపుచ్చటానికా అన్నట్టు అతడు తనను జిజ్ఞాసువుగా గుర్తించమనీ వేడుకుంటాడు. నీకు అర్థం కానని హెచ్చరిస్తాడు.

"నీవు కేవలము కాముకివి:నీకు నేను సరికాను" అని ఒకచోట చెప్పి మళ్లీ "నీ మర్మావయవములను స్పర్శించితి నీకర్మానుభవములకు శోకించితి" అని వింతగా మొదట చెప్పిన దాన్ని త్యజిస్తాడు. క్షణక్షణాన ఉలికిపడి క్షణక్షణాన అనుమానించుట— ఇక్కడ ప్రేమ తత్త్వమనిపిస్తుంది.

"ఈ శోభనపు మందిరము నాకు అతిథీ గృహమని తలంచలేవు"
"ఊహలో నేకదా ఖహం ఉంది.
ఊహలతోకదా పరం కలుగుతుంది."
"కవిత్వములో పసితనమునున్నది.

పసితనములో పశుత్వమున్నది" ఇటువంటి వాక్యాలు పాఠకుని కలతపెట్టి ఆలోచింపచేస్తాయి. అయితే యీ ఆలోచనలనుండి తేరుకొనకముందే

"నీ నగ్నసౌందర్యమే నాకు ప్రశాంతినిస్తుంది"
"ప్రజలలో చీము స్రవించెడి కురుపు నా హృదయము"
"నాలో పురుషత్వములేదని అనుమానమా
నీకు కామ సంతృప్తి లేదని అవమానమా!"

మొదలైన వాక్యాలు పాఠకుని భావనా సమాధిని భగ్నం చేసి భరింపలేని జుగుప్సను కలుగజేస్తాయి. అక్షయ తూణీరానికి అక్షయపాత్రకూ వీరికి అర్థభేదం తెలీదు.

"నను కవిత పిలిచెను ; కలత రేపెను
ననువనిత పిలచెను ; మమత కురిపెను"

అన్న మాటలు తెలుగు సాహిత్యంలోని ప్రేమ కవితా భావనలు తెలిసిన పాఠకులకు విచిత్రంగా తోస్తవి.

శిథార్థులు

(నాటకం)

[గ్రంథకర్త: శ్రీకొప్పుల వసంతరావు: శ్రీ పద్మావతీ పబ్లికేషన్స్, 339 గిడ్డంగివీధి, నెల్లూరు, 79 పేజీలు. వెల రూ. 2.]

తెలుగు నాటక రంగానికి నూరేళ్లు నిండినా వెలుగు నాటకం తీరలేదు. సమకాలీన జీవితేతివృత్తంతో వందలాది ప్రదర్శనలతో అఖండంగా ప్రదర్శింపపడుతున్న నాటకా లిప్పుడులేవు. మా భూమి ఎన్. జి. వో. వంటి నాటకాల తరువాత ప్రజాదరణ పొందుతున్న సాంఘిక నాటకాలు తక్కువ. రక్తకన్నీరు ఆకాశరామన్న, మాస్టర్జీ, పునర్జన్మ మొదలైన నాటకాలన్నీ తెలుగు జీవితానికి అనువర్తింపబడినవే తప్ప తెలుగుజాతి జనుల జీవితంతో పెనవేసుకొనిన సాంఘికేతివృత్తాలుకావు. స్వాతంత్ర్యానంతర సాహిత్యంలో అపరాధ పరిశోధక నాటకాలు విస్తృతమైనచోటు గడించుకొన్నాయి. వందలాది నాటకాలు ప్రేక్షకుల మనస్సుల

పైన ఏ ప్రభావాన్నీ కలిగించకుండానే ప్రదర్శింపబడుతున్నాయి. రంగస్థలంపైన ఏవి ప్రదర్శింపవద్దని ప్రాచీనులు వారించారో వాటినే ప్రదర్శించటం అభ్యుదయమనే పేరు గడించుకొన్నది. కారణంలేని హత్యలూ అవీ పిస్తోళ్లతో ప్రదర్శింపబడుతున్నాయి. సామాన్య గృహస్థుల యిండ్లలో అసలీ పిస్తోళ్లింత ఎక్కువగా ఎలా ఉంటాయో అర్థంకాదు. నాయకుడు లేని నాటకాలు, భీభత్సాంగి అయిన రూపకాలు, ఇతివృత్తమే లేని ఊహాప్పుగాలూ ప్రదర్శింపబడుతున్నాయి. కాల పరిమితి ఉంటే చాలన్నట్లు రచయితలు నాటకం, నాటిక అనే పేర్లు పెడుతున్నారు. ఇటువంటి రచయితల నాటకాలే పెక్కు ప్రదర్శింపబడినప్పుడు వీటిలో మెరుగైన వాటికే నాటక కళాపరిషత్తులు బహుమతు లిస్తున్నాయి. నాటక రచనా ప్రదర్శనల గురించి సరిగా తెలీకపోయినా ఉత్సాహవంతులైన వయోవృద్ధులు న్యాయ నిర్ణేతలుగా చోటు చేసుకుంటున్నారు. ఈ విధంగా బహుమతి పొందిన నాటకాలకూ, నటులకూ పత్రికలు ఫోటోలతో సహా ప్రచారం చేసిపెట్టే ఆంధ్ర నాటకరంగ అధోస్థితికి కారణభూతమవుతున్నాయి. శ్రుతి తప్పిన అభ్యుదయ రచయితల రచనలలో బహుమతి పొందిన నాటకం యీ 'శిథిర్వాలు.'

ఇందిర అనే అమ్మాయి తనను ప్రేమించిన సదానంద్ అనే తన బావను కాదని చంద్రం అనే మరో యువకుడికి మనసిస్తుంది. సదానంద్ తేనెపూసిన కత్తి. ఇందిరా చంద్రం జంటను విడదీయటానికి పన్నాగాలు పన్నుతూ, ఇందిర తండ్రి సోమయాజులూ, చంద్రం తల్లి జానకమ్మలు మాట్లాడుకుంటున్నప్పుడు 'ఫోటో' తీసి, అపోహ కల్పించి ఆ 'ఫోటో' సాయంతోనూ, వెఱ్ఱివెంటవాడుకందశాస్త్రి మాటతోనూ చంద్రం మనస్సు విరిచేస్తాడు. చంద్రం క్రోధంతో సోమయాజుల్ని చంపడానికి వచ్చి మనస్సు మార్చుకోగా, అతడి చేతిలోని పిస్తోలుతోనే సదానంద్ సోమయాజుల్ని హత్య చేస్తాడు. ఆ నేరాన్ని నేర్పుతో చంద్రంమీదికి త్రోసేసి రహస్యాన్ని బయట పెట్టకుండా అతడిని 'బ్లాక్ మెయిల్' చేసి ఉరికంబానికిఎక్కించటానికిసిద్ధమౌతాడు. చివరి అంకంలో నేరం వెల్లడికాగా సదానంద్ మనస్సు మారి నిజం వెళ్ళగక్కేస్తాడు. సంగ్రహంగా యిదీ కథ.

ఈయితివృత్తాన్నిఉదాత్తంగాఉన్నట్టు పత్రికలెల్లా ప్రశంసించాయో ఆశ్చర్యం వేస్తుంది. రచనలోనూ ప్రదర్శనలోనూఅడుగడుగునాఔత్సుక్యంతప్ప ఆనందం కలిగించలేని ఘట్టాలు, సందర్భశుద్ధిలేని నిర్వచనాలూ, ప్రతి పాత్రా అడుగడుగునా సంఘంమీదనోరుచేసుకోవటంతో, ఆధునిక నాటకానికుండే అవక తవకలన్నింటినీ యీ నాటకం పూర్తి చేసుకొన్నది.

ఇంతటి సాధారణమైన యితివృత్తమూ, పేలవమైన రచనా ప్రదర్శన గాంభీర్యాన్ని దూరంచేసే పాటలూవున్న యీ నాటకానికి ఫిలిం జర్నలిస్టులు బహుమతి యివ్వటం గమనార్హం. "నాటకాన్తం హి సాహిత్యమ్" అనే ఖ్యాతిని పొందిన నాటక రంగానికి ఔత్సుక్యమే దాని జీవమనే గడ్డు రోజులు దాపురించకుండుగాక.

—రామమోహనరాయ్.

ఉన్మాది

'ఉన్మాది' అనే పద్యకావ్యాన్ని శ్రీ వి. వి. చలపతి వ్రాసినట్లు ఫిబ్రవరి సంచికలో పడినది. అది అచ్చు తప్పు. ఈ గ్రంథమును వ్రాసిన కవి పూర్తిపేరు శ్రీ వి. వి. చలపతిరావుగారు. పాఠకులు గ్రహించగలరు.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by Radhakrishna at The Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras 1
Editor : S. Sambhu Prasad.